సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 215
శనివారం 26-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'


పుణేలోనూ పరేషాన్
న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 156కే ఆలౌట్. -19లో


పెట్టుబడులకు గమ్యస్థానం
భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపు -6లో

న్యూస్‌రీల్

మా భూములు లాక్కోవద్దు



'దొరా.. మీ కాళ్లు మొక్కుతాం. మమ్మల్ని బతకనీయండి. ప్రాణాలైనా ఇస్తాం కానీ ఫార్మా కంపెనీల కోసం భూములు మాత్రం ఇవ్వం' అంటూ వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్ల, రోటిబండతండా గిరిజన రైతులు అధికారులను వేడుకున్నారు.
- వివరాలు 8లో▶

బిల్డర్లకు అండగా ఉంటాం



బిల్డర్లకు, నిర్మాణ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టత ఉందని అన్నారు.
- వివరాలు 20లో▶

నలుగురు భారతీయులు సజీవ దహనం



కెనడాలో అదుపుతప్పిన టెస్లా కారుకు మంటలు అంటుకుని నలుగురు భారతీయులు దుర్మరణం చెందారు. స్నేహితుడి బర్త్ డే పార్టీ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.
- వివరాలు 6లో▶

ఇదండీ సంగతి


నిజమే సార్! ఉప ఎన్నికల్లో కూడా సీట్లు అడిగితే ఇస్తారో.. ఇవ్వరో.. మంది పని చేశారు!

హైదరాబాద్‌ను ఫినిష్ చేసే యత్నం



గుజరాత్‌తో పోటీపడుతున్నామని బీజేపీ, బీఆర్ఎస్‌ల అక్కసు
ఏబీపీ సదరన్ రైజింగ్ సదస్సులో సీఎం రేవంత్ ఆరోపణ

- గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేయొచ్చు.. ఇక్కడ మూసీ పునరుజ్జీవం వద్దా?
- మీకు నచ్చకుంటే ఇంట్లో కూర్చోండి.. మా ప్రభుత్వాన్ని పనిచేయనివ్వండి
- ఎన్డీయే హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం
- పార్టీలు, ప్రభుత్వాలను విడగొట్టడం తప్ప ప్రజలకు మోదీ చేసిన మేలేంటో చెప్పాలి
- అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూఘాట్
- సర్దార్ పటేల్ విగ్రహం తరహాలోనే ఇక్కడ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ''గుజరాత్‌తో పోటీపడుతోందన్న అక్కసుతో హైదరాబాద్‌ను ఫినిష్ చేయాలని చూస్తున్నారు. మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగు రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో పురోగతి సాధించిన తర్వాత తెలంగాణ రాష్ట్రం.. గుజరాత్‌కు పోటీ ఇస్తుందనే విషయం తెలిసే బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి మా ప్రయత్నాలను ఆపాలని చూస్తున్నాయి..'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ సర్కారు నిర్ణయాలను బీఆర్ఎస్ వ్యతిరేకించిన మరుసటి రోజే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కూడా తప్పుపడతారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఏబీపీ నెట్‌వర్క్ 'సదరన్ రైజింగ్ సమ్మిట్-2024'ను సీఎం రేవంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

''గుజరాత్ రాష్ట్రంలో సబర్మతి రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ మేం మూసీ పునరుజ్జీవం చేస్తామంటే మాత్రం బీజేపీ నేతలు అడ్డుకుంటారు. మూసీ పునరుజ్జీవంతోపాటు బాపూఘాట్ అభివృద్ధిని కూడా బీజేపీ వ్యతిరేకిస్తోంది. మీకు నచ్చకపోతే ఇంట్లో కూర్చోండి. మా ప్రభుత్వాన్ని పనిచేయనివ్వండి. మా ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవాలని చూడొద్దు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నది గుర్తుంచుకోండి.

వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు

తెలంగాణ ప్రజల ఆలోచనలను పట్టించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. కాంగ్రెస్ ప్రభుత్వం
మిగతా 15వ పేజీలో ▶

తొలుత బాపూఘాట్ వరకే!

- మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై రాష్ట్ర సర్కారు యోచన
- భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడమే కారణం
- బాపూఘాట్ సంగమం వద్ద రక్షణ శాఖ నుంచి భూములు తీసుకోవాలని నిర్ణయం
- మూసీపై త్వరలోనే సీఎం ఆధ్వర్యంలో మరో సమావేశం

15లో

అవి జగన్ సొంత సంస్థలు

వాటిలో షర్మిల వాటాదారు కాదు
చెల్లిపై ప్రేమ, ఆప్యాయతతో 4 సంస్థల్లో 40% వాటా రాసిచ్చారు

- ఈడీ, కోర్టు అనుమతి ఇచ్చాక వాటాను పూర్తి స్థాయిలో బదలాయిస్తానని జగన్ స్పష్టంగా రాసిచ్చారు
- వైఎస్ జగన్ బెయిల్ రద్దుకు చంద్రబాబు కుట్ర.. ఆ కుట్రలో పావుగా మారి ఈడీ జప్తు చేసిన సరస్వతీ పవర్ షేర్లను బదలాయించిన షర్మిల
- ఆ కుట్రను చిత్తు చేయడానికే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన జగన్.. అంతేగానీ ఆస్తుల్లో వాటా వెనక్కి తీసుకోవాలని కాదు
- షర్మిల నిజంగా షేర్‌హోల్డర్ అయితే ఆమెపై కేసులు ఎందుకు నమోదు కాలేదు?.. కేవలం జగన్‌పైనే కేసులు పెట్టి జైలుకు ఎందుకు పంపారు?
- జగన్ పదేళ్లలో ఇచ్చిన రూ.200 కోట్లు కంపెనీ డివిడెండ్ కాదు.. అసలు కంపెనీ షేర్ హోల్డరే కానప్పుడు.. డివిడెండ్ ఇస్తారా?
- చెల్లెలిపై అభిమానం, ప్రేమతోనే జగన్ ఆ డబ్బులిచ్చారు.. చంద్రబాబుతో కలిసి రాజకీయాలు చేయడం వైఎస్సార్ అభిమతమా షర్మిలా?
- విలేకరుల సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని


మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని

16లో

జగన్‌ను దెబ్బతీస్తున్న అతి మంచితనం.. అతి నిజాయితీ..

- పెళ్లయిన 20 ఏళ్ల తర్వాత, తండ్రి మరణించిన పదేళ్ల తర్వాత ఆస్తులిచ్చే అన్న ఉంటారా?
- సొంత అన్నపై కత్తికట్టి.. శత్రువులతో కలిసి కుట్రలా..
- నెటిజన్ల వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో చర్చ

పేదల ఇళ్లు కూల్చితే రణరంగమే...

బీజేపీ మహాధర్నాలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డి, బండి, ఈటలకు గోడు వెళ్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు

- వాళ్లు తిరగబడితే ఏ పోలీసులూ అడ్డుకోలేరు
- కూల్చివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోక పోతే తీవ్ర పరిణామాలు
- మూసీ ప్రాంత ప్రజల ఇళ్లల్లో ఉండేందుకు మేం సిద్ధం

సాక్షి, హైదరాబాద్/కవాడిగూడ: 'మూసీలో పేదల ఇళ్లు కూల్చితే తెలంగాణ రణరంగంగా మారుతుంది. పేదలు ఆక్రోశంతో తిరగబడితే ఏ పోలీసులూ అడ్డుకోలేరు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేదల ఇళ్ల కూల్చివేతల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. మేం కూడా కూల్చివేతలను అడుగడుగునా అడ్డుకుంటాం. సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను మేం స్వీకరిస్తున్నాం. మూసీ పరీవాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం
మిగతా 15వ పేజీలో ▶

కేసులకు భయపడం.. ఏం చేస్తారో చేస్కోండి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

- వచ్చేది మేమే.. వందరెట్లు వడ్డీతో బదులు తీర్చుకుంటాం
- సిరిసిల్లలో ఈఆర్సీ విచారణకు హాజరు
- విద్యుత్ చార్జీల పెంపును అడ్డుకుంటామని స్పష్టీకరణ

సిరిసిల్ల: 'మహా అయితే.. ఏం చేస్తారు.. ఏవో తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతారు.. ఏం కేసులు పెడతారో పెట్టుకోండి. ప్రజల కోసం జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇంతకు వందరెట్లు వడ్డీతో సహా బదులు తీర్చుకుంటాం. ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు. వచ్చేది మేమే.. నేనే.. 'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. విద్యుత్ సంస్థల చార్జీల పెంపు ప్రతిపాదనలపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)
మిగతా 15వ పేజీలో ▶

రిపోర్టు అన్నారు... రిక్తహస్తం చూపారు!

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆవేదన


మీడియాతో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్ తదితరులు

- మంత్రివర్గ ఉపసంఘం నివేదికను సీఎస్ బయటపెట్టక పోవడంపై అసంతృప్తి
- ఇక డీఏలపైనే అందరి ఆశ
- నేటి కేబినెట్‌లో తేల్చకుంటే భవిష్యత్ కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. 317 జీవో వల్ల ఎదురైన సమస్యలపై తమ వాదనను సీఎస్ ముందు ఉంచారు. వాటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సీఎస్ హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం భేటీ కావడం తెలిసిందే. ఆర్థిక అంశాలపై మార్చి వరకు
మిగతా 14వ పేజీలో ▶

పదేళ్లలో అక్రమార్జన రూ. వెయ్యి కోట్లు!

- రాష్ట్రంలో అవినీతి అధికారుల భరతం పడుతున్న ఏసీబీ
- 2014 నుంచి ఈ ఏడాది ఆగస్టు మధ్య 1,032 కేసులు నమోదు
- స్వాధీనమైన ఆస్తుల విలువ రూ. వెయ్యికోట్ల పైమాటే...


0లో

నేడు బాలకృష్ణ సినీ స్టూడియోకు భూమి కేటాయింపు!



- ప్రతిపాదనలు సిద్ధం.. నేటి కేబినెట్‌లో ఆమోదమే తరువాయి
- టీజీపీఎస్సీలో వివిధ కేటగిరీల్లో 142 అదనపు పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు

- వివరాలు 15లో▶

న్యాయం చేయాలంటూ కలెక్టర్ కాళ్లపై పడుతున్న రైతులు



పత్తిపై తేమ, ధరల కత్తి

ఆదిలాబాద్‌లో కొనుగోళ్లపై ప్రతిష్టంభన

- తేమ శాతం, ధర ఖరారుపై వివాదం
- తక్కువ ధర ఖరారు చేసిన వ్యాపారులు
- నిబంధనల ప్రకారమే కొంటామన్న సీసీఐ
- తేమతో సంబంధం లేకుండా కొనాలని రైతుల డిమాండ్
- ఆదిలాబాద్‌లో రాత్రి వరకు కొనసాగిన ఆందోళన

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ మార్కెట్లో పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన నెలకొంది. తేమ శాతం, తక్కువ ధర ఖరారుపై వివాదం ఏర్పడటంతో కొనుగోళ్లు జరగలేదు. తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనాలంటూ రైతులు రాత్రివరకు తమ ఆందోళన కొనసాగించారు. వివరాలిలా ఉన్నాయి.. సీసీఐతో పాటు ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. సీసీఐ క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.7,521తో కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చింది. ప్రైవేట్ వ్యాపారులు మొదట క్వింటాల్ పత్తికి రూ.6,700 ధర వేలం ద్వారా నిర్ణయించి, ఆ తర్వాత రూ.10, రూ.20 పెంచుతూ రూ.7,150 వరకు చేరుకున్నారు. ఆ తర్వాత
మిగతా 7వ పేజీలో ▶

భాష లోకల్.. ర్యాగ్‌తో గ్లోబల్



అడవిలో గోండు భాషలో మాట్లాడినా.. అమెరికా అధ్యక్షుడికి అర్థమయ్యేలా మారిపోతుంది

- అందుబాటులోకి 'రిట్రైవల్-అగ్మెంటెడ్ జనరేషన్' టూల్
- క్షణాల్లోనే సాఫ్ట్‌వేర్ కోడింగ్స్ రాయగలిగే సామర్థ్యం
- కాల్ సెంటర్లలో వందల మంది చేసే పని ఒక్క టూల్‌తోనే పూర్తి
- అతి తక్కువ వనరులతో అద్భుతంగా పనిచేసే సాంకేతికత
- 'ర్యాగ్' టూల్స్ అభివృద్ధికి భారీగా కంపెనీల వ్యయం
- సాఫ్ట్‌వేర్ రంగానికి ఇదో సరికొత్త సవాల్.. ఏఐతో పోటీ పడితేనే నిలదొక్కుకునే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఇప్పటి దాకా పోగేసింది రూ.లక్ష. దాన్ని రెట్టింపు చేయాలనుంది. మనసులోని ఈ మాటను 'చాట్ జీపీటీ'కి చెప్పడమే ఆలస్యం.. రూ.పది వేల నుంచి రూ.లక్ష వరకూ చేయగల బిజినెస్ ప్రోగ్రాం రెడీ చేసి పెడుతుంది. ఆదిలాబాద్‌లోని ఆదివాసీలు గోండు భాషలో మాట్లాడితే.. అమెరికాలో ట్రంప్ విని అవలీలగా అర్థం చేసుకునేలా మారిపోతుంది. అమెరికా, ఆఫ్రికా వాళ్లు ఏ భాషలో మాట్లాడినా.. మనకు తెలుగులోనే వినిపిస్తుంది. మనం తెలుగులో మాట్లాడుతుంటే.. వాళ్లకు అర్థమయ్యే భాషలో వారికి వినిపిస్తుంది. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ (ఏఐ) సృష్టించిన, సృష్టించబోతున్న ఇలాంటి అద్భుతాలు ఎన్నో. ఏఐ సృష్టించే కొత్త భాషతో మారుమూల ప్రాంతాల్లోని వారి మనోగతంతో సహా విశ్లేషించే
మిగతా 14వ పేజీలో ▶

'ర్యాగ్' కోసం భారీ పెట్టుబడులు

చాట్ జీపీటీ వచ్చిన తర్వాత కృత్రిమ మేధ టూల్స్‌పై అంతర్జాతీయ సంస్థలు అత్యంత ఆసక్తి చూపుతున్నాయి. ఐడీసీ పరిశోధన సంస్థ అంచనా ప్రకారం.. 2028 నాటికి రూ.50లక్షల కోట్లకుపైనే ఖర్చుపెట్టనున్నాయి. మన భారతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు దాదాపు రూ.20 వేల కోట్లకుపైనే ఏఐ టూల్స్ కోసం వెచ్చిస్తున్నాయి. తక్కువ వనరులతో అత్యంత అద్భుతంగా పనిచేసే సామర్థ్యం ర్యాగ్ టూల్స్‌కు ఉంటుందని టెక్ నిపుణులు చెప్తున్నారు.

కొత్తగా 13 జిల్లా పట్టణాభివృద్ధి సంస్థలు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే ఉన్న యూడీఏల పరిధి పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 13 పట్టణాభివృద్ధి సంస్థలు (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)లకు తోడు వనపర్తి, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, నిర్మల్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, మహబూబాబాద్, కొత్తగూడెం, కామారెడ్డి, కాగజ్‌నగర్, జోగుళాంబ గద్వాల, ఆదిలాబాద్ జిల్లాల పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రోడ్ నెట్‌వర్క్, తాగునీరు, ఉపాధి అవకాశాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలు, గ్రామాలను ఈ యూడీఏల పరిధిలోకి తీసుకువచ్చారు. వీటితోపాటు కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, నిజామాబాద్, స్తంభాద్రి (ఖమ్మం), మహబూబ్‌నగర్, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిని పెంచారు. ఈ మేరకు ఆయా యూడీఏల పరిధిలోనికి వచ్చే మున్సిపాలిటీలు, గ్రామాలను ఈ ఉత్తర్వుల్లో నోటిఫై చేశారు.



నీటిపారుదల శాఖలో 1,578 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ

అనుమతిచ్చిన ఆర్థిక శాఖ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో 1,597 మంది లస్కర్లు, 281 హెల్పర్లు కలిపి.. మొత్తం 1,878 మందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించడానికి అనుమతిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టుల భర్తీకి సంబంధిత ప్రాంత ఈఎన్‌సీ/సీఈల నేతృత్వంలో స్థానిక ఎస్‌ఈ, స్థానిక డీసీఈలతో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఈఈల జీతాల నిలిపివేత

- డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ ఆదేశం
- ఆర్థిక శాఖ అనుమతి లేదని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో 500 మందికి పైగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఇటీవల నిర్వహించిన బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి లేకపోవడంతో.. వచ్చే నెలలో వారికి జీతాలు నిలిపివేయాలని డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ ఆదేశించింది. కాగా, జీవో నంబర్ 193 ఆధారంగానే తమకు బదిలీలు నిర్వహించారని, జీతాలు నిలిపివేత సరికాదని ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం ఇదే తరహాలో వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగం డైరెక్టర్ తమ జీతాలను నిలిపివేశారని వారు ఆరోపిస్తున్నారు. జీతాలు నిలిపివేస్తే వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.



టామ్‌కామ్ సేవలు విస్తృతం చేయండి



- వచ్చే నెల రెండోవారంలో హుస్నాబాద్‌లో మెగాఫారిన్ జాబ్ మేళా
- తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ అధికారులతో మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్)సేవలు మరింత విస్తృతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు సూచించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం టామ్‌కామ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ...నవంబర్ రెండోవారంలో హుస్నాబాద్‌లో టామ్‌కామ్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించాలన్నారు. నైపుణ్యం ఆధారంగా ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్న దేశాలకు నిరుద్యోగులను పంపించే విధంగా చర్యలు తీసుకోవాల ని సూచించారు. టామ్‌కామ్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జాబ్‌మేళాలు నిర్వహించాలన్నారు. ఈ జాబ్‌మేళాపై అవగాహన కల్పించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టామ్‌కామ్ సీఈ ఓ విష్ణువర్ధన్ రెడ్డి, జనరల్ మేనేజర్ నాగభారతి తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా యువత ఆలోచించాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్య సహా అన్ని రంగాల్లోనూ ప్రపంచంతో పోటీ పడాల్సిన అవసరం ఏర్పడిందని, ఈ దిశగా యువత సరికొత్త ఆలోచన విధానాలతో ముందడుగు వేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూఏఈ, టాంగా, ఇండోనేసియా, శ్రీలంక తదితర దేశాలకు చెందిన 31 మంది సీనియర్ రక్షణ అధికారులతో హైదరాబాద్‌లో హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. రక్షణ రంగంలో వస్తున్న మార్పులు, భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని దేశాలు సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగానే తెలంగాణ వ్యాప్తంగా విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని, ప్రపంచ దేశాలతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని యోచిస్తున్నట్టు పేర్కొన్నారు.





సాక్షి

శనివారం, 26 అక్టోబర్ 2024

మరీ ఇంత బరితెగింపా?

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉండేవారు వివాదాస్పదులవుతారో, లేక అలాంటివారినే ఆ పదవికి ఎంపిక చేస్తారో గానీ మరోసారి అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా వార్తల్లోకెక్కారు. ఈసారి ముఖ్యమంత్రితో వచ్చిన జగడం వల్లకాక సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ వల్ల ఆయన పేరు మార్మోగింది. ఢిల్లీ మహానగరంలో రోడ్ల వెడల్పు కోసం 1,100 వృక్షాలు నేల కూల్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌కు జవాబిస్తూ సక్సేనా వింత వాదన చేశారు. కేంద్ర సాయుధ పోలీసు దళాల కోసం కేంద్రం నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాల సముదాయానికి వున్న అప్రోచ్ రోడ్డును వెడల్పు చేయటం కోసం రిట్జ్ ప్రాంతంలో చెట్లను కూల్చారు. రూ. 2,200 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ప్రగతి ఎలావుందో పరిశీలించటానికి గత ఫిబ్రవరిలో వెళ్లినప్పుడు అక్కడున్న అధికారులెవరూ చెట్ల కూల్చివేతలకు అనుమతి అవసరమని తనతో చెప్పలేదన్నది ఆయన వాదన. 1994లో తీసుకొచ్చిన ఢిల్లీ వృక్ష సంరక్షణ చట్టం (డీపీటీఏ) కింద అటవీ విభాగం కేంద్ర పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి తీసుకుందనీ, ఢిల్లీ సీఎం, తానూ కూడా అందుకు అంగీకరించామనీ సక్సేనా వివరించారు. ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం నుంచి అనుమతి తీసుకోనట్టయితే కోర్టు ధిక్కారమవుతుందని తనకు తెలియదని ఆయన చెబుతున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్నవారికి అన్నీ తెలియాలని లేదు. నిజమే. కానీ తెలుసుకోవటం, తెలియజెప్పటం రివాజుగా సాగిపోవాలి. ఢిల్లీ సీఎం ఏదైనా నిర్ణయం తీసుకోగానే ఫలానా నిబంధన ప్రకారం ఇది చెల్లదని బుట్టదాఖలు చేయటం అలవాటైనవారికీ, అన్ని చట్టాలూ శోధించి ఆధిక్యతను చాటుకునేవారికీ నిబంధనలు తెలియలేదంటే ఎవరైనా నవ్విపోరా? చెట్లు కూల్చడం ఫిబ్రవరి 16న మొదలైతే, జూన్ 10న ఢిల్లీ అభివృద్ధి సంస్థ (డీడీఏ) వైస్ చైర్మన్ చెప్పేవరకూ తెలియదనటం ఆశ్చర్యకరం. గురువారం సుప్రీంకోర్టు ఈ విషయాన్ని సూటిగా ప్రశ్నించింది. ఏప్రిల్ 10నే లెఫ్టినెంట్ గవర్నర్‌కు చెప్పినట్టు రికార్డులు చూస్తే వెల్లడవుతోందని ధర్మాసనం తెలిపింది. పోనీ తెలియదనే అనుకుందాం... చట్ట నిబంధన తెలియక పొరపాటు చేశానని పౌరుడెవరైనా అంటే చెల్లుతుందా? అధికారులు నిబంధనలను సరిగా అర్థం చేసుకోకపోవటంవల్ల పొరపాటు జరిగిందని, ఇది ప్రజా ప్రయోజనం కోసం చిత్తశుద్ధితో చేసిన పని అని లెఫ్టినెంట్ గవర్నర్ అఫిడవిట్ చెప్పటమూ సరికాదు. సక్సేనా కార్పొరేట్ రంగంలో, వివిధ సామాజిక రంగాల్లో విశేషానుభవం కలవారని అంటారు. ఒక కార్పొరేట్ రంగానికి చెందిన వ్యక్తిని లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించటం ఇదే ప్రథమం. అలాంటి వ్యక్తి సైతం నిబంధన ఉల్లంఘిస్తే ఎలా?

అసలు ఆ రోడ్ల వెడల్పు ప్రాజెక్టు వెనక మరింత వివాదం ఉన్నదని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఆగస్టు 2022లో డీడీఏ ఆమోదించిన ప్లాన్‌కూ, అనంతర కాలంలో సవరించిన ప్లాన్‌కూ మధ్య ఎన్నో వ్యత్యాసాలున్నాయని ఆ కథనాలు వివరిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఉండే ఫార్మ్ హౌస్‌లకూ, శ్రీ జ్ఞానానంద ఆశ్రమం, ఇతర ప్రైవేటు ఆస్తులకూ నష్టం కలుగుతున్నదన్న కారణంతోనే ముందనుకున్న ప్లాన్ కాస్తా సవరించారన్నది అభియోగం. పర్యవసానంగా అక్కడి అటవీ భూముల్లోని చెట్లు కూల్చేయాల్సి వచ్చిందని ఆ కథనాలు చెబుతున్నాయి. ముందు రూపొందిన మ్యాప్ ప్రకారం రోడ్లు వెడల్పు చేస్తే 50 చెట్లకు మించి నష్టం ఉండేది కాదని లెక్కేస్తున్నారు. పైగా మార్చిన ప్లాన్ వల్ల సాధారణ పౌరుల నివాస గృహాలకు నష్టం జరిగిందని మీడియా కథనాలు వివరిస్తున్నాయి. అంటే నోరూ వాయీ లేని వారికి ఎంత నష్టం కలిగినా ఫర్వాలేదు... సంపన్నులకు మాత్రం తేడా రావొద్దన్నది అధికారుల ఉద్దేశం. ఈ విషయంలో గోశాల రోడ్‌కు చెందిన పౌరుడు నీరజ్ కుమార్... ప్రధాని మొదలుకొని లెఫ్టినెంట్ గవర్నర్ వరకూ ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. దాంతో సుప్రీంకోర్టు ముందు దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌లో తాను కూడా కక్షిదారుగా ఉండదల్చుకున్నట్టు దరఖాస్తు చేసుకున్నాడు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆ ప్రాంతాన్ని సందర్శించటానికి సంబంధించిన రికార్డు ఉందో లేదో తెలియదని, అందుకు వ్యవధి కావాలని కూడా డీడీఏ సుప్రీంకోర్టుకు తెలిపింది. కానీ ఇంత చిన్న సమాచారం కోసం ఎన్నాళ్లు వెదుకుతారని ధర్మాసనం గట్టిగా ప్రశ్నించటంతో, అక్షింతలేయటంతో లెఫ్టినెంట్ జనరల్ జవాబివ్వటం తప్పనిసరైంది.

కింది స్థాయిలో జరిగిన లాలూచీలు సక్సేనాకు తెలియలేదనుకున్నా ఫిర్యాదు వచ్చినప్పుడైనా ఆరా తీయలేదంటే ఏమనుకోవాలి? దేశంలో అభివృద్ధి పేరుతో జరిగేదంతా ఇలాగే ఉంటున్నది. సంపన్నుల కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే అధికారులు పేదలకు నిలువ నీడ లేకుండా పోతున్నదన్న స్పృహ లేకుండా వ్యవహరిస్తుంటారు. ప్రశ్నించినవారిపై కేసులు బనాయించటం, జైళ్లలో పెట్టడం సర్వసాధారణమైంది. ఇప్పుడు డీడీఏ నిర్వాకం కారణంగా భారీయెత్తున చెట్లు కూలిపోవటం మాత్రమే కాదు... 43 ఏళ్లుగా ఆ ప్రాంతంలో చిన్నా చితకా ఇళ్లలో నివసిస్తున్నవారిని నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించారు. దేశంలోని కీలక వ్యవస్థలన్నీ కొలువుదీరిన చోటే ఇంతగా నియమోల్లంఘనలు చోటుచేసుకుంటే ఏ ఛత్తీస్‌గఢ్ అడవుల్లోనో, ఇతర మారుమూల ప్రాంతాల్లోనో సక్రమంగా జరుగుతున్నాయని ఎలా అనుకోగలం? ఇలాంటి దురన్యాయాలుంటే తిరుగుబాట్లు రావా? సమస్య మూలాలు వదిలి పరిష్కారాలు వెదికే తెలివితక్కువతనం మరిన్ని సమస్యలకు దారితీయటం లేదా? ప్రభుత్వాలు ఆలోచించాలి. తామే చట్టాలు ఉల్లంఘిస్తే, మానవీయతను మరిస్తే సామాన్య పౌరులను చట్టబద్ధంగా నడుచుకొమ్మని చెప్పే నైతికార్హత ఉంటుందా?

బహుళ ధ్రువ ప్రపంచానికి దారి?

విశ్లేషణ



టంకశాల అశోక్

అక్టోబర్ 22–24 వరకు కజాన్(రష్యా)లో జరిగిన బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సమావేశం ఒక గొప్ప ఆరంభాన్ని వాగ్దానం చేసింది. బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఆర్థిక వ్యవహారాలను తమ స్థానిక కరెన్సీలలో జరుపుకోవాలనీ, తమతో ఆర్థిక సంబంధాలు నెరపే ఇతర దేశాలతో సైతం ఇదే పద్ధతిలో వ్యవహరించేందుకు ప్రయత్నం జరగాలనీ 'కజాన్ డిక్లరేషన్' పేర్కొన్నది. ప్రపంచాన్ని శాసిస్తున్న డాలర్ వ్యవస్థను వీలైనంత బలహీన పరచటం వర్ధమాన దేశాలన్నిటికి కీలకంగా మారింది. అధికారం, అభివృద్ధి, విధాన పరమైన నిర్ణయాలకు కొత్త కేంద్రాలు ఉనికిలోకి వచ్చినందున, అవి సమానత్వంతో కూడిన న్యాయబద్ధమైన, బహుళ ధ్రువ ప్రపంచానికి దారులు వేయగలవన్న ఆశాభావం డిక్లరేషన్‌లో కనబడింది.

కజాన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు రెండు రోజుల ముందు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పిన మాటలు సంచలనమయ్యాయి. బ్రిక్స్ దేశాల మధ్య వ్యాపారాలకు, ఇతర అవసరాలకు చెల్లింపులు ఇక మీదట ఆ యా దేశాల సొంత కరెన్సీలలోనే ఉండగలవని అన్నారు. అప్పటికి అది ఇంకా బ్రిక్స్ తీసుకున్న తుది నిర్ణయమో, చేసిన ఉమ్మడి ప్రకటనో కాదు. అయితే, ఈ అంశంపై బ్రిక్స్ దేశాల మధ్య కొంతకాలంగా సంప్రదింపులు సాగుతున్నాయి. ఒక ఏకాభిప్రాయ ప్రకటన రాగల సూచనలు కూడా ఉన్నాయి. అందువల్లనే కూటమి దేశాలేవీ పుతిన్ ముందస్తు ప్రకటనకు అభ్యంతరపెట్టలేదు. అక్టోబర్ 23న విడుదలైన కజాన్ డిక్లరేషన్‌లోని 134 పేరాగ్రాఫ్‌ల సుదీర్ఘ సంయుక్త ప్రకటనను చదివినపుడు, అందులో అత్యధికం ఆర్థిక సంబంధమైన అంశాలే కనిపిస్తాయి. వాటిలో రెండు (63, 65) పుతిన్ పేర్కొన్న స్థానిక కరెన్సీ చెల్లింపులకు సంబంధించినవి.

134 పేరాలలో రెండు మాత్రమే ఇవా? అందుకోసం ఇంత అట్టహాస ప్రకటన అవసరమా? అనుకుంటే పొరపాటు. మొత్తం ప్రపంచాన్ని శాసిస్తున్న డాలర్ వ్యవస్థను మటుమాయం చేయటం సాధ్యం కాకపోయినా, వీలైనంత బలహీన పరచటం బ్రిక్స్‌తో సహా మొత్తం వర్ధమాన దేశాలన్నిటికి కీలకంగా మారింది. డాలర్ ఆధిపత్యాన్ని ఎంత దెబ్బ తీయగలిగితే, ప్రపంచంపై అమెరికా రాజకీయ, సైనిక ప్రాబల్యాన్ని, భౌగోళిక చాణక్యాన్ని అంతగా ఎదుర్కొనగలరు.

ఈ దేశాలకు ఇటువంటి అవకాశం లభించటం ప్రపంచ చరిత్రలోనే ఇది మొదటిసారని చెప్పాలి. వలస పాలనలు 60–70 సంవత్సరాల క్రితమే ముగిసి ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ఎన్ని ఏర్పడినా, ఒకటి రెండు అగ్ర దేశాలే ఏకధ్రువ, ద్విధ్రువ ప్రపంచాలను సాగించాయి. అంతర్జాతీయ చట్టాలను తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ రాగా, అమెరికన్ డాలర్, యూరోపియన్ దేశాల యూరో కరెన్సీలు అందుకు సాధనాలుగా మారాయి. 1947 స్వాతంత్ర్య సమయంలో ఒక డాలర్‌కు ఒక రూపాయిగా ఉండిన భారత కరెన్సీ ఈ రోజున 84 రూపాయలకు పడిపోయిందంటే అందుకు ఇవన్నీ కారణాలే. ఆ విలువ సహజ క్రమంలో తగ్గటం ఒకటైతే, అమెరికన్లు, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వారు ఒత్తిడి చేసి మరీ విలువను తగ్గింపజేసే సందర్భాలు వర్ధమాన దేశాలకు అనేకం. అంతర్జాతీయంగా ముడిసరకుల అమ్మకాలు, వాణిజ్య నిబంధనలు, డబ్ల్యూటీవో పనితీరు అన్నీ ధనిక దేశాలకు, డాలర్‌కు అనుకూలం.

ఈ విధమైన అనేకానేక సమస్యలన్నింటికి సమాధానాలు కజాన్ డిక్లరేషన్‌లో పొందు పరచటం గమనార్హం. ఇటువంటి ఆలోచనలకు, మార్పులకు ఒక గొప్ప ఆరంభం బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఆర్థిక వ్యవహారాలు తమ స్థానిక కరెన్సీలలో జరుపుకోవటం. తమతో ఆర్థిక



బ్రిక్స్ సమావేశాల్లో జిన్‌పింగ్ (చైనా), పుతిన్ (రష్యా), మోదీ (ఇండియా)

సంబంధాలు నెరపే ఇతర దేశాలతో సైతం ఇదే పద్ధతిలో వ్యవహరించేందుకు ప్రయత్నం జరగాలని కూడా ఆ డిక్లరేషన్ పేర్కొన్నది. ఆ డాక్యుమెంట్ శీర్షికను గమనిస్తేనే బ్రిక్స్ లక్ష్యం, అంతరార్థం, భవిష్యత్తు గురించిన దార్శనికత అర్థమైపోతుంది: న్యాయబద్ధమైన విధంగా ప్రపంచాభివృద్ధి కోసం, భద్రత కోసం బహుళత్వాన్ని శక్తిమంతం చేయటం. ఈ మూడు క్లుప్తమైన మాటలను శోధిస్తూ పోతే అనేక విషయాలు అర్థమవుతాయి. వలసవాదం అంతమై, అంతర్జాతీయ సంస్థలు, నిబంధనలు ఎన్ని ఏర్పడినా పాశ్చాత్య రాజ్యాల ఏకధృవ ఆధిపత్యాన్ని తట్టుకోలేకపోయిన తక్కిన ప్రపంచానికి ఇపుడు బ్రిక్స్ రూపంలో ఒక బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడగల అవకాశాలు చరిత్రలో మునుపెన్నడూ లేనివి. వాస్తవానికి బహుళ ధృవ ప్రపంచ సృష్టి అనే మాట కొంతకాలంగా వినవస్తున్నదే. కాలక్రమంలో ఇండియా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో పాటు కొన్ని ఏషియన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్, అరబ్ దేశాలు కొంత అభివృద్ధి సాధించి మధ్యమస్థాయి దేశాలుగా పురోగమించినా, వాటికి కూడా వివిధ పరిస్థితులవల్ల స్థిరత్వం ఉండటం లేదు. బ్రిక్స్ ఏర్పడినాక ఇంతకు ముందు 15 శిఖరాగ్ర సమావేశాలు జరిగినా, వివిధ ఆర్థికపరమైన నిర్ణయాల మూలంగా కజాన్‌లో జరిగింది ఎంతో భిన్నమైనది!

డిక్లరేషన్‌లోని 134 పేరాలను 4 ఉప శీర్షికల కింద విభజించగా, అందులో 3 ఆర్థిక సంబంధమైనవే కావటం గమనించదగ్గది. అవన్నీ ఇక్కడ రాయటం వీలుకాదు గానీ, వాటి సారాంశాన్ని చెప్పుకోవాలంటే ఈ విధంగా ఉంటుంది: గ్లోబల్ సౌత్ అనబడే వర్ధమాన దేశాల కోసం పని చేయటం. అధికారం, అభివృద్ధికి, విధానపరమైన నిర్ణయాలకు కొత్త కేంద్రాలు ఉనికిలోకి వచ్చినందున, అవి సమానత్వంతో కూడిన న్యాయబద్ధమైన, బహుళ ధ్రువ ప్రపంచానికి దారులు వేయగలవు. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి, డబ్ల్యూటీవో వంటి సంస్థలను సంస్కరించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేక అవకాశాలివ్వాలి. ముఖ్యంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాలకు వాణిజ్యంపై ఏకపక్ష నియంత్రణలు, ఆంక్షలు ఉండరాదు. అంతర్జాతీయ రుణాల చెల్లింపు పద్ధతిలో మార్పులు రావాలి. బ్రిక్స్ దేశాల మధ్య చెల్లింపులు స్థానిక కరెన్సీలలో జరగాలి. బ్రిక్స్ పే కార్డును వినియోగానికి తేవాలి. అయితే ఈ విషయమై ఇంకా చర్చలు అవసరం. అట్లాగే ఇది స్వచ్ఛందమే తప్ప, తప్పనిసరి కాదు. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, వనరుల వితరణ; విద్యా, సాంకేతిక, ఆరోగ్య, పారిశ్రామిక రంగాలలో సహకారం పెరగాలి.

కజాన్ డిక్లరేషన్ ఈ విధమైన స్వతంత్ర ప్రకటనలు చేస్తూనే, బ్రిక్స్ కూటమి పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకం కాదనీ, తమదొక స్వతంత్రమైన సంస్థ మాత్రమేననీ స్పష్టం చేసింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కొద్దికాలం క్రితం, "వారు (పాశ్చాత్య దేశాలు) ఒక క్లబ్ పెట్టుకున్నారు. మమ్మలను అందులోకి రానివ్వలేదు. కనుక మా క్లబ్బు మేము పెట్టుకున్నా"మని వ్యాఖ్యానించటం గమనించదగ్గది. మొదట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో బ్రిక్‌గా ఏర్పడిన ఈ సంస్థ దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారింది. వాటి ఉమ్మడి భూభాగం ప్రపంచంలో 33.9 శాతం, జనాభా 45.2 శాతం, పారిశ్రామిక ఉత్పత్తి 39.3 శాతం, జీడీపీ 36.7 శాతం, ఎగుమతుల శాతం 24.5 శాతం కావటాన్ని బట్టి ప్రపంచంలో వాటి స్థానం ఎంతటిదో గ్రహించవచ్చు. ఈ అయిదు దేశాలు కాక ఇప్పుడు కొత్తగా ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ చేరాయి. సౌదీ అరేబియా త్వరలో చేరనుంది. మరొక 30 చేరగోరుతున్నట్లు పుతిన్ ప్రకటించారు. బ్రిక్స్ విస్తరించేకొద్దీ పరిస్థితి గణనీయంగా మారుతుంది. ఈ సంస్థ దేశాల మధ్య ఏకాభిప్రాయంతో పరస్పర సహకారాలు తప్ప ఎవరి అంతర్గత వ్యవహారాలలోనూ జోక్యం చేసుకోవటం ఉండదని స్పష్టం చేయటం విశేషం. ఈ మాట, అటువంటి జోక్యాలు చేసుకునే పాశ్చాత్య దేశాలకు ఒక హెచ్చరిక అని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు.

అదే సమయంలో కొన్ని రాజకీయ పరిస్థితులను బ్రిక్స్ ఉపేక్షించబోదని కూడా కజాన్ డిక్లరేషన్ వల్ల స్పష్టమవుతున్నది. గాజాపై ఇజ్రాయెల్ మారణకాండను, లెబనాన్‌పై దాడులను ఖండించారు. ఇరాన్‌పై దాడి ఆలోచనను విమర్శించారు. పాలస్తీనా స్వతంత్రతను బలపరిచారు. పశ్చిమాసియాలో అణ్వస్త్ర వ్యాప్తిని వ్యతిరేకించారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వివాదాలు ఏర్పడినా చర్చల ద్వారా మాత్రమే పరిష్కారాలు చేసుకోవాలన్నారు. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కజాన్‌లో సమావేశం కానుండగా, సరిహద్దు సమస్యపై ఒక చిన్న ముందడుగు వేయటం ఈ తీర్మానానికి అద్దం పడుతున్నది. మోదీ ముందస్తుగా మాట్లాడుతూ, భారత్–చైనా సత్సంబంధాలు ప్రపంచ శాంతి సుస్థిరతలకు అవసరమన్నారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



దేనికి ఆధారం?

వయసును నిర్ధారించడానికి ఆధార్ కార్డు పనికి రాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇది చిరునామా రుజువుగా పనికిరాదు. పుట్టిన తేదీకి పనికిరాదు. పౌరసత్వానికి పనికిరాదు. కానీ ఇది అన్ని గుర్తింపు కార్డులకు తల్లి అని ప్రచారం జరిగింది. ఒక విప్లవమన్నారు. పొద్దున ఆరింటికి లైన్లలో నిలబెట్టారు. దేనికోసం?

– అమిత్ శాండిలియా, కాలమిస్ట్



అప్పడే మూడు!

ఇండియా–జర్మనీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఒక ఆసక్తికర అంశం: ఇండియా తన 3.94 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్(4.11 ట్రిలియన్లు)ను 2025లో, జర్మనీ(4.58 ట్రిలియన్లు)ని 2027లో అధిగమించనుంది. కానీ మారక రేట్ల అనిశ్చితిని సరళతరం చేసే 'పీపీపీ' ప్రకారం, ప్రపంచ బ్యాంక్ ఇప్పటికే ఇండియా జీడీపీని 14.25 ట్రిలియన్ డాలర్లుగా చూపింది. చైనా(32 ట్రిలియన్లు), యూఎస్ (28 ట్రిలియన్లు) తర్వాత అది ప్రపంచ మూడో స్థానం.

– మిన్హాజ్ మర్చంట్, సంపాదకుడు



అరెస్టు డిమాండ్

నవంబర్ 1–19 మధ్య ఎగిరే ఎయిర్ ఇండియా విమానాలకు వ్యతిరేకంగా బెదిరింపులకు పాల్పడ్డ (ఖలిస్తానీ) గురు పత్‌వంత్ సింగ్ పన్నూను యూఎస్ అరెస్టు చేయాలని ఇండియా ఎందుకు డిమాండ్ చేయడం లేదు? ఆ బెదిరింపునకూ, విమాన ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తున్న వరుస నకిలీ బాంబు బెదిరింపులకూ సరిపడుతోంది.

– బ్రహ్మ చెలానీ, స్ట్రాటెజిక్ థింకర్



చట్టబద్ధ విషం

మద్యపానం అనేది అత్యంత సామాజిక అంగీకారం పొందిన డ్రగ్. ప్రపంచవ్యాప్తంగా సుమారు 230 కోట్ల మంది దీన్ని తాగుతున్నారు. ప్రతి వీధిలోనూ అమ్మే ఈ చట్టబద్ధ విషం ఏటా 30 లక్షల మరణాలకు కారణమవుతోంది.

– సుమిత్ శర్మ, వైద్యుడు



చదువెందుకు?

గుజరాత్‌లో ఒకాయన నకిలీ కోర్టును పెట్టి, తీర్పులు కూడా ఇచ్చాడట. మీ కలలకు మధ్యలో చదువును ఎంతమాత్రం రానీయకండి.

– కుణాల్ కామ్రా, కమెడియన్

ఇన్ బాక్స్

ఫీజుల భారం తగ్గించండి

2015–16 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ విద్యార్థులకు ఏడాదికి ఒకసారి చివర్లో పరీక్షలు నిర్వహించి తర్వాత పై తరగతులకు అనుమతించేవారు. కానీ విద్యా సంస్థల్లో సమూలమైన మార్పులు చేస్తూ 2016–17 అకడమిక్ ఇయర్ నుంచి డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. అందువలన విద్యార్థులంతా ఒక సంవత్సరంలో రెండు పర్యాయాలు పరీక్షలు రాయవలసి వస్తోంది. అంటే ప్రతి సెమిస్టర్‌కూ పరీక్ష ఫీజు చెల్లించవలసి వస్తోంది.

రాష్ట్రంలో ఏడు యూనివర్సిటీల పరిధిలో దాదాపు 130కి పైగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు వివిధ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా నడుస్తున్నాయి. అయితే ఒక్కో యూనివర్సిటీ పరిధిలో ఒక్కో విధంగా... కోర్సును బట్టి ఫీజులు వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కొన్ని కాలేజీల్లో ఆర్ట్స్ విద్యార్థులకు పరీక్ష ఫీజు, బయోమెట్రిక్ ఫీజు, స్పెషల్ ఫీజులు అంటూ మొత్తం రూ. 2,000 నుంచి రూ. 3,000 వరకూ, అది కాకుండా కళాశాల అడ్మిషన్ ఫీజు 5 వేల వరకూ... మొత్తానికి ఒక్కో సెమిస్టర్‌కు రూ. 8 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అలాగే సైన్స్ విద్యార్థులకు 11 వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అంటే రెండు సెమిస్టర్లకూ ఈ ఫీజులు రెట్టింపవుతున్నాయన్నమాట. విద్యార్థులు ఈ ఫీజులు కట్టలేక పోతున్నారు. ఫలితంగా చదువులను మధ్యలో ఆపేస్తున్నారు. అలాగే ప్రభుత్వాలు సకాలంలో ఉపకార వేతనాలు అందజేయకపోడం విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఇటీవల వైస్ ఛాన్సలర్స్‌ను నియమించడంతో యూనివర్సిటీల పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో పేద గ్రామీణ విద్యార్థులే ఎక్కువగా చదువుతారు కాబట్టి... వారు మధ్యలోనే చదువు ఆపకుండా ఉండేందుకు ఫీజులు తగ్గించే చర్యలు వీసీలు తప్పనిసరిగా తీసుకోవాలి.

– ఎజ్జు మల్లయ్య I తెలుగు అధ్యాపకుడు

ఎవరి అర్థాలు వాళ్లవి...

అభిప్రాయం




జాన్‌సన్ చోరగుడి

దసరా పండుగ నాడు ఢిల్లీ 'భారత మండపం'లోని 'గతిశక్తి అనుభూతి కేంద్ర'ను మోదీ హఠాత్తుగా సందర్శించారు. ఆ రోజు 'ప్రధాన మంత్రి గతి శక్తి' కేంద్రం మూడవ వార్షికోత్సవం వేళ అక్కడికి వెళ్లి తన ప్రాధాన్యాన్ని దేశానికి వెల్లడించారు. అయితే, ఇది అందరికీ ఒకేలా అర్థం కావాలనే షరతు ఏమీ లేదు. వీటి తాత్పర్యం చంద్రబాబుకు ఒకలాగా, జగన్‌మోహన్ రెడ్డికి మరొక లాగా అర్థం కావొచ్చు. అందుకు వాళ్ళ వయస్సు, వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చిన కాలం, వారి ప్రాపంచిక దృక్పథం, మరెన్నో కారణాలు కావొచ్చు. అయితే తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన ఈ పదేళ్ళలో అదీ దేశానికి తూర్పున ఈ చివరన ఉన్నామేమో, ఇందులో 'మనకు ఏముంది' అని చూసినప్పుడు, మనం అర్థం చేసుకోవాల్సింది కొంచెం ఎక్కువే ఉంది.

ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 15.39 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టిన 208 భారీ మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు ఉన్నాయి. దీని అమలుకు వేర్వేరు శాఖలు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రభుత్వాలతో సమన్వయం కోసం ఒక 'నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్' పనిచేస్తున్నది. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ – ఇంటర్నల్ ట్రేడ్' కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా... 'ఇందులో 101 జాతీయ రహదారులు, 73 రైల్వే ప్రాజెక్టులు, 12 పట్టణ అభివృద్ధి ప్రణాళికలు, 4 చమురు–గ్యాస్ ప్రాజెక్టులు ఉన్నాయి' అంటున్నారు. ఈ నాలుగు రంగాలు కూడా ప్రాంతాల మధ్య దూరాలను తగ్గించి వాటిని చేరువ చేస్తూ, విద్యుత్తు భద్రత, పట్టణీకరణలకు దోహదం చేస్తాయి. ఇందులో కీలకమైన అంశం 'పి.ఎం. గతిశక్తి'... 'బ్రాడర్ విజన్' పేరుతో దేశవ్యాప్తంగా 1600 రకాల 'జియో స్పెటల్ డేటా'ను సేకరించి ఈ 'నేషనల్ మాస్టర్ ప్లాన్' ప్రాజెక్టు కోసం ఇక్కడ భద్రపరుస్తున్నారు.

పక్కా 'డేటా'తో అభివృద్ధి ప్రణాళికల తయారీకోసం వీటిని సేకరిస్తున్నారు. ఇందులో 'నేచురల్ రిసోర్సెస్ డేటా' సేకరణ ఒక అంశంగా ఉంది. ప్రాంతాల స్వరూపం తెలియడం కోసం 'ల్యాండ్ రికార్డ్ డేటా' అవసరం. అలాగే సాగు కోసం భూగర్భ జలాల వినియోగం ఎంతో తెలియడానికి వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చాలి. నిజానికి ఇవి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వీటిని ప్రతిపక్షాలు ఎన్నికల్లో ఏ స్థాయిలో అల్లరి చేసిందీ తెలిసిందే.

'అభివృద్ధి' గురించి ఆంధ్రప్రదేశ్‌లో మాట్లాడితే అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు మార్చి 2023లో విశాఖలో



జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పింది ఏమిటో చూడాలి. ఇందులో కీలకం ఏమంటే, ఆయన దృష్టి ఆసాంతం ఢిల్లీ నుంచి కిందికి దక్షిణాదికి దిగే క్రమంలో ఢిల్లీ యంత్రాంగాన్ని నేరుగా తూర్పు తీరానికి చేర్చడంపై పెట్టారు. 'ప్రస్తుతం ఢిల్లీ నుంచి బొంబాయి చేరి అక్కణ్ణించి నాగపూర్ వచ్చి అక్కణ్ణించి దక్షిణాది రాష్ట్రాల్లోకి ప్రవేశించడానికి రోడ్డు ప్రయాణంలో ఎదురవుతున్న కష్టాన్ని చెబుతూ... ఇప్పుడు నిర్మాణంలో ఉన్న 'నేషనల్ హైవేస్' డిసెంబర్ 2024 నాటికి పూర్తి అవుతాయనీ, అవి పూర్తి అయితే వాటిలో ఒకటైన 'రాయపూర్–విశాఖపట్టణం' రోడ్డు ద్వారా ఖనిజ నిక్షేపాలు ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు ఏపీ పోర్టులు అందుబాటులోకి వస్తాయనీ ఆయన అన్నారు. ప్రస్తుతం ఇక్కడ 2,014 కి.మీ. పొడవైన 70 రోడ్డు ప్రాజెక్టులు రూ. 33.540 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. ఇలా ఢిల్లీ నుంచే కాకుండా, సెంట్రల్ ఇండియా నుంచి దక్షిణాన మన సముద్ర తీరానికి రెండు మూడు మార్గాల్లో తేలిగ్గా చేరవచ్చన్నారు. సరే, ఇది విని 'ఎందుకు?' అని మనం ప్రశ్న వేసుకుంటే దానికి జవాబు నాలుగు నెలల తర్వాత కాకినాడలో దొరికింది. అక్టోబర్ 28న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పరిశ్రమలు–వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్' సదరన్ కేంపస్ ప్రారంభానికి హాజరై ఆంధ్ర సముద్ర తీరం ఢిల్లీకి ఎంత కీలకమో చెప్పకనే చెప్పారు.

ఇక వెనకబడిన మెట్ట కరవు ప్రాంతాలను 'ఓపెన్' చేయడానికి నడికుడి– శ్రీకాళహస్తి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నడికుడి నుంచి పల్నాడు జిల్లా శావల్యాపురం వరకు పనులు పూర్తి చేశారు. రెండో దశలో దర్శి వరకు రైల్వే లైన్ మార్చి నాటికి పూర్తయింది. అద్దంకి రోడ్డు వద్ద స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్త రాష్ట్రంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తనదైన సంక్షేమ ముద్రను ప్రతి రంగం మీద వేసింది. కుర్చీ ఎక్కిన ఆరు నెలల్లోనే వచ్చిన 'కరోనా' మహమ్మారిని నిలువరించడంలో దేశంలోనే 'ఏపీ' ముందు నిలిచింది.


జగన్ ముందు చూపు అప్పట్లో అందరికీ అర్థం కాలేదు. కేంద్రం 'గతిశక్తి సంఘటన్' పేరుతో చేస్తున్న మౌలిక వసతుల కల్పన వల్ల రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, జగన్ ప్రభుత్వం ప్రజల పాటవ నిర్మాణం (కెపాసిటీ బిల్డింగ్) పై దృష్టి పెట్టింది. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, విద్య–వైద్యం ప్రాధాన్యత పెంచింది. కొత్త జిల్లాలతో ప్రభుత్వాన్ని, కొత్త మెడికల్ కాలేజీలతో వైద్యాన్ని కొత్త ప్రాంతాలకు చేర్చింది. నైపుణ్యాలు తప్పనిసరి అయ్యే సామాజిక వర్గాలు – ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల జీవిక కోసం 'స్కిల్ డెవలప్మెంట్'పై దృష్టి పెట్టింది. అయినా ఎన్నికలప్పుడు 'అభివృద్ధి ఏది?' అనే విమర్శ చేయడం చాలా తేలిక. కానీ 'అభివృద్ధి' అంటే 'మానవాభివృద్ధి' అని అర్థమయ్యేట్టుగా చెప్పడం మరీ కష్టం.

వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

జిజ్ఞాసువులు

సృష్టి ఆరంభంలో సృష్టికర్తకు అల్పజనాభా సమస్య ఎదురైంది. తను సృష్టించిన విశాల విశ్వంలో వనరులు వినియోగంలోకి తెచ్చేందుకు అప్పటికి జనాభాయే లేదు. జనాభాను త్వరితంగా వృద్ధి చేస్తారన్న ఆశతో ఆయన మొదట సన, సనక్, సనందన, సనత్కుమారులనే నలుగురు మానస పుత్రులను సృష్టించాడు. అయితే వాళ్ళకు వైరాగ్యంలో, వేదాంతంలో తప్ప, గృహస్థ జీవితం గడిపి జనసంఖ్య వృద్ధి చేయటంలో ఎలాంటి ఆసక్తీ లేకపోయింది. అందుకే వాళ్ళు పెళ్ళిళ్ళూ, సంసారాలూ పెట్టుకోకుండా, తమకు బ్రహ్మజ్ఞానం, మోక్ష జ్ఞానం ఎవరు ఉపదేశిస్తారా అని అన్వేషిస్తూ తిరిగారు.

'ఎవరో ఎందుకు? పరబ్రహ్మ తత్వం చతుర్ముఖ బ్రహ్మ దగ్గర నేర్చుకోండి' అని, నారదుడు వాళ్ళని బ్రహ్మ లోకానికి తీసుకెళ్ళాడు. అక్కడ బ్రహ్మ తన భార్య వీణా వాదనను తన్మయత్వంతో వింటూ కనిపించాడు. అది చూసి, 'ఈయనే సాంసారిక బంధాలలో నిమగ్నుడైపోయి ఉన్నాడు. ఈయనను వైరాగ్యం గురించి ఎలా అడుగుతాం!' అనిపించి, నారదుడు వాళ్ళను వైకుంఠానికి తీసుకెళ్ళాడు. అక్కడ, మహాలక్ష్మి పాదాలొత్తుతూ సేవ చేస్తుండగా, మాధవుడు ఆమెతో సల్లాపాలాడుతూ కనిపించాడు. ఆ అన్యోన్య దాంపత్యం చూస్తుంటే, వేదాంత విద్య నేర్పటానికి ఆ స్వామి సరయిన గురువు అవుతాడని వాళ్ళకు నమ్మకం కుదరలేదు. అక్కడినుంచి కైలాసం వెళితే, కైలాస నాథుడు భార్యను అసలే వీడలేనట్టు అర్ధనారీశ్వరుడుగా కూర్చొని ఉన్నాడు. ఇక మోక్ష విద్యను గురించి ఆయనను ఏమడుగుతారు?



జ్యోతిర్మయం

ఆయనకు నమస్కరించి వాళ్ళు వెనుదిరిగి వెళ్తుంటే, విశ్వేశ్వరుడికి బోధపడింది. జగత్పితరులను సంసార లంపటులైన సామాన్య గృహస్థులుగా పొరబడిన వాళ్ళ అమాయకత్వానికి జాలిపడినా, వాళ్ళకున్న తదేకమైన బ్రహ్మజిజ్ఞాసను పరమ శివుడు మెచ్చాడు. వాళ్ళు తిరిగి వెళ్తున్న మార్గంలో ఒకచోట, ఒక వటవృక్షం కింద, దక్షిణాభిముఖుడై, చిన్ముద్రలో కూర్చొని, శ్రీ దక్షిణామూర్తిగా వాళ్ళకు దర్శనమిచ్చాడు. ఉత్తమ జిజ్ఞాసువులైన శిష్యవరులకు, ఆ యువ గురువు మౌన వ్యాఖ్యతోనే పరబ్రహ్మ స్వరూపం ప్రకటించాడు. నోటి మాట లేకుండానే ఆ గురుమూర్తి, శిష్యుల సంశయాలన్నింటినీ ఛిన్నం చేశాడు. తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే!

– ఎం. మారుతి శాస్త్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.నవమి ఉ.6.22 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఆశ్లేష ప.1.20 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.2.11 నుండి 3.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.34 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.37 నుండి 1.20 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 5.31.

పట్టా చేయమంటే పట్టుకుని కొట్టారు

- దళిత రైతుపై డిప్యూటీ తహసీల్దార్, అటెండర్ దాడి
- నాలుగేళ్లుగా తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న రైతు
- కరీంనగర్ జిల్లా చిగురుమామిడి రెవెన్యూ ఆఫీసులో ఘటన


మాతంగి తిరుపతి

చిగురుమామిడి: భూమి పట్టా చేయాలని నాలుగేళ్ల నుంచి తిరుగుతున్న ఓ దళిత దివ్యాంగ రైతుపై డిప్యూటీ తహసీల్దార్, అటెండర్ దాడి చేశారు. దివ్యాంగుడనే కనికరం లేకుండా వీపుపై పిడిగుద్దులు గుద్ది, కడుపులో తన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.

కౌలు చేసుకుంటూ కాజేశారు..

మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మాతంగి తిరుపతి తల్లి రాజవ్వకు చిగురుమామిడిలో ఎకరం భూమి ఉంది. దాన్ని తిరుపతి మేనమామలు ఇద్దరు కౌలుకు సాగుచేశారు. అక్రమంగా తమ పేరిట పట్టా చేసేసుకున్నారు. విషయం తెలిసిన రాజవ్వ.. తిరుపతితో కలసి నాలుగేళ్ల క్రితం చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. కబ్జాలో రాజవ్వ, పట్టాలో తన ఇద్దరు సోదరులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూమిని రాజవ్వ పేరిట మార్చేందుకు సమయం పడుతుందని అధికారులు చెప్పారు. దీంతో న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు తిరుపతి ఫిర్యాదు చేశాడు.

ఎన్నిసార్లు ఆధారాలివ్వాలని అడిగినందుకు...

గురువారం మరోసారి చిగురుమామిడి తహసీల్దార్ రమేశ్‌కు ఫిర్యాదు చేశాడు. సమస్య విన్న తహసీల్దార్ పూర్తి ఆధారాలు ఇస్తే న్యాయం చేస్తామన్నారు. దీంతో ''నాలుగేళ్లుగా తిరుగుతున్నా.. ఎంతమంది అధికారులకు కాగితాలు ఇవ్వాలి. ఇచ్చినవి ఇచ్చినట్లు మాయం చేస్తూ మళ్లీ అడుగుతున్నారు'' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో అటెండర్ కంకణాల రాజేందర్ తిరుపతిని బయటికి నెట్టేశాడు. అక్కడే ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి కూడా తిరుపతిపై దాడి చేశాడు. బాధితుడు 100కు డయల్ చేసినా ఫలితం లేదు. విషయం తెలుసుకున్న స్థానిక ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తిరుపతికి న్యాయం చేయాలని, తిరుపతిపై దాడి చేసిన పార్థసారథి, రాజేందర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆందోళన చేశారు. దీనిపై తహసీల్దార్, అటెండర్లను వివరణ కోరగా.. తాము తిరుపతిపై దాడి చేయలేదని కేవలం బయటకు వెళ్లాలని మాత్రమే చెప్పామని తెలిపారు.

ఎమ్మెల్యే కోవా లక్ష్మికి హైకోర్టులో ఊరట

- ఆమె ఎన్నికను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ డిస్మిస్
- ఏడాదిలోగానే ఎన్నికల పిటిషన్‌లో తీర్పు వెలువరించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎన్నికను సవాల్ చేస్తూ ఆసిఫాబాద్ కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యామ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో కోవా లక్ష్మి సరైన సమాచారం ఇవ్వలేదని, ఆమె ఎన్నిక చెల్లదని హైకోర్టులో శ్యామ్ పిటిషన్ వేశారు. ఎన్నికల సంఘం గత ఐదేళ్ల ఆదాయపన్ను రిటర్న్‌ల వివరాలను అందించాలని అభ్యర్థులందరినీ ఆదేశించినా.. ఆమె 2021–22, 2020–21, 2019–20, 2018–19 ఏళ్ల రిటర్న్‌లపై సమాచారాన్ని ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(2)కు విరుద్ధమన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎన్నికల సందర్భంగా సరైన సమాచారం ఇవ్వలేదనడానికి ఆధారాలు లేవంటూ శ్యామ్ పిటిషన్‌ను కొట్టివేశారు.

ప్రజావిశ్వాసం పెంపొందించేలా..

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 86 (7), సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు హైకోర్టు ఎన్నికల వ్యాజ్యం (ఈపీ)లను ఆరు మాసాల్లో పరిష్కరించాలి. గతంలో ఐదేళ్ల పదవీకాలం ముగిసే దశలో ఒకోసారి ఐదేళ్ల పదవీ కాలం పూర్తయ్యాక ఈపీలో తీర్పులు వచ్చిన సందర్భాలున్నాయి. తాజాగా దాఖలైన ఈపీపై 9నెలల 20 రోజుల్లో తీర్పు చెప్పి హైకోర్టు కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఈ కేసులో ఇరుపక్షాల న్యాయవాదులు సహకరించడం వల్లే సత్వరమే తీర్పు చెప్పినట్లు జస్టిస్ కె.లక్ష్మణ్ వివరించారు.

స్థానికతను కూడా పరిగణనలోకి తీసుకోండి

జీవో 317 అమలుపై సీఎస్‌కు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వినతి


317 జీవోపై సీఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: జీవో 317 అమలులో స్థానికతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, జీవో కారణంగా ఏర్పాటైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేసింది. జీవో 317పై ఉద్యోగుల అభ్యంతరాలను, పరిష్కారానికి గల మార్గాలను ఈ వినతిపత్రంలో పేర్కొంది. అనంతరం జేఏసీ నేతలతో కలసి లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ జీవో 317 విషయంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం, సకాలంలో ఈ కమిటీ నివేదిక ఇవ్వడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికలో స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ గ్రౌండ్స్‌లోని ఉద్యోగులకు న్యాయం చేయాలని సిఫారసు చేసినట్టు తెలిసిందన్నారు. నాడు ఈ జీవో అమల్లోకి రాకుండా అడ్డుకోవడంలో ఉద్యోగ సంఘాల నేతలు విఫలమయ్యారని ఆరోపించారు. అశాస్త్రీయ జోనల్ విభజన కారణంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు స్థానికత కోల్పోయారని, వారికి న్యాయం చేయాలని, అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి వారిని స్థానిక ప్రాంతానికి పంపాలని ప్రభుత్వాన్ని కోరినట్టు వెల్లడించారు. జేఏసీ నేతలు డాక్టర్‌నిర్మల, హన్మంతరావు, కత్తి జనార్దన్, రమేశ్‌పాక, దర్శన్‌గౌడ్, గరికె ఉపేందర్‌రావు, సుగంధిని, హేమలత, శ్రీధర్, రాబర్ట్ బ్రూస్, మల్లేశ్ పాల్గొన్నారు.

317 జీవో తప్పిదాలు సరిచేయవచ్చు

జేఏసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న 317 జీవో తప్పిదాలను సరిచేసేందుకు ప్రభుత్వానికి అధికారం ఉందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర బృందం సభ్యుడు, జేఏసీ జనరల్ సెక్రటరీ ఏలూరు శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచన మేరకు శుక్రవారం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి 317 జీవో అమలుకు గల అవకాశాలపై పలు సూచనలు చేశారు. స్థానికత అంశంలో 1975 రాష్ట్రపతి ఉత్తర్వులకు.. 2018 రాష్ట్రపతి ఉత్తర్వులు కొన్ని సవరణలకు అవకాశం కల్పించిందని తెలిపారు. నియామకం జరిగినప్పుడున్న స్థానికతనే ఉద్యోగ విరమణ వరకూ అనుసరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత.. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికే వర్తిస్తుందని తెలిపారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలు, సూచనలు, అప్పీళ్లను పరిష్కరించలేదన్న అంశాన్ని సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు మరో ఉద్యమం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో కుట్ర జరుగుతోందని..వర్గీకరణ అమలు సాధనకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన మాదిగల ధర్మ యుద్ధ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలును మాలలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పిస్తే అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ ఇచ్చిన మాటతప్పారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండానే 11 వేల ఉద్యోగాలు భర్తీ చేయడంతో 1,100 మంది మాదిగ నిరుద్యోగులు నష్టపోయారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 30 వరకు తెలంగాణలోని అన్ని జిల్లాలు, నవంబర్ 1 నుంచి ఏపీలో అన్ని జిల్లాల్లో సభలు నిర్వహించనున్నట్లు మంద కృష్ణ తెలిపారు. తొలుత జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమే కాక మాదిగ అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

హైడ్రా ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు సీజే ధర్మాసనం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)కు విస్తృత అధికారాలు కట్టబెడుతూ ఇచ్చిన ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసకువచ్చిన విషయం తెలిసిందే. దీనికి అక్టోబర్ 3న గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి(మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుమారుడు) హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం–1955ని సవరిస్తూ ఇచ్చిన ఆర్డినెన్స్ సస్పెన్షన్‌కు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సరస్సులు, నాలాలు, ఇతర ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో.. అలాగే అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేయడంలో హైడ్రాకు ఈ ఆర్డినెన్స్‌తో విస్తృత అధికారాలు వచ్చాయన్నారు. అయితే జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, వాల్టాలోని అధికారాలు హైడ్రాకు బదలాయించారని.. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనను పరిశీలించిన ధర్మాసనం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శిలకు నోటీసులు జారీ చేసింది.

అడ్వాంటేజ్ డొనాల్డ్ ట్రంప్

హారిస్‌తో ఉత్కంఠ పోరు

- తాజా సర్వేల్లో ఆధిక్యం- 2 పాయింట్ల లీడ్‌లోకి
- స్వింగ్ రాష్ట్రాల్లోనూ ముందంజ
- బెట్టింగుల్లోనూ ట్రంప్‌దే హవా





అమెరికా అధ్యక్ష ఎన్నికలకు పది రోజులే మిగిలి ఉంది. పోలింగ్ తేదీ నవంబర్ 5 దగ్గర పడుతున్న కొద్దీ ప్రచార హోరు పెరిగింది. పోల్స్ ఫలితాలు కూడా తారుమారవుతున్నాయి. అధ్యక్ష బరి నుంచి ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకొన్న మొదట్లో వరుస పోల్స్ హారిస్ వైపే మొగ్గు చూపాయి. కానీ తీరా పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ పరిస్థితి క్రమంగా తారుమారు అవుతున్నట్టు కన్పిస్తోంది. కీలక రాష్ట్రాల్లో ట్రంప్ ఆధిక్యంలోకి వెళ్తున్నారు. అంతేగాక తాజా పోల్స్‌లో సానుకూలతను పెంచుకున్నారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ట్రంప్, హారిస్ పోరు తారాస్థాయికి చేరుతోంది. మొన్నటిదాకా సర్వేల్లో హారిస్ ఆధిక్యంలో ఉండగా తాజాగా ట్రంప్ కాస్త ముందంజలోకి వచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ తాజా సర్వేలో ట్రంప్ 47 శాతం మద్దతు దక్కించుకోగా హారిస్‌కు 45 శాతం ఓట్లు పోలయ్యాయి. సీఎన్‌బీసీ ఆల్ అమెరికన్ ఎకనమిక్ సర్వేలోనూ హారిస్ కంటే ట్రంప్ రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. హోరాహోరీ పోరు సాగుతున్న 7 కీలక స్వింగ్ రాష్ట్రాల్లోనూ తాజా సర్వేల్లో హారిస్ కంటే ట్రంప్ ఒక్క పాయింట్ ఆధిక్యం సాధించారు. డెమొక్రాట్ల కంచుకోటలైన మిషిగన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియాతో పాటు నల్లజాతీయులు, లాటినో ఓటర్లలో ఆయన పట్టు సాధిస్తున్నారు. ఇది డెమొక్రాట్లకు ఆందోళన కలిగిస్తోంది. అయితే ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ప్రధాన పోల్స్ అన్నింటినీ విశ్లేషించే రియల్‌క్లియర్‌పాలిటిక్స్ ప్రకారం హారిస్ ఇప్పటికీ ట్రంప్‌పై 0.3 శాతం ఆధిక్యంలో ఉన్నారు. కాకపోతే స్వింగ్ స్టేట్లలో మాత్రం ట్రంప్‌కే 0.9 శాతం మొగ్గుందని అది తేల్చింది. అమెరికా బెట్టింగ్ మార్కెట్ అయితే ట్రంప్ విజయావకాశాలను ఏకంగా 61 శాతంగా అంచనా వేసింది. హారిస్ గెలిచేందుకు 39 శాతం మాత్రమే చాన్సుందని పేర్కొంది. ట్రంప్‌పై కొన్ని రోజులుగా హారిస్ తీవ్ర విమర్శలు చేస్తుండటం తెలిసిందే. హిట్లర్‌ను ప్రశంసించిన ట్రంప్ అంతకంటే నియంత అంటూ దుయ్యబట్టారు. ఆయనో అసమర్థుడని ఎద్దేవా చేశారు. ట్రంప్ మళ్లీ అధికారంలోకి వస్తే పర్యవసానాల గురించి పదేపదే హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హారిస్ పాపులర్ ఓట్లను గెలుచుకోవచ్చని సర్వేలంటున్నాయి. కానీ కీలక రాష్ట్రాలను కైవసం చేసుకుంటేనే ఎన్నికల విజయం సాధ్యం. మరోవైపు చాలా రాష్ట్రాల్లో ఓటర్లకు హారిస్‌పై పలు అంశాల్లో ఇప్పటికీ అభ్యంతరాలున్నాయి. మరోవైపు ముందస్తు ఓటేసిన అమెరికన్ల సంఖ్య 3.1 కోట్లు దాటింది.

పెన్సిల్వేనియాలో ట్రంప్ ఆధిక్యం

స్వింగ్ రాష్ట్రాల్లో అత్యంత ముఖ్యమైనది పెన్సిల్వేనియా. వాటిలో అత్యధికంగా 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్న రాష్ట్రం. ఇక్కడి ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రకటనలపైనే రెండు పార్టీలు కోట్లు వెచ్చించాయి. ఇక్కడి ఓటర్లు ఆర్థిక వ్యవస్థపై చాలా ఆందోళన చెందుతున్నారు. వారు క్రమంగా ట్రంప్ వైపే మొగ్గుతున్నారు. వివాదాస్పద, కుంభకోణాల వ్యక్తిగా ట్రంప్‌పై విముఖత ఉన్నా ఆయన హయాంలో ఆహారం, పెట్రోల్ ధరలు తక్కువగా ఉండేవని అభిప్రాయపడుతున్నారు. ఇక్కడి మహిళలు మాత్రం హారిస్ పట్ల సానుకూలంగా ఉన్నారు. ''ట్రంప్ వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన దారుణం. ఆయన్ను మరోసారి వైట్‌హౌస్‌కు పంపించేదే లేదు'' అంటున్నారు. కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, మాజీ ఉపాధ్యక్షుడు డిక్ షెనీ కూతురు లిజ్ షెనీ వంటివారి ప్రచారం కూడా హారిస్‌కు ఎంతో కొంత కలిసి రానుంది.

'అబార్షన్ హక్కులు' ప్రభావం చూపేనా?

హారిస్‌కు అమెరికావ్యాప్తంగా ఉన్న సానుకూలత మహిళా ఓటర్లలో బలమైన ఆధిక్యం. ఆమె అభ్యర్థిత్వమే చరిత్రాత్మకం. కానీ ఆమె దీనిపై ప్రచారం చేసుకోవడం లేదు. మహిళల అబార్షన్ హక్కులకు బలంగా మద్దతిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టిన అత్యంత కఠినమైన అబార్షన్ నిషేధం మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీన్ని రాజ్యాంగంలో చేర్చాలా వద్దా అనే అంశాన్ని పది రాష్ట్రాలు ఓటింగ్‌కు పెట్టాయి. అలాంటి రాష్ట్రాల్లో అరిజోనాలో హారిస్‌కు మెజారిటీ వచ్చే అవకాశముంది. అయితే అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగినప్పుడు సృష్టించిన వాతావరణాన్ని హారిస్ బలంగా కొనసాగించలేకపోయినట్టు పోల్స్ చెబుతున్నాయి.

డెమొక్రాట్లకు 'గాజా' షాక్
ట్రంప్‌కే అరబ్-అమెరికన్ల జయహో

కీలక రాష్ట్రాల్లో ఒకటైన మిషిగన్‌లో అరబ్-అమెరికన్ ఓటర్లు అత్యధికంగా ఉంటారు. 2020లో బైడెన్ కేవలం అక్కడ 1.5 లక్షల ఓట్ల తేడాతో గెలిచారు. ఇక్కడ అరబ్ అమెరికన్ల జనాభా 3 లక్షలు. గాజా, లెబనాన్లలో ఇజ్రాయెల్ దాడులను నియంత్రించడంలో బైడెన్ విఫలమయ్యారని వారంతా భావిస్తున్నారు. ఈ ప్రభావం నేరుగా డెమొక్రాట్ల అభ్యర్థి హారిస్‌పై పడేలా ఉంది. ఉపాధ్యక్షురాలిగా హారిస్ కూడా దీనికి బాధ్యురాలేనని వారు భావిస్తున్నారు. డెమొక్రాట్ల కంటే అధిక వామపక్ష భావాలున్న వారిలోనూ ఇదే ధోరణి కనబడుతోంది. ''మేమంతా ట్రంప్‌కు ఓటేస్తాం. అంతేగాక ఆయనకే ఓటేయాలని ఇతరులకూ చెబుతాం'' అని వారంటున్నారు. ''మేం ట్రంప్‌కు ఓటేస్తామని ఏడాది కిందట ఊహించను కూడా లేదు. కానీ ఇప్పుడు డెమొక్రాట్లను క్షమించలేం. హారిస్‌కు ఓటేసేది లేదు'' అని స్పష్టంగా చెబుతున్నారు. మిషిగన్‌లో కార్మికవర్గం, యూనియన్ల ఓట్లు కూడా కీలకంగా మారనున్నాయి. తామెవరికీ మద్దతివ్వబోమని ఇప్పటికే కొన్ని యూనియన్లు ప్రకటించాయి. హారిస్‌పై కొన్ని అభ్యంతరాలున్నా ఆమె తప్ప ప్రత్యామ్నాయం లేదని కొందరు భావిస్తుండటం ఆమెకు కాస్త కలిసొచ్చే అంశం.

- సాక్షి, నేషనల్ డెస్క్


పెట్టుబడులకు గమ్యస్థానం భారత్

- ఎన్నో అవకాశాలున్నాయి.. సద్వినియోగం చేసుకోండి
- విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- భారత కార్మికులకు వీసాల సంఖ్యను 90 వేలకు పెంచిన జర్మనీ
- ఢిల్లీలో 'ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్' సదస్సు

న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. తమ దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావాలని విదేశీ వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. భారత అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా మారడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'మేక్ ఫర్ ద వరల్డ్' కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఆహ్వానించారు. నేడు ప్రపంచ వ్యాపార, వాణిజ్య, తయారీ కేంద్రంగా భారత్ అభివృద్ధి చెందిందని వెల్లడించారు. పెట్టుబడులకు భారత్ కంటే మెరుగైన దేశం మరొకటి లేదని స్పష్టంచేశారు. శుక్రవారం ఢిల్లీలో '18వ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్-2024' సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సదస్సు జరగడం 12 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్‌తో పాటు భారత్, జర్మనీ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇదే సరైన సమయమని విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాని సూచించారు. నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులపై జర్మనీ ఎంతగానో ఆసక్తి చూపుతోందని, వారికి ప్రతిఏటా ఇచ్చే వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని నిర్ణయించిందని తెలిపారు. దీనివల్ల జర్మనీ ఆర్థిక వ్యవస్థకు లబ్ధి చేకూరుతుందని ఉద్ఘాటించారు. సదస్సులో ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

'ఫోకస్ ఆన్ ఇండియా' హర్షణీయం

''ప్రజాస్వామ్యం, జనాభా, డిమాండ్, డేటా అనే నాలుగు బలమైన మూలస్తంభాలపై భారత్ నేడు సగర్వంగా నిల్చుంది. రహదారులు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, ఓడరేవుల అభివృద్ధికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెడుతున్నాం. 2047 నాటికి ఇండియాను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేశాం. ఇది చాలా కీలక సమయం. అందుకే ఇండియాతో సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా జర్మనీ కేబినెట్ 'ఫోకస్ ఆన్ ఇండియా' అనే డాక్యుమెంట్ విడుదల చేసింది. ఇది నిజంగా హర్షణీయం. జర్మనీ సంస్థలకు ఇండియాలో ఎన్నో వ్యాపార అవకాశాలు ఉన్నాయి. పెట్టుబడిదారులకు, వ్యాపారవేత్తలకు భారత్ కంటే మెరుగైన దేశం ఇంకెక్కడైనా ఉందా? లేదని కచ్చితంగా చెప్పగలను. భారతదేశ ప్రగతికి టాలెంట్, టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనేవి నాలుగు అంశాలు. వీటిని ముందుకు నడిపించడానికి మా వద్ద 'ఆకాంక్షలతో కూడిన భారత్' అనే ఇంధనం ఉంది. నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత ప్రజాస్వామీకరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. కృత్రిమ మేధ(ఏఐ), సెమీకండక్టర్, గ్రీన్ హైడ్రోజన్, అంతరిక్ష సాంకేతికత అనేవి మాకు చాలా ముఖ్యమైన కార్యక్రమాలు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు, ఒప్పందాలకు అద్భుతమైన అవకాశాలున్నాయి. వాటిని విదేశీ వ్యాపారవేత్తలు.. ముఖ్యంగా జర్మనీ వ్యాపారవేత్తలు ఉపయోగించుకోవాలి'' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.


శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జర్మనీ చాన్స్‌లర్ స్కోల్జ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

శాంతి స్థాపనకు సహకరిస్తాం

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఆయా ప్రాంతాల్లో శాంతి స్థాపన కోసం అన్ని రకాలుగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. ఏడో ఇంటర్-గవర్నమెంటల్ కన్సల్టేషన్స్(ఐజీసీ)లో భాగంగా మోదీ శుక్రవారం ఢిల్లీలో జర్మనీ చాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్‌తో సమావేశమయ్యారు. భారత్-జర్మనీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలికేలా రాజకీయ పరిష్కారం కోసం భారత్ కృషి చేయాలని స్కోల్జ్ కోరారు. మోదీ బదులిస్తూ.. యుద్ధాలతో సమస్యలకు పరిష్కారం లభించదని, చర్చలు, దౌత్యమార్గాల్లో ప్రయత్నించాలన్నదే భారత్ విధానమని తేల్చిచెప్పారు.

మోదీ, స్కోల్జ్ చర్చల్లో బేబీ అరిహా షా ప్రస్తావన

న్యూఢిల్లీ: భారత ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ అలాఫ్ స్కోల్జ్ మధ్య శుక్రవారం జరిగిన చర్చల్లో మూడేళ్ల చిన్నారి బేబీ అరిహా షా ప్రస్తావన కూడా వచ్చింది. ఈ అంశాన్ని స్కోల్జ్‌తో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెప్పారు. చిన్నారిని అప్పగించాలని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారని, ఈ అంశాన్ని తాము నిశితంగా పరిశీలిస్తున్నామని స్కోల్జ్ చెప్పినట్లు వెల్లడించారు. భారత్‌లోని గుజరాత్‌కు చెందిన దారా షా, భవేష్ షా దంపతులు ఉద్యోగం నిమిత్తం 2018లో జర్మనీకి వెళ్లారు. అక్కడే వారికి 2021లో అరిహా షా జన్మించింది. చిన్నారిని దారుణంగా వేధించారని ఆరోపిస్తూ దంపతులపై అక్కడి అధికారులు కేసు నమోదు చేశారు. కేవలం ఏడు నెలల వయసున్న అరిహా షాను 2021 సెప్టెంబర్ 23న ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉంది. దారా షా, భవేష్ షా దంపతులపై కేసు రద్దయ్యింది. చిన్నారిని మాత్రం ఇంకా అప్పగించలేదు. దాంతో వారిద్దరూ భారత్‌కు తిరిగి వచ్చి న్యాయ పోరాటం చేస్తున్నారు.

కెనడాలో టెస్లా కారుకు ప్రమాదం..
నలుగురు భారతీయులు సజీవ దహనం



టొరంటో: అదుపుతప్పిన టెస్లా కారుకు మంటలు అంటుకుని నలుగురు భారతీయులు దుర్మరణం చెందారు. కెనడాలోని టొరంటోలోని డౌన్‌టౌన్‌లో బుధవారం అర్ధరాత్రి టెస్లా కారు అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొట్టింది. ఆపై అందులోని బ్యాటరీ నుంచి మొదలైన మంటలు వ్యాపించి కారులో ఉన్న ఐదుగురిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటుగా వెళ్తున్న వారు వెంటనే స్పందించి ఝలక్ పటేల్‌ను కారు అద్దాలు పగులగొట్టి బయటకు లాగారు. ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు సమాచారం. ప్రాణాలు కోల్పోయిన వారిలో గుజరాత్‌లోని గోద్రాకు చెందిన తోబుట్టువులు కెటా గోహిల్(30), నీల్ గోహిల్(26)ఉన్నారు. మరో ఇద్దరిని ఆనంద్ జిల్లాకు చెందిన దిగ్విజయ్ పటేల్, జే సిసోడియాగా గుర్తించారు. వీరంతా స్నేహితుడి బర్త్ డే పార్టీ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా విషాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. కాగా, వీరి వాహనం సెల్ఫ్ డ్రైవింగ్ కారా కాదా అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ ఎలక్ట్రిక్ వాహనానికి అంటుకున్న మంటలను ఆర్పివేసేందుకు భారీగా నీళ్లు అవసరమయ్యాయని ఫైర్ అధికారి తెలిపారు. మంటలు ఆర్పాక బ్యాటరీ సెల్‌ను పక్కన పడేసి, కారులో ఇసుకను నింపి డంప్‌యార్డుకు తీసుకెళ్లామన్నారు. బ్యాటరీ వల్లే ప్రమాదం తీవ్రత పెరిగిందని భావిస్తున్నామన్నారు.

పెంపుడు కుక్క టిటో, పనిమనిషికి కూడా..
వీలునామాలో ఆస్తులను పంచిన రతన్ టాటా



ముంబై: పారిశ్రామికవేత్త రతన్ టాటా తన దాతృత్వాన్ని చనిపోయాక కూడా చాటుకున్నారు. తన రూ.10 వేల కోట్ల ఆస్తుల్లో తోబుట్టువులకే కాదు, పెంపుడు శునకం టిటో, పనిమనిషి సుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ శంతను నాయుడుకు కూడా వాటాలు పంచుతూ వీలునామా రాశారు. టాటా గ్రూప్ చైర్మన్ మాతృసంస్థ టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా ఈ నెల 9వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. తనకెంతో ప్రీతిపాత్రమైన జర్మన్ షెపర్డ్ శునకం టిటో సంరక్షణ బాధ్యతలను జీవితకాలం పాటు వంటమనిషి రజన్ షా చూసుకోవాలని కోరారు. ఆస్తుల్లో సోదరుడు జిమ్మీ టాటా, సవతి సోదరీమణులు షిరీన్, డియానా జీజాభాయ్‌లకు కొంత కేటాయించారు. టాటా సన్స్‌లో వాటాను రతన్ టాటా ధార్మిక ఫౌండేషన్‌కు బదిలీ చేయాలని కోరారు. విల్లుపై బాంబే హైకోర్టు విచారణ జరపనుందని అధికారులు తెలిపారు. తన ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ శంతను నాయుడుకు చెందిన గుడ్‌ఫెలోస్‌లో పెట్టిన పెట్టుబడిని వదిలేయాలని, విదేశాల్లో చదువుకునేందుకు నాయుడుకిచ్చిన రుణం మాఫీ చేయాలని వీలునామాలో తెలిపారు.

సమాజం పట్ల కరుణతోనే న్యాయమూర్తిగా నిలదొక్కుకున్నా..
సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడి



ముంబై: న్యాయస్థానాలు, న్యాయమూర్తులు సైతం సూక్ష్మ పరిశీలనకు గురి కావాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. న్యాయమూర్తుల పనితీరును చుట్టూ ఉన్న సమాజం పరిశీలిస్తూనే ఉంటుందని అన్నారు. అయితే, సమాజం పట్ల ఉన్న దయ, కరుణ, జాలి, అనురాగం వల్లే తాను అన్ని రకాల పరిశీలనలు, పరీక్షలకు నిలిచి, న్యాయమూర్తిగా నిలదొక్కుకున్నానని తెలిపారు. సమాజం పట్ల తమ ప్రేమానురాగాలు తమ తీర్పుల ద్వారా వెల్లడవుతాయని వివరించారు. జస్టిస్ చంద్రచూడ్ వచ్చే నెల 10వ తేదీన పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముంబైలో ఆయనను ఘనంగా సత్కరించారు. జస్టిస్ చంద్రచూడ్ అందించిన సేవలను న్యాయవాదులు ప్రశంసించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ తాను ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. ''ఐఐటీ-ధన్‌బాద్‌లో చేరేందుకు సకాలంలో అడ్మిషన్ ఫీజు రూ.17,500 చెల్లించలేకపోయిన దళిత విద్యార్థికి మా ఆదేశాలతో ప్రవేశం లభించింది. ఇలాంటి తీర్పులు తనకెంతో సంతృప్తిని ఇచ్చాయి'' అని తెలిపారు.

ఎల్‌ఏసీ నుంచి బలగాల ఉపసంహరణ ప్రారంభం

- వెనక్కి మళ్లుతున్న భారత్, చైనా సేనలు
- ఈ నెల 29 కల్లా పూర్తయ్యే అవకాశం

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో సంఘర్షణాత్మక ప్రాంతాలైన డెమ్‌చోక్, డెప్సాంగ్ నుంచి భారత్, చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 28, 29వ తేదీ కల్లా ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని భారత సైనిక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి ఉన్న బలగాలను వెనక్కి తీసుకోవాలని భారత్, చైనా నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ఇరుపక్షాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఎల్‌ఏసీ వద్ద భారత్, చైనా నడుమ నాలుగేళ్లుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. బలగాల ఉపసంహరణ పూర్తయిన తర్వాత సరిహద్దు వెంబడి పెట్రోలింగ్ ప్రారంభమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇరుదేశాల సైన్యం వారి యథాస్థానాలకు చేరుకుంటుందని పేర్కొన్నాయి. ఎల్‌ఏసీ వద్దనున్న తాత్కాలిక నిర్మాణాలను సైతం ధ్వంసం చేయబోతున్నట్లు వెల్లడించాయి. ఇక డెమ్‌చోక్, డెప్సాంగ్‌లో పెట్రోలింగ్ 2020 ఏప్రిల్ నాటి స్థితికి చేరుకుంటుందని వివరించాయి. బలగాల ఉపసంహరణపై భారత్, చైనా మధ్య నాలుగేళ్లపాటు చర్చలు కొనసాగాయి. తొలుత దౌత్య స్థాయిలో, తర్వాత సైనికాధికారుల స్థాయిలో సంప్రదింపులు జరిగాయి. చివరకు కమాండర్ల స్థాయిలో జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. గల్వాన్ లోయలో 2020 జూన్‌లో జరిగిన భీకర ఘర్షణ తర్వాత భారత్, చైనా మధ్య సంబంధాలు బలహీనపడిన సంగతి తెలిసిందే.

కెనడా ప్రధాని చుట్టూ ఖలిస్తాన్ ఉగ్రవాదులే

- భారత వ్యతిరేక శక్తులతో జస్టిన్ ట్రూడోకు సన్నిహిత సంబంధాలు
- రాజకీయ అవసరాల కోసం ఖలిస్తానీ ముష్కరులకు ప్రభుత్వం అండ
- భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ వెల్లడి



న్యూఢిల్లీ: కెనడా ప్రధానమంత్రి జస్టిస్ ట్రూడో తీరును కెనడాలో భారత హై కమిషనర్‌గా పనిచేసిన సంజయ్ కుమార్ వర్మ బట్టబయలు చేశారు. ట్రూడో అంతరంగికుల్లో ఖలిస్తానీ ఉగ్రవాదులతో పాటు భారత వ్యతిరేక శక్తులు ఉంటాయని చెప్పారు. కెనడాలో రాజకీయ అవసరాల కోసం ఖలిస్తానీ ఉగ్రవాదులకు ట్రూడో ప్రభుత్వం రక్షణ కవచంగా నిలుస్తోందని అన్నారు. భారత్-కెనడా మధ్య వివాదం నేపథ్యంలో సంజయ్ కుమార్ వర్మను భారత ప్రభుత్వం ఇటీవల వెనక్కి పిలిపించిన సంగతి తెలిసిందే. ఆయన తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. కెనడాలోని ఖలిస్తానీ శక్తులు, భారత వ్యతిరేక శక్తులు ప్రధాని ట్రూడోతో అత్యంత సన్నిహితంగా మెలుగుతుంటాయని వెల్లడించారు. ఖలిస్తాన్ మద్దతుదారులు ట్రూడో ఆప్త మిత్రులుగా మారిపోయారని తెలిపారు. 2018లో ట్రూడో భారత్‌ను సందర్శించినప్పుడు ఆయన వెంటనే ఖలిస్తాన్ సానుభూతిపరులు కూడా కనిపించారని సంజయ్ కుమార్ వర్మ గుర్తుచేశారు. ఖలిస్తాన్ పోరాట యోధులమని చెప్పుకుంటున్న వ్యక్తులకు కెనడాలో ఎనలేని ప్రోత్సాహం లభిస్తోందని ఆరోపించారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో సంజయ్ కుమార్ వర్మను కెనడా ప్రభుత్వం అనుమానితుడిగా చేర్చిన సంగతి తెలిసిందే. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు భారత్ సహకరించడం లేదని కెనడా చేస్తున్న ఆరోపణలపై సంజయ్ కుమార్ వర్మ స్పందించారు. ఆ కేసులో భారత్ పాత్ర ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు దొరకలేదని తేల్చిచెప్పారు. ఖలిస్తానీ ముష్కరులు కెనడాలో భారత కాన్సులేట్ కార్యాలయాల ఎదుట అల్లర్లు సృష్టించారని, భారత దౌత్యవేత్తలను సోషల్ మీడియా ద్వారా బెదిరించేందుకు ప్రయత్నించారని గుర్తుచేసుకున్నారు.

దారుణ పరిస్థితుల్లో విద్యార్థులు

కెనడాలో ఉన్నత విద్య అభ్యసించాలని కోరుకుంటున్న భారత విద్యార్థులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సంజయ్ కుమార్ వర్మ సూచించారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు మెరుగ్గా లేవని అన్నారు. రూ.లక్షలు ఖర్చు చేసినా మంచి కాలేజీల్లో ప్రవేశాలు దొరకడం లేదని, చదువులు పూర్తిచేసుకున్నాక ఉద్యోగాలు లభించడం లేదని చెప్పారు. విద్యార్థుల్లో కుంగుబాటు, ఆత్మహత్య వంటి పరిణామాలు కనిపిస్తున్నాయని వెల్లడించారు. తాను కెనడాలో హైకమిషనర్‌గా పనిచేసిన సమయంలో వారానికి కనీసం రెండు మృతదేహాలను భారత్‌కు పంపించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాక, తల్లిదండ్రులకు ముఖం చూపించలేక కెనడాలో భారతీయ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. అందుకని కెనడాను ఎంచుకోకపోవడమే మంచిదని సూచించారు. ఒకవేళ భారత్-కెనడా మధ్య సంబంధాలు బాగున్నా కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు తాను ఇదే సలహా ఇచ్చేవాడినని వ్యాఖ్యానించారు. ఎన్నో ఆశలతో వెళ్లిన విద్యార్థులు శవాలై తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ దుస్థితికి ఏజెంట్లు కూడా కొంత కారణమని విమర్శించారు. రూ.లక్షలు దండుకొని ఊరూపేరు లేని కాలేజీల్లో విద్యార్థులను చేర్పిస్తున్నారని, సరైన వసతులు కూడా కల్పించడం లేదని వెల్లడించారు. వారానికి కేవలం ఒక క్లాసు నిర్వహించే కాలేజీలు కూడా ఉన్నాయన్నారు. ఇరుకు గదిలో ఎనిమిది మంది విద్యార్థులు సర్దుకోవాల్సిన పరిస్థితి అక్కడ కనిపిస్తున్నాయని తెలిపారు. కెనడాలో భారతీయ విద్యార్థులు చదువులు పూర్తి చేసుకున్నప్పటికీ ఉద్యోగాలు రాక జీవనోపాధి కోసం క్యాబ్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని, దుకాణాల్లో చాయ్, సమోసాలు అమ్ముకుంటున్నారని సంజయ్ వర్మ ఆవేదన వ్యక్తంచేశారు.

ఇజ్రాయెల్ దాడులు..
ముగ్గురు జర్నలిస్టులు మృతి

బీరుట్/ఖాన్ యూనిస్: గాజాతోపాటు లెబనాన్‌పై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. లెబనాన్‌లోని హస్బయా ప్రాంతంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వీరిని బీరుట్ కేంద్రంగా పనిచేసేత అరబ్ టీవీ అల్ మయాదీన్ కెమెరామ్యాన్ ఘస్సన్ నాజర్, టెక్నీషియన్ మహ్మద్ రిడా, హెజ్‌బొల్లా గ్రూపునకు చెందిన అల్ మనార్ టీవీ కెమెరామ్యాన్ విస్సమ్ కస్సిమ్‌గా గుర్తించారు. ఘటన సమయంలో ఆ భవనంలో ఏడు వేర్వేరు మీడియా సంస్థలకు చెందిన 18 మంది జర్నలిస్టులు ఉన్నారని లెబనాన్ సమాచార మంత్రి జియాద్ మకరీ చెప్పారు. ఇజ్రాయెల్ చర్యను ప్రణాళిక ప్రకారం చేపట్టిన హత్యాకాండగా అభివర్ణించారు. కుప్ప కూలిన భవనం ప్రాంగణంలో ప్రెస్ అనే స్టిక్కర్‌తో ధ్వంసమైన వాహనాలున్న వీడియోను అసోసియేటెడ్ ప్రెస్ విడుదల చేసింది. ఆ సమయంలో తామంతా విశ్రాంతి తీసుకుంటున్నామని దాడి నుంచి సురక్షితంగా బయటపడిన అల్ జజీరా ఇంగ్లిష్ చానెల్ కరస్పాండెంట్ ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. అయితే, ఉద్దేశపూర్వకంగా తాము దాడి చేయలేదని ఇజ్రాయెల్ మిలటరీ పేర్కొంది. గాజాపై యుద్ధం మొదలయ్యాక 128 మంది జర్నలిస్టులు విధుల్లో ఉండగా ప్రాణాలు కోల్పోయారని జర్నలిస్టుల రక్షణ కమిటీ తెలిపింది. మరోవైపు 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది.


శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన ఇల్లు, ఆవరణలోని ప్రెస్ వాహనం

ఒకే కుటుంబంలోని 36 మంది మృతి

గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంపై గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఇజ్రాయెల్ ఆర్మీ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో మొత్తం 38 మంది చనిపోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది చిన్నారులు సహా 36 మంది ఉన్నారని పాలస్తీనా ఆరోగ్య విభాగం తెలిపింది.

మరో 25 విమానాలకు బెదిరింపులు

న్యూఢిల్లీ/ముంబై: దేశీయ విమానయాన సంస్థల విమానాలకు బాంబు బెదిరింపులు ఆగేలా కనిపించడం లేదు. శుక్రవారం మరో 25కు పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో బాంబులు పెట్టామని, పేల్చేస్తామంటూ బెదిరింపులు అందాయి. పూర్తి తనిఖీల అనంతరం ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపులేనని అధికారులు తేల్చారు. కోజికోడ్-దమ్మామ్ (సౌదీ)సర్వీసు సహా మొత్తం ఏడు విమానాలకు హెచ్చరికలు అందాయని ఇండిగో సంస్థ తెలిపింది. విస్తారా, స్పైస్‌జెట్ సంస్థలకు చెందిన ఏడేసి విమానాలు, ఎయిరిండియాకు చెందిన ఆరు విమానాలకు బెదిరింపులు అందినట్లు సమాచారం. దీంతో, గత 12 రోజుల్లో 275కు పైగా విమానాలకు ఎక్కువగా సామాజిక మాధ్యమాల ద్వారా బాంబు హెచ్చరికలు అందాయి. వీటి వెనుక ఉన్న వారిని గుర్తించి, చర్యలు తీసుకునేందుకు సహకరించాల్సిందిగా కేంద్రం ఎక్స్, మెటా నిర్వాహకులను కోరింది.

పత్తి రైతుకు తేమ దెబ్బ

- వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేయడంపై ఆందోళన
- 8–12 శాతం తేమను పరిగణనలోకి తీసుకుని కొనుగోలుకు సీసీఐ నిర్ణయం
- రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులతో 8–25 శాతం వరకు తేమ నమోదు
- తేమ శాతం సవరించాలని రైతుల వినతి

సాక్షి ప్రతినిధి, వరంగల్: పత్తి రైతులకు ఈసారి కూడా గిట్టుబాటు కాదు కదా కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కూడా దక్కే టట్లు లేదు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి తీసే దశలో వర్షాలు, తద్వారా నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తిలో తేమ 15 నుంచి 18 శాతంగా నమోదవుతోంది. దీన్ని సాకుగా తీసుకుని వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. తేమ పేరిట భారీగా ధరలు తగ్గించడంపై వరంగల్, ఆదిలాబాద్ మార్కెట్‌లలో రైతులు ఆందోళనకు దిగారు. 2024–25 సంవత్సరంలో పత్తి ఎమ్మెస్పీ క్వింటాల్‌కు రూ.7,521 అని కేంద్రం ప్రకటించింది. 8–12 మధ్య తేమను పరిగణనలోకి తీసుకుని కొత్త పత్తిని కొనుగోలు చేయాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్ణయించింది. అయితే వ్యాపారులు తేమ ఎంత ఎక్కువ ఉంటే అంత ధరలో కోత విధించడం, రైతులు పెద్దయెత్తున ఆందోళనలకు దిగడంతో పత్తి కొనుగోళ్ల ప్రారంభం దశలోనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 15 నుంచి 18 శాతం తేమను పరిగణనలోకి తీసుకుని కొనుగోలు చేయాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ కాటన్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాసింది.

ఆదిలోనే కష్టాలు

ఈ వానాకాలంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాలలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగతా అన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో 43.76 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా, ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున 35,00,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఆ మేరకు కొనుగోళ్లు చేసేందుకు సీసీఐ ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ బ్రాంచిల పరిధిలోని 30 జిల్లాల్లో 115 సెంటర్లను ప్రతిపాదించింది. ఇప్పుడిప్పుడే పత్తి తీసే పనులు ముమ్మరం కాగా, మార్కెట్లోకి కొత్త పత్తి వస్తున్న నేపథ్యంలో వ్యాపారులు తేమను సాకుగా చూపుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధరకు తూట్లు

పత్తిలో ఉన్న తేమ, రంగును బట్టి వ్యాపారులు ధరను నిర్ణయించాల్సి ఉంది. తేమశాతం ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేసేందుకు దళారులు ఆసక్తి చూపిస్తున్నారు. 8 శాతం కన్నా ఎక్కువగా ఉన్న ఒక్కో శాతానికి కిలో ధర చొప్పున కోత విధిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో పత్తిలో తేమ 18–25 శాతం వరకు నమోదవుతోంది. ఆ స్థాయిలో ఉన్న పంటకు క్వింటాల్‌కు రూ.5,500 వేల నుంచి రూ.6,300 మధ్య మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో రైతుల ఇంటి ఎదుట ఆరబెట్టిన పత్తి

15-18 శాతంగా సవరించాలి

తేమ శాతం 15–18గా సవరించాలని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశాం. ఈ సమయంలో ప్రభుత్వ అధికారులు పత్తి రైతులకు మద్దతు ఇవ్వకపోతే దేశవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ దీర్ఘకాలిక ప్రయోజనాలపై ప్రభావం పడుతుంది. రాష్ట్ర పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 15–18 శాతం తేమతో ఎమ్మెస్పీకి కొనుగోలు చేయాల్సిందిగా సీసీఐని కేంద్రం ఆదేశించాలి.

– బొమ్మినేని రవీందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ కాటన్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

టీజీఎస్పీ సిబ్బంది సెలవుల్లో మార్పులు నిలిపివేత

- సిబ్బంది సమస్యల్ని నేరుగా పంపండి
- టీజీఎస్పీ అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది సెలవుల్లో మార్పులు చేస్తూ ఈ నెల 10న ఇచ్చిన మెమోను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు నిలిపివేస్తున్నట్లు టీజీఎస్పీ అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సెలవుల అంశంపై ఇచ్చిన ఉత్తర్వులు సిబ్బందిని అయోమయానికి గురిచేసినట్లు తన దృష్టికి రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బెటాలియన్లలో సిబ్బంది సమస్యలను తెలుసుకునేందుకు దర్బార్లు ఏర్పాట్లు చేసి వారితో మాట్లాడాలని, ఆ సమస్యలు తన దృష్టికి తేవాలని అన్ని బెటాలియన్ల కమాండెంట్లను సంజయ్‌కుమార్ జైన్ ఆదేశించారు. బెటాలియన్లలో పనిచేసే సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సిబ్బంది వ్యక్తిగతంగా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తేవొచ్చని తెలిపారు. అందుకు tgspcontrol@gmail.com లేదా గ్రీవెన్స్ నంబర్ 8712658531కు తెలియజేయాలని స్పష్టం చేశారు.

అమోయ్‌కుమార్‌పై మరో ఫిర్యాదు

- రూ.వెయ్యికోట్ల విలువ చేసే భూములు కబ్జాదారులకు కట్టబెట్టినట్టు ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: భూ కేటాయింపుల్లో అక్రమాలపై ఈడీ విచారణ ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌పై మరో భూ కుంభకోణం ఫిర్యాదు నమోదైంది. దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువ చేసే భూములను కబ్జాదారులకు కట్టబెట్టారని ఆరోపిస్తూ శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో మధురానగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. మధురానగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకుడు రామ్మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు ఈడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తట్టి అన్నారం గ్రామంలోని 70 ఎకరాల 39 గుంటల భూమిని పట్టాదారు అయిన మద్ది సత్యనారాయణరెడ్డి 1982లో దాదాపు 840 ప్లాట్లతో వెంచర్ చేసి విక్రయించినట్లు వివరించారు. అయితే ఈ భూమి ధరలు పెరగడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను పడిందని, ఈ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించిన కబ్జాదారులు అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ సహకారంతో ఆన్‌లైన్‌లో రికార్డులలో ఓనర్ల పేర్లను తొలిగించారని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిపారు. అమోయ్‌కుమార్ అవినీతిపై ఈడీ విచారిస్తున్నట్టు తెలియడంతో తమకు జరిగిన అన్యాయాన్ని ఈడీ అధికారుల దృష్టికి తెచ్చినట్టు వెల్లడించారు.

మూడో రోజూ విచారణ..: రంగారెడ్డి జిల్లా, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో జరిగిన భూ అక్రమాలపై ఐఏఎస్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు వరుసగా మూడో రోజూ విచారించారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 వరకు ఈడీ అధికారుల ప్రశ్నల పరంపర కొనసాగింది. అవసరం ఉన్నప్పుడు మళ్లీ రావాలని అమోయ్‌కుమార్‌కు ఈడీ అధికారులు సూచించినట్టు సమాచారం.

పత్తిపై తేమ, ధరల కత్తి

▶ మొదటి పేజీ తరువాయి

ధర పెంచేందుకు ససేమిరా అన్నారు. దీంతో కలెక్టర్ రాజర్షిషా, మార్కెట్ అధికారులు ధర పెంచాలని ప్రైవేట్ వ్యాపారులకు సూచించినప్పటికీ వారు ఒప్పుకోలేదు. సీసీఐతో పోల్చితే ప్రైవేట్ ధర తక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వారికి నచ్చజెప్పినప్పటికీ వినకుండా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులతో దాదాపు 2 గంటల పాటు చర్చించారు. ప్రైవేట్ వ్యాపారులు రూ.7,200కు కొనుగోలు చేసేందుకు ఒప్పించారు. మరోవైపు సీసీఐ అధికారులు నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని తెలిపారు. 8 నుంచి 12 మధ్య శాతం తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అది దాటితే క్వింటాలుకు రూ.75.21 చొప్పున కోత విధిస్తామని పేర్కొనడంతో తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వారికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మద్దతు తెలిపారు.

కలెక్టర్ ఘెరావ్..ఉద్రిక్తత : ప్రైవేట్ వ్యాపారులు, సీసీఐ అధికారులు, రైతులతో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కలెక్టర్ పలుమార్లు చర్చించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్ రూ.7,200కు కొనుగోలు చేసేలా ఒప్పించిన తర్వాత వాహనంలో వెళ్లేందుకు ప్రయత్నించగా రైతులు ఘెరావ్ చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. మొత్తం మీద రాత్రి వరకు తేమ పేచీ తేలలేదు. తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తి పంటను కొనుగోలు చేయాలని రైతులు పట్టుబట్టారు. కానీ నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చెప్పడం, ధర పెంచేందుకు ప్రైవేట్ వ్యాపారులు ఒప్పుకోక పోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మార్కెటింగ్ అధికారులు మరోసారి సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో చర్చించినా ఎటూ తేలలేదు. కోపోద్రిక్తులైన రైతులు పంజాబ్ చౌక్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చివరకు మొదటి రోజు తీసుకొచ్చిన పత్తి ని తేమతో సంబంధం లేకుండా క్వింటాల్ రూ.6,696 చొప్పున శనివారం కొనుగోలు చేసేలా వ్యాపారులను ఒప్పించారు.

కార్మిక చైతన్యంతోనే లక్ష్య సాధన

- సింగరేణి సీఎండీ బలరామ్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ 720 లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి కార్మికులను చైతన్య పరచాలని కార్మిక సంఘాలకు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం నిర్వహించిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక నాయకుల 4 రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్పాదకత పెరిగితేనే సంస్థకు భవిష్యత్తు ఉంటుందని బలరామ్ స్పష్టం చేశారు. ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా సంస్థ ముందుకు పోతోందని తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంసిద్ధమవుతోందన్నారు. ఉద్యోగులు పూర్తి పని గంటలను సద్వినియోగం చేస్తూ.. యంత్రాలను పూర్తి సామర్థ్యంతో వినియోగించడంలో కార్మిక సంఘాలు తోడ్పాటు అందించాలని కోరారు.

పత్తి రైతులకు వాట్సాప్ సేవలు

- 8897281111 నంబర్ ఏర్పాటు: మంత్రి తుమ్మల
- వివరాలు తెలుసుకునేందుకు, ఫిర్యాదులకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: పత్తి రైతుల సౌకర్యార్థం వాట్సాప్ సేవలను ప్రారంభించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8897281111 వాట్సాప్ నంబర్ ద్వారా పత్తి కొనుగోలు సంబంధిత సేవలు అందించేందుకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేసిందని వివరించారు. పత్తి రైతులు తమ పంటను అమ్ముకోవడంలో ఎలాంటి జాప్యం జరగకూడదనే ఉద్దేశంతో దీనిని ప్రారంభించామన్నారు. ఈ వాట్సాప్ నంబర్ ద్వారా రైతులు పత్తి అమ్మకం, అర్హత, అమ్మకాల తక్పట్టి వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం, కొనుగోలు తదితర వివరాలు తమ ఇంటి వద్దనే ఉండి చాటింగ్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉందని మంత్రి తెలిపారు. పింజ రకాన్ని బట్టి ఒక క్వింటాల్‌కు రూ. 7,521, రూ.7,471, రూ.7,421గా ధరలు నిర్ణయించామన్నారు. 8 నుండి 12 శాతం మధ్య తేమ ఉన్న పత్తికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. రైతులు పత్తిని పూర్తిగా ఎండబెట్టి తేమ శాతం తక్కువగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతనే ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాల వద్ద అమ్ముకోవాలని మంత్రి సూచించారు. రైతులకు ఎటువంటి ఫిర్యాదులున్నా ఈ వాట్సాప్ చాట్ ద్వారా తెలియజేస్తే, మార్కెటింగ్ శాఖ సత్వరమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నేటినుంచి పశుగణన

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన పేరుతో జరుగుతున్న కార్యక్రమం.. శనివారం రాష్ట్రంలో ప్రారంభమవుతుందని పశుసంవర్థక శాఖ వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి, శుక్రవారం నుంచే పశుగణన ప్రారంభం కావలసి ఉంది. కానీ గాలి కుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు పంపిణీ చేసే కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ నిమగ్నమై ఉన్నారు. దీంతో శనివారం నుంచి అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం తెలంగాణ పశుసంవర్థక శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు నాలుగు నెలల పాటు రాష్ట్రంలోని అన్ని గ్రామాలను సందర్శించి.. ప్రతి ఇంట్లోని జీవాలను ఎన్యూమరేటర్ల బృందాలు లెక్కించనున్నాయి.

రివాల్వర్‌తో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఒక సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బీజాపూర్ జిల్లా బైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధి సీఆర్‌పీఎఫ్ 199 బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ (35) శుక్రవారం ఉదయం విధుల్లో ఉన్నప్పుడు.. తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. దీంతో అపస్మారక స్థితికి చేరిన ఆయనను ఆస్పత్రికి తరలించే క్రమంలో క్యాంపులోనే మృతి చెందాడు. కాగా, పవన్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

నేటి విద్యుత్ కార్మికుల ధర్నా వాయిదా

సాక్షి, హైదరాబాద్: టీజీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు, ఆర్టిజన్ల సమస్యలపై శనివారం మింట్ కాంపౌండ్‌లో తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేసినట్టు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.సాయి బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

● ఓయూ పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జరిగిన వివిధ ఎల్ఎల్బీ కో ర్సుల రెగ్యులర్, బ్యాక్లాగ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం ప్రకటించారు. నవంబర్ 4 నుంచి సంబంధిత కళాశాలలో మార్క్స్ షీట్లను పొందవచ్చు. పరీక్ష తప్పిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం ఈనెల 26 నుంచి నవంబర్ 9 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

దొరా.. మా భూములు లాక్కోవద్దు

- మీ కాళ్లు మొక్కుతం.. మమ్మల్ని బతకనీయండి
- ప్రాణాలైనా ఇస్తాం కానీ ఫార్మా సంస్థలకు భూములివ్వం
- అధికారులను వేడుకున్న వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని గిరిజన రైతులు
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడిపై దాడికి యత్నం.. ఉద్రిక్తత



ఆందోళన కారులను చెదరగొడుతున్న పోలీసులు

కొడంగల్, దుద్యాల్: 'దొరా.. మీ కాళ్లు మొక్కుతాం. మమ్మల్ని బతకనీయండి. ప్రాణాలైనా ఇస్తాం కానీ ఫార్మా కంపెనీల కోసం భూములు మాత్రం ఇవ్వం'అంటూ వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్ల, రోటిబండతండా గిరిజన రైతులు అధికారులను వేడుకున్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం దుద్యాల్ మండలంలో 1,358 ఎకరాల భూసేకరణలో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని... సంబంధిత రైతులు, స్థానికులకు ముందుగానే సమాచారం అందించారు. కానీ సమావేశం మొదలవకముందే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ప్రజాభిప్రాయ సేకరణ భేటీ రద్దయింది.

ఏం జరిగిందంటే..

కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల కమిటీ అధ్యక్షుడు అవుటి శేఖర్ హైదరాబాద్ నుంచి లగచర్లకు బయలుదేరగ రోటిబండ తండా వద్ద ప్రతిపాదిత ఫార్మా కంపెనీల వల్ల భూములు కోల్పోనున్న గిరిజన రైతులు ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గిరిజనులు, శేఖర్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శేఖర్ తమను కులం పేరుతో దూషించారంటూ తండావాసులు ఆయనపై దాడికి యత్నించారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు అప్రమత్తమై ఆయన్ను పక్కనే ఉన్న పంచాయతీ భవనంలోకి తీసుకెళ్లారు. తమకు భూములు కోల్పోయే పరిస్థితి తలెత్తడానికి కూడా ఆయనే కారణమని ఆరోపిస్తూ తండావాసులు పంచాయతీ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. కొందరు పంచాయతీ భవనంపైకి ఎక్కి బండరాళ్లతో రేకులను పగలగొట్టే ప్రయత్నం చేయగా మరికొందరు అక్కడే ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభాన్ని పెకిలించి దానితో తలుపులు బద్దలు కొట్టేందుకు విఫలయత్నం చేశారు. ఇంకొందరు శేఖర్ కారుపై రాళ్లతో దాడిచేశారు. ఈ క్రమంలో పోలీసులు, గిరిజనులకు మధ్య తోపులాట చోటుచేసుకొని పలువురు మహిళలు కిందపడి గాయపడ్డారు. పరిస్థితి చేజారుతోందని గమనించిన పోలీసులు లాఠీచార్జీ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దీంతో కొంత వెనక్కి తగ్గిన ఆందోళనకారులు శేఖర్‌తో తమకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఎస్పీ నారాయణరెడ్డి అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం శేఖర్‌ను అక్కడి నుంచి తరలించారు.

ఫార్మా వద్దు.. పరిహారం వద్దు

ఎకరా, రెండెకరాల భూములను ఇచ్చేస్తే మేమెలా బతకాలని గిరిజనులు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణ ఎదుట విలపించారు. ప్రభుత్వం అందించే పరిహారం వద్దని.. తమ జోలికి రావొద్దని వేడుకున్నారు. దీనిపై లింగ్యానాయక్, ఎస్పీ నారాయణ స్పందిస్తూ ప్రభుత్వం దౌర్జన్యంగా ఎవరి భూములను లాక్కోదని స్పష్టం చేశారు.

డామిట్.. కబ్జా కుట్ర అడ్డం తిరిగింది!

- రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా!... శేరిలింగంపల్లిలో 12.09 ఎకరాల స్థలంపై కన్ను
- ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టి
- రంగారెడ్డి-2 జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కు
- 39అంతస్తుల్లో నివాస, వాణిజ్య భవన నిర్మాణానికి స్కెచ్
- ఆరుగురు నిందితులు అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి, ఫోర్జరీ సంతకాలతో ఏకంగా నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి రూ.600 కోట్ల విలువైన సర్కారు భూమిని కొట్టేసేందుకు కబ్జాదారులు కుట్రపన్నారు. రంగారెడ్డి జిల్లా-2 జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై, కబ్జాదారులు ఈ కుట్రకు పాల్పడగా...శేరిలింగంపల్లి మండలం డిప్యూటీ కలెక్టర్ కమ్ తహసీల్దార్ కుకల వెంకారెడ్డి ఫిర్యాదుతో కబ్జాకుట్ర బయటపడింది. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణాధికారి ఏసీపీ ఎస్.రవీందర్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గ్ పైగా గ్రామంలోని సర్వే నంబర్లు 1, 4, 5, 20లలో 12.09 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎల్ఐపీసీవో) సంస్థకు యాజమాన్య హక్కులున్నాయి. ఈ స్థలంపై బోరబండకు చెందిన మొహమ్మద్ అబ్దుల్ రజాక్, మొహ్మద్ అబ్దుల్ ఆదిల్, సయ్యద్ కౌసర్, అఫ్షా సారా నలుగురు కన్నేశారు. రంగారెడ్డి జిల్లా-2 జాయింట్ సబ్ రిజిస్ట్రార్ జె.గురుసాయిరాజ్‌తో కలసి కుట్ర పన్నారు. ఈ నలుగురు నిందితులు పైజుల్లా వారసులుగా నటిస్తూ...1978 నాటి ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసేశారు. దీని సహాయంతో ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లను కూడా సృష్టించారు. ప్రభుత్వ భూమిని చట్టబద్ధంగా క్లెయిమ్ చేసేందుకు ఏకంగా గీక్ బిల్డర్ ఎల్ఎల్పీతో అభివృద్ధి ఒప్పందం చేసుకున్నారు.

39 అంతస్తుల్లో భారీ భవనం...

ఈ ప్రభుత్వ భూమిలో భారీ నివాస, వాణిజ్య సముదాయం నిర్మించేందుకు కబ్జాదారులు గీక్ బిల్డర్ ఎల్ఎల్పీ పార్టనర్ నవీన్‌కుమార్ గోయెల్‌తో అక్రమంగా అభివృద్ధి ఒప్పందాలు సైతం చేసుకున్నారు. 39 అంతస్తుల్లో 19 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాస, వాణిజ్య సముదాయం నిర్మించేందుకు ప్రణాళిక వేశారు. 30:70 నిష్పత్తిలో వాటాలతో ఒప్పందాలు చేసుకున్నారు.

జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కు...

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గురుసాయిరాజ్ నిందితులతో కుమ్మక్కయ్యారు. రిజిస్ట్రేషన్ రికార్డులను తారుమారు చేసి, చట్టవిరుద్ధంగా యాజమాన్య హక్కులను బదలాయించారు. ఈ నెల 11న నిందితులు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తో కలసి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవరాఫ్ అటార్నీ (డీజీపీఏ) డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసేశారు.

రూ.202 కోట్లతో మాల్ నిర్మాణం..

ఈ ప్రభుత్వ భూమిలోని కొంత భాగంలో 5.16 ఎకరాల స్థలంలో యూనిటీ మాల్‌ను నిర్మించాలని టీఎస్ఎల్ఐపీసీవో నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్టీపీసీ)తో లీజు ఒప్పందాన్ని చేసుకుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం రూ.202 కోట్లను కేటాయించింది. టీఎస్టీపీసీ ఆర్కిటెక్చర్ డిజైన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సేవల కోసం కన్సల్టెంట్లను సైతం ఖరారు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 4న ఓఎస్సీ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు ప్రాజెక్ట్ తవ్వకాల పనుల కాంట్రాక్ట్‌ను సైతం ఇచ్చింది.

కుట్ర బయటపడిందిలా...

శేరిలింగంపల్లి మండలం డిప్యూటీ కలెక్టర్ కమ్ తహసీల్దార్ కుకల వెంకారెడ్డి సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం(ఈఓడబ్ల్యూ) పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కబ్జాకుట్ర బయటకొచ్చింది. దీంతో సాంకేతిక ఆధారాలను సేకరించిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు నిందితులు జే గురు సాయి రాజ్‌తో పాటు మొహమ్మద్ అబ్దుల్ రజాక్, మొహ్మద్ అబ్దుల్ ఆదిల్, సయ్యద్ కౌసర్, అఫ్షా సారా, గీక్ బిల్డర్ ఎల్ఎల్పీ పార్టనర్ నవీన్ కుమార్ గోయెల్‌పై బీఎన్ఎస్ చట్టంలోని 318 (4), 316 (5), 338, 336 (3), 340 (2), 61 (2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పీహెచ్‌సీలకు స్పెషలిస్ట్ వైద్యులను తరలించవద్దు

తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్ట్ బోధనా వైద్యులను తరలించవద్దని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తెలంగాణలో ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉందని గ్రామస్థాయిలో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు వైద్యుల నియామకాలు చేపట్టడం, పట్టణ ప్రాంతాల్లో వైద్య నిపుణుల ద్వారా టెలీమెడిసిన్ సేవలు వినియోగించుకోవడం తదితర మార్గాలలో వైద్య సేవలు మెరుగుపరచవచ్చన్నారు. ఇప్పటికే డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ సిస్టమ్ రూపంలో మెడికల్ కాలేజీ డాక్టర్లు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దానికి అదనంగా మెడికల్ కాలేజీల్లోని ఫ్యాకల్టీని గ్రామీణ ప్రాంతాలలో నేరుగా ఉపయోగించడం వల్ల ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. వైద్యుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న కొత్త మెడికల్ కాలేజీలకు ఇది అదనపు భారం అవుతుందన్నారు. జాతీయ మెడికల్ కమిషన్‌కు అవసరమైన కనీస హాజరు శాతం కరువై ఇవి మెడికల్ కాలేజీల మనుగడకే ప్రమాదంగా మారుతుందని వివరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్ష చేయాలని లేదంటే నిరవధిక సమ్మె చేపట్టాల్సి వస్తుందని కిరణ్‌మాదల హెచ్చరించారు.



ప్రజాభవన్‌లో న్యాయం కోరుతూ బైఠాయించిన గురుకుల 1:2 అభ్యర్థులు

'గురుకుల' అభ్యర్థుల ఆందోళన

లక్డీకాపూల్ (హైదరాబాద్): గురుకుల నియామక బోర్డు బోధన పోస్టులను నింపే క్రమంలో డిసెండింగ్ విధానం పాటించకపోవడం వల్ల ఒక్కొక్కరికి 2,3,4 పోస్టులు వచ్చాయని, దీని వల్ల 9 వేల పోస్టుల్లో 3 వేలు మిగిలిపోయాయని గురుకుల అభ్యర్థుల (1:2 జాబితా) ప్రతినిధులు ఎండీ ఉస్మాన్, రాజు, టి.ఉమాశంకర్‌లు పేర్కొన్నారు. పోస్టులు నింపే క్రమంలో ముందుగా పీజీటీ, టీజీటీ, జేఎల్, డీఎల్ పోస్టింగ్‌లు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. శుక్రవారం తమకు న్యాయం చేయాలంటూ ప్రజాభవన్ వద్ద అభ్యర్థులు బైఠాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి స్పష్టమైన సమాధానం వచ్చేంత వరకు ఇక్కడే ఉంటామంటూ పట్టుపట్టారు. జీవో నం.81ని సడలించి తమకు న్యాయంగా రావాల్సిన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చీరకొంగుకు చిట్టీలు.. చేతిపై రాతలు..

- గ్రూప్-1 పరీక్షలో ప్రభుత్వోపాధ్యాయిని చూసిరాతలు
- డీబార్ చేసిన టీజీపీఎస్సీ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్/హైదరాబాద్: ఆమె ఒక ప్రభుత్వోపాధ్యాయిని.. పరీక్షల్లో చూసిరాతల్ని నివారించాల్సిన బాధ్యత ఆమెది.. అలాంటిది ప్రతిష్టాత్మక గ్రూప్-1 పరీక్షకు చీరకొంగులో చిట్టీలు తెచ్చుకుని.. చూసిరాస్తూ పట్టుబడి డీబార్ అయ్యారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సెంటర్- 21లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. రూమ్ నంబర్ 210లో ఇస్లావత్ లక్ష్మి అనే ప్రభుత్వోపాధ్యాయిని (240921569) పేపర్- 4 ఎకానమీ, డెవలప్‌మెంట్ పరీక్షకు హాజరయ్యారు. కాగా, ఆమె ప్రశ్నపత్రం ఇవ్వకముందే జవాబుపత్రంలో సమాధానాలు రాస్తుండటాన్ని ఇన్విజిలేటర్ గమనించారు. అభ్యర్థిని చీరకొంగుకు చిట్టీలు, ఆమె ఎడమ అరచేతిలో రాతలున్నట్లు కూడా కనుగొన్నారు. దీంతో అభ్యర్థిని పరీక్షకు అనుమతించకుండా.. సాయంత్రం వరకు పరీక్ష కేంద్రంలోనే ఉంచారు. సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేయించారు. అనంతరం అభ్యర్థి లక్ష్మిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసి.. డీబార్ చేసినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, మాల్‌ప్రాక్టీస్‌లో పట్టుబడిన అభ్యర్థిని వద్ద దొరికిన సమాచారం.. ప్రశ్నపత్రానికి సంబంధం లేదని వెల్లడించారు. కాగా, అభ్యర్థిని లక్ష్మి మహబూబ్‌నగర్ జిల్లా, పెద్దమందాడి మండలం, గట్లఖానాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వోపాధ్యాయినిగా గుర్తించారు.

67.4 శాతం మంది హాజరు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 46 పరీక్ష కేంద్రాల్లో జరిగిన గ్రూప్-1 పేపర్-4 పరీక్ష (ఎకానమి అండ్ డెవలప్‌మెంట్)కు 67.4 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 31383 మంది అభ్యర్థుల్లో.. 21195 మంది హాజరైనట్లు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. టీజీపీఎస్సీ ప్రతినిధి, జిల్లా కలెక్టర్ నియమించిన అధికారి సమక్షంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే గ్రూప్-1 పరీక్ష ప్రశ్నపత్రాల సీల్ తెరుస్తామని వెల్లడించారు. ఈ ప్రశ్నపత్రాల సీల్డ్ కవర్ మెషీన్‌తో ప్యాక్ చేసి ఉంటుందని, మూడు సెట్ల ప్రశ్నపత్రాలు వేర్వేరు కోడ్‌లలో ఉంటాయని స్పష్టం చేశారు. నిర్ధారించిన ప్యాక్‌ను మాత్రమే ఆరోజు అందరి సమక్షంలో తెరిచి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈ సంస్థలకు ప్రోత్సాహం

ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు హామీ



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

నిజాంపేట్: 'కోటి మందిని కోటీశ్వరులను చేద్దాం' నినాదంతో ఎంఎస్ఎంఈ సంస్థలకు ప్రోత్సాహం ఇస్తామని ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. మహిళా సాధికారత కోసం అలీప్ ఇస్తున్న ప్రోత్సాహం శ్లాఘనీయమని అభినందించారు. ప్రగతినగర్‌లోని అలీప్ పారిశ్రామికవాడలో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎస్ఎంఈ డిఫెన్స్ కాన్‌క్లేవ్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ అలీప్ సంస్థల రథసారథి రమాదేవి చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామికవాడలు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా మొదట 25 నియోజకవర్గాల్లో ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అలీప్ ప్రాంగణంలో నిర్మించిన డిజిటల్ స్టూడియోను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అంతకుముందు రక్షణ శాఖ పాత్ర గురించి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ వివరించారు. 'భారత రక్షణ శాఖ పర్యావరణ అభివృద్ధి అవకాశాలు'అనే అంశంపై రక్షణ శాఖ ప్రొడక్షన్ సలహాదారు సుగీత్‌కౌర్ మాట్లాడారు. అనంతరం అలీప్ సహాయంతో ఎదిగిన స్టార్టప్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ మన్సూర్, మిధాని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా, పీహెచ్‌డీసీసీఐ డైరెక్టర్ డాక్టర్ నాసిర్ జమాల్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

13 మంది నిర్బంధ కార్మికులకు విముక్తి

- ఒడిశా నుంచి పెద్దపల్లి కలెక్టర్‌కు ఫిర్యాదులు
- విచారణ చేపట్టి రక్షణ చర్యలకు ఉపక్రమించిన జిల్లా యంత్రాంగం
- రెవెన్యూ, పోలీసుశాఖ సంరక్షణలో సొంత రాష్ట్రానికి తరలింపు



పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయంకు తరలించిన నిర్బంధ కార్మికులు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా రాష్ట్రం బాలంగిర్‌కు చెందిన 13 మంది నిర్బంధ కార్మికులకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం విముక్తి కల్పించింది. కార్మికుల స్వస్థలంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం...అక్కడ్నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు, వీడియో సందేశం అందడంతో ఈ విషయం వెలుగు చూసింది.

ఏపీలో పని అంటూ తెలంగాణకు...

పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఓ ఇటుకబట్టీ నిర్మాణ సంస్థ నిర్వాహకులు ఒడిశాలోని బాలంగిర్ జిల్లాకు చెందిన 13 మంది ఇటుకబట్టీ కార్మికులను పనుల నిమిత్తం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయాల్సి ఉందని నమ్మించి వారిని తెలంగాణలోని పెద్దపల్లిలోని రాఘవాపూర్‌కు తీసుకొచ్చారు. అయితే వీరికి రెండు నెలలుగా చెల్లింపులు చేయకుండా నిర్బంధించి పని చేయిస్తున్నారని, ఈ విషయంపై సొంత ప్రాంతంలోని కుటుంబ సభ్యులకు చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల సహకారంతో పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు కార్మికులను నిర్బంధించి పనిచేయిస్తున్న తీరు, వారి ఇబ్బందులను వివరించే వీడియోలను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. దీంతో రంగంలోకి దిగిన కలెక్టర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకారంతో విచారణ చేపట్టి మొత్తం 13 మంది కార్మికులతో పాటు ఇద్దరు చిన్నారులను నిర్బంధం నుంచి విడిపించారు. అనంతరం పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి తరలించి అక్కడ్నుంచి వారి స్వగ్రామాలకు ప్రయాణ ఏర్పాట్లు చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని కొయెలేషన్ అగెనెస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ అండ్ చైల్డ్ లేబర్(సీఏహెచ్‌బీసీ) కన్వీనర్ ఫిలిప్స్ ఇసిడోర్ వ్యాఖ్యానించారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 26 । అక్టోబర్ । 2024



డెడ్ డ్రాప్ పంథాలో..
బెంగళూరు కేంద్రంగా డెడ్ డ్రాప్ పంథాలో వ్యవస్థీకృతంగా సాగుతున్న డ్రగ్స్ దందాకు హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు చెక్ చెప్పారు. -10లో



స్నేక్ ఫ్రెండ్స్..
ఎవరింటికైనా పాములు వచ్చాయని ఫోన్ చేస్తే చాలు వచ్చేస్తారు.. పాములను పట్టుకుని సురక్షిత ప్రాంతాల్లో వదిలిపెడతారు. వారే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/22.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







బొమ్మల కొలువుకు వేళాయే..

ముంగిళ్లలో దీపాల వెలుగులు. లోగిళ్లలో బొమ్మల కొలువులు. బాణాసంచాతో అంబరమంటే సంబరం. దీపావళి అంటేనే ఒక అపురూప ఆనందం. పండగ పూట అన్ని రకాల వస్తువుల కొనుగోళ్లతో నగరంలోని మార్కెట్లు కొత్త కళను సంతరించుకున్నాయి. దీపావళికి ప్రత్యేకంగా ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుంటారు. ఈ సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లో పలు రకాల బొమ్మలు విక్రయానికి ఇలా కొలువుదీరాయి.

స్వీటుతో చేటే!

మిఠాయి షాపుల్లో నిబంధనల ఉల్లంఘన

- ప్రజారోగ్యంతో నిర్వాహకుల చెలగాటం
- అమీర్‌పేటలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- వెలుగులోకి నివ్వెరపోయే నిజాలు

సాక్షి, సిటీబ్యూరో: చిన్నాచితకా వాటి నుంచి పేరున్న బడా షాపుల దాకా ఒకటే తీరు. సాధారణ హోటల్ నుంచి స్టార్ హోటళ్ల వరకూ అదే వరస. ప్రజలు తినే తిండితో వ్యాపారం చేస్తున్న నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. చివరకు ప్రజలు శుభకార్యాల్లో, సంతోష సమయాల్లో తినే.. దీపావళి పండగ సందర్భంగా బంధుమిత్రులకు పంపిణీ చేసే స్వీట్స్ దాకా ఈ పరిస్థితిలో మార్పు లేదు. ప్రజలు ఎగబడి క్యూలు కట్టే దుకాణాల్లోనూ అదే పరిస్థితి. గత కొన్ని నెలలుగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నా, ఆయా దుకాణాల నిర్వాకాలు బట్టబయలవుతున్నా ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. ఒకసారి తనిఖీ చేసిన వాటిల్లోనూ తిరిగి అలాంటి ఘటనలే పునరావృతమవుతున్నాయంటే చర్యలపై వాటికి ఎంతటి లెక్కలేనితనం ఉందో అంచనా వేసుకోవచ్చు.

డొల్లతనం వెల్లడైంది ఇలా..

- జనసమ్మర్దం ఎక్కువగా ఉండే నగరంలోని అమీర్‌పేటలో కొన్ని స్వీటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో డొల్లతనం వెల్లడైంది. నిబంధనలు బేఖాతరు చేయడం దృష్టికొచ్చింది. కనీసం ట్రేడ్ లైసెన్సులు లేకుండా రిజి్స్ట్రేషన్లతోనే దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తుండటం తెలిసింది. ఆయా వివరాలను అధికారులు శుక్రవారం వెల్లడించారు. వారు చెప్పిన వివరాల ప్రకారం..
- నిబంధనల మేరకు ఆహార విక్రయ దుకాణాల్లో ప్రజలకు కనిపించేలా ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)సర్టిఫికెట్ ప్రదర్శించాల్సి ఉండగా, 'ఆగ్రా స్వీట్స్'లో అది కనిపించలేదు. లైసెన్సు లేకుండానే కేవలం రిజి్స్ట్రేషన్ మాత్రం చేయించుకొని వ్యాపారం చేస్తుండటం దృష్టికొచ్చింది. డస్ట్ బిన్లకు ఎలాంటి మూతలు లేకుండా కనిపించాయి. సిబ్బంది తలలకు క్యాప్, చేతులకు గ్లౌజ్‌లు, ఆప్రాన్స్ లేవు.
- సగం తయారైన వంటకాలు ఫ్రిజ్‌లో సవ్యంగా ఉంచకపోవడం, లేబుల్ లేకపోవడం కనిపించాయి. కొన్ని సరుకులు ఎక్స్‌పైర్ డేట్‌వి ఉండటం అధికారుల దృష్టికొచ్చింది. 'ఢిల్లీ మిఠాయి వాలా' దుకాణంలో సిబ్బంది మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, నీటి విశ్లేషణ నివేదికలు లేవు. శిక్షణ పొందిన సూపర్‌వైజర్ లేకపోవడం గుర్తించారు. క్రిమి కీటకాలు చొరబడకుండా తలుపులు, కిటికీలకు ప్రూఫ్ స్క్రీన్స్ లేవు. నేలపై అడ్డదిడ్డంగా చక్కెర బ్యాగ్స్, స్టోర్‌రూమ్ ర్యాక్స్‌లో ఎలుక పెంటికలు, మూతలు లేని డస్ట్‌బిన్లు కనిపించాయి.

హోమ్ ఫుడ్స్‌లోనూ అదే తంతు..

వాసిరెడ్డి హోమ్ ఫుడ్స్‌లో కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కనిపించలేదు. కేవలం రిజి్స్ట్రేషన్ మాత్రం చేసుకున్నట్లు గుర్తించారు. స్టోర్‌రూమ్‌లోని సిబ్బంది తలకు క్యాప్, చేతులకు గ్లౌజ్‌లు, ఆప్రాన్స్ లేకుండానే ఉండటాన్ని, సిబ్బంది మెడికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించిన సర్టిఫికెట్స్ కానీ, పెస్ట్ కంట్రోల్‌రికార్డులు కానీ లేకపోవడం అధికారుల దృష్టికొచ్చింది. తినడానికి సిద్ధంగా ఉన్న సేవరీలు, పచ్చళ్లకు, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వాటికి లేబుళ్లు లేకపోవడాన్ని గుర్తించారు. 'వినూత్న ఫుడ్స్'లోనూ దాదాపుగా అవే పరిస్థితులు. ఇక్కడ రిజి్స్ట్రేషన్ సర్టిఫికెట్ సైతం గడువు ముగిసిపోయి ఉండటాన్ని గుర్తించారు. ఆహార పదార్థాలు ఎక్కడి నుంచి తెస్తున్నారో రికార్డులు లేవు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచేందుకు తగిన స్టోరేజీ సదుపాయం కూడా లేకపోవడం గుర్తించారు. ఇలా.. ఎక్కడ తనిఖీలు జరిగినా లోపాలు బట్టబయలవుతున్నాయి.



చర్యలు లేకే..

తగిన చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బయట తినే బదులు ఇంట్లో చేసుకునే చిక్కీ అయినా మేలని అంటున్న వారూ ఉన్నారు. 'అయ్యో.. నేనెప్పుడు అక్కడే కొంటుంటాను. ఇకనుంచి మానేస్తాను' అని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్న వారూ ఉన్నారు.

మెట్రో రెండో దశకు మోక్షమెలా?

నిధుల సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు

- రుణాల సేకరణపై కసరత్తు
- 5 కారిడార్లలో రూ.24,237 కోట్లతో అంచనాలు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ ప్రక్షాళన, మెట్రో రెండో దశ ప్రాజెక్టులను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల సేకరణ సవాల్‌గా మారింది. రూ.వేల కోట్ల భారీ అంచనాలతో రూపొందించిన ఈ రెండు ప్రాజెక్టులకు జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులు, జైకా వంటి సంస్థల నుంచి రుణాలు అందాలి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఫోర్త్‌సిటీ, హయత్‌నగర్ తదితర 5 కారిడార్‌లలో మెట్రో రెండో దశ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఇటీవల డీపీఆర్‌ను వెల్లడించింది. దాదాపు రూ.24,237 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఈ క్రమంలో కేంద్రం నుంచి లభించే ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోంది. కొద్ది నెలల్లో కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. రెండోదశ ప్రాజెక్టుకు ఏ మేరకు నిధులు కేటాయించనుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

గడువులోగా పూర్తయ్యేనా?

- ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మూడు కారిడార్‌లలో మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. రెండో దశలో కొత్తగా మరో 5 మార్గాల్లో మెట్రో విస్తరించనున్నారు. మొదట ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు వరకు పూర్తి చేయాలనేది లక్ష్యం. దశలవారీగా 2029 నాటికి అన్ని కారిడార్‌లలో మెట్రో నిర్మాణం చేపట్టాలని హైదరాబాద్ మెట్రో రైల్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఈ లక్ష్యానికి అనుగుణంగా నిధులు లభించడమే ప్రధానం. నిధుల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
- ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం 15 శాతం (రూ.3,635 కోట్లు), రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం (రూ.9,210 కోట్లు) చొప్పున నిధులు కేటాయించాలి. మిగతా 50 శాతం నిధుల్లో 45 శాతం వరకు జాతీయ, అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాల రూపంలో సేకరించాలని ప్రతిపాదించారు. 5 శాతం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిధులు సేకరించనున్నారు. ఇప్పటికే మెట్రో రెండో దశతో పాటు మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కోసం జైకా వంటి సంస్థలతో అధికారులు సంప్రదింపులు ప్రారంభించారు. మరికొన్ని బ్యాంకుల నుంచి కూడా రుణాల సేకరణపై దృష్టి సారించినట్లు అధికారులు చెప్పారు. సకాలంలో బ్యాంకుల నుంచి రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు లభిస్తేనే గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయడం సాధ్యమవుతుందని ఒక అధికారి పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పుడు మెట్రో రెండో దశ నిధుల సేకరణే సవాల్‌గా మారింది.

పెరిగిన రూట్ కిలోమీటర్లు..

- రెండో దశ మెట్రో ప్రాజెక్టును మొదట 78 కిలోమీటర్‌ల వరకు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించారు. కానీ.. రెండు, మూడు దఫాలుగా ప్రాజెక్టును వివిధ మార్గాల్లో పొడిగించారు. దీంతో ప్రస్తుతం ఇది 116.2 కిలోమీటర్‌లతో అతి పెద్ద ప్రాజెక్టుగా అవతరించింది. గతంలో మైలార్‌దేవ్‌పల్లి నుంచి పీ–7 రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించిన రూట్‌ను తాజాగా మార్చారు. ఆరాంఘర్ నుంచి కొత్త హైకోర్టు మీదుగా మళ్లించారు. రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు మొదట ప్రతిపాదించిన రూట్‌ను సైతం ఇప్పుడు కోకాపేట్ నియోపోలిస్ వరకు పొడిగించడంతో రెండో దశ రూట్ కిలోమీటర్‌లు పెరిగాయి. కొత్తగా ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కిలోమీటర్‌ల మార్గాన్ని కూడా ఈ రెండో దశలోనే ప్రతిపాదించారు.
- ఓల్డ్‌సిటీ రూట్‌లో మొదట ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించగా.. దాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇలా అన్ని వైపులా అదనంగా పొడిగించడంతో రెండో దశ పరిధి బాగా విస్తరించింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిపాదిత ఫోర్త్ సిటీ వరకు 40 కిలోమీటర్‌ల పొడవు ఉంటుంది. ఈ కొత్త లైన్ కోసం రూ.8000 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ లైన్ మినహాయించి మిగతా లైన్‌లకు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. రెండో దశ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ. 24,237 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఫోర్త్‌సిటీతో కలిపితే ఇది రూ.32,237 కోట్లకు పెరగనుంది. ప్రస్తుతం 5 రూట్‌లకే డీపీఆర్ పూర్తయిన దృష్ట్యా ఈ మార్గాల్లో మెట్రో రెండో దశ చేపట్టాల్సి ఉంది.

స్టెరిలైజేషన్‌తో కుక్కల బెడదకు చెక్ : ఇలంబర్తి



ఫతుల్లాగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇలంబర్తి తదితరులు

నాగోలు: నగరంలో కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్ విరివిగా చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాగోలులోని ఫతుల్లాగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని, డాగ్ క్యాచింగ్ వెహికల్, కుక్కల ఆపరేషన్ థియేటర్, పెంపుడు కుక్కల క్రిమిటోరియం, సీఅండ్‌డీ ప్రాసెసింగ్ ప్లాంట్‌లను ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజలతో కలిసి ఆయన పరిశీలించారు. రోజుకు ఎన్ని కుక్కలను పట్టుకుంటున్నారు.. ఎన్నింటికి స్టెరిలైజేషన్ చేస్తున్నారని చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫతుల్లాగూడ సమీపంలో భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ యూనిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా 500 టన్నుల కెపాసిటీ ఉన్న నాలుగు భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రంజిత్, హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తదితరులు ఉన్నారు.

లక్డీకాపూల్ చౌరస్తాలో కొత్త పైపులైన్

- వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: లక్డీకాపూల్ ప్రాంతంలో వరద ముప్పు తప్పించడానికి కొత్త పైపులైన్ నిర్మాణమే పరిష్కారమని అధికారులు తేల్చారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ విభాగం అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ నేతృత్వంలో హైడ్రా, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు శుక్రవారం ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. టెలిఫోన్ భవన్ నుంచి మెహిదీపట్నం వైపు వరకు మ్యాన్‌హోళ్లను జలమండలికి చెందిన ఎయిర్‌టెక్ మెషిన్‌తో పరిశీలించారు. దశాబ్దాల క్రితం వేసిన వరద నీటి పైపులైన్లు, కాల్వలు పూర్తిగా శిథిలమైనట్లు గుర్తించారు. లక్డీకాపూల్‌లోని మెట్రో పిల్లర్ 1211 వద్ద స్ట్రాం వాటర్ పైపులైన్ బ్లాక్ అయినట్లు, లక్డీకాపూల్ బ్రిడ్జి సమీపంలో శిథిలమైనట్లు తేల్చారు. ఆ ప్రాంతంలో కొత్త పైపులైన్ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫోన్ చేసిన ఏవీ రంగనాథ్ చర్చించారు. ఈ నేపథ్యంలోనే యుద్ధ ప్రాతిపదికన కొత్తగా పైపులైన్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. గరిష్ఠంగా వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని, ఒకటి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. నగరంలో వరద ముప్పు తీవ్రంగా ఉన్న మరో 30 ప్రాంతాల్లోనూ క్షేత్ర స్థాయి పర్యటనల ద్వారా వర్షాకాలం కష్టాలు రాకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. తాము 20 ఏళ్లుగా వరదనీటి సమస్యతో బాధపడుతున్నామని, వర్షం వస్తే చాలు చౌరస్తాలో వరద నీరు నిలిచిపోవడంతో పాటు తమ దుకాణాల్లోకి వచ్చి చేరుతోందని స్థానిక వ్యాపారులు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ఆ ముప్పు తొలగించడానికి చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.



మ్యాన్‌హోళ్లను పరిశీలిస్తున్న రంగనాథ్ తదితరులు

ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలి

టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసు కుటుంబ సభ్యుల మెరుపు ధర్నా



నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొండాపూర్ టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు మెరుపు ధర్నాకు దిగారు. శుక్రవారం రాత్రి కొండాపూర్ 8వ బెటాలియన్‌లో నివాసం ఉండే పోలీసుల కుటుంబ సభ్యులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఉన్న పోలీసు విధానాన్ని అమలు చేయాలని, కానిస్టేబుళ్లకు సెలవుల విషయంలో ఒకే పోలీసు విధానాన్ని ఆచరణలో పెట్టాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపిన టీజీఎస్‌పీ పోలీసుల కుటుంబ సభ్యులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెలవులు రద్దు చేస్తూ పోలీసు శాఖ ఇచ్చిన ఉత్తర్వులు పూర్తిగా వెనక్కు తీసుకోవాలన్నారు. కొండాపూర్ పోలీసు బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ ధర్నా వద్దకు చేరుకొని చర్చలు జరిపారు. మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు. ధర్నాతో సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. - గచ్చిబౌలి



ధర్నా చేస్తున్న పోలీసుల కుటుంబ సభ్యులు

గండిపేట్ కాండూట్‌కు రిపేర్

కెమికల్ ట్రీట్‌మెంట్‌తో మరమ్మతులకు అవకాశం

- వాటర్ షట్‌డౌన్ చేయకుండానే పనులు
- పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గండిపేట్ కాండూట్ లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మరమ్మతు పనులకు చేపట్టేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఇక్కడ పర్యటించారు. గండిపేట్ కాండూట్‌కి పదేళ్లుగా గండిపేట్, కోకాపేట్, మణికొండ, సీబీఐటీ కాళాశాల, పుప్పాల గూడ, జానకీ నగర్, కౌసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేపడితే.. నీటి సరఫరాలో నెల రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఈ పనుల్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. నీటి సరఫరాకు ఆటంకం కాకుండా.. మరమ్మతులు చేసే సాంకేతికతను అన్వేషించారు.

మరమ్మతులకు ముందుకొచ్చిన చెన్నై కంపెనీ

ఎట్టకేలకు చెన్నైకి సంబంధించిన కంపెనీ జర్మన్ టెక్నాలజీతో సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లీకేజీలు అరికట్టేందుకు ముందుకొచ్చింది. 40 రోజుల క్రితం ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్‌కి 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ ద్వారా మరమ్మతులు ప్రయోగాత్మకంగా చేపట్టి.. విజయవంతంగా పూర్తి చేశారు. వాటర్ షట్ డౌన్ తీసుకుంటే.. వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు కెమికల్ ట్రీట్‌మెంట్ పద్ధతిని ఉపయోగించి మరమ్మతులు చేపడతారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో మొదటగా ప్రత్యేక పరికరాలతో నీటిని ఖాళీ చేసి.. ఆ ప్రదేశంలోకి ప్రత్యేకమైన రసాయనాన్ని పంపిస్తారు. క్షణాల్లో ఆ రసాయనం ఘన పదార్థంగా మారి, ఖాళీ ప్రాంతాల్లో పూడుకుపోతుంది. దీంతో లీకేజీ ఆగిపోతుంది. ఈ పద్ధతి ద్వారా నీటి సరఫరా నిలిపివేయకుండానే.. మరమ్మతు పనులు నిర్వహించవచ్చు.

నగరానికి 26 ఎంజీడీల నీరు..

గండిపేట్‌కు మొత్తం 26 ఎంజీడీల తాగునీరు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం నగరానికి ప్రతినిత్యం 20 ఎంజీడీలు సరఫరా చేస్తే, అందులో దాదాపు 8 జీడీల నీరు ఈ లీకేజీలతో వృథా అవుతోంది. చివరికి 12 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నాయి. ఈ లీకేజీ సమస్య దాదాపు 14.5 కిలో మీటర్ల మేర 45 ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీ అశోక్ రెడ్డి సరఫరాపై ప్రభావం పడకుండా మరమ్మతు నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిపేర్ పూర్తయితే.. మరో 14 ఎంజీడీల నీరు వినియోగదారులకు సరఫరా చేయవచ్చు.

అపోలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ పరికరాలు ధ్వంసం

- బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు

సనత్‌నగర్: బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో పార్క్ చేసిన అపోలో యాజమాన్యానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్‌లోని కొన్ని పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు స్వల్పంగా ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రామయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.అపోలో ఆస్పత్రుల యాజమాన్యానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ వీటీ–పీసీఆర్‌ను బేగంపేట విమానాశ్రయంలో పార్కు చేసి అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. గత ఏప్రిల్ 5న విమానంలో చెన్నై వెళ్లేందుకు పరిశీలించగా ఇంజిన్‌లోని కొన్ని పరికరాలు స్వల్పంగా దెబ్బతిని కనిపించాయి. అయితే అప్పటికే విమానం టేకాఫ్‌కు అనుమతి రావడంతో బేగంపేట నుంచి చెన్నైకు విమానం వెళ్లింది. అయితే చెన్నై విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో ఇంజిన్‌లో కొన్ని లోపాలను గుర్తించిన సిబ్బంది విమానం చెన్నై చేరిన తర్వాత పరిశీలించగా ఇంజిన్‌లోని కొన్ని పరికరాలు ధ్వంసమైనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని బేగంపేట ఎయిర్‌పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఈ ఘటనపై విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే పలుమార్లు దీనిపై అపోలో యాజమాన్యం ఎయిర్‌పోర్ట్ అధికారులను సంప్రదించినా పట్టించుకోకపోవడంతో గురువారం ఆస్పత్రుల చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జగ్జీత్‌సింగ్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీసీ ఫుటేజీలను సేకరించనున్నారు. ఏప్రిల్ 5కు ముందు సంఘటన జరిగి ఉండవచ్చునని అప్పటి సీసీ ఫుటేజీలను ఇవ్వాల్సిందిగా విమానాశ్రయ అధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డూప్లికేట్ ఐఫోన్ పరికరాలు
విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు

- నలుగురు వ్యక్తుల అరెస్టు
- రూ.2.42 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం



అబిడ్స్: ఐఫోన్ డూప్లికేట్ వస్తువులు అక్రమంగా విక్రయిస్తున్న దుకాణాలపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అబిడ్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీ ఎత్తున నకిలీ ఐ ఫోన్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లో శుక్రవారం పలు దుకాణాలపై దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపిల్ బ్రాండెడ్ మొబైల్ ఫోన్లకు చెందిన ఫోన్ కవర్లు, హెడ్‌సెట్, మదర్‌బోర్డ్స్, స్పీకర్లు, బ్యాటరీలు తదితర డూప్లికేట్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నింబ్ సింగ్, హీరారాం, గోవింద్‌లాల్ చౌహాన్, ముఖేష్ జైన్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డెడ్ డ్రాప్ పంథాలో
సింథటిక్ డ్రగ్స్ దందా!

బెంగళూరు కేంద్రంగా సాగుతున్న వ్యవహారం

- పెడ్లర్స్ అక్కడ.. డెలివరీ బాయిస్ ఇక్కడ
- పోలీసు నిఘాకు చిక్కకుండా పక్కా పథకం
- అంతర్జాతీయ ముఠాలకు చెక్ చెప్పిన హెచ్ న్యూ
- నలుగురి అరెస్టు, రూ.20 లక్షల సరుకు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా సంప్రదింపులు... యూపీఐ యాప్స్ ద్వారా నగదు చెల్లింపులు.. డెడ్ డ్రాప్ విధానంలో సరుకు డెలివరీ... బెంగళూరు కేంద్రంగా ఈ పంథాలో వ్యవస్థీకృతంగా సాగుతున్న డ్రగ్స్ దందాకు హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు చెక్ చెప్పారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని పట్టుకున్నామని, నలుగురిని అరెస్టు చేసి, మరొకరిని అతడి దేశానికి డిపోర్ట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్రతో కలిసి శుక్రవారం బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

బెంగళూరు నుంచి నగరంలో 'వ్యాపారం'...

నైజీరియాకు చెందిన యాకూబ్ అలియాస్ కుర్బా కొన్నేళ్ల క్రితం స్టడీ వీసాపై నగరానికి వచ్చాడు. సైనిక్‌పురి, టోలిచౌకీ ప్రాంతాల్లో ఉంటూ డ్రగ్స్ దందా చేస్తూ పోలీసులకు మూడుసార్లు చిక్కాడు. ఇతడిపై కుషాయిగూడ, ఫలక్‌నుమ, రాజేంద్రనగర్ ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఇక్కడ పోలీసు నిఘా తప్పించుకోవడానికి తన మకాం బెంగళూరుకు మార్చాడు. అక్కడి నుంచే డ్రగ్స్ దందా చేస్తున్నాడు. 2016లో స్టూడెంట్ వీసాపై సూడాన్ నుంచి వచ్చిన అబ్దుల్ రెహ్మాన్ ఉస్మాన్ ఇంగ్లిష్ కోర్సు చేసి తిరిగి వెళ్లాడు. 2018లో నాలుగేళ్ల వీసాపై వచ్చి ఉత్తరప్రదేశ్‌లో బీసీఏ కోర్సులో చేరి... కరోనా సమయంలో స్వదేశానికి వెళ్లాడు. రెండేళ్ల తర్వాత మళ్లీ వచ్చిన అతను కోర్సు పూర్తి చేసి సిటీకి వచ్చాడు. టోలిచౌకి ఉంటూ జల్సాల కోసం తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు.

ఆ ఐదుగురికీ డెలివరీ బాయ్‌గా...

ఇతడికి బెంగళూరులో స్థిరపడిన యాకూబ్‌తో పాటు నైజీరియా, టాంజానియా నుంచి వచ్చి అక్కడ ఉంటున్న రోమియో, గడాఫీ, జాన్‌పాల్, కేరళ వాసి జాకబ్‌లతో ఆన్‌లైన్‌లో పరిచయమైంది. వీరు ఐదుగురూ హైదరాబాద్‌లో ఉన్న డ్రగ్ వినియోగదారులతో సోషల్‌మీడియా యాప్స్ ద్వారా సంప్రదింపులు జరుపుతారు. బేరం కుదిరిన తర్వాత ఆ మొత్తాన్ని కస్టమర్ యూపీఐ ద్వారా చెల్లిస్తారు. ఇందుకు అవసరమైన బ్యాంకు ఖాతాలు కూడా డమ్మీ వ్యక్తులవే అయి ఉంటున్నాయి. ఆపై వారు ఇక్కడకు రావడం ద్వారా లేదా ఉస్మాన్‌ను బెంగళూరు పిలిపించడం ద్వారా సరుకు నగరానికి చేరుతుంది. ప్రధానంగా రోడ్డు మార్గంలోనే మాదకద్రవ్యాలను నగరానికి తీసుకు వస్తున్నారు. కస్టమర్, డెలివరీ బాయ్ నగరంలోనే ఉన్నప్పటికీ వీరి మధ్య ఎలాంటి సంబంధం ఉండదు.

ఫొటో, లోకేషన్ షేర్ చేయడం ద్వారా...

ఈ డ్రగ్‌ను డెలివరీ బాయ్ ఉస్మాన్ డెడ్ డ్రాప్ విధానంలో కస్టమర్‌కు చేరుస్తాడు. బహిరంగ ప్రదేశంలో ఎవరికీ అనుమానం రాని ప్రాంతంలో డ్రగ్ ప్యాకెట్‌ను ఉంచుతాడు. ఎండ, వానల వల్ల ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్యాక్ చేస్తాడు. దీని ఫొటో, లోకేషన్‌ను వాట్సాప్ ద్వారా బెంగళూరులోని సప్లయర్‌కు పంపిస్తాడు. అతడు ఇదే సమాచారం కస్టమర్‌కు షేర్ చేస్తాడు. వీటి ఆధారంగా ఆ ప్రాంతానికి వెళ్లే కస్టమర్ ఆ సరుకు తీసుకుంటాడు. దీనినే డెడ్ డ్రాప్ విధానం అని పిలుస్తుంటారు. డెడ్ డ్రాప్ చేయడానికి డెలివరీ బాయ్ ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు, పాన్ డబ్బాలు, మెట్రో పిల్లర్లు తదితరాలను ఎంచుకుంటున్నారు. పెడ్లర్స్, సప్లయర్స్ ఇలా తాము సంపాదించిన మొత్తంలో 30 నుంచి 40 శాతం డెలివరీ బాయ్‌కు చెల్లిస్తారు.

సీఓడీ విధానంలోనూ మరో ముఠా..

బెంగళూరు కేంద్రంగానే పని చేస్తున్న మరో ముఠా డెడ్ డ్రాప్‌తో పాటు క్యాష్ ఆన్ డెలివరీ (సీఓడీ) విధానంలో డ్రగ్స్ సరఫరా చేస్తోంది. బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ డ్రగ్స్‌కు బానిసయ్యాడు. కుటుంబీకులు ఓ రీహాబ్ సెంటర్‌లో చేర్చినా ఫలితం దక్కలేదు. ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ డ్రగ్స్ దందాలోకి దిగిన అతను ఈ ఏడాది ఫిబ్రవరిలో నాంపల్లి పోలీసులకు చిక్కాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత టోలిచౌకీలో కుటుంబానికి దూరంగా నివసిస్తున్నాడు. బెంగళూరుకు చెందిన చుక్వా ఒబైయ్ డెడ్ డ్రాప్ ద్వారా కేరళ నుంచి వచ్చి బెంగళూరులో ఉంటున్న నందకుమార్‌ను డ్రగ్స్ అందిస్తాడు. ఇవి ఇతడి నుంచి చందానగర్‌కు చెందిన నవీన్‌కు చేరుతున్నాయి. అతడి నుంచి లేదా ఒక్కోసారి నేరుగా బెంగళూరు వెళ్లడం ద్వారా ఇమ్రాన్ ఈ సరుకు తీసుకువస్తున్నాడు. ఆపై డెడ్ డ్రాప్ లేదా సీఓడీ విధానంలో కస్టమర్లకు అందిస్తున్నాడు.

నలుగురి అరెస్టు..

ఈ రెండు గ్యాంగ్‌లపై సమాచారం అందుకున్న హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జీఎస్ డానియేల్, ఎస్సై సి.వెంకట రాములు తమ బృందాలతో రంగంలోకి దిగారు. దాదాపు నెల రోజులు నిఘా ఉంచి ఉస్మాన్, యాకూబ్, నందకుమార్, మహ్మద్ ఇమ్రాన్, నవీన్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.20 లక్షల విలువైన ఎండీఎంఏ, ఎల్‌ఎస్డీ బోల్ట్స్‌తో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నలుగురినీ అరెస్టు చేసిన పోలీసులు యాకూబ్‌ను అతడి దేశానికి డిపోర్టేషన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌లోని ప్రధాన సూత్రధారులు, తెలుగు రాష్ట్రాల్లోని వినియోగదారుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కస్టమర్ల పాత్రను బట్టి రీహాబ్‌కు తరలించడం లేదా అరెస్టు చేయడంపై నిర్ణయం తీసుకోనున్నారు.

సైబర్ మోసాలపై శిక్షణ.. ఆపై నేరాలు!

- పెట్టుబడుల పేరుతో రూ.19.90 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ మోసాలు ఎలా చేయాలి, మోసం చేశాక పోలీసులకు చిక్కకుండా సాక్ష్యాధారాలను ఎలా మాయం చేయాలనే అంశాలపై ట్రయినింగ్ తీసుకున్నాడు. వివిధ రకాల మోసాల పద్ధతులపై సైబర్ క్రైమ్ నిపుణుల వద్ద సమగ్రంగా శిక్షణ పొందాడు. తీరా, నేరం చేసి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు. ఇన్‌స్పెక్టర్ శంకర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ గ్రామానికి చెందిన కారంపూడి రాజేశ్ వేవ్‌టెక్ ఇన్ఫో సొల్యూషన్స్ పేరుతో సంస్థను స్థాపించాడు. వ్యాపారం పేరుతో కరూర్ వైశ్యా బ్యాంక్‌లో కరెంట్ ఖాతాలను తెరిచాడు. పెట్టుబడుల పేరుతో అమాయకులకు వల వేసే అతను హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌కు ప్రాతినిధ్య వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. సైబరాబాద్‌కు చెందిన వ్యక్తిని సంప్రదించిన రాజేష్ వీఐపీ హెచ్‌డీఎఫ్‌సీ మొబైల్ యాప్ ద్వారా ఐపీఓ స్టాక్‌లో పెట్టుబడులు పెట్టాలని సూచించాడు. అతడి మాటలను నమ్మిన బాధితుడు రూ.19.90 లక్షలు నిందితుడు సూచించిన వివిధ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేశాడు. ప్రాఫిట్స్ విత్ డ్రా చేయడంలో విఫలం కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కే శంకర్ రెడ్డి బాధితుడి నుంచి కొట్టేసిన సొమ్ము వేవ్‌టెక్ ఇన్ఫో సొల్యూషన్స్ అనే సంస్థ ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో అతడిని మహబూబాబాద్ జిల్లాలో అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని..

- భారీగా వసూలు
- ఇద్దరు నిందితుల రిమాండ్
- రూ.68 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని చెప్పి వారి నుంచి భారీగా వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వనస్థలిపురం డీఐ రాజేశ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన శేఖర్, రాజు, మరో వ్యక్తి ముఠాగా ఏర్పడ్డారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని ప్రచారం చేసుకున్న వీరు దాదాపు 30 మంది రూ. లక్షలు వసూలు చేశారు. ఇటీవల ప్రభుత్వం 28 మందిని రెగ్యులరైజ్ చేయడంతో తమను ఎందుకు రెగ్యులరైజ్ చేయలేదని బాధితులు నిలదీయడంతో వారు తప్పించుకు తిరుగుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం రాత్రి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 68 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

ఎట్టకేలకు దొరికిపోయారు

- ఏసీబీకి చిక్కిన ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్



ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండల అధికారులు అవినీతికి కేరాఫ్‌గా నిలుస్తున్నారు. రెండేళ్లలో మూడో ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. గతంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ, సబ్ రిజిస్ట్రార్, చౌదరిగూడ బిల్ కలెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తాజాగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు సంబంధించి బోడుప్పల్ ఏఈ, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీని అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

లంచం ఇస్తేనే బిల్లులు చేస్తామని..

మున్సిపాలిటీకి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ ఏడాది ఏదులాబాద్ వినాయక సాగర్ శ్రీనారాయణ చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్ల ఏర్పాటుకు టెండర్ దక్కించుకున్నాడు. నిమజ్జనం అనంతరం రూ.10 లక్షలు బిల్లు కాగా.. జీఎస్టీ మినహాయించుకొని రూ. 8 లక్షలు కాంట్రాక్టర్‌కు రావాల్సి ఉంది. బిల్లు రావాలంటే రూ.1.5 లక్షలు లంచం ఇవ్వాలని ఏఈ రాజశేఖర్, రూ.60 వేలు కావాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ డిమాండ్ చేశారు. సన్నీ రూ.30 వేలు అడ్వాన్స్‌గా ఫోన్ పే ద్వారా తీసుకొని పనుల రికార్డు పూర్తి చేశాడు. అనంతరం ఏఈ రాజశేఖర్‌కు రూ.70 వేలు వాయిదా పద్ధతిలో చెల్లిస్తానని కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. వాయిదా పద్ధతిలో ముందు రూ. 50 వేలు, తర్వాత రూ. 25 వేలు ఇవ్వాలని ఏఈ షరతు విధించాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించగా వారి సూచనలు మేరకు బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో లంచం డబ్బులు చెల్లించేందుకు వెళ్లాడు. డబ్బులు బయట తీసుకుంటానని ఏఈ అన్నాడు. అనంతరం ఏఈ తన నివాసంలో రూ. 50 వేలు తీసుకుంటుండగా రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈని ఆయన నివాసంలో, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సన్నీని ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డార్క్ వెబ్‌పై ప్రత్యేక నిఘా

- సోషల్‌మీడియాను జల్లెడపడుతున్నాం
- అత్యాధునిక టూల్స్ సమీకరించుకున్నాం
- నగరంలో డ్రగ్స్ దందాలను ఉపేక్షించం
- స్పష్టం చేసిన నగర కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో జరుగుతున్న డ్రగ్స్ దందాపై పటిష్ట నిఘా ఉంచామని కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) పని తీరును సమీక్షించడంతో పాటు అదనపు సిబ్బంది, వనరులను సమకూర్చామన్నారు. శుక్రవారంసీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'సింథటిక్ డ్రగ్స్ గోవా, బెంగళూరుల నుంచి.. గంజాయి సంబంధితమైనవి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని కొన్ని ప్రాంతాల నుంచి వస్తున్నాయి. ప్రస్తుతం బెంగళూరుపై కన్నేసి ఆపరేషన్లు చేస్తున్నాం. ఒడిశాలోని ఓ గ్రామంలో హష్ ఆయిల్ తయారీకి ఓ కర్మాగారం ఉన్నట్లు గుర్తించాం. త్వరలో టీజీ ఏఎన్‌బీ, ఏపీ పోలీసులతో కలిసి అక్కడ ఆపరేషన్ చేపట్టనున్నాం. స్నాప్‌చాట్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ సహా ప్రతి సోషల్‌మీడియాను పర్యవేక్షించడానికి, డార్క్ వెబ్‌పై కన్నేయడానికి ప్రత్యేక టూల్స్ సమీకరించుకున్నాం. పెడ్లర్లు, డెలివరీ బాయ్స్ ఇటీవలకాలంలో వర్చువల్ నెంబర్లు, వీపీఎన్ నెట్‌వర్క్ వాడుతున్నారు. తమ బ్యాంకు ఖాతాలు కాకుండా మనీ మ్యూల్స్‌వి, గుర్తింపుకార్డులు సైతం నకిలీవి వినియోగిస్తున్నారు. వీటన్నింటి పైనా పక్కా నిఘా ఉంచి, వారికి చెక్ పెట్టే సామర్థ్యం సముపార్జించుకున్నాం. నగరంలో సింథటిక్ డ్రగ్స్ వాడే వారిలో సంపన్నులు, వారి సంతానంతో పాటు ఐటీ ఉద్యోగులు, అప్పుడే కాలేజీల నుంచి చదువు పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులు ఉంటున్నట్లు గుర్తించాం. శుక్రవారం దొరికిన ఇమ్రాన్ గ్యాంగ్‌లో గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి కీలకంగా ఉన్నట్లు తెలిసింది. అతను ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు పెడ్లర్‌గా పని చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. స్టూడెంట్ వీసాపై వచ్చిన విదేశీయులు ఇక్కడ స్థిరపడుతున్నారు. వీరిపైన చర్యలు తీసుకోవడానికి అనేక అంతర్జాతీయ అంశాలు అడ్డు వస్తున్నాయి. ఇలాంటి వారిలో అసాంఘిక శక్తులు, నేరాలు చేసిన వారిని డిపోర్టేషన్ చేయడం పెద్ద ప్రహసనంగా మారింది. నగరంలోని కొన్ని లో లెవల్ పబ్స్‌లో యువతులతో డ్యాన్స్‌లు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. దీనిపై సమాచారంతో ఓ పబ్‌పై చర్యలు తీసుకున్నాం. మిగిలిన వాటి పైనా పటిష్ట నిఘా ఉంచాం. సికింద్రాబాద్ దేవాలయం ఉదంతంలో ఎలాంటి కుట్ర కోణం లేదు. నగర పోలీసులతో పాటు ముంబై ఏటీఎస్, ఎన్‌ఐఏ అధికారులూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కంప్యూటర్ ఇంజనీర్ అయిన ఆ నిందితుడిలో మతోన్మాదం ఉంది. ఆ కారణంగానే ఉద్యోగాలు పోగొట్టుకోవడంతో పాటు రెండుసార్లు జైలుకు వెళ్లాడు. డ్రగ్ పెడ్లర్స్‌ను పట్టుకోవడంలో అనేక రిస్కులు ఉంటాయి. అవన్నీ అధిగమిస్తూ ముందుకు వెళ్తున్న హెచ్–న్యూ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం' అని అన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.51 లక్షలు స్వాహా

- నగరానికి చెందిన వ్యక్తికి టోకరా
- సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో రూ.51 లక్షలు టోకరా వేశారు. యస్ సెక్యూరిటీ ఇండియా లిమిటెడ్ (వైఎస్ఐఎల్) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు 'ఏ630 వైఎస్ఐఎల్ అఫీషియల్ మెంబర్స్ గ్రూప్' పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో చేర్చాడు. ఇది ఎస్ బ్యాంక్ అనుబంధ సంస్థగా నమ్మించాడు. ట్రేడింగ్‌లో సలహాలు ఇస్తామంటూ నకిలీ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. వివిధ రకాలైన స్కీములు చెప్పి భారీ మొత్తం ఇన్వెస్ట్ చేయించారు. ప్రతి సందర్భంలోనూ భారీ లాభాలు వచ్చినట్లు ఆ యాప్ ద్వారా చూపించారు. అయితే డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే మరికొంత మొత్తం పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించారు. ఇలా చివరకు రూ.51 స్వాహా చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

లాక్‌డౌన్ నష్టాలను గట్టెక్కొచ్చని..

- నగరవాసికి కుచ్చుటోపీ పెట్టిన సైబర్ నేరస్తులు
- రూ.1.45 కోట్లు వసూలు
- ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: కరోనా, లాక్‌డౌన్ సమయంలో జరిగిన నష్టాల నుంచి గట్టెక్కొచ్చని నమ్మించి నట్టేట ముంచేశారు. నగరవాసికి కుచ్చుటోపి పెట్టి రూ.1.45 కోట్లు కొట్టేశారు సైబర్ కేటుగాళ్లు. ఈ మేరకు నమోదైన కేసులో బెంగళూరుకు చెందిన ముగ్గురు నిందితులు రామేశ్వర బెహెరా అలియాస్ ఆర్కే భట్, షేక్ జైనాబ్ అలియాస్ నిహారిక, ఆమె భర్త అక్బర్ ఖాన్‌లను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసిన రామేశ్వర బెహెరా బెంగళూరుకు వెళ్లి ట్రేడింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. 2018లో ఎక్స్‌టీ స్క్వేర్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను స్థాపించాడు. గతంలో వే2గెయిన్స్ సంస్థలో అతడితో పాటు పనిచేసిన నిహారిక, ఆమె భర్త అక్బర్ ఖాన్ కూడా ఎక్స్‌టీలో చేరారు. ఎక్స్‌టీ స్క్వేర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో పెట్టుబడులపై అధిక లాభాలు ఇస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ క్రమంలో సైబరాబాద్‌కు చెందిన వ్యక్తికి 2019 జనవరిలో నిహారికా నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఎక్స్‌టీ స్క్వేర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ద్వారా పెట్టుబడులపై అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపింది. ఆమె మాయమాటలను నమ్మిన బాధితుడు తొలుత రూ.2 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. మరింత ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1.45 కోట్లు పెట్టుబడి పెట్టాడు. లాభాలు కాదు కదా అసలు కూడా తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఈనెల 3న సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ వాడితే జీవితాలు నాశనం

'సే నో టు డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్

బంజారాహిల్స్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్, షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పోస్టర్‌ను శుక్రవారం చిత్తూరు ఎంపీ ప్రసాద్‌రావు, చెన్నూరు శాసనసభ్యులు వివేక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పంజాబ్‌లో డ్రగ్స్ వల్ల రాష్ట్రమే నాశనం అయ్యిందన్నారు. యువత డ్రగ్స్ వాడకుండా రాష్ట్ర ప్రజలు, పోలీసు అధికారులు నడుం బిగించాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభుకుమార్ చల్లాగాలి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడడం వల్ల అనేక అనారోగ్య సమస్యల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ గత సంవత్సర కాలంగా డ్రగ్స్ నిర్మూలనకు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాఠశాలలు, కళాశాలల్లో అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రఫుల్లారెడ్డి, కేఎస్ రంగనాయకులు, ఇమ్రాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసనను కొనసాగించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని పరిపాలనా భవనం ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్‌గౌడ్, జేఏసీ నేతలు యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, పుష్పా చక్రపాణి, ఆనంద్ పవర్, రజనీకాంత్, పరకుశం వెంకటరమణ, రాములు, నారాయణరావు, రుషేంద్ర మణి, వేణుగోపాల్, అవినాష్, కిషోర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరావు, లక్ష్మిలకు జీవనసాఫల్య పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న సత్యనారాయణ తదితరులు

ఖైరతాబాద్: చరిత్ర పునర్నిర్మాణంలో అధికారిక సమాచారం ఇచ్చే సంస్థ ఏజీ కార్యాలయమని, ఆ సమాచారం పరిశోధనకు ఎంతో ఉపయోకరమైందని అందుకే రంజని సంస్థ పట్ల తనకు ఎంతో అభిమానమని తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి వెలుదండ నిత్యానందరావు అన్నారు. రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏజీ ఆఫీసు ఆడిటోరియంలో దసరా–దీపావళి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వెలుదండ నిత్యానందరావు సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏజీ ఆఫీసు పూర్వ ఉద్యోగులు, లబ్ధ ప్రతిష్ఠ సాహితీవేత్తలు పాలకోడేటి సత్యనారాయణరావు, పీఎస్ఎం లక్ష్మిలకు జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. అనంతరం పాలకోడేటి మాట్లాడుతూ జీవన పర్యంతం తాను రాస్తూనే ఉంటానని, ఈ కార్యాలయం తనకు పుట్టిల్లు వంటిదన్నారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తిగత జీవనానికి రంజని ఎంతో సహకరించిందన్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ మాధవి, పూర్వ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్స్ ఎస్. సుధీర్‌కుమార్, మల్లాది సుబ్రమణ్యం, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ సంజయ్, సురేష్‌లతో పాటు రంజని అధ్యక్షులు నందిరాజు పద్మలతా జయరాం, ఉపాధ్యక్షులు అద్దెపల్లి రాధాకృష్ణ, పూర్వ రంజని కార్యదర్శి మట్టిగుంట వెంటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: క్షేత్రస్థాయిలో చిన్నారులకు విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి గుర్తు చేశారు. డివిజన్‌లో సంజయ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చేపడుతున్న మరమ్మతు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు తనవంతు కృషి అందిస్తానని హామీ ఇచ్చారు. బడి మానేసిన చిన్నారులకు తిరిగి అంగన్‌వాడీ పాఠశాలలకు పంపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సయ్యద్ ఖదీర్, షేక్ అక్రంతోపాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం

వీ–హబ్ సీఈఓ సీత పల్లచోల్ల



బంజారాహిల్స్: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి వారికి వ్యాపార అవకాశాలను మెరుగుపరచడమే వీ–హబ్ లక్ష్యమని ఆ సంస్థ సీఈఓ సీత పల్లచోల్ల స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న నూతన మహిళా పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ చేయూతను అందిస్తామని చెప్పారు. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే మహిళలకు వారి వద్ద ఉన్న సరికొత్త ఆలోచనలను తమకు తెలియజేస్తే వారికి సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. వ్యాపారంలో ఎలా నిలదొక్కుకోవాలి, బ్యాంక్ రుణాలు తదితర అంశాల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒక్క వ్యాపారంలోనే కాకుండా మహిళలకు వారికి నచ్చిన ప్రతి ఒక్క రంగంలో వారి ఆలోచనలను తమకు తెలపాలని సూచించారు. తద్వారా వారి కలలను సాకారం చేసుకోవచ్చని తెలిపారు.

హాకా ఆధ్వర్యంలో టపాకాయల విక్రయం

లిబర్టీ: గత 43 సంవత్సరాలుగా జంటనగరాల వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా (ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్) ఈ ఏడాది కూడా దీపావళి పండుగను పురస్కరించుకొని టపాకాయల ద్వారా సేవలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన నాణ్యమైన టపాకాయలను ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతి ఏడాది వలే ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్‌టీఆర్ స్టేడియంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి, అనుభవజ్ఞులైన సిబ్బందితో అన్ని రకాల దీపావళి టపాకాయలను విక్రయిస్తున్నామని హాకా ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వినియోగదారులకు సేవే లక్ష్యంగా ఎక్కువగా లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు అందిస్తామన్నారు. పార్కింగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నామని, అగ్నిమాపక కేంద్రం, పోలీసుల నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

మత్తు ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్న పెడ్లర్ అరెస్టు

పంజగుట్ట: నిషేధిత పెంటాజోన్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర పెడ్లర్‌తో పాటు వినియోగదారులను పంజగుట్ట పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో విభాగం పోలీసులు కలిసి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం, పాట్నాకు చెందిన విజయ్ కుమార్ గుప్తా అక్కడే ఓ మందుల షాపులో పని చేస్తున్నాడు. పెంటాజోన్ ఇంజెక్షన్ల కోసం ఎంత ధర అయినా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గమనించాడు. ఈ క్రమంలో భూత్‌నాథ్ రోడ్డులో ఎలాంటి లైసెన్స్ లేకుండా సరస్వతి ఎంటర్‌ప్రైజెస్, ఫార్మా డిస్ట్రిబ్యూటర్ పేరుతో సొంత కంపెనీ ప్రారంభించడం గమనించాడు. దీంతో అక్కడే ఓ ఆసుపత్రిలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌తో స్నేహం చేసి అతని ద్వారా పెంటాజోన్ ఇంజెక్షన్లు తయారీ యూనిట్‌ను సంప్రదించి విజయ్‌కుమార్ పనిచేసే ఆసుపత్రి పేరుతో ఇంజెక్షన్లు ఆర్డర్ ఇచ్చారు. ఆసుపత్రి యాజమాన్యానికి తెలియకుండా అందులో పనిచేసే విజయ్‌కుమార్ సహకారంతో ఆసుపత్రి పేరుతో ఆర్డర్ ఇచ్చి వినియోగదారులకు అధిక ధరలకు నిషేధిత ఇంజెక్షన్లను వీరు సరఫరా చేస్తున్నారు. వచ్చిన లాభాన్ని విజయ్ కుమార్ గుప్త, విజయ్ కుమార్ ఇద్దరూ పంచుకునేవారు. ఈ ఇంజెక్షన్ల గూర్చి తెలుసుకున్న యూసూఫ్‌గూడ, కృష్ణానగర్‌లో నివసించే మొహమ్మద్ నయీంఉద్దీన్ విజయ్‌కుమార్ గుప్తను సంప్రదించి అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. నిందితుల కదలికలు తెలుసుకున్న పంజగుట్ట, తెలంగాణ యాంటీ నార్కోటిక్ పోలీసులు మొహమ్మద్ నయీంను అదుపులోకి తీసుకుని ఇతని సమాచారంతో పాట్నాకు వెళ్లి విజయ్‌కుమార్ గుప్తను అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి సహకరించిన విజయ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలి పారు. నగరంలో ఈ ఇంజెక్షన్ వినియోగించిన ఐదుగురు వినియోగదారులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారం కోసం..

కంట్రోల్ రూం ఏర్పాటు..!

- ప్రారంభించిన జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతి
- సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలి
- దరఖాస్తులు స్వీకరించనున్న ఎనిమిది విభాగాల అధికారులు
- అప్‌డేట్ అవుతూ నాణ్యమైన సేవలు అందిస్తాం : అనురాగ్‌జయంతి



మాట్లాడుతున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ కార్యాలయాలకు వచ్చే సమస్యలపై వారంలో రెండు వారాలకోసారి జోనల్ కమిషనర్ సంబంధిత సర్కిళ్ల డీసీలు, ఈఈలు, ఏఎంఓహెచ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి వాటి పురోగతిపై చర్చిస్తారు. వారానికోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నా కొన్నిసార్లు ఆ సమస్యలు పరిష్కార దిశలో ముందుకుసాగడం లేదు. ఎప్పటికప్పుడు సమావేశాల్లో జోనల్ కమిషనర్ ప్రశ్నిస్తున్నా సంబంధిత అధికారులు ఏదో ఒక కారణంతో తప్పించుకోవాలని చూస్తుంటారు. ఇప్పటికే చాలా సమస్యలపై అధికారులు పరిష్కారం చూపినా..ఇంకా కొన్ని సమస్యలు మాత్రం అక్కడక్కడ పెండింగ్‌లోనే ఉంటున్నాయి. దీనికి పరిష్కారం చూపే దిశలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సరికొత్త ఆలోచనతో ముందుకువచ్చారు. సమీక్ష సమావేశాలే కాకుండా రోజువారీగా ప్రజల నుంచి సమస్యలు స్వీకరిస్తూ వాటిని అక్కడికక్కడే పరిష్కరించే దిశలో చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగానే ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో పౌరుల సమస్యల సత్వర పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. పౌరులకు మరింత మెరుగైన సేవలందించేందుకు గాను వారి సమస్యలు విని పరిష్కరించే దిశలో ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన అనంతరం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశలో పనిచేయాలని సూచించారు. ప్రజల గొంతుకను వినాలని, వారి చెప్పింది పరిష్కరించాలన్నది కంట్రోల్‌రూమ్ ఉద్దేశమన్నారు. అధికారుల బాధ్యతలు, ప్రజల సమస్యల పరిష్కారం దిశలో ముందుకుసాగాలన్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకోవాలన్నారు. పౌరులకు, అధికారులకు మధ్య సమన్వయం పెంపొందించి వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఏ సమస్యలను ప్రశ్నిస్తున్నారో వాటిని తప్పనిసరిగా విని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఆ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పన్నుల విభాగం, పారిశుద్ధ్య విభాగం, పార్కుల నిర్వహణ విభాగం, స్వయం సహాయక బృందాల యూడీసీ విభాగం.. ఇలా పౌరులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి ఎనిమిది విభాగాలకు చెందిన ఎనిమిదిమంది అధికారులు కూర్చొని విన్నపాలను స్వీకరిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం ఈ విన్నపాల రిపోర్టును జోనల్ కమిషనర్‌కు అందజేస్తారు. ఫిర్యాదు ఇచ్చిన పౌరుడికి అది ఏ దశలో ఉందో కూడా ఎప్పటికప్పుడు తెలియజేస్తారు. రోజువారీగా అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరిస్తారు. తమతో కానివి మాత్రమే అధికారుల దృష్టికి తీసుకువెళ్తారు. ఇదొక మంచి ఆలోచన అని, పౌరులు, అధికారులకు మధ్య ఈ కంట్రోల్ రూమ్ వేదిక కానున్నదని, వారం రోజుల్లో మరింత బలోపేతం చేస్తామని అనురాగ్‌జయంతి తెలిపారు. రోజువారీగా ఎదుర్కొంటున్న అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ వెళ్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పనివేళలు ముగిసేదాకా ఈ కంట్రోల్ రూం పౌరులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఆకట్టుకుంటున్న ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రఖ్యాత డిజైనర్లు దీపావళి స్పెషల్‌గా ప్రత్యేక డిజైన్లతో దుస్తులు, ఆభరణాలు ప్రదర్శించగా ఇవి వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఫిలింనగర్‌లో దొంగతనానికి యత్నం

ఫిలింనగర్: దొంగతనం చేయడానికి ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నించిన దొంగల ముఠా ఇంటి యజమాని అప్రమత్తం కావడంతో పారిపోయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లోని లోటస్‌పాండ్ ఎదురుగా సంఘమిత్ర పెరివార్ అనే ఆర్కిటెక్ నివసిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆయన ఇంట్లోకి ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి గేటు దూకి లోనికి ప్రవేశించారు. ఇంట్లోకి చొరబడేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా సంఘమిత్ర సోదరుడు మేఘమిత్ర మేల్కొన్నాడు. కిటికీలో నుంచి బయటకు చూడగా ముగ్గురు ఆగంతకులు ఆయనకు కనిపించారు. దీంతో తన ఇంటి బయట అలారం మోగించడంతో పాటు చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. దీంతో అందరూ లేచి దొంగలను పట్టుకునేందుకు యత్నించగా క్షణాల్లోనే ఆ ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించగా లైసెన్స్ కలిగిన నెంబర్ ప్లేట్‌తో బైక్‌లపై వచ్చారని గుర్తించారు. వీరి వద్ద మారణాయుధాలు కూడా ఉన్నట్లుగా సీసీ ఫుటేజీల ద్వారా తెలుసుకున్నామని, తాము అప్రమత్తం కాకపోతే ప్రాణాలు తీసి ఉండేవారని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

ఆకుల కోసం చెట్టెక్కి.. అనంత లోకాలకు..

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి

రహమత్‌నగర్ (బోరబండ): మేకలు ఆకలి తీర్చాలని ఆకుల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యవకుడు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్మికనగర్ శుక్రవారం చోటుచేసుకుంది. బోరబండ ఏఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం... కార్మికనగర్‌కు చెందిన మహ్మద్ ఇలియాజ్ (20) స్థానికంగా ఉండే వాటర్ ప్లాంట్‌లో పనిచేసేవాడు. తమ మేకల కోసం పోచమ్మ ఆలయం ముందు ఉన్న రాగి చెట్టు ఎక్కి ఆకులు కోస్తున్న క్రమంలోనే పక్కనే ఉన్న విద్యుత్తు తీగలు తగటంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇలియాజ్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పోచయ్య తెలిపారు.

అనుమతుల్లేని సైరన్లపై స్పెషల్ డ్రైవ్

15 సైరన్లు, 12 మల్టీ టోన్డ్ హారన్ల సీజ్... కేసులు నమోదు



కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజిద్ తదితరులు

ఖైరతాబాద్: సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు గతరెండు రోజులుగా వాహనాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ఉపయోగిస్తున్న 15 సైరన్లు, 12 మల్టీ టోన్డ్ హారన్స్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజిద్ నేతృత్వంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రవీంద్రభారతి, రోటరీ చౌరస్తా, ఎన్టీఆర్‌మార్గ్ ప్రాంతాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వీఐపీ సైరన్లు, మల్టీ టోన్డ్ హారన్లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సైఫాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ వినయ్ కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పంజగుట్ట శ్మశాన వాటికను శుభ్రం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: దీపావళి పండుగ సమీపిస్తున్న దృష్ట్యా పంజగుట్ట శ్మశాన వాటిక ప్రాంతాన్ని శుభ్రం చేయాలంటూ వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం అందజేశారు. దీపావళి పర్వదినం సందర్భంగా పెద్దలకు దీపాలు వెలిగించి పూజలు చేయనున్న నేపథ్యంలో అడవిలా మారిన శ్మశానవాటిక ప్రాంతాన్ని క్లీన్ చేయాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే శ్మశానవాటిక ప్రాంగణంలో లైట్లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

ముమ్మరంగా క్లీన్ ఆఫ్ హైదరాబాద్



బంజారాహిల్స్: క్లీన్ ఆఫ్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన నెలల తరబడి పేరుకుపోయిన మట్టికుప్పలు, నిర్మాణ వ్యర్థాలను అధికారులు తరలిస్తున్నారు. గడిచిన మూడురోజులుగా పంజగుట్ట నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం.1 వరకు రోడ్డుకు రెండువైపులా, బంజారాహిల్స్ రోడ్ నెం. 14, రోడ్‌నెం. 3 ప్రాంతాల్లో ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 21 రోజుల పాటు కొనసాగే ఈ డ్రైవ్‌లో కాలనీలు, బస్తీల్లో ఎక్కడైనా వ్యర్థాలు, మట్టి కుప్పలు పేరుకుపోయి ఉంటే జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

దోషం తొలగిస్తామని దోచుకెళ్తారు..

- పలువురికి టోకరా
- ఇద్దరు మాయలేడీల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

బంజారాహిల్స్: మీ ఇంటికి పట్టిన దోషం తొలగిస్తామని, మీ ఇంటిపై నరదృష్టి ఉందని, ధనలక్ష్మీ ఇంటి తలుపులు దాకా వచ్చి వెనక్కి వెళ్తుందని మాయమాటలు చెప్పి పూజల పేరుతో అమాయకులైన మహిళల నుంచి రూ.లక్షలు దోచుకుంటున్న ఇద్దరు కిలాడీ లేడీలను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా, తోరికొండ గ్రామానికి చెందిన శారదక్క కవిత అలియాస్ రాసూరి కవిత ఈసీఐఎల్‌లో నివాసం ఉంటోంది. దమ్మాయిగూడలో ఉంటున్న ఆర్మూర్‌కు చెందిన కొడపల్లి మాధవితో కలిసి పట్టుచీరలు కట్టుకుని, పెద్ద పెద్ద బొట్లు పెట్టుకుని సంపన్నులు నివసించే కాలనీల్లో పర్యటించేవారు. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి ఇంటి తలుపు తడతారు. తలుపు తీయగానే మీ ఇంటికి నరదోషం ఉంది..దివ్య దృష్టితో చెబుతున్నాం ..చాలా కష్టాల్లో ఉన్నారంటూ మాటలతో నమ్మిస్తారు. ఇదే తరహాలో ఫిబ్రవరి 9న బంజారాహిల్స్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన వీరు ఆ ఇంట్లో ఉండే ప్రైవేటు టీచర్‌ను మాటల్లోకి దింపారు. దోష నివారణ కోసం పూజలు చేస్తామని, చీర, జాకెట్టు అమ్మవారి ఎదుట పెట్టి బియ్యంలో రూ. లక్ష మూటకట్టాలని చెప్పారు. అనంతరం ఆమెను అటూ ఇటూ తిప్పుతూ దృష్టి మరల్చి మూ టలో ఉన్న రూ.లక్ష నగదును చాకచాక్యంగా నొక్కేశారు. పూజల పేరుతో కొద్దిసేపు హడావిడి చేసి మర్నాడు మూట విప్పాలని చెప్పి అక్కడి నుంచి జారుకున్నారు. మరుసటి రోజు బాధితురాలు మూట విప్పి చూడగా అందులో డబ్బు కనిపించకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్, క్రైమ్ పోలీసులు నీరజ్, వెంకటేశ్వర్లు, భవానీ రంగంలోకి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు 2015 నుంచి దోష నివారణ పూజల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. వీరిపై నగరంలోని పలు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఎంటమాలజీ కార్యాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంటమాలజీ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

మహాధర్నాకు తరలివెళ్లిన బీజేపీ నేతలు



బీజేపీ మహా ధర్నాకు తరలివెళ్తున్న బీజేపీ నేతలు

బంజారాహిల్స్: మూసీ బాధితులకు న్యాయం కోసం బీజేపీ తలపెట్టిన మహాధర్నాకు జూబ్లీహిల్స్ డివిజన్ నేతలు తరలివెళ్లారు. మూసీ బాధితులను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం వ్యవహరించడంపై ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. మహాధర్నాకు తరలివెళ్లిన వారిలో బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, దండుగుల శ్రీనివాస్, గందె అరుణ్‌కుమార్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, బోయ రామాంజనేయులు ఉన్నారు.

హెచ్‌ఎఫ్‌నగర్‌లో సెల్ టవర్‌ను తొలగించండి



డీఎంసీకి వినతి పత్రం అందజేస్తున్న మామెల్ల నాగేష్

రహమత్‌నగర్: హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్‌బస్తీలో సెల్‌టవర్‌ను తొలగించాలని ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఉత్తర భారత వర్కింగ్ ప్రెసిడెంట్ మామెల్ల నాగేష్ జీహెచ్ఎంసీ సర్కిల్–19 డీఎంసీ జకీయా సుల్తానాను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎఫ్ నగర్‌లో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను తొలగించాలని తాము జీహెచ్ఎంసీ కమిషనర్ విన్నవించామని, దీనిపై స్పందించిన ఆయన వెంటనే తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. అయితే నేటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. దీంతో మళ్లీ వినతి పత్రం సమర్పించామని తెలిపారు.

రొమ్ము కేన్సర్ అవగాహన సదస్సు



రహమత్‌నగర్ : వీకేర్‌యూ ఫౌండేషన్, ,శ్రేష్ఠ ఫౌండేషన్ సంయుక్తంగా హెచ్‌ఎఫ్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్లో శుక్రవారం మహిళల రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.రమణ మోహన్, డాక్టర్ నీరజ, డాక్టర్ అరుణ, డాక్టర్ మంజుల రొమ్ము కేన్సర్ రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు, వస్తే చికిత్స విధానాన్ని మహిళలకు వివరించారు. వీకేర్ యూ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎఫ్రామయి కంకణాల, డివిజన్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షరీఫ్, కోఆర్డినేటర్ విజయ, అంగన్‌వాడీ. ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ మేళా నిర్వహించడం అభినందనీయం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఖైరతాబాద్: స్వదేశీ మేళాను నిర్వహించడం అభినందనీయమని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళా కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాలుగా మార్గనిర్దేశం చేసిన మన భారత భూమి పురాతన జ్ఞానంలో పాతుకుపోయిన వారసత్వ సంపదకు ప్రతీక అని, స్వదేశీ కేవలం ఆర్థిక భావన మాత్రమే కాదని, ఇది మన స్వావలంబన వక్తీకరణ, బాహ్య దేశాలపై ఆధారపడకుండా, పరిష్కారాల కోసం అంతర్గతంగా చూడాలనే ఆలోచనను సూత్రమని అన్నారు. మన మూలాలు, ప్రజలతో లోతైన సంబంధాన్ని పెంపొందించుకోవాలని ఇది మనలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. స్వదేశీ జాగరణ మంచ్, సావలంబి భారత్ అభియాన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టీయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు, మంచ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్‌బాబు, గంగోత్రి డెవలపర్స్ చైర్మన్ మధురాంరెడ్డి, స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత కన్వీనర్ జి.రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జడ్జీలకు స్వాగతం



కొత్తగా వచ్చిన జ్యుడీషియల్ ఆఫీసర్లను పరిచయం చేస్తున్న నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజవర్ధన్‌రెడ్డి

సిటీకోర్టులు: నాంపల్లి కోర్టుకు పదోన్నతిపై వచ్చిన ఐదుగురు జ్యుడీషియల్ ఆఫీసర్లకు శుక్రవారం నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజవర్ధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గోకుల్, రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ సిబ్బంది, న్యాయవాదులు ఘనంగా స్వాగతం పలుకుతూ బొకేలు అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజవర్ధన్‌రెడ్డి, పలువురు జడ్జీలు, బార్ అసోసియేషన్ మెంబర్లు మామిడాల రమేశ్, రాజగోపాల్, ఈశ్వర్‌కుమార్, ఎస్.కుమార్, కిరణ్, దయాకర్, మల్లేశం, మాధవి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

- జడ్జి కె.ఆశారాణి సికింద్రాబాద్ నుంచి నాంపల్లి కోర్టు 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు,
- జడ్జి ఎ.స్వర్ణలత మిర్యాలగూడ నుంచి నాంపల్లి కోర్టులోని 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు,
- జడ్జి ఎ.నిర్మల సికింద్రాబాద్ కోర్టు నుంచి నాంపల్లిలోని 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు,
- జడ్జి జి.అనుష జహీరాబాద్ నుంచి నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు,
- జడ్జి వి.సౌమ్య గజ్వేల్ నుంచి నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు బదిలీపై వచ్చారు.

ధర్మరాజును నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి

ఆధ్యాత్మికవేత్త గరికిపాటి నరసింహారావు



గరికిపాటి నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ నాగ్యా దంపతులు

అడ్డగుట్ట: మహాభారతంలో ధర్మరాజును నేటితరం ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడిచి ధర్మాన్ని కాపాడాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మికవేత్త గరికిపాటి నరసింహారావు సూచించారు. దక్షిణ మధ్య రైల్వే లలిత కళాసమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం పద్మశ్రీ గరికిపాటి నరసింహారావుచే మహాభారతంలో ధర్మరాజు పాత్ర, ఔచిత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. రాగ, భావ యుక్తంగా పద్యాలు, శ్లోకాలు గానం చేస్తూ ప్రసంగించిన ఆయన ప్రవచనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. మహాభారతంలో ధర్మరాజు తన జీవితంలో క్లిష్టమైన సమస్యలు ఎదుర్కొన్న తీరు, పుట్టుక ప్రత్యేకత, ధర్మానికి కట్టుబడి ఉండటం, యక్ష ప్రశ్నలు, అరణ్య పర్వం ఘట్టాలను చమత్కారాలతో వివరించారు. ధర్మానికి కట్టుబడి ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా శాంతి మార్గంలో సమస్యలను పరిష్కరించడం ధర్మరాజు నుంచి నేర్చుకోవాలన్నారు. సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారం అనుకుంటున్న ఎంతో మంది.. ఓర్పు, సహనంతో వాటిని అధిగమించి ముందుకు సాగడం తెలుసుకోవాలన్నారు. అంతకుముందు కళాసమితి ఉపాధ్యక్షుడు రవి పి.పాడి, మంత్రి భుజంగరావులు 56 సంవత్సరాలుగా సమితి చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. అనంతరం.. గరికిపాటి నరసింహారావు దంపతులను కళాసమితి బృందం సత్కరించారు. ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ బి.నాగ్యా, మాజీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, సమితి మాజీ అధ్యక్షుడు గణేశ్వరరావు, కే.పద్మజ, చాన్ భాషా, గోవిందు పాల్గొన్నారు.

దివ్యాంగుల జాబ్ పోర్టల్‌లో నమోదుకు అవకాశం

చాదర్‌ఘాట్: దివ్యాంగుల జాబ్ పోర్టల్‌కు అర్హులైన దివ్యాంగుల సౌకర్యార్థం పేరు నమోదుకు మలక్‌పేటలోని ప్రధాన కార్యాలయంలో కౌంటర్‌లో నమోదు చేసుకోవచ్చని, సిబ్బందిని నియమించామని డైరెక్టర్ శైలజ తెలిపారు. మలక్‌పేటలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పోర్టల్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ఆన్‌లైన్‌లో సమస్యలు తలెత్తితే 040–24559048కు ఫోన్ చేసి సమాచారం తీసుకోవాలని ఆమె తెలిపారు.

రూ.500 కోట్ల విలువైన భూమి కబ్జా!

వంద మందితో స్థలంలోకి చొరబడి దౌర్జన్యం

రాచకొండ కమిషనర్ మమ్మల్ని బెదిరించారు

సీఎం సోదరులను కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని సలహా

బాధితుడు రాకేశ్‌రెడ్డి ఆరోపణలు

అల్వాల్/పంజగుట్ట: రూ.500 కోట్ల విలువైన పట్టా భూమిని కబ్జా చేశారని, వంద మంది ప్రైవేట్ సైన్యంతో స్థలంలో చొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితుడు, మల్కాజిగిరికి చెందిన న్యాయవాది రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. తమ స్థలం కబ్జాకు గురైందని రాచకొండ పోలీసు కమిషనర్ జీ.సుధీర్‌బాబును కలిస్తే.. తమనే బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి సోదరులను కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థలం పట్టాదారుడు సూర్యనారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

తాజ్ ఉన్నీసా నుంచి కొనుగోలు..

మల్కాజ్‌గిరిలోని తిరుమలగిరిలో సర్వే నంబర్లు 398, 399, 409, 410, 411/1, 411/2, 579లల్లో 19 ఎకరాల 18 గుంటల భూమి ఉంది. 1974లో తాజ్‌ఉన్నీసా బేగం వద్ద ఈ భూమిని కొనుగోలు చేశాం. జి.సూర్యనారాయణరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అప్పటి నుంచి రెవెన్యూ, మున్సిపల్ పన్నులు చెల్లిస్తున్నారు. పహానీలో సైతం సూర్యనారాయణ పేరే వస్తుంది. 1986లో మున్సిపల్ అనుమతి తీసుకొని భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాం. ప్రహరీ గోడ లోపల అగ్రికల్చర్ షెడ్ వేసుకొని, వ్యాపారాలు చేసుకుంటున్నాం. 50 ఏళ్లుగా భూమిలో పొజిషన్‌లో ఉన్నాం.

50 మందితో వచ్చి బీభత్సం..

ఈ నెల 5న సుమారు 50 మందితో స్థలంలోకి చొచ్చుకు వచ్చి ఈ స్థలం తమదే అంటూ బీభత్సం సృష్టించారు. దీంతో మల్కాజ్‌గిరి ఇన్‌స్పెక్టర్‌ను కలిసి తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, రెవెన్యూ, మున్సిపల్ పన్నుల బిల్లులు వంటి అన్ని రకాల ప్రతాలను చూపించగా.. ఇన్‌స్పెక్టర్ కూడా ఈ స్థలం మీదేనని స్పష్టం చేశారు. అయితే తనకు పైనుంచి ఒత్తిడి ఉన్న నేపథ్యంలో రాచకొండ కమిషనర్‌ను కలవాలని సలహా ఇచ్చారు. దీంతో సీపీ సుధీర్‌బాబు వద్దకు వెళ్లాం. ఆయన దుర్మార్గంగా బెదిరిస్తూ మేమే దగ్గరుండి స్థలం ఖాళీ చేయిస్తాం.. లేకపోతే వెంటనే వెళ్లి మైనంపల్లి హన్మంతరావు ద్వారా ముఖ్యమంత్రి సోదరులను కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని సలహా ఇచ్చారు.

స్థలంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న పోలీసులు..

తమ స్థలం వద్ద షిఫ్టుల వారీగా పోలీసులు బందోబస్తు పెట్టారు. తమ స్థలంలోకి తమనే వెళ్లనీయడం లేదని రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వంద మందితో కలిసి వచ్చి స్థలంలో వేసుకున్న షెడ్‌లను కూల్చేసి, మెడికల్ సామగ్రిని ఎత్తుకెళ్లి తుక్కు కింద విక్రయించుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తమస్థలం తమకు ఇప్పించాలని వేడుకున్నారు.



సూర్యనారాయణరెడ్డి తోట

ఆరు దశాబ్దాలుగా వివాదం నడుస్తోంది

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు హెచ్చరిక

తిరుమలగిరిలోని భూమిపై ఆరు దశాబ్దాలుగా వివాదం నడుస్తోందని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు వర్గాలు కూడా భూమికి హక్కుదారులమని చెబుతున్నారని, 2020లో మూడు కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇటీవల నమోదైన మూడు కేసులపై కూడా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. నిజమైన హక్కుదారులు తగిన పత్రాలు సమర్పిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, పోలీసు అధికారులపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. తప్పుడు కథనాలు ప్రచురించినా, ప్రసారం చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్థలంలోకి వచ్చి షెడ్‌ను ధ్వంసం చేసిన దృశ్యాలు ప్రదర్శిస్తున్న బాధితులు

పేదల ఇళ్ల కోసం భూమిని దానం చేశాం

- హాజీ బేగం వారసుడు మాజిద్ షరీఫ్
- మాపై తప్పుడు ఆరోపణలు సరికాదు

మౌలాలి: మాకు వారసత్వంగా వచ్చిన భూమిలో పేదల ఇళ్ల కోసం ఉచితంగా అందజేశాం. మాపై మల్కాజిగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి వారసులు తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని అత్తాపూర్‌కు చెందిన హాజీ బేగం వారసుడు మాజిద్ షరీఫ్ అన్నారు. మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాకు వారసత్వంగా వచ్చిన భూమిలో పేదలకు ఇళ్లు, స్థలాల కోసం పిల్లి నర్సింగ్‌రావునగర్ కాలనీలో 4 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చారన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ మా భూముల విషయాన్ని పెద్ద అంశంగా చూపించాలనే తలంపుతో పోలీసులు, రాజకీయ నాయకులు మా వెనుక ఉన్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. తమపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుమలనగర్‌లోని 398, 399, 409, 410 సర్వే నెంబర్‌లలోని మాకు వారసత్వంగా వచ్చిన ఆస్తిపై కన్నెసిన సూర్యనారాయణరెడ్డి, ఆయన వారసులు మాపై తప్పుడు ప్రచారాలు చేస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా గురువారం సూర్యనారాయణరెడ్డి కుమారులు రాకేశ్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తమ అనుచరులతో ప్రహరీ గోడను కూల్చారన్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారిపై మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 824/2024, యూఎస్ 329(4), 324(4), 351(2), ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలిపారు. మాపై ఆరోపణలు చేసిన వారి వద్ద ఏమున్నా కోర్టు ద్వారా తేల్చుకోవాలన్నారు.



తోటలోని షెడ్

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సొసైటీ టు సేవ్ రాక్స్ ఆధ్వర్యంలో జియో డైవర్సిటీ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సర్కిల్ జనరల్ మీటింగ్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బషీర్‌బాగ్‌లోని ఎస్‌పీఆర్ ఆడిటోరియంలో కొనసాగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మహిళా పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడమే లక్ష్యం



రాయదుర్గం: మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్ఈఆర్‌పి) సీఈఓ డి.దివ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులకు పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అధికారులతో కలిసి ఆమె శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ద్వారా వారు ఎన్నో విషయాలను నేర్చుకున్నారన్నారు. వచ్చే కొన్ని రోజుల్లో వారంతా క్యాంటీన్లు ప్రారంభించి వాటిని నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలాత్రిపాఠి, నిథమ్ ఫ్యాకల్టీ మిషెల్లీ జే ఫ్రాన్సిస్, నిథమ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకే గణేష్, సెర్ప్ డైరెక్టర్లు గోపాలరావు, పి.జాన్సన్, నాగరాజరావు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికుల ఆందోళన



డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నాంపల్లి: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, తెలంగాణ రాష్ట్ర రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏసీగార్డ్స్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లాల నుంచి వందలాది మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మంది కార్మికులు పలు రకాల పద్ధతుల్లో పనిచేస్తున్నట్లు వివరించారు. ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్నా క్రమబద్ధీకరణ జరగడం లేదని, కనీస వేతనాలు ఇవ్వడం లేదని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మున్సిపాలిటీల్లో నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. కార్మికులకు ఎలాంటి రక్షణ సదుపాయాలు కల్పించకపోవడంతో పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారికి పరిహారం చెల్లించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పారిశుద్ధ్య కార్మికులందరికి కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. కార్మికులకు పీఆర్సీలలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్‌పేని కనీస వేతనంగా చెల్లిస్తున్న ఆనవాయితీ వస్తోందన్నారు. కానీ గత ప్రభుత్వం జీవో నెం.60 ప్రకటించినప్పటికీ జీవోలో పేర్కొన్న కేటగిరీల వారీ వేతనాలను మున్సిపల్ కార్మికులకు చెల్లించలేదన్నారు. దీంతో 11వ పీఆర్సీ నిర్ణయించిన మినిమమ్ బేసిక్ రూ.19 వేలు, రూ.22వేలు, రూ.31వేలను కేటగిరీల వారి వేతనాలు కార్మికులకు చెల్లించడం లేదన్నారు. కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని నూతన పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, మున్సిపల్ సిబ్బంది అందరినీ క్రమబద్ధీకరించాలని, 8గంటల పని విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

40 శాతం వైకల్యం ఉంటే సంక్షేమ పథకాలు

- తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య



మాట్లాడుతున్న తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 40శాతం వైకల్యం ఉన్న వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సమస్యలపై రాష్ట్రంలో ప్రత్యేక అధ్యయనం చేయాలని ఆయన కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక 4వ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగుల పరికరాలకు రూ.64 కోట్లు కేటాయిస్తే మొదటి ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50కోట్లు కేటాయించిందని అన్నారు. వికలాంగులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే మోటరైజ్డ్ వాహనాలు 40శాతం వైకల్యం ఉన్నవారికి కూడా అందిస్తామన్నారు. వికలాంగుల బ్యాటరీ వీల్‌చైర్స్ కూడా 40శాతం వైకల్యం ఉంటే ఇస్తామని తెలిపారు. అందవికలాంగులకు 50శాతం, వినికిడి లోపం ఉన్న వారికి 51శాతం, ఆపైన ఉన్నవారికి ల్యాప్‌టాప్‌లు ఇస్తామని తెలిపారు. చదువుకోని వికలాంగుల జీవనోపాధిని పెంపొందించడం కోసం తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ హిందుత్వ మతోన్మాద కార్పొరేట్ విధానాలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఆర్‌డీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబు రాజన్, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల చైర్మన్ ఉమర్‌ఖాన్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్, ఎంపీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకట్, అడివయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితుల పక్షాన ఆమ్‌ఆద్మీ పార్టీ

ఆప్ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



మూసీ పరివాహక ప్రాంతంలో కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న ఆప్ నేతలు

కవాడిగూడ: మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మూసీ బాధిత ప్రజల పక్షాన ఆమ్ ఆద్మీపార్టీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో ఆప్ ప్రతినిధి బృందం శుక్రవారం మూసీ ఒడ్డున కూల్చివేసిన పేదల ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. మూసీ ఒడ్డున దశాబ్దాలుగా ఉంటున్న పేద ప్రజలు ఆక్రమణదారులు కాదని, మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు కడుతున్నారని, వారి ఇళ్లను ప్రభుత్వం ఎలా కూల్చివేస్తుందని నిలదీశారు. పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చవద్దంటూ కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ మూసీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి డీపీఆర్ ప్రదర్శించి వారి సలహాలు సూచనల మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, ఎంఏ మసీద్, సల్మాన్‌రాజు, అధికార ప్రతినిధి జావీద్, షరీఫ్, అప్సా సలాం, శివాజీ, శ్రీనివాస్, రాకేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి జన ప్రవాహం

- డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తుల వెల్లువ
- ఒక్కరోజులో 509 అర్జీలు దాఖలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి 'ప్రజావాణి' కార్యక్రమానికి జన ప్రవాహం పెరిగింది. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ప్రజావాణిలో మొత్తం 509 అర్జీలు దాఖలయ్యాయి. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు 200, రెవెన్యూ సమస్యలపై 76, విద్యుత్ శాఖకు 57 దరఖాస్తులు వచ్చాయి. ఎనర్జీ శాఖకు 57, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు 35 అర్జీలు, ప్రవాసి ప్రజావాణి కార్యక్రమానికి ఐదు దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 136 అర్జీలు అందాయి. కాగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి ఎంతో ఓపికగా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా చదివి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అవసరం మేరకు ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడి అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ కూడా అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అర్జీలు ఇచ్చేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

బల్కంపేట ఎల్లమ్మ సేవలో..

అమీర్‌పేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన పెద్దిరెడ్డి గర్భగుడిలో ఎల్లమ్మ అమ్మవారిని దర్శించున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను వారికి వివరించారు. అనంతరం అద్దాల మండపంలోని అమ్మవార్లను దర్శించుకున్నారు.



ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

పరిశోధన, పారిశ్రామిక రంగాల మధ్య దూరం తగ్గించాలి

- కేంద్ర సంయుక్త కార్యదర్శి శ్రవణ్‌కుమార్
- బేగంపేటలో ఐఈఈఈ ఇండస్ట్రీ కాన్‌క్లేవ్

లక్డీకాపూల్: పరిశోధనలను సమాజానికి ఉపయోగపడే విధంగా అందించడంలో స్టార్టప్ ఇండియా, నిధి వంటి ప్రభుత్వ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి జే.శ్రవణ్ కుమార్ అన్నారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో డాక్టర్ వీఎస్‌కే మూర్తి బలిజేపల్లి ఆధ్వర్యంలో ఐఈఈఈ ఇండస్ట్రీ రిలేషన్స్ కమిటీ నిర్వహించిన ఐఈఈఈ ఇండస్ట్రీ కాన్‌క్లేవ్ విజయవంతంగా ముగిసింది. విద్యారంగం, పరిశ్రమ, ప్రభుత్వ రంగాలకు చెందిన ప్రముఖులకు వేదికగా నిలిచిన ఈ కార్యక్రమం పరిశోధన నుంచి పారిశ్రామిక మార్గం వరకు చర్చ జరిగింది. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. పరిశోధన, పారిశ్రామిక సంబంధాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంలో ప్రభుత్వం సమర్థవంతమైన పాత్రపై చర్చించారు. ఐఈఈఈ ఇండస్ట్రీ రిలేషన్స్ చైర్ డాక్టర్ వీఎస్‌కే మూర్తి బలిజేపల్లి మాట్లాడుతూ.. పరిశోధనలను సమాజంలో ప్రాముఖ్యత పొందే విధంగా మార్చడం ఎంతో ముఖ్యమన్నారు. పరిశోధన, పారిశ్రామిక రంగాల మధ్య ఉన్న గ్యాప్ తగ్గించడానికి వారి సాంకేతిక అనుభవాలు, అమూల్య సూచనలు సమావేశానికి ప్రేరణనిచ్చాయి. హైదరాబాద్ విభాగం చైర్ వై.విజయలత, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, టీఎస్ ట్రాన్స్‌కో మాజీ డైరెక్టర్ జగత్ రెడ్డి, ఐఈఈఈ డబ్ల్యుఐఈ చైర్ సెలియా షహ్నాజ్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ గురురాజ్, ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ కుముదిని పాల్గొన్నారు.



కేంద్ర సంయుక్త కార్యదర్శి శ్రవణ్ కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మూర్తి, విజయలత

పాము అంటే ఎవరికి భయం ఉండదు చెప్పండి.. ఎక్కడైనా కనిపిస్తే చాలు భయంతో పరుగులు పెడుతుంటాం. ఇక ఇంట్లోకి వచ్చిందంటే కథ వేరేలా ఉంటుంది. భయానికి చెమటలతో సగం తడిచిపోతుంటాం. ఇంకొందరైతే తెగ హడావుడి చేసి ఎలాగైనా చంపేయాలని చూస్తుంటారు. కానీ వీరు మాత్రం పాములు కనిపిస్తే చాలు ప్రేమగా వాటిని పట్టుకుంటారు. వాటికి ఎలాంటి హానీ కలగకుండా జాగ్రత్తగా తీసుకెళ్లి దగ్గర్లోని అడవుల్లో వదిలేస్తుంటారు. ఇంతకీ వాళ్లెవరా అని ఆలోచిస్తున్నారా? వాళ్లే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్.. వీరి గురించి మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో





స్నేక్ ఫ్రెండ్స్..

పాములు పట్టి సురక్షిత ప్రాంతాలకు తరలింపు

- భద్రంగా చూసుకుంటున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్
- వర్షాకాలంలో, నాలాల పక్కన ఇళ్లల్లోకి తరచూ పాములు
- భయం లేకుండా ధైర్యంగా పాములను పడుతున్న యువకులు
- పాములపై ప్రేమతో సొసైటీలో చేరుతున్న పలువురు
- జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో తమ వంతు కృషి..



ఎవరి ఇంటికైనా పాములు వచ్చాయని ఫోన్ చేస్తే చాలు క్షణాల్లో వాలిపోయి.. పాములను చాలా జాగ్రత్తగా పట్టుకుని సురక్షిత ప్రాంతాల్లో వదిలిపెడతారు. ఏటా దాదాపు 10 వేల నుంచి 12 వేల వరకూ పాములను పట్టి.. వేరే ప్రాంతాల్లో విడిచిపెడుతున్నారు. ఇటు మనుషుల ప్రాణాలతో పాటు పాములను కూడా కాపాడుతూ రియల్ హీరోలుగా నిలుస్తున్నారు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు.



స్వచ్ఛందంగా సేవలు..

ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థను 1995లో రాజ్‌కుమార్ కానూరి స్థాపించారు. పాములు జీవవైవిధ్యానికి ఎంతో కీలకమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన చెబుతుండేవారు. ఒకరిద్దరితో ప్రారంభమైన ఈ సంస్థలో.. ఇప్పుడు ఏకంగా 150 మంది వలంటీర్లు ఉన్నారు. పాములపై ప్రేమ.. పాములను పట్టుకోవాలని ఆసక్తి ఉన్న ఉద్యోగులు, స్టూడెంట్స్ తమకు ఉన్న ఖాళీ సమయాల్లో స్నేక్ క్యాచింగ్ చేసేందుకు ముందుకు వస్తుంటారు. స్నేక్ క్యాచింగ్ అంటే ఆసక్తి ఉన్న వారు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థను సంప్రదిస్తే.. వారికి 6 నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఎక్కడైనా పాము గురించి సమాచారం అందగానే దగ్గరలో ఉన్న వలంటీరు అక్కడికి వెళ్లి వాటిని రక్షిస్తారు.

వర్షాకాలంలో ఎక్కువ..

సాధారణంగా పాములు బొరియల్లో తల దాచుకుంటాయి. వర్షాకాలంలో ఆ బొరియల్లోకి వరద నీరు చేరుతుండటంతో బయటకు వస్తాయి. అప్పుడు ఎక్కడికి వెళ్లాలో తెలియక అప్పుడప్పుడూ ఇళ్లల్లోకి వస్తుంటాయి. అంతేకాకుండా నాలాల పక్కన ఉన్న ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి కూడా పాములు చేరుతుంటాయి. అంతేకానీ మనకు ఎలాంటి హానీ తలపెట్టబోవని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. వాటికి మనం హాని చేస్తున్నామని అనిపిస్తేనే అవి కాటేస్తాయని పేర్కొంటున్నారు.



అవగాహన అవసరం..

పాములన్నీ విషపూరితం కాదు.. ఎవరికీ హాని చేయని పాములు కూడా ఉంటాయి. వాటిని చూసి అనవసరంగా భయపడి వాటిని చంపొద్దని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ వలంటీర్లు చెబుతున్నారు. పాముల గురించి ప్రజల్లో మరింత అవగాహన రావాలనే ఉద్దేశంతో ఏటా దాదాపు 200 నుంచి 300 వరకూ అవగాహనా కార్యక్రమాలు చేస్తుంటామని వివరించారు. పాము కాటు వేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పిస్తుంటామని పేర్కొంటున్నారు. దీంతో పాటు అడవుల్లో అరుదైన జాతి పాములను కాపాడేందుకు తాము కృషి చేస్తున్నామని వివరించారు. ఔషధ గుణాలున్నాయంటూ కొన్ని పాములను అనవసరంగా చంపి, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారని, ఇలాంటి వారి గురించి తమ దృష్టికి వస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి.. అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రకృతిలో అన్ని జీవులకూ సమాన హక్కులు ఉంటాయని, ఏ ప్రాణినీ చంపే అధికారం ఎవరికీ లేదని ఈ సంస్థ వాళ్లు చెబుతున్నారు. కాకపోతే పట్టణీకరణ కారణంగా భవన నిర్మాణ కార్యకలాపాలు పెరుగుతుండటంతో పాములు, ఇతర జంతువుల ఆవాసాలైన అడవులను నరికేస్తున్నారని, ఈ నేపథ్యంలో వాటికి ఆవాసం లేకపోవడంతో ఇళ్లల్లోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇక,

జీవ వైవిధ్యానికి ముఖ్యం..

పాములు జీవవైవిధ్యానికి, మనిషి జాతి మనుగడకు చాలా కీలకమని, వాటిని కాపాడుకుంటే భవిష్యత్తు తరాలు సుస్థిరంగా ఉంటాయని చెబుతున్నారు. ఆహార భద్రతలో కూడా పాములు కీలక పాత్ర పోషిస్తాయని సంస్థ ప్రతినిధులు అంటున్నారు. అందుకే పాములపై తాము పరిశోధనలు చేస్తున్నామని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ నిర్వాహకులు చెబుతున్నారు. ఇందుకోసం సంస్థలో పరిశోధనా విభాగం ఉందని, వాళ్లు ఎప్పటికప్పుడు కొత్త రకం పాముల గురించి పరిశోధనలు చేస్తుంటామని వివరించారు. ఈ విషయంలో అటవీ శాఖ, జూపార్కు అధికారులు తమకు ఎంతో మద్దతు ఇస్తుంటారని చెబుతున్నారు.

ఆ తృప్తి వేరు..

పాములు పట్టాలంటూ రోజూ చాలా మంది ఫోన్ చేస్తుంటారు. రెస్క్యూ చేసిన పాముల్లో దాదాపు 50 శాతం విషపూరితమే. కొన్నిసార్లు వాటిని పట్టే సమయంలో వలంటీర్లు కూడా ఇబ్బందులు పడుతుంటారు. ఎంతగా శిక్షణ తీసుకున్నా.. ఫీల్డ్‌లోకి వచ్చేసరికి కొన్ని సవాళ్లు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ.. సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు వెళ్తుంటాం. పాములను జాగ్రత్తగా పట్టుకున్న తర్వాత.. ఇంటి యజమానుల కళ్లల్లో కృతజ్ఞతాభావం మాకు ఎంతో సంతృప్తినిస్తుంది. మేం చేస్తున్న పనిలో ఆ క్షణం తృప్తినిచ్చే క్షణం.



- అవినాష్ విశ్వనాథం,
జనరల్ సెక్రటరీ,
ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ



బన్ తిని.. చాయ్ తాగి!

నీలోఫర్ కేఫ్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా హిమాయత్ నగర్‌లోని నీలోఫర్ కేఫ్‌లో ప్రత్యక్షమయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ బీజేపీ ఆధ్వర్యంలో మూసీ బాధితుల పక్షాన ఇందిరా పార్క్ వద్ద ధర్నా అనంతరం ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు లంకల దీపక్ రెడ్డి, డాక్టర్ పుల్లారావు యాదవ్‌తో కలిసి నీలోఫర్ కేఫ్‌కు వచ్చారు. సాదాసీదాగా కేఫ్‌లోకి వెళ్లి కూర్చుని 'మస్కాబన్' తిన్నారు. ఛాయ్ తాగారు. బండి సంజయ్ వచ్చారని తెలుసుకున్న నీలోఫర్ కేఫ్ యజమాని బాబూరావు అక్కడికి వచ్చి పరిచయం చేసుకున్నారు. తాము ఈ మధ్య చిట్టిముత్యాలతో తయారు చేసిన సాంబార్ రైస్‌ను బాబూరావు అభ్యర్థన మేరకు సంజయ్ రుచిచూసి బాగుందని పేర్కొన్నారు. కేఫ్‌కు నీలోఫర్ పెట్టడానికి కారణమేంటని ప్రశ్నించడంతో.. 'తాను చాలా పేదరికం నుండి వచ్చానని, 1976లో నీలోఫర్ ఆస్పత్రి వద్ద రూ.2 రూపాయలకు చిన్న ఉద్యోగం చేసి.. అక్కడే టీ, బిస్కట్లు అమ్మానని, వాటికి గిరాకీ ఉండటంతో కేఫ్ స్థాపించానని తెలిపారు. అందుకే నీలోఫర్‌కు వచ్చే రోగులకు తనవంతు సహకారం అందిస్తున్నాని తెలపడంతో బండి సంజయ్ బాబూరావును ప్రత్యేకంగా అభినందించారు.



బి న్యూలో దీపావళి ఆఫర్స్

లక్డీకాపూల్: బి న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వినియోగదారులకు దీపావళి ఆఫర్స్‌ను ప్రకటించింది. మొబైల్స్‌తో పాటు గృహోపకరణాలపై కూడా అద్భుతమైన ఆఫర్లను తమ వినియోగదార్ల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నట్టు బి న్యూ సీఈఓ వై సాయి నిఖిలేష్ తెలిపారు. ఎలాంటి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా ఆధార్ కార్డు, పాన్ కార్డుపై బజాజ్ ఫెస్ట్ ద్వారా మొబైల్, టీవీ, లాప్‌టాప్‌లను జీరో డౌన్ పేమెంట్, జీరో వడ్డీపై అందిస్తున్నామన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై సాయి నితీష్‌తో కలిసి నిఖిలేష్ శుక్రవారం మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో 150కి పైగా షోరూమ్‌లలో ఈ ఆఫర్లను అందిస్తున్నామని, మొబైల్స్ కొనుగోళ్లపై బహుమతులతో పాటు లక్కీ డ్రాలో కారు, బైక్‌లే కాకుండా రూ.10 లక్షల నగదును గెలుచుకునే అవకాశం ఉందని నితీష్ తెలిపారు.

ఆరోగ్యార్థులకు శామ్‌సంగ్ కొత్త ఫీచర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించడంలో తోడ్పాటును అందించేందుకు శామ్‌సంగ్ హెల్త్ యాప్ -2 మెడికేషన్ ట్రాకింగ్ ఫీచర్-1ని జోడించినట్లు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ బ్రాండ్ సామ్‌సంగ్ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ ఫీచర్ వినియోగదారులకు, వారికి సిఫారసు చేయబడిన లేదా ఓవర్ ది కౌంటర్ మందుల విధానాన్ని ట్రాక్ చేయడానికి వీలు కల్పించడమే కాకుండా ముఖ్యమైన వైద్య సమాచారం, చిట్కాలను అందిస్తుందని, రక్తపోటు, మధుమేహం, పీసీఓఎస్, పీసీఓడీ వంటి సమస్యలకు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి చికిత్సకు ఈ ఫీచర్ సహాయపడుతుందని వివరించారు.

ఐఓఐ-2024లో సుశిల్ సత్తా..

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి అంతర్జాతీయ రజత పతకం

- సుశిల్‌రాజ్ ఉమాసుధన్‌కు ఐఓఐ-2024లో రజతపతకం
- ఇప్పటి వరకూ మూడు పతకాలు సొంతం
- ఆసియాలో బంగారు పతకం, అంతర్జాతీయ స్థాయిలో రజతం, కాంస్యం

రాయదుర్గం: ఇటీవల అలెగ్జాండ్రియాలో జరిగిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ఇన్ ఇన్ఫర్మేటిక్స్ (ఐఓఐ-2024)లో హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థి సుశిల్ రాజ్ ఉమాసుధన్ రజతపతకాన్ని గెలుచుకున్నాడు. ఈ పతకాన్ని సాధించి హైదరాబాద్ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపాడు. ఇప్పటి వరకూ మూడు పతకాలు సాధించడం విశేషం. ప్రస్తుతం భారత్‌లో రెండో స్థానంలో, ప్రపంచంలోని అగ్రపోటీదారుల్లో టాప్ 15వ స్థానంలో ఉండడం మరో విశేషం. తాజాగా ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో నిర్వహించిన ఐఓఐ-2024లో రజత పతకం సాధించగా, 2023లో హంగేరీలో ఐఓఐ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ఇదే ఏడాది చైనాలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ ఇన్ఫర్మేటిక్స్ ఒలంపియాడ్ (ఏపీఐఓ-2024) ఆన్‌లైన్ పోటీలో ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి 35 దేశాల నుంచి విద్యార్థులు పోటీపడగా అందులో సత్తా చాటి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.



చిన్నతనం నుంచే...

సుశిల్‌రాజా ఉమాసుధన్‌కు ప్రోగ్రామింగ్ అంటే పిచ్చి. తన 10వ తరగతిలోనే ఒలంపియాడ్‌కు సిద్ధమయ్యాడు. లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. ప్రతిరోజూ 10 గంటలకు పైగా ప్రోగ్రామింగ్ చేస్తూ.. అల్గారిదమ్‌వైపు మొగ్గు చూపాడు. 96 దేశాల నుంచి 350 మందిలో రజతపతకం సాధించి వరల్డ్ టాప్-15లో నిలవడం విశేషం.



అమ్మా నాన్నలే స్ఫూర్తి...

ఆరేళ్ల వయసులో గ్రేడ్-1 చదివే సమయంలోనే కోడింగ్ ప్రారంభించాను. నాన్న చెన్నైలోని ఐబీఎంలో ఫ్రీలాన్స్ కన్సల్టెంట్. అమ్మ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కోడింగ్ నేర్చుకోడానికి నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఒకానొక సమయంలో జేఈఈకి వెళ్లాలా.. లేదా ఒలంపియాడ్‌కు వెళ్లాలా అనే సందిగ్ధంలో పడిపోయాను. అప్పుడు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చి నచ్చిన దారిలో వెళ్లమని ప్రోత్సహించారు.

- సుశిల్‌రాజ్ ఉమాసుధన్,
ట్రిపుల్‌ఐటీ విద్యార్థి



జియో డైవర్సిటీ చిత్ర ప్రదర్శన

34 చిత్రాలతో ఈనెల 27 వరకూ కొనసాగింపు

మాదాపూర్: చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సొసైటీ టు సేవ్ రాక్స్ ఆధ్వర్యంలో జియో డైవర్సిటీ పేరుతో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్రాలను వేసిన కళాకారులను అభినందించారు. సొసైటీ టు సేవ్ రాక్స్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఫాతీమా అలీఖాన్ మాట్లాడుతూ అంతరించిపోతున్న రాళ్లను కాపాడుకావాలని సూచించారు. కేవలం చిత్రాలకే అంకితం కాకుండా పెద్ద పెద్ద రాళ్లను సైతం పిండిచేసి కట్టడాలను నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రదర్శనలో 34 పేయింటిగ్స్ అందుబాటులో ఉన్నాయని, ఈనెల 27 వరకూ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సొసైటీ టు సేవ్ రాక్స్ వైస్ ప్రెసిడెంట్ సంగీతవర్మ, హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్ డైరెక్టర్ అనంత్ మారిగంటి, జీఎస్ఐ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ రిటైర్డ్ డైరెక్టర్ రవికుమార్ ఉండవల్లి పాల్గొన్నారు.

రేపు మూన్‌షైన్‌లో షల్మాలి ఖోల్గాడే ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్‌లోని మూన్ షైన్ వేదికగా దిస్ ఈస్ మీ ఇండియా టూర్-2024 పేరుతో ప్రముఖ గాయని షల్మాలి ఖోల్గాడే అక్టోబర్ 27న రాత్రి 9 గంటలకు ప్రదర్శన ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనేక సంవత్సరాలు హిందీ చిత్ర పరిశ్రమలో పాటలు పాడిన అనంతరం షల్మాలి స్వతంత్రంగా 2019లో తన సొంత ఆల్బమ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సునిధి చౌహాన్, నిఖిల్ డిసౌజా, విశాల్ దద్లానీ, రాజన్ బాత్రా, హనుమాన్‌కైండ్ వంటి పరిశ్రమ దిగ్గజాల సహకారంతో ఇంగ్లిష్, హిందీలో సొంత ఆల్బమ్స్ విడుదల చేశారు.



రేపు వింటేజ్ వాహనాల ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన వాహన ప్రియుల బృందం.. కార్స్ ఎన్ కాఫీ ఆధ్వర్యంలో వింటేజ్ కార్స్, బైక్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఈ పాతకాలపు కార్లు, బైక్‌ల ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఈ ఈవెంట్ 1930 నాటి 125 పాతకాలపు క్లాసిక్ వాహనాలను ప్రదర్శిస్తుందని నిర్వాహక సంస్థ ప్రతినిధి దీపక్ తెలిపారు. ఈ ఈవెంట్‌లో భాగంగా కమ్యూనిటీ మీట్‌అప్ కూడా ఉంటుందని, ఔత్సాహికులకు ఆటోమొబైల్స్ పట్ల వారి అవగాహన, ఆలోచనలను పరస్పరం పంచుకోడానికి ఇది అవకాశం కల్పిస్తుందని వివరించారు.



హల్లోవీన్ పెయింట్స్ పార్టీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం నగరవ్యాప్తంగా నెలకొన్న హల్లోవీన్ ఫీవర్‌ను పురస్కరించుకుని హల్లోవీన్ పెయింట్స్ పార్టీ పేరుతో పెయింటింగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ సోషల్ ఆవరణలోని ఎస్‌సీసీ స్కై సినిమా వేదికగా ఆదివారం జరిగే ఈ ఈవెంట్‌లో ఎవరైనా పాల్గొనవచ్చని, చిత్రకళలో ఏ మాత్రం ప్రవేశం ఉన్నవారైనా అర్హులేనని నిర్వాహకులు తెలిపారు. ఈ హల్లోవీన్ పెయింట్స్ పార్టీ మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రారంభం అవుతుంది.

పదేళ్లలో అక్రమార్జన రూ.1,000 కోట్లు!



రాష్ట్రంలో అవినీతి అధికారుల భరతం పడుతున్న ఏసీబీ

2014 నుంచి ఈ ఏడాది ఆగస్టు మధ్య 1,032 కేసులు నమోదు

అధికారిక లెక్కల ప్రకారమే అక్రమాస్తుల విలువ రూ. 265 కోట్లు

బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ నాలుగు రెట్లపైనే..

(శ్రీరంగం కామేశ్, 'సాక్షి' ప్రతినిధి)

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు / అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఎప్పటికప్పుడు కొరడా ఝుళిపిస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన (డీఏ) వారితోపాటు లంచాలు తీసుకుంటూ చిక్కిన (ట్రాప్) వారి భరతం పడుతోంది. గత పదేళ్లలో ఏసీబీ నమోదు చేసిన కేసుల సంఖ్య వెయ్యి మార్కు దాటడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. 2014 నుంచి 2024 ఆగస్టు మధ్య డీఏ, ట్రాప్ కేసులు కలిపి మొత్తం 1,032 కేసులను ఏసీబీ నమోదు చేసింది. వాటిలో 109 డీఏ కేసులుకాగా మిగిలినవన్నీ ట్రాప్ కేసులే కావడం గమనార్హం. డీఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆస్తుల అధికారిక విలువను రూ. 265 కోట్లుగా ఏసీబీ లెక్కించగా బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ. 1,000 కోట్లపైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

ప్రథమ స్థానంలో దేవికారాణి..



ఏసీబీ నమోదు చేసిన 109 డీఏ కేసుల్లో అత్యధికంగా 29 కేసులతో తొలి స్థానంలో నిలిచి రెవెన్యూ విభాగం అపఖ్యాతిని మూటకట్టుకోగా 20 కేసులతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, 11 కేసులతో హోంశాఖ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈఎస్ఐ మందుల సరఫరా కుంభకోణంలో ఏసీబీ 2019లో అరెస్టు చేసిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మాజీ డైరెక్టర్ దేవికారాణి అక్రమాస్తులే ఇప్పటికీ ప్రథమ స్థానంలో ఉన్నాయి. ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ అధికారిక లెక్కల ప్రకారమే రూ. 25,70,84,461గా తేలింది. అలాగే రంగారెడ్డి జిల్లా మాజీ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డిపై నమోదైన ట్రాప్ కమ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 32 ఇళ్ల స్థలాలకు సంబంధించిన దస్తావేజుల అధికారిక విలువ రూ. 4.19 కోట్లుగా తేలింది. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ. 20 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

లంచాల బాధితుల కోసం ఏటా రూ. 30 లక్షలు


ఏసీబీ పేరు చెప్పగానే గుర్తుకువచ్చే అంశం అవినీతిపరుల్ని వలపన్ని పట్టుకోవడం. బాధితులు ఓ అధికారి లంచం డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే ఏసీబీ ఆధారాలు సేకరిస్తుంది. ఆపై రహస్య కెమెరాలు, వీడియో రికార్డింగ్ పరికరాలను బాధితుడికి అమర్చి లంచం అడిగిన అధికారి వద్దకు పంపుతుంది. లంచం డిమాండ్ వీడియో రికార్డయ్యాక ఆ మొత్తంలో కొంత ఇన్‌స్టాల్‌మెంట్‌గా ఇచ్చేలా ఫిర్యాదుదారుడితో చెప్పిస్తుంది. ఆ మొత్తాన్ని ఫిర్యాదుదారుడే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. బాధితుల నుంచి అధికారి ఆ లంచం సొమ్ము అందుకుంటుండగా అప్పటికే మాటు వేసి ఉండే ఏసీబీ బృందాలు పట్టుకుంటాయి. ఈ మొత్తాన్ని సీజ్ చేసి కోర్టుకు సమర్పిస్తారు. నిర్ణీత సమయంలో ఆ మొత్తాన్ని ఫిర్యాదుదారుడికి రీయింబర్స్ చేస్తారు. దీని కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.30 లక్షల చొప్పున ఏసీబీకి కేటాయిస్తుంది.

'పింక్'తో రెడ్ హ్యాండెడ్‌గా..

లంచం అడిగిన అధికారికి ఇచ్చేందుకు ఫిర్యాదుదారుడు తీసుకొచ్చే కరెన్సీ నోట్లపై ఏసీబీ ముందే ఫినాఫ్తలీన్ అనే రసాయన పొడిని పూస్తుంది. లంచం తీసుకొనే అధికారి లేదా ఆయన సూచించిన వ్యక్తి నోట్ల కట్టలను ముట్టుకోగానే ఈ కెమికల్ అంటుకుంటుంది. వెంటనే ఏసీబీ ఆ సొమ్మును స్వాధీనం చేసుకోవడంతోపాటు సదరు అధికారి చేతుల్ని సోడియం బైకార్బొనేట్ ద్రావణంలో ముంచుతుంది. అప్పుడు ఆ ద్రావణం గులాబీ రంగులోకి మారుతుంది. ఈ ప్రక్రియను సాక్షుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేసి కోర్టుకు ఏసీబీ సమర్పిస్తుంది.


శిక్షల వరకు 'ప్రయాణం'లో అవాంతరాలెన్నో..

ఏసీబీ నమోదు చేసే కేసులు శిక్షల వరకు వెళ్లడం మధ్య ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులపై ఈ కేసుల దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి. ఈ దశలోనే అనేక కేసులు మూతపడటం, డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీకి సిఫార్సు కావడం జరుగుతోంది. ఒకవేళ చార్జిషీట్లు దాఖలు చేసినా న్యాయ విభాగంలో ఉన్న మానవవనరుల కొరతతో విచారణకు సుదీర్ఘ సమయం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కేవలం ఐదు ఏసీబీ కోర్టులే ఉండటంతోపాటు కొన్ని సందర్భాల్లో సాక్షులు ఎదురుతిరగడం, సుదీర్ఘ విచారణ తదితరాల నేపథ్యంలో ప్రస్తుతం ఏసీబీ కేసుల్లో శిక్షల శాతం 55గా ఉంది. దీన్ని ఈ ఏడాది 60 శాతం దాటించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



మొత్తం ఐదు రకాలైన కేసులు...

వాస్తవానికి ఏసీబీ ఐదు రకాల కేసులకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ట్రాప్, డీఏ కేసులను నేరుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. వాటిని రిజిస్టర్డ్ కేస్ ట్రాప్ (ఆర్సీటీ), రిజిస్టర్డ్ కేస్ అసెట్స్ (ఆర్సీఏ) అంటారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీల ద్వారా అధికారుల నేరపూరిత దుష్ప్రవర్తనను గుర్తించి ప్రాథమిక దర్యాప్తు చేపడుతుంది. అనంతరం ఆయా అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రభుత్వ విభాగాలకు సిఫార్సు చేస్తుంది. మరోవైపు ఆర్టీఏ చెక్‌పోస్టులు, కార్యాలయాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీల ద్వారా గుర్తించే అవినీతిపై రిజిస్టర్డ్ కేస్ అదర్స్ (ఆర్సీఓ) నమోదు చేసి శాఖాపరమైన చర్యలకు బదిలీ చేస్తుంటుంది. ఇక ఏసీబీ డీజీ సూచనల మేరకు కొన్ని అంశాలపై డిస్క్రీట్ ఎంక్వైరీలు చేపడుతుంది. ఇందులో ఆధారాలు లభిస్తే ఆర్సీటీ, ఆర్సీఏ కింద మార్చి ముందుకు వెళ్తుంటుంది.





ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం

ప్రభుత్వ ఉద్యోగులు లేదా అధికారులు లంచం డిమాండ్ చేస్తే మాకు ఫిర్యాదు చేయండి. 1064 నంబర్‌కు కాల్ చేసి లేదా నేరుగా మా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయొచ్చు. ప్రతి ఫిర్యాదును అన్ని కోణాల్లోనూ విచారించి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతాం.

- విజయ్‌కుమార్, డీజీ, అవినీతి నిరోధక శాఖ

మీ వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరం

కేటీఆర్‌పై మంత్రి సురేఖ వ్యాఖ్యలను తప్పుబట్టిన సిటీ సివిల్ కోర్టు

ఆయనపై ఇంకెప్పుడూ అడ్డగోలు వ్యాఖ్యలు చేయరాదని ఆదేశం

సిటీ కోర్టులు: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావుపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించింది. ఓ బాధ్యతగల మహిళా మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యానించింది. కేటీఆర్‌పై భవిష్యత్తులో అలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేయరాదంటూ కొండా సురేఖకు స్పష్టం చేసింది. అలాగే మంత్రి వ్యాఖ్యల తాలూకు వీడియోలు, కథనాలను పబ్లిక్ డొమైన్ నుంచి తొలగించాలని ప్రధాన మీడియా చానళ్లతోపాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, ఇతర వెబ్‌సైట్లను ప్రత్యేకించి గూగుల్, యూట్యూబ్, ఫేస్‌బుక్‌లకు తేల్చిచెప్పింది. ఈ మేరకు కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన రూ. 100 కోట్ల పరువునష్టం కేసు విచారణలో భాగంగా సిటీ సివిల్ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 21కి వాయిదా వేసింది. ఆ రోజు కొండా సురేఖ విచారణకు హాజరుకావాలని స్పష్టం చేస్తూ ఆమెకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు కోర్టు ఉత్తర్వులను మంత్రి కొండా సురేఖ పాటించాల్సిందేనని బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు లలితారెడ్డి, వేణుగోపాల్‌రావు, జక్కుల లక్ష్మణ్, ప్రవీణ్, కావ్యశ్రీ, భాస్కర్, కార్తీక్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో పేర్కొన్నారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న లలితారెడ్డి తదితరులు

'గుస్సాడీ' రాజు కన్నుమూత

అనారోగ్యంతో పద్మశ్రీ గ్రహీత మృతి



కెరమెరి/జైనూర్/సాక్షి, హైదరాబాద్: గుస్సాడీ నృత్యానికి వన్నె తెచ్చి.. దేశవిదేశాల్లో మన్ననలు పొందిన ఆదివాసీ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు (83) అనారోగ్యంతో మృతి చెందారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని స్వగ్రామం మార్లవాయిలో శుక్రవారం రాత్రి 8:15 గంటలకు తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన ఆస్తమాతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స అందించినా నయం కాలేదు. గుస్సాడీ నృత్య కళాభివృద్ధికి కనకరాజు సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2021 నవంబర్ 9న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది. శనివారం మార్లవాయిలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుస్సాడీ నృత్య కళాకారుడు, పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సంతాపం తెలిపారు. కళాకారుడు కనకరాజు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

వచ్చే నెలాఖరులోగా క్రీడా విధానం

మన స్పోర్ట్స్ పాలసీ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలి

- క్రీడా విశ్వవిద్యాలయ బిల్లును సత్వరమే రూపొందించండి
- రెండేళ్లలో తెలంగాణలో జాతీయ క్రీడలు నిర్వహించేలా సిద్ధమవ్వాలి
- క్రీడా విధానంపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జితేందర్‌రెడ్డి, సీఎస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర క్రీడా విధానం తుది ముసాయిదాను వచ్చే నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా విధానం దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలని.. అందుకోసం విస్తృత అధ్యయనం చేయడంతోపాటు నిపుణులు, క్రీడాకారులతో సంప్రదింపులు జరపాలన్నారు. క్రీడా విధానంపై సీఎం రేవంత్ శుక్రవారం తన నివాసంలో సమీక్షించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడావనరులను సమర్థంగా వినియోగించుకోవాలని... ఇప్పటికే అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు, క్రీడా ప్రాంగణాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చాలన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును త్వరగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ క్రీడా విధానంలో భాగమైన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైఐపీఈఎస్‌యూ), యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ (వైఐఎస్ఏ), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీజీ)కు సంబంధించి పలు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అందులో చేయాల్సిన మార్పుచేర్పులను సీఎం అధికారులకు సూచించారు.

దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా క్రీడా విధానాల అధ్యయనం

దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అక్కడి కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా గుర్తించిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ అధికారులతో పంచుకున్నారు. అలాగే మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం తాజాగా దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. దక్షిణ కొరియా క్రీడా వర్సిటీతోపాటు క్రీడా రంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలన్నారు. మరో పది రోజుల్లోనే స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వెంటనే తయారు చేయాలని.. వచ్చే రెండేళ్లలో జాతీయ క్రీడలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎ.పి. జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం కార్యదర్శి షానవాజ్ పాల్గొన్నారు.

భాష లోకల్.. ర్యాగ్‌తో గ్లోబల్

▶ మొదటి పేజీ తరువాయి

టెక్నికల్ టూల్‌ను చూడబోతున్నాం. ప్రపంచ దేశాలన్నీ పోటీపడుతున్న ఆ టూల్.. 'రిట్రైవల్–అగ్మెంటెడ్ జనరేషన్ (ర్యాగ్)'.

ఏంటీ దీని ప్రత్యేకత?

మన దేశంలోని మారుమూల పల్లెలో మాట్లాడే స్థానిక భాషను అమెరికా అధ్యక్షుడు కూడా అర్థం చేసుకునేలా చేయగల సత్తా ర్యాగ్ టూల్స్‌కు ఉంటుంది. కొన్ని వేల భాషలను, కోట్ల కొద్దీ పదాలను అత్యంత వేగంగా విశ్లేషించగలవు. కృత్రిమ మేధలోని డీప్ లెర్నింగ్ సాంకేతికతను ఎన్నో రెట్లు అభివృద్ధి చేసి ఈ టూల్స్‌ను రూపొందించినట్టు నిపుణులు చెప్తున్నారు. ఉదాహరణకు కొన్ని పోలికలతో వధువు కావాలని జీపీటీలో సెర్చ్ చేస్తే.. ప్రపంచవ్యాప్తంగా సరిపోయే వ్యక్తులు, వారి అలవాట్లు, వారి హావభావాలతో చిత్రాలను అందిస్తుంది. సీ, సీ ప్లస్ ప్లస్, డెవాప్స్ వంటి అనేక కంప్యూటర్ కోడింగ్ భాషలున్నాయి. ర్యాగ్ టూల్స్ క్షణాల్లోనే ఆ భాషల్లో కోడింగ్స్ రాయగలవు. కాల్ సెంటర్లలో కొన్ని వేల మంది చేసే పనిని ఒక్క ర్యాగ్ టూల్‌తో సాధించవచ్చు. కంపెనీల ఆడిట్ రిపోర్టులు, అంతర్గత వ్యవహారాలు, అంతర్జాతీయ వ్యాపార లింకులు వంటి పనులెన్నో ర్యాగ్‌తో ఇట్టే ముగించే వీలుంది.

ఉపాధికి దెబ్బపడుతుందా?

సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి 'ర్యాగ్' టూల్స్‌తో చాలెంజ్ అనే చెప్పాలని నిపుణులు అంటున్నారు. కాల్ సెంటర్ ఉద్యోగాల నుంచి కోడింగ్ చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల దాకా ఉపాధి తగ్గుతుందని.. కార్యాలయాల్లో పనిచేసే పద్ధతులు మారిపోతాయని చెప్తున్నారు. ఎక్కడో ఉండి మరెక్కడో కంపెనీని నడిపే సాంకేతికత అందుబాటులోకి వస్తుందని వివరిస్తున్నారు.

పోటీ పడితేనే అవకాశాలు..

మన దేశంలో ఏటా 24 లక్షల మంది టెక్ గ్రాడ్యుయేట్లు మార్కెట్లోకి వస్తున్నారు. వారిలో కేవలం 8 శాతం మందికే తగిన స్కిల్స్ ఉంటున్నాయని పరిశ్రమవర్గాలు చెప్తున్నాయి. ఇక ముందు ర్యాగ్‌తో పోటీ పడి, అంతకన్నా మెరుగైన ఆలోచనతో పనిచేసే వారికే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని స్పష్టం చేస్తున్నాయి. ఏఐతో పోటీపడే తెలివితేటలు ఉంటే తప్ప, కొత్తగా, భిన్నంగా ఆవిష్కరించే సత్తా ఉంటే తప్ప నిలదొక్కుకోవడం కష్టమేనని పేర్కొంటున్నాయి.

ఏఐతో పోటీ పడితేనే రాణించగలం



చాట్ జీపీటీ సహా ఏఐ ప్రయోగాలు ముందుకెళ్తున్న నేపథ్యంలో 'ర్యాగ్' సాంకేతికత మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది. డీప్ లెర్నింగ్‌లో భాగంగా దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అయితే ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను మరింత లోతుగా అధ్యయనం చేయాలి. ఇక మీదట ఏఐతో పోటీపడి, క్రియేటివిటీని రుజువు చేసుకుంటేనే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

- డాక్టర్ కేపీ సుప్రీతి
కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, జేఎన్టీయూహెచ్

జలాశయాల్లో 'సికెంట్' వినియోగించరు!

వాటి డిజైన్ల తయారీకి మార్గదర్శకాలు లేవు

- మేడిగడ్డ బరాజ్‌లో వాటిని ఎందుకు వాడారు?
- సరైన షూటింగ్ వెలాసిటీ, టెయిల్‌పాండ్ లెవల్‌ను అంచనా వేయలేదా?
- సీడీఓ మాజీ ఎస్ఈని ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- ఆ నిర్ణయం ఫీల్డ్ ఇంజనీర్లు, ఎల్అండ్‌టీదే అని ఎస్ఈ వివరణ



జస్టిస్ పినాకి చంద్రఘోష్

సాక్షి, హైదరాబాద్: 'జలాశయాల నిర్మాణంలో సికెంట్ పైల్స్ వినియోగించరు. సికెంట్ పైల్స్ డిజైన్ల తయారీకి ప్రత్యేక నిబంధనలూ లేవు. మేడిగడ్డ బరాజ్‌కి సికెంట్ పైల్స్ ఎందుకు వాడారు?' అని కాళేశ్వరం బరాజ్‌లపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నించింది. నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) మాజీ ఎస్ఈ కె.ఎస్.ఎస్.చంద్రశేఖర్‌కు శుక్రవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో బరాజ్‌ల డిజైన్లపై కమిషన్ కీలక ప్రశ్నలను సంధించింది. దేశంలో జలాశయాల నిర్మాణాల్లో సికెంట్ పైల్స్ వినియోగంపై అప్పట్లో తమ వద్ద సమాచారం లేదని చంద్రశేఖర్ బదులిచ్చారు. ఇన్‌ఫ్రా, సముద్రపు తీర ప్రాజెక్టుల్లో వీటిని వినియోగిస్తున్నారన్నారు. వీటి డిజైన్లకు మార్గదర్శకాలు లేకపోవడంతో బ్రిటిష్ కోడ్‌ను అనుసరించామన్నారు.

సికెంట్ పైల్స్‌పై నిర్ణయం ఫీల్డ్ ఇంజనీర్లు, ఎల్అండ్‌టీదే..

మేడిగడ్డ బరాజ్ పునాది (ర్యాఫ్ట్)ల కింద షీట్‌పైల్స్‌కి బదులు సికెంట్ పైల్స్‌తో కటాఫ్ వాల్ నిర్మించాలని ప్రాజెక్టు క్షేత్ర స్థాయి ఇంజనీర్లతో పాటు నిర్మాణ సంస్థ 'ఎల్అండ్‌టీ' నిర్ణయం తీసుకుందని చంద్రశేఖర్ తెలిపారు. ప్రాథమిక దశలో నాలుగు బోర్ రంధ్రాలు వేసి నిర్వహించిన మట్టి నమూనా పరీక్షల ఆధారంగా షీట్‌పైల్స్‌ను డిజైన్లలో ప్రతిపాదించామన్నారు. తర్వాత దశలో మరిన్ని బోర్ రంధ్రాలు వేసి పరీక్షలు నిర్వహించగా భూగర్భంలో కంకర మట్టి, ఇసుక రాళ్లు ఉన్నట్టు తేలడంతో షీట్‌పైల్స్‌ను వాడడం సాధ్యం కాదని క్షేత్ర స్థాయి ఇంజనీర్లు నివేదించారన్నారు. తాము ప్రత్యామ్నాయంగా డయాఫ్రమ్ వాల్‌కి డిజైన్లు ఇవ్వగా, క్షేత్ర స్థాయి ఇంజనీర్లు, ఎల్అండ్‌టీ ప్రతినిధులు సికెంట్ పైల్స్ వేసేందుకు డిజైన్లు కోరారన్నారు.

సరైన షూటింగ్ వెలాసిటీని పరిగణనలోకి తీసుకున్నారా

సీడీఓ విభాగం సరైన డిజైన్లు ఇవ్వకపోవడంతోనే మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్ కుంగిందనే ఆరోపణల్లో వాస్తవం లేదని చంద్రశేఖర్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. డిజైన్ల రూపకల్పన సందర్భంగా.. మేడిగడ్డ బరాజ్ నుంచి విడుదలయ్యే వరద వేగాన్ని (షూటింగ్ వెలాసిటీని) సరైన రీతిలో పరిగణనలోకి తీసుకోలేదని, విడుదలైన వరద నేలను తాకే చోట మట్టికోతకు గురికాకుండా దిగువన సరిపడా నీటి నిల్వలతో టైల్‌పాండ్ ఉండాలనే ఆలోచన చేయలేదని కమిషన్ తప్పుబట్టగా, అందులో వాస్తవం లేదన్నారు. డిజైన్ల రూపకల్పన సందర్భంగా సరైన షూటింగ్ వెలాసిటీ, టైల్‌పాండ్ లెవల్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంతో నేలకోతకు గురై మేడిగడ్డ బరాజ్ కుంగిందని ఓ మోడల్ స్టడీలో తేలడంతో కమిషన్ ఈ కీలక ప్రశ్నను లేవనెత్తింది. అధిక షూటింగ్ వెలాసిటీ ఉండనుందని క్షేత్ర స్థాయి ఇంజనీర్ల నుంచి తమకు లెక్కలు అందలేదన్నారు. వ్యాప్కోస్ నివేదికలోని లెక్కల ఆధారంగా సరైన టైల్‌పాండ్ లెవల్‌తోనే డిజైన్లను తయారు చేశామన్నారు.

డీపీఆర్‌లో నీటి నిల్వ సామర్థ్యం లేదు..

మేడిగడ్డ బరాజ్ డీపీఆర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని సూచించలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చంద్రశేఖర్ తెలిపారు. వ్యాప్కోస్ ఇచ్చిన హైడ్రాలజికల్ డేటాను హైపవర్ కమిటీ ఆమోదించిందని, దాని ఆధారంగానే డిజైన్లను తయారు చేశామని వివరించారు. సీఈ సీడీఓ ఇచ్చిన డిజైన్లకు నిర్మాణ దశలో చేసిన మార్పులు గుర్తు లేదన్నారు. క్షేత్ర స్థాయి ఇంజనీర్ల సూచనతో బరాజ్‌ల ర్యాఫ్ట్ డిజైన్లలో మార్పులు చేసిచ్చామన్నారు. నీటి నిల్వ సామర్థ్యంపై క్షేత్ర స్థాయి ఇంజనీర్లు ఏమైనా సూచనలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, గుర్తు లేదన్నారు. 2డీ, 3డీ మోడల్ స్టడీస్ తర్వాత డిజైన్లలో మార్పులు చేయాల్సిన అవసరం రాలేదన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మలేసియా వ్యవసాయ మంత్రికి తుమ్మల విజ్ఞప్తి



మలేసియా వ్యవసాయ మంత్రితో సమావేశమైన తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ అధికారుల బృందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని, అగ్రి ప్రాసెసింగ్ యూనిట్స్ నెలకొల్పాలని మలేసియా వ్యవసాయ శాఖ మంత్రి మహ్మద్ బిన్ సాబును రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. మూడో రోజు శుక్రవారం మంత్రి తుమ్మల మలేసియాలో పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహ్మద్ బిన్ సాబుతో తుమ్మల సమావేశమయ్యారు. తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడానికి తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందని ఆయన వివరించారు. మంత్రి తుమ్మల వినతిపై మలేసియా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఫెల్డా చైర్మన్ అహ్మద్ షబేరీ చీక్‌తో కూడా తుమ్మల సమావేశమై ఆయిల్ పామ్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు. మలేసియాలో భారత హైకమిషనర్ బీఎన్ రెడ్డితో ఆయన సమావేశమయ్యారు. తెనాషియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించి, యాంత్రీకరణకు సంబంధించి యంత్రాలు, పనిముట్లు, వాటి పనివిధానాన్ని మంత్రి తుమ్మల అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రిపోర్టు అన్నారు.. రిక్తహస్తం చూపారు!

▶ మొదటి పేజీ తరువాయి

వేచి ఉండాలని సూచించిన ఆయన.. 317 జీవో ద్వారా జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఈ దిశగా వేసిన మంత్రివర్గ ఉపసంఘం నివేదికను సీఎస్ సమక్షంలో పరిశీలించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం సీఎస్‌ను కలిశారు. అయితే మంత్రివర్గ ఉపసంఘం 317 సమస్యల పరిష్కారానికి సూచించిన సాధ్యాసాధ్యాలను సీఎస్ బహిర్గతపరచలేదని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. నివేదిక చూపిస్తామని పిలిచి సూచనలు ఇవ్వాలంటూ పంపేశారని పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక 317 జీవో వల్ల పలువురు ఉద్యోగులకు జరిగిన నష్టం, స్పౌజ్ కేసుల పరిష్కారం తదితర అంశాలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక గురించి పలువురు ఉద్యోగ నేతలు సీఎస్‌ను అడగ్గా ఆ ఫైల్ సర్క్యులేషన్‌లో ఉందని.. కేబినెట్ పరిశీలనకు వెళ్లే వీలుందని ఆమె సర్దిచెప్పినట్లు సమాచారం. ఇక ఆందోళన బాట పట్టాలనుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం జరిగే మంత్రివర్గ సమావేశంలో డీఏ ప్రకటిస్తారా లేదా అనే అంశాన్ని పరిశీలించాక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. సీఎస్‌తో భేటీలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఏలూరు శ్రీనివాస్‌రావు, చావా రవి తదితరులు పాల్గొన్నారు.

ఇతరుల తప్పులను పైన వేసుకోవద్దు

లేని సమస్యలను కొని తెచ్చుకోవద్దు

- రికార్డులు లేకుండా సమాచారం ఇస్తే చర్యలు
- మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుకు పీసీ ఘోష్ కమిషన్ వార్నింగ్



నల్లా వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: ఇతరుల తప్పులను భుజాలపై వేసుకోవద్దని, లేని సమస్యలను కొనితెచ్చుకోవద్దని.. కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ హెచ్చరించింది. అఫిడవిట్‌లో పొందుపర్చిన వివరాలకు భిన్నంగా కమిషన్ ముందు వాంగ్మూలం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. సరైన రికార్డులు లేకుండా కమిషన్‌కు సమాచారం ఇచ్చి తప్పించుకోవడానికి ప్రయత్నం చేయరాదని వార్నింగ్ ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై విచారణలో భాగంగా కమిషన్ శుక్రవారం రెండో రోజు నల్లా వెంకటేశ్వర్లుకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.14 వేల కోట్లను ఖర్చు చేయగా, రూ.13,250 కోట్లతో కట్టిన నిర్మాణాలను కాళేశ్వరం ప్రాజెక్టులో వినియోగించుకున్నామని, మిగిలిన రూ.750 కోట్ల పనులు వృథా అయ్యాయని ఓ ప్రశ్నకు నల్లా వెంకటేశ్వర్లు బదులిచ్చారు. 2019 జూన్ 21న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పనులన్నీ పూర్తయి వాడుకలోకి రాగా, అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదల్లో దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు.

నిధుల దారిమళ్లింపు తెలియదనుకుంటున్నారా?

మేడిగడ్డ బరాజ్ వ్యయం రూ.2,591 కోట్ల నుంచి రూ.4,613 కోట్లకు, అన్నారం బరాజ్ అంచనాలను రూ.1,785 కోట్ల నుంచి రూ.2,700 కోట్లకు, సుందిళ్ల బరాజ్ అంచనాలను రూ.1,437 కోట్ల నుంచి రూ.2,200 కోట్లకు పెంచినట్టు నల్లా వెంకటేశ్వర్లు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కొత్తగా ఫ్లడ్ బ్యాంకులు, డైవర్షన్ చానల్స్ నిర్మించాల్సి రావడంతో పాటు పన్నుల శ్లాబులు మారడంతోనే అంచనా వ్యయం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా కమిషన్ జోక్యం చేసుకుంటూ పన్నులు ఎన్ని వందల కోట్లు పెరిగాయి? నిధులు ఏ విధంగా దారిమళ్లాయో తెలియదనుకుంటున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

తొలుత బాపూఘాట్ వరకే!

- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై రాష్ట్ర సర్కారు యోచన
- భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడమే కారణం
- రోడ్లు, ఫ్లైఓవర్ కూడళ్లు, మెట్రో అవసరాల కోసం బఫర్ జోన్‌లోకి..
- బాపూఘాట్ సంగమం వద్ద రక్షణ శాఖ నుంచి భూములు తీసుకోవాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై కసరత్తు ముమ్మరం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తొలిదశలో బాపూఘాట్ ప్రాంతం వరకే పనులను పరిమితం చేయాలని భావిస్తోంది. నదీ తలంతోపాటు బఫర్ జోన్‌లోని నిర్మాణాల తొలగింపులో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నగర శివార్లలోని బాపూఘాట్ వరకు పునరుజ్జీవం, సుందరీకరణ పనులు పూర్తిచేశాక.. దానిని నమూనాగా చూపి హైదరాబాద్ నగరం నడిబొడ్డున మిగతా పనులు చేపట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

భూసేకరణ సమస్య లేకపోవడంతో..

వికారాబాద్ అడవుల్లో జన్మించే మూసీ నది.. ఈసీ, మూసా అనే రెండు పాయలుగా ప్రవహిస్తూ వచ్చి, లంగర్‌హౌజ్ ప్రాంతంలోని బాపూఘాట్ వద్ద సంగమిస్తుంది. ఇందులో ఈసీపై హిమాయత్‌సాగర్, మూసాపై ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రభుత్వం ప్రస్తుతం ఈ రిజర్వాయర్ల దిగువ నుంచి ఈసీ, మూసా నదుల సంగమం బాపూఘాట్ వరకు భూసేకరణ సమస్యలు పెద్దగా ఉండవని ప్రభుత్వం భావిస్తోంది. రెండు నది పాయల తీరప్రాంతం, బాపూఘాట్‌ను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా విభిన్న ప్రణాళికలు, నమూనాలతో సీఎం అధ్యక్షతన మూసీ పునరుజ్జీవంపై త్వరలో జరిగే భేటీకి రావాల్సిందిగా ప్రాజెక్టు కన్సల్టెంట్లను ఆదేశించింది. నిజానికి మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు స్థితిగతులపై రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ అధ్యక్షతన భేటీ జరిగింది. ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ అధికారులు, కన్సల్టెంట్ సంస్థ మెయిన్‌హార్ట్ కన్సార్షియం ప్రతినిధులు పాల్గొన్న ఈ భేటీలో మూసీ పునరుజ్జీవం, సుందరీకరణ కోసం చేపట్టాల్సిన పనులపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు.

భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా 'బఫర్'

మూసీకి ఇరువైపులా 50 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా గుర్తించాలని ఇప్పటికే నిర్ణయించినా.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బఫర్ జోన్‌ను డిజైన్ చేయాలని సర్కారు భావిస్తోంది. భవిష్యత్తులో మూసీకి ఇరువైపులా రోడ్లు, వంతెనలు, భారీ కూడళ్లు, మెట్రో రైలు మార్గం వంటివి నిర్మించేందుకు వీలుగా ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తారు. బఫర్ జోన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, రాళ్లు, వ్యర్థాలను తొలగించి సమతలం చేస్తారు. ప్రభుత్వ భూముల లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ విభిన్న డిజైన్లలో పర్యాటకులను ఆకర్షించేలా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తారు. అయితే.. బాపూఘాట్ సమీపంలో ఈసీ, మూసా నదుల సంగమం తీర ప్రాంతంలో రక్షణశాఖ భూములు ఉన్నాయి. ఆ భూముల వివరాలను రెవెన్యూ విభాగం ద్వారా సేకరించి.. మూసీ అభివృద్ధి ప్రాజెక్టుకు కేటాయించేలా కేంద్రాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బాపూఘాట్

➤ మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా బాపూ ఘాట్ ప్రాంతాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. పర్యాటకులను ఆకర్షించేలా బాపూఘాట్ వద్ద స్కైవే, బ్రిడ్జితో కూడిన బరాజ్, పాదచారుల వంతెనను నిర్మించేలా నమూనాలు, ప్రణాళికలు సిద్ధం చేసే బాధ్యతను కన్సల్టెంట్‌కు అప్పగించారు. బాపూఘాట్‌కు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రతి బింబించేలా ఈ డిజైన్లు, ప్రణాళికలు ఉంటాయి. గుజరాత్‌లోని నర్మదానది వద్ద నిర్మించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ భారీ విగ్రహం తరహాలో బాపూఘాట్ వద్ద మహాత్మాగాంధీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇక ఈసీ, మూసా సంగమ ప్రదేశాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని కన్సల్టెంట్‌ను ఆదేశించారు. సంగమ స్థలం వద్ద మహాప్రస్థానం, స్నాన ఘట్టాలతో ఘాట్ల నిర్మాణం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

ఉస్మాన్‌సాగర్‌కు గోదావరి జలాలు

➤ జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు భారీ అభివృద్ధి ప్రణాళికల నేపథ్యంలో.. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి, సేకరించాల్సిన భూమిపై రెవెన్యూ శాఖ కసరత్తు చేయాల్సి ఉంది. గోదావరి జలాలను హిమాయత్‌సాగర్ మీదుగా ఉస్మాన్‌సాగర్‌కు తరలించేందుకు కాలువ తవ్వాలా లేక టన్నెల్ నిర్మించాలా? అన్న అంశాలను తేల్చే బాధ్యతను హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డుకు అప్పగించారు. ఈ నెల 24న జరిగిన సమావేశంలో వీటిని సమీక్షించేందుకు సీఎం రేవంత్ మరో సమావేశం ఏర్పాటు చేస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

హైదరాబాద్‌ను ఫినిష్ చేసేయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు కాగానే పడగొట్టాలని అనుకున్నారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే నాకు మద్దతుగా నిలిచారు. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపించిన కేసీఆర్ పది సార్లు కూడా సెక్రటేరియట్‌కు రాలేదు. ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారు. కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకముంటే ఎందుకు బయటకు రావడం లేదు? తానో జమీందార్ అని, ప్రజలందరూ గులాములని కేసీఆర్ భావిస్తారు. అందుకే బయటికి రావడం లేదు. ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూఘాట్ ఉంది. అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా దానిని అభివృద్ధి చేస్తాం. గాంధీజీ వారసులుగా మేం ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా బాపూఘాట్ అభివృద్ధి చేయబోతున్నాం. గుజరాత్‌లో పటేల్ విగ్రహం తరహాలోనే బాపూఘాట్‌లో గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేస్తాం.

ప్రజల కోసం మోదీ ఏం చేశారు?: నెహ్రూ మొదలుకుని ఇందిర, రాజీవ్, పీవీ, మన్మోహన్ వంటి కాంగ్రెస్ ప్రధానులందరూ దేశంలో అనేక సంస్కరణలతో పాటు విప్లవాలు తీసుకువచ్చారు. కానీ దేశానికి మూడోసారి ప్రధాని అయిన మోదీ ఏం విప్లవం తెచ్చారో, దేశ ప్రజల కోసం ఏం చేశారో, ఎవరికి ప్రయోజనం చేకూర్చారో చెప్పాలి. పార్టీలను, ప్రభుత్వాలను విడగొట్టడం, పడగొట్టడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు మోదీ ఏమీ చేయలేదు. ఈ దేశంలో ఉత్తర, దక్షిణ భారతాలనే విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగేది. ఉత్తరాది రాష్ట్రాలకు కూడా నిధులు కేటాయించి అభివృద్ధి చేసేవారు. కానీ ఎన్డీఏ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గతంలో ఉత్తర భారతం నుంచి ప్రధాని ఉంటే.. దక్షిణ భారతం నుంచి రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ పాటించింది. కానీ మోదీ ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కి కేవలం ఎన్నికల్లో గెలుపు కోసమే పనిచేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పన్నులు తీసుకుంటున్నా.. కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. దక్షిణ భారత రాష్ట్రాలకు మోదీ నుంచి అందిన సహకారం చాలా తక్కువ. ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో ఒక్క రూపాయి వెళితే.. 7 రూపాయలు వెనక్కు ఇస్తున్నారు. అలాగే బిహార్‌కు 6 రూపాయలు వెనక్కి ఇస్తున్నారు. తెలంగాణ నుంచి రూపాయి వెళితే.. కేవలం 40పైసలు మాత్రమే వెనక్కి ఇస్తున్నారు. ప్రధాని మోదీ ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తి కావడంతోనే దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నారన్న విషయాన్ని ప్రజలు గమనించాలి..'' అని సీఎం రేవంత్ ఆరోపించారు.

నేడు బాలకృష్ణ సినీ స్టూడియోకు భూమి కేటాయింపు!

- ప్రతిపాదనలు సిద్ధం.. నేటి కేబినెట్‌లో ఆమోదమే తరువాయి
- టీజీపీఎస్సీలో వివిధ కేటగిరీల్లో 142 అదనపు పోస్టులు మంజూరుకు ప్రతిపాదనలు
- హనుమకొండ, వరంగల్ జెడ్పీల ఏర్పాటుకూ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్న మంత్రివర్గం

సాక్షి, హైదరాబాద్: నటుడు, ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఎమ్మెల్యే, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు బావమరిది అయిన నందమూరి బాలకృష్ణ సినీ స్టూడియోకు ప్రభుత్వ భూమి కేటాయింపునకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు.. ఆమోదం నిమిత్తం శనివారం తెలంగాణ కేబినెట్ ముందుకు రానున్నట్టు అధికారవర్గాల సమాచారం. బాలకృష్ణ సినీ స్టూడియోకు భూ కేటాయింపుపై రెవెన్యూ శాఖ నుంచి ఇప్పటికే సీఎస్‌కు ప్రతిపాదనలు వెళ్లాయని, ప్రస్తుతం సీఎస్‌వాటిని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. ఈ భేటీలోనే బాలకృష్ణ సినీ స్టూడియోకు భూ కేటాయింపుతో పాటు సమ్మక్క..సారక్క గిరిజన విశ్వవిద్యాలయానికి భూమి కేటాయింపు ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోద ముద్ర వేయనుందని తెలిసింది. మరోవైపు టీజీపీఎస్సీలో వివిధ కేటగిరీల్లో 142 అదనపు పోస్టుల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. అదేవిధంగా వరంగల్, హనుమకొండ జిల్లా పరిషత్‌ల ఏర్పాటు ప్రతిపాదనలను సైతం కేబినెట్ పరిశీలించనున్నట్టు తెలుస్తోంది.

మరికొన్ని ప్రతిపాదనలు: ఉన్నత విద్యాశాఖలో కొత్తగా కేసముద్రం మండల కేంద్రంలో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి 29 పోస్టుల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలు.. ఆమోదం నిమిత్తం మంత్రిమండలి ఎదుటకు రానున్నాయి. తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో 39 రెగ్యులర్, 17 ఔట్‌సోర్సింగ్ (మొత్తం 56) పోస్టుల కల్పన, తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ లో 33పోస్టుల కల్పనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేయనున్నట్టు సమాచారం. నాంపల్లి మండల పరిధిలోని గోషామహల్‌లో ఉన్న 31.39 ఎకరాల భూమిని (ప్రస్తుతం పోలీస్ క్వార్టర్స్, పెట్రోల్‌బంక్, స్టేడియం, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, తదితరాలున్న ప్రదేశం) ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం నిమిత్తం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు కేటాయించేందుకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా కేబినెట్ ఆమోదానికి పంపించినట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది.



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న కేటీఆర్

కేసులకు భయపడం.. ఏం చేస్తారో చేస్కోండి

▶ మొదటి పేజీ తరువాయి

శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో త్వరలో రాజకీయ బాంబులు పేలతాయనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావించగా.. పైవిధంగా స్పందించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. 'ముందు ఆయనపై జరిగిన ఈడీ దాడులు, బీజేపీ వాళ్లతో రహస్య ఒప్పందాలు, సీఎం బావమ్మర్దితో కాంట్రాక్టు ఒప్పందాలు ఇవన్నీ చూసుకోవాలి. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూ.4,500 కోట్ల వ్యవహారం చూసుకోవాలి. మాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడం. చంద్రబాబునాయుడు వంటి వాళ్లతోనే కొట్లాడినం. ఈ చిట్టినాయుడు ఎంత..'అని అన్నారు. తానింకా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదని, కాంగ్రెస్‌లో చేరలేదంటూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, మరి సీఎం రేవంత్‌రెడ్డితో ఎందుకు కండువా కప్పించుకున్నారని, బీఆర్ఎస్‌లో ఉంటూ కాంగ్రెస్‌తో కలవడమంటే రాజకీయంగా వ్యభిచారం చేసినట్టేనని అన్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వారంతా రాజకీయ వ్యభిచారులేనని వ్యాఖ్యానించారు.

పదేళ్లలో పైసా విద్యుత్ చార్జీలు పెంచలేదు

ఈఆర్సీ బహిరంగ విచారణ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో పైసా విద్యుత్ చార్జీలు కూడా పెంచకుండా నెలకు రూ.వెయ్యి కోట్లు భరిస్తూ పాలన అందించామని కేటీరామారావు తమ పాలనను గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కరెంట్ కోతలు, విద్యుత్ చార్జీల వాతలు పెడుతోందని తీవ్రంగా విమర్శించారు. పెద్ద పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను ఒకే గాటన కట్టి, కుటీర పరిశ్రమకు రాయితీలను ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీతో సమానంగా సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమల యజమానులు ఎలా విద్యుత్ చార్జీలు చెల్లిస్తారని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నామని, డిస్కంలపై రూ.18,000 కోట్ల ఆర్థిక భారాన్ని మోపే ప్రయత్నాలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సూక్ష్మ, చిన్నతరహా, కుటీర పరిశ్రమలకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి సబ్సిడీ టారిఫ్‌తో విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చేనేత రంగానికి సంబంధించి నేతన్నల సంక్షేమం కోసం 10 హెచ్‌పీల వరకు ఉన్న 50 శాతం విద్యుత్ రాయితీని 30 హెచ్‌పీల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. బహిరంగ విచారణలో ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు మహావీర్‌రాజు, కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, 'సెస్'చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

దద్దమ్మ పాలనలో దద్దరిల్లుతున్న రాష్ట్రం

దద్దమ్మ పాలనలో రాష్ట్రం ధర్నాలతో దద్దరిల్లుతోందని కేటీఆర్ విమర్శించారు. దిక్కుమాలిన పాలనలో ప్రజల జీవితాలు దిక్కూమొక్కూ లేకుండా తయారయ్యాయని శుక్రవారం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. 'అలంపూర్ నుండి మొదలు పెడితే ఆదిలాబాద్ వరకు, గ్రామ సచివాలయం నుండి మొదలు రాష్ట్ర సచివాలయం వరకు ధర్నాలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రైతులు మొదలుకుని రైస్ మిల్లర్ల వరకు, కార్మికులు మొదలు కాంట్రాక్టర్ల వరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. టీచర్ల నుంచి పోలీస్ కుటుంబాల దాకా, అవ్వతాతలు, ఆడబిడ్డలు, విద్యార్థులు, విద్యావంతులు, నిరుద్యోగులు , ఉద్యోగులు రోడ్లెక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నాయకుల నుంచి వృద్ధులు, బడి పిల్లలు కూడా ప్రభుత్వ తీరుపై ఆందోళనలకు దిగుతున్నారు. కాంగ్రెస్ పాలన వద్దు అంటూ నినాదాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు కష్టాలు తెచ్చి పెట్టింది..' అని కేటీఆర్ మండిపడ్డారు.

క్లుప్తంగా...

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు: కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడిని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హత్య చేయించారని స్వయంగా ఎమ్మెల్సీ చెప్తున్నా హత్య కేసు ఎందుకు నమోదు చేయడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసమే ఈ హత్య జరిగిందన్నారు. తెలంగాణలో హత్యా రాజకీయాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు ఉన్నాయా అని నిలదీశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరలేదంటూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. అలాంటపుడు గాంధీభవన్‌లో కాంగ్రెస్ సమావేశానికి ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల పరిస్థితి బ్రోకర్ల కంటే హీనంగా మారిందన్నారు. హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి కొనసాగితే రాష్ట్రంలో హత్యలు జరుగుతాయని వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లాలో 40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోసిన జీవన్‌రెడ్డికి.. ఆ పార్టీ గంగారెడ్డి హత్యను బహుమతిగా ఇచ్చిందని విమర్శించారు. కాగా, యాదాద్రి ఆలయం గురించి ప్రపంచానికి తెలియచేసేందుకే గుడి ఆవరణలో అధికారుల అనుమతితో ఫొటో షూట్ చేశామన్నారు.

అరెస్టులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు: బండి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. 'ఒక పార్టీలో చేరి అనంతరం మరో పార్టీలో చేరిన వాళ్లను రాజకీయ వ్యభిచారులని అంటున్నారు కదా... మరి మీ తండ్రి కేసీఆర్ మొదట ఏ పార్టీలో ఉన్నడు? ఇప్పుడు ఏ పార్టీ నడుపుతున్నడు? వేరే పార్టీలో గెలిచిన వాళ్లను చేర్చుకుని పార్టీని నడుపుతున్న వాళ్లను ఏమనాలే?'అని బండి సంజయ్ ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులపై మాజీమంత్రి కేటీరామారావు చేసిన వ్యాఖ్యలపై సంజయ్ పైవిధంగా స్పందించారు. బీఆర్ఎస్ నేతల భాష, వ్యవహారశైలిని చూస్తే అసహ్యమేస్తోందన్నారు. లీగల్ నోటీసులకు భయపడేది లేదని, దానికి సరైన రీతిలో సమాధానమిస్తామని స్పష్టం చేశారు. ఇందిరాపార్క్ వద్ద మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సంజయ్ సమాధానమిచ్చారు. అరెస్ట్ చేస్తే అంతుచూస్తామన్న కేటీఆర్ వ్యాఖ్యలపై...కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని చెప్పారు. రెండ్రోజుల్లో బాంబులు పేలతాయని మంత్రులంటే...అరెస్ట్ చేస్తే మీ అంతు చూస్తామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నరు. ఇద్దరివీ డ్రామాలే. నువ్వు కొట్టినట్లు చెయ్...నేను దెబ్బతిన్నట్లు నటిస్తానంటూ డ్రామాలాడుతున్నరు'అని మండిపడ్డారు.

కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుంది: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: జైలుకు వెళ్లాల్సి వస్తుందనే టెన్షన్‌లో మాజీమంత్రి కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆయనకు జైలు భయం పట్టుకుందన్న విషయం ఆయన మాటల్లోనే అర్థమవుతోందని అసెంబ్లీలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అందుకే తాను రెండు, మూడేళ్లయినా జైల్లో ఉండేందుకు సిద్ధమని ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని, చావుకైనా సిద్ధమంటూ పోరాట యోధుడిలా బడాయి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...తననేమీ పీకలేరంటూ కేటీఆర్ నీచమైన భాష మాట్లాడుతున్నారని, తమకేమి చేతనవుతుందో గత రెండు ఎన్నికల్లోనూ చూపించామని, కేటీఆర్ అయ్య కుర్చీ పీకి చూపించామని గుర్తు చేశారు. 4 రోజులు ఓపిక పడితే ఇంకా ఏం చేస్తామో, అసలు రేవంత్‌రెడ్డి అంటే ఏంటో చూస్తావని వ్యాఖ్యానించారు. పార్టీ మారిన వారు వ్యభిచారులని కేటీఆర్ అంటున్నారని ప్రతిపక్షపార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను మంత్రులను చేసిన వారిని ఏమనాలని ప్రశ్నించారు.

జైలు భయంతోనే కేటీఆర్ రైతు యాత్ర

టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్



సాక్షి, హైదరాబాద్: జైలుకెళ్తాననే భయంతోనే మాజీ మంత్రి కేటీఆర్ రైతు యాత్రకు సిద్ధమవుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బైకాని లింగం యాదవ్ విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రైతుల గురించి ఏనాడూ పట్టించుకోని బీఆర్ఎస్.. ఇప్పుడు రైతు యాత్ర నిర్వహిస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు కోట్ల శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తప్పు చేసినవారు ఎంత పెద్దవారైనా జైలుకు వెళ్లాల్సిందేనన్నారు. సీఎం రేవంత్, మంత్రులను తిడితే గ్రాఫ్ పెరుగుతుందనే ఆలోచనలో బీఆర్ఎస్ నేతలున్నారని దుయ్యబట్టారు. మూసీకి పునరుజ్జీవానికి సీఎం రేవంత్ చేస్తున్న ప్రయత్నాలను బీఆర్ఎస్, బీజేపీలు ఓర్వలేకపోతున్నాయన్నారు.

చిత్తశుద్ధి, దూరదృష్టితోనే అభివృద్ధి

ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. భద్రాచలంలో రామాలయ దర్శనం



భద్రాద్రి రామాలయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పరివట్టం కడుతున్న ప్రధాన అర్చకుడు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నిధులు ఉన్నంత మాత్రాన అభివృద్ధి జరగదని.. దూరదృష్టి, చిత్తశుద్ధితోనే అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు దక్కుతాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆయన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆయనకు పరివట్టం కట్టి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో మూలమూర్తుల దర్శనం తర్వాత అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ రమా దేవి స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలు అందచేశారు. తర్వాత రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భద్రాచలంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తలసేమియా, సికిల్‌సెల్ ప్రత్యేక వార్డులను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో గిరిజనులకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అమూల్యమైన సేవలు అందటం అభినందనీయమని అన్నారు. భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రిని కేంద్రం నిధులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చే ప్రతిపాదనలను పరిశీలిస్తామని వెల్లడించారు.

కలెక్టరేట్లలో భేటీలు: ఈ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొత్తగూడెం కలెక్టరేట్, ఖమ్మం కలెక్టరేట్లలో అధికారులతో పాటు వివిధ రంగాల్లోని ప్రముఖులతో భేటీ అయ్యారు. అలాగే, శాఖల వారీగా ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సమావేశాల్లో గవర్నర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద, గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందించి వారు మెరుగైన జీవితం గడిపేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. భద్రాద్రి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు బాగుందని అభినందించారు. ఖమ్మంలో గవర్నర్ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మాదిరిగా తాను సైతం పర్యావరణ వేత్తగా కెరీర్‌ను ప్రారంభించానని, ప్రకృతి దైవంతో సమానమనే భావన అందరిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, రెండు జిల్లాల కలెక్టర్లు జితేశ్ వి.పాటిల్, ముజమ్మిల్ ఖాన్, ఎస్పీ రోహిత్‌రాజ్, సీపీ సునీల్‌దత్, ఐటీడీఏ పీఓ రాహుల్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డికి యాష్కీ, జగ్గారెడ్డి మద్దతు

- ఆయన్ను పార్టీ కాపాడుకుంటుందని వెల్లడి.. ఆయన అభ్యంతరాలను అధిష్టానం పరిశీలించాలని వినతి
- జీవన్‌రెడ్డిని కలిసి పరామర్శించిన యాష్కీ.. ప్రకటన విడుదల చేసిన జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డికి ఆ పార్టీలోని పలువురు నేతలు బహిరంగంగా మద్దతు పలుకుతున్నారు. అనుచరుడి హత్యతో తీవ్ర ఆవేదనలో ఉన్న ఆయన్ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ హైదరాబాద్‌లోని జీవన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం కలిసి పరామర్శించారు. అనుచరుడి హత్యకు సంబంధించిన వివరాలు తెలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారని... ఆయన సేవలు పార్టీకి మరింత అవసర మని అభిప్రాయపడ్డారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఓడిపోయినా ఆ తర్వాత జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలిచారని గుర్తుచేశారు. అప్పుడే ఆయనకున్న ప్రజాబలం ఏమిటో అర్థమైందన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ కాపాడుకుంటుందని.. ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు ప్రభుత్వ పాలనలో ఆయన తెలిపిన అభ్యంతరాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని యాష్కీగౌడ్ చెప్పారు.

ఆయన ఆవేదన చూసి బాధపడ్డా: జగ్గారెడ్డి

జీవన్‌రెడ్డి ఆవేదనపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా స్పందించారు. జీవన్‌రెడ్డి ఆవేదన చూసి తాను చాలా బాధపడ్డానని.. మనసు కలుక్కుమందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మీకు అండగా ఉన్నానని చెప్పడానికి ఈ ప్రకటన మీడియా ద్వారా చేస్తున్నా. నేను ఎవరినీ తప్పుబట్టట్లేదు. కానీ పార్టీలో మీరు ఒంటరినని అనుకోవద్దు. సమయం వచ్చినప్పుడు నేను మీ వెంట ఉంటా. ఎప్పుడూ జనంలో ఉండే మిమ్మల్ని జగిత్యాల, సంగారెడ్డి ప్రజలు ఎందుకు ఓడించారో అర్థం కావట్లేదు. మీ సమస్యకు అధిష్టానం పరిష్కారం చూపాలని సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీని కోరుతున్నా'అని జగ్గారెడ్డి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పేదల ఇళ్లు కూల్చితే రణరంగమే

▶ మొదటి పేజీ తరువాయి

వారి ఇళ్లల్లో ఉండేందుకు మేం సిద్ధం..'అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మూసీ, హైడ్రా కూల్చివేతలకు నిరసనగా 'చేయి చేసిన కీడు...మూసీ బాధితులకు బీజేపీ తోడు'పేరిట నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు.

ఇళ్లు కూల్చకుండా సుందరీకరణ చేయాలి

'మూసీ ప్రక్షాళనకు, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు. అయితే పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా మూసీ సుందరీకరణ చేయాలి. మూసీకి రెండువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మించాక సుందరీకరణ చేపట్టాలి. అప్పుడు బీజేపీ కార్యకర్తలు కరసేవ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. అలాకాకుండా పేదల ఇళ్లు కూల్చాలనుకుంటే మాత్రం ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకుంటాం. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి, వివరాలు సేకరించి రానున్న రోజుల్లో పేదల పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. అనేక ఏళ్ల నుంచి ఉంటున్న ఇళ్లను ఎలా కూలుస్తారు ? మూసీ పరీవాహక ప్రాంతం చరిత్ర రేవంత్‌రెడ్డికి తెలుసా? మూసీలో అనేక ప్రాంతాల డ్రైనేజీ నీరు కలుస్తోంది. దాన్ని మళ్లించకుండా, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్టీపీలు) నిర్మించకుండా మూసీ ప్రక్షాళన చేయలేరు..'అని కిషన్‌రెడ్డి చెప్పారు. ముందుగా హైదరాబాద్‌లోని అనేకచోట్ల భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, పేద ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాక మూసీ సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో అనేక హామీలిచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, తమ మోసపూరిత వైఖరి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చుతామంటోందని ధ్వజమెత్తారు.

మూసీ పునరుజ్జీవం అతి పెద్ద స్కామ్: బండి సంజయ్

'మూసీ పునరుజ్జీవం అతి పెద్ద స్కామ్. మూసీ దుస్థితికి ప్రధాన కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లే. లండన్, సియోల్ కాదు.. మూసీ బాధితుల వద్దకు వెళ్లే దమ్ము సీఎంకు, మంత్రులకు ఉందా? మీ అల్లుడి (వాద్రా) కోసం మూసీ దోపిడీకి ప్లాన్ చేస్తారా? మూసీ బాధితులకు మేం అండగా ఉంటాం..'అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే మూసీ ప్రాజెక్టుకు లక్షన్నరకోట్లు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూసీ ప్రక్షాళనకు, ఇళ్ల కూల్చివేతలకు సంబంధం ఏమిటో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు.

సీఎం మాతో మూసీ పర్యటనకు రావాలి: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సీఎం రేవంత్ తమతోపాటు మూసీ పర్యటనకు రావాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళనకు ప్రజల్లో ఒక్కరు ఒప్పుకున్నా తాము వెనక్కి తగ్గుతామని సవాల్ చేశారు. మీ కమీషన్ల కోసం సామాన్య ప్రజలను రోడ్డున పడేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు సమన్వయకర్తగా నిర్వహించిన ఈ ధర్నాలో ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్, పలువురు పార్టీ నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. మూసీ ప్రభావిత ప్రాంతాల్లోని పలువురు మహిళలు ఈ సందర్భంగా తమ సమస్యలను వివరిస్తూ కన్నీరు పెట్టుకున్నారు.

మంత్రులు, ప్రతిపక్ష నేతల ఫోన్లను రేవంత్ ట్యాప్ చేయిస్తున్నారు

దమ్ముంటే సీఎం లై డిటెక్టర్ పరీక్షకు రావాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

సాక్షి, హైదరాబాద్: మంత్రులతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై తాను చేసిన ప్రకటనను రేవంత్ ఖండించాలని, లేనిపక్షంలో ఆయనకు దమ్ముంటే కెమెరాల ముందు లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలన్న రేవంత్ ప్రభుత్వం.. హాఫ్ గ్యారంటీ సర్కారుగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్

'దేశంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనమైంది. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతులు పట్టుకుంటున్న రాహుల్ గాంధీ తెలంగాణలో రాజ్యాంగం ఖూనీపై, బుల్డోజర్ రాజ్యంపై మౌనం వహిస్తున్నారు..'అని కేటీఆర్ విమర్శించారు. అప్పట్లో రూ.50 లక్షల డబ్బు కట్టలతో ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర చేసినందుకే రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టామని చెప్పారు.

ప్రజల అంచనాలు పెరగడం వల్లే ఓటమి

'తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల అంచనాలు పెరగడం బీఆర్ఎస్ ఓటమికి కారణం. దేశంలో ఎన్నికలు ఒకరి ఎంపిక కోసం కాకుండా అధికారంలో ఉన్నవారిని తిరస్కరించడం కోసం జరుగుతుంటాయి. అసెంబ్లీ ఎన్నికలు రేవంత్ ఎంపిక కోసం కాకుండా మా ప్రభుత్వాన్ని తిరస్కరించడానికి జరిగాయి. గెలుపు ఓటములకు చలించిపోయే తత్వం కేసీఆర్‌కు లేదు. ఆయన నిరంతరం తెలంగాణ భవిష్యత్తు కోసం ఆలోచిస్తూ ప్రణాళికలు రచిస్తున్నారు..'అని కేటీఆర్ తెలిపారు. ఎక్కువ మంది పిల్లలను కనాలని ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నారని, అయితే ఉన్న జనాభాకు తగినట్లుగా ప్రస్తుతం మౌలిక వసతులు లేవని, ముందుగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని మాజీ మంత్రి సూచించారు.

అవి జగన్ సొంత సంస్థలు

వాటిలో షర్మిల వాటాదారు కాదు

- షర్మిల నిజంగా షేర్‌హోల్డర్ అయితే ఆమెపై కేసులు ఎందుకు నమోదు కాలేదు?
- కేవలం జగన్‌పైనే కేసులు పెట్టి జైలుకు ఎందుకు పంపారు?
- జగన్ పదేళ్లలో ఇచ్చిన రూ.200 కోట్లు కంపెనీ డివిడెండ్ కాదు
- అసలు కంపెనీ షేర్ హోల్డరే కానప్పుడు.. డివిడెండ్ ఇస్తారా?
- చెల్లెలిపై అభిమానం, ప్రేమతోనే జగన్ ఆ డబ్బులిచ్చారు
- చంద్రబాబుతో కలిసి రాజకీయాలు చేయడం వైఎస్సార్ అభిమతమా షర్మిలా?
- ఇలాగేనా మీ తండ్రి వైఎస్సార్ ఆశయాల కొనసాగింపు?
- వైఎస్సార్‌సీపీ ఎదుగుదలలో జగన్, కార్యకర్తలదే పాత్ర
- విలేకరుల సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్ సంస్థలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత సంస్థలని.. వాటిల్లో షర్మిల వాటాదారు కాదని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) తేల్చి చెప్పారు. సోదరి షర్మిలపై ప్రేమ, అప్యాయతతో తన స్వార్జితమైన నాలుగు సంస్థల్లో 40 శాతం వాటాను ఇస్తూ జగన్ ఒప్పందం రాసిచ్చారని.. ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్), కోర్టు అనుమతి ఇచ్చాక వాటిని పూర్తి స్థాయిలో బదలాయిస్తానని స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. అయితే ఈడీ జప్తు చేసిన సరస్వతీ పవర్ షేర్లను బదిలీ చేయించి జగన్ బెయిల్‌ను రద్దు చేయించాలన్న కుట్రలో షర్మిల పావుగా మారారని.. ఆ కుట్రను చిత్తు చేయడానికే ఎన్‌సీఎల్‌టీలో జగన్ పిటిషన్ వేశారేగానీ ఆస్తులు వెనక్కి తీసుకోవాలని కాదని స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వారిద్దరూ మీడియాతో మాట్లాడారు.

అవన్నీ జగన్ స్వార్జితం: వైవీ సుబ్బారెడ్డి



- షర్మిల బహిరంగ లేఖ చూశాక కుటుంబపరమైన కొన్ని విషయాలను ప్రజలకు తెలియజేస్తున్నా. సరస్వతీ పవర్ షేర్ల అంశం హైకోర్టులో ఉంది. ఈడీ జప్తు చేసిన ఆ సంస్థ ఆస్తులపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. జగన్‌పై కాంగ్రెస్ పార్టీ అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించడంతో ఆయన సంస్థల ఆస్తుల అటాచ్‌మెంట్ జరిగింది. ఈడీ అటాచ్‌మెంట్లో ఉన్న షేర్లను బదిలీ చేయించుకున్నారు కాబట్టే దాన్ని ఆపాలని జగన్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ ఇచ్చారు. అంతేగానీ ఆస్తులు వెనక్కు తీసుకోవాలని కాదు.
- జగన్ తన స్వార్జిత ఆస్తిలో షర్మిలకు వాటా ఇస్తూ 2019 ఆగస్టులో ఒప్పందం రాసిచ్చారు. ఆ ఒప్పందంలో జగన్ స్వార్జిత ఆస్తులు అని చాలా స్పష్టంగా ఉంది. అది చూశాకే షర్మిలమ్మ, విజయమ్మ ఇద్దరూ సంతకం పెట్టారు. తన చెల్లిపై ప్రేమ, అభిమానంతో ఆస్తులు ఇస్తున్నట్లు జగన్ ఆ ఒప్పందంలో రాశారు. ఇవన్నీ వాస్తవాలు. వాటిని కప్పి పుచ్చి దుష్ప్రచారం చేస్తున్నారు.
- దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉన్నప్పుడే ఆయన ఆస్తులను పంచారు. షర్మిల ఈ ఆస్తులు కావాలని అని నిజంగా అనుకుంటే.. అవి ఇస్తానని జగన్ చెప్పినా.. ఆమె ఇప్పుడేం మాట్లాడుతున్నారో చూస్తుంటే.. ఆమె ఆస్తుల కోసం పోరాడుతున్నారా? లేక జగన్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారా? అని అనిపిస్తోంది.
- నాకు తెలిసినంతవరకు జగన్ స్వార్జిత ఆస్తిలో ఎక్కడా షర్మిలమ్మ ప్రమేయం లేదు. నిజంగా ఆ ఆస్తుల్లో షర్మిలమ్మకు వాటా ఉండి ఉంటే.. ఆమెపై ఆనాడు కేసులు ఎందుకు నమోదు కాలేదు? కేవలం జగన్ మాత్రమే ఎందుకు జైలుకు వెళ్లారు? జగన్ కంపెనీలో షేర్ హోల్డర్ కాబట్టే ఆయనకు డివిడెండ్ వచ్చింది. దాన్నుంచే ఆయన తన చెల్లికి ఈ పదేళ్లలో రూ.200 కోట్లు ఇచ్చారు. షర్మిల అందులో షేర్ హోల్డర్ కాదు. అవి జగన్ సొంత కంపెనీలు. అందుకే వాటికి భారతి సిమెంట్స్.. తన పేరు, భార్య పేరు కలిసొచ్చేలా జగతి పబ్లికేషన్స్ (సాక్షి గ్రూప్) అని పేరు పెట్టారు.
- నలుగురు పిల్లలూ తనకు సమానం అని వైఎస్సార్ అన్నారని షర్మిల లేఖలో రాశారు. అది నిజమే. ప్రేమను పంచడంలో వైఎస్సార్ నలుగురు పిల్లలనూ సమానంగా చూశారు. అయితే వైఎస్సార్ బతికున్నప్పుడే జగన్ స్థాపించిన కంపెనీల్లో ఎక్కడా షర్మిల గానీ, అనిల్ గానీ షేర్‌హోల్డర్‌గా లేరు. అది వైఎస్సార్ కోరుకోలేదు. ఒకవేళ ఆయన కోరుకుంటే వారిని ఆ కంపెనీల్లో షేర్ హోల్డర్లుగా పెట్టి ఉండేవారు కదా? తండ్రి మరణం తర్వాత, ప్రజలకు ఇచ్చిన మాట కోసం జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి ఓదార్పు యాత్ర చేశారు. ఎన్నో పోరాటాలు చేశారు. 2014లోగానీ మొన్న 2024లోగానీ అబద్ధాలు చెప్పి ఉంటే అధికారంలోకి వచ్చేవారు. అలాంటి మనిషే అయితే చెల్లి విషయంలో మాట తప్పరు కదా?

- గత మూడు నాలుగు రోజుల నుంచి టీడీపీ నానా హంగామా చేసి చెప్పిన బ్రేకింగ్ న్యూస్ ఏమిటంటే.. షర్మిలమ్మ తన ఆస్తుల పంపకం గురించి అన్నకు రాసిన ఉత్తరం. అది రాష్ట్రానికి, ప్రజలకు అంత ముఖ్యమా? షర్మిలమ్మ పీసీసీ అధ్యక్షురాలు. ఆమె అన్నకు రాసిన ఉత్తరం ఎన్‌డీఏ అఫీషియల్ వెబ్‌సైట్‌లో రావడం అంటే చంద్రబాబు ఎంత అనైతికంగా వ్యవహరిస్తున్నారు? ఎక్కడికక్కడ ఎవరెవరితో కలిసి పని చేస్తున్నారు? అనేది ఆలోచించండి. ఢిల్లీలో కాంగ్రెస్‌తో కుస్తీ.. ఇక్కడ మాత్రం దోస్తీ! ఏ స్థాయిలో దిగజారి రాజకీయాలు చేస్తున్నాడో చూడండి. లేఖ రాసింది రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలైతే టీడీపీ వెబ్‌సైట్‌లో ప్రచారం చేయడం ఏమిటి?
- వైఎస్సార్ జీవించి ఉన్నప్పుడు మొదలుపెట్టిన కంపెనీల్లో కుటుంబ సభ్యులంతా వాటాదారులైతే.. భారతి సిమెంట్స్‌లో షర్మిల పేరు ఎందుకు పెట్టలేదు? షేర్ హోల్డర్లుగా ఎందుకు ప్రకటించలేదు? జగన్ ఆ కంపెనీలకు కేవలం కాపలాదారే అయితే వైఎస్సార్ మిమ్మల్ని కంపెనీల్లో డైరెక్టర్లుగా పెట్టేవారు కదా? అప్పట్లో మీరు విదేశాల్లో కూడా లేరు కదా?
- వైఎస్సార్ అభిమతం, ఆశయాలను కొనసాగించాలన్న అంకితభావం ఉంటే.. చంద్రబాబుతో కలిసి ప్రయాణించడం, రాజకీయం చేయడాన్ని ఎవరైనా ఊహిస్తారా? వైఎస్సార్ అదే ఆశించారా? ఆయన్ను అణగదొక్కడానికి చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేశారో తెలుసు కదా? రాజకీయాల్లో ఇద్దరూ బద్ధ శత్రువులు. అలాంటి చంద్రబాబుతో కలిసి పని చేస్తారా? ఏబీఎన్ రాధాకృష్ణతో కూడా కలసి పోతారా? వైఎస్సార్ అభిమానుల్లో ఎవరైనా చంద్రబాబుతో కలిసి పని చేస్తున్నారా? కానీ ఆ పని మీరు ఎందుకు చేస్తున్నారు? మీరు కాంగ్రెస్‌లో ఉంటూ ఎన్డీఏ కూటమితో కలసి ఎలా పని చేస్తున్నారు? అదేనా వైఎస్సార్ అభిమతం? ఆశయం?

బాబుతో కలసి రాజకీయం చేయడం వైఎస్ అభిమతమా?: పేర్ని నాని



- వైఎస్సార్ మరణించాక.. జగన్ 10 ఏళ్లు కష్టాలు పడితే.. తాను పార్టీ కోసం పాటుపడ్డాడని, కష్టపడి పని చేశానని షర్మిలమ్మ అంటున్నారు. జగన్ ఎప్పుడు సమస్యలు ఎదుర్కొన్నారో తెలియదా? ఆయన సోనియాను ఎదిరించి బయటకు వచ్చిన తర్వాత అక్రమ కేసులు పెట్టారు. జైల్లో పెట్టారు. అప్పుడు 230 రోజులు షర్మిలమ్మ పాదయాత్ర చేశారు. అది కూడా 2014 ఎన్నికల ముందు మాత్రమే. 2014 తర్వాత ఆమె ఏనాడూ రాలేదు. పార్టీ జెండా మోయలేదు.
- వైఎస్సార్‌సీపీకి 2012 నుంచి ఈరోజు వరకు కర్త, కర్మ, క్రియ, కష్టం నష్టం.. గెలుపు.. అన్నింటిలో పూర్తి భాగస్వామ్య హక్కు జగన్‌ది మాత్రమే. కేవలం ఆయన వల్లనే పార్టీ ఎదిగింది... నిల్చింది... గెల్చింది. ఆ ఘనత పార్టీది, కార్యకర్తలది. అంటే జగన్, పార్టీ కార్యకర్తలకే ఆ ఘనత దక్కుతుంది. ఇంకా చెప్పాలంటే మాలాంటి వారు చాలా మంది పని చేశారు. పదవులు వదులుకుని వచ్చాం. టీడీపీ నుంచి కూడా పదవులు వీడి వచ్చిన వారు ఉన్నారు. అధికారాన్ని వదులుకుని ప్రతిపక్షంలో ఉన్న పార్టీలోకి వచ్చారు. కానీ ప్రధానంగా పని చేసింది లక్షలాది మంది కార్యకర్తలు, జగన్ మాత్రమే. వారి వల్లనే పార్టీ ఎదిగింది. నిలబడింది. ఇది వాస్తవం. దీన్ని షర్మిలమ్మ గుర్తించాలి.
- ఇది చెప్పాలో వద్దో తెలియదు. షర్మిలమ్మ పాదయాత్ర సమయంలో జగన్ జైల్లో ఉంటే నేను స్వయంగా కలిశా. చెల్లితో పాదయాత్ర చేయించడం ఎంత వరకు కరెక్ట్? భవిష్యత్తులో సమస్యలు వస్తాయని చెబితే అలాంటి అవకాశం అసలు ఉండదని నాడు జగన్ అన్నారు. చెల్లిపై ఆయనకు అంత నమ్మకం. కానీ ఈ రోజు నేను అన్నదే జరుగుతోంది.
- అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ కేవలం గార్డియన్ మాత్రమేనని, ఆస్తులను నలుగురికి (మనవళ్లు, మనవరాళ్లు) సమానంగా పంచడం, అది జగన్ బాధ్యత అని.. అది వైఎస్సార్ ఉద్దేశమని.. అది ఆయన సన్నిహితులైన కేవీపీ, సాయిరెడ్డి, సుబ్బారెడ్డికి కూడా తెలుసని షర్మిలమ్మ ఆ లేఖలో రాశారు. ఒకవేళ నిజంగా వైఎస్సార్ ఉద్దేశం అదే అయితే.. ఇంత మందికి ఆయన చెప్పి ఉంటే, జగన్‌కు కూడా చెప్పి ఉండాలి కదా? ఇద్దరు తల్లిదండ్రులను కూడా కంపెనీ డైరెక్టర్లుగా పెట్టి ఉండాలి కదా? ఇలాంటి మనస్తత్వమా షర్మిలది?
- తండ్రి మరణం తర్వాత జగన్ ఓదార్పుయాత్ర చేస్తానంటే.. కాంగ్రెస్ వద్దనడంతో పార్టీని వీడారు. పదవులు ఇస్తామన్నా ఆశ పడలేదు. కేవలం మాట కోసం బయటకు వచ్చారు. రాజీ పడకుండా పోరాడారు. తండ్రి ఆశయం, జనం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతో పోరాడారు. 16 నెలలు అన్యాయంగా జైలు శిక్ష అనుభవించారు. ఎంతో జీవితాన్ని పోగొట్టుకున్నారు. కానీ ఆశయాన్ని మాత్రం వీడలేదు. జగన్‌పై ఎన్ని కేసులు పెట్టారు? ఇప్పటికీ వాటిని మోస్తూనే ఉన్నారు. పదవులు ఇస్తామన్నా కేవలం ఇచ్చిన మాట కోసం వదులుకున్నారు.
- అలాంటి గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి ఏదో నాలుగు ఆస్తుల్లో 40 పైసల వాటా కోసం మాట తప్పుతారా? ఇచ్చిన మాట నిలబెట్టుకోరా? తనే స్వయంగా రాశారని మీరే చెబుతున్నారు కదా! నమ్మిన సిద్ధాంతం, ఆశయాల కోసం రాజీ పడకుండా అన్ని కష్టాలు అనుభవించిన వ్యక్తి 40 పైసల వాటా కోసం మాట తప్పుతారా? మరి ప్రజలు దీన్ని నమ్ముతారా?
- గత పదేళ్లలో మీకు రూ.200 కోట్లు నగదు బదిలీ చేస్తే అది కంపెనీ డివిడెండ్ అని అంటారా? మీరు కంపెనీలో షేర్‌హోల్డర్ కానప్పుడు మీకు లాభం ఎలా పంచుతారు? అది వచ్చింది మీ అన్న, వదిన నుంచి కాదా? ఇంత దారుణంగా మాట్లాడడం, వ్యవహరించడం ఎంత వరకు సబబు? తండ్రి, అన్న శత్రువుతో కలిసి పని చేయడం, ఆస్తుల కోసం జగన్ కోర్టుకు ఎక్కాడని టీడీపీ మీడియాతో కలసి దుష్ప్రచారం చేయడాన్ని మీ విజ్ఞత, విచక్షణకే వదిలేస్తున్నాం.
- షర్మిలను పార్టీ కోసం వాడుకుని వదిలేశారని చంద్రబాబు అంటున్నారు. మరి నువ్వు జూనియర్ ఎన్టీఆర్‌ను పార్టీ కోసం ఎంతగా వాడుకున్నావ్ చంద్రబాబూ..? మీరు కనీసం సభ్యత్వం కూడా ఇవ్వలేదు. అందుకే ఆయన పార్టీని వీడారు కదా? మీరు మీ లాభం కోసం మనుషులను ఎలా వాడుకుంటారో.. స్వయంగా మీ తోడల్లుడు ఏకంగా పుస్తకమే రాశారు కదా! వాడుకోవడం, వదిలేయడం.. అదీ మీ నైజం! అలాంటి మీరు నీతులు చెబుతున్నారు. ఆస్తులు ఇవ్వడం లేదని విమర్శిస్తున్నారు. మరి మీ హెరిటేజ్‌లో మీ తోబుట్టువులకు ఎంత వాటా ఇచ్చారు? ఏమైనా రాసిచ్చారా? మీకు నిజాయితీ ఉంటే వెంటనే ఆ పని చేసి చూపండి. ఈ వయసులో ఇకనైనా బుద్ధి తెచ్చుకోండి చంద్రబాబూ!!

సరస్వతీ పవర్ వాటాల బదిలీపై

షర్మిల వాదన అసంబద్ధం

ఆమె వాదన చట్ట నిబంధనలకు విరుద్ధమంటున్న న్యాయ నిపుణులు

- ఈడీ.. సరస్వతీ పవర్ స్థిర, చరాస్తులను జప్తు చేసింది.. ఈ విషయాన్ని అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పే స్పష్టం చేస్తోంది
- కంపెనీల చట్టం ప్రకారం చరాస్తుల పరిధిలోకి షేర్లు కూడా వస్తాయి
- సరస్వతీ పవర్ ఆస్తుల జప్తును అప్పిలేట్ ట్రిబ్యునల్ రద్దు చేసింది
- ట్రిబ్యునల్ తీర్పుపై హైకోర్టు జోక్యం చేసుకుంది
- అన్ని రకాలుగా యథాతథస్థితిని కొనసాగించాలని ఆదేశించింది
- ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా షేర్ల బదిలీని చేపట్టిన షర్మిల
- న్యాయపరమైన సమస్యలు వస్తాయని చెప్పిన జగన్.. పట్టించుకోకపోవడంతో న్యాయ పోరాటం మొదలు పెట్టిన జగన్
- న్యాయపరమైన సమస్యల నుంచి బయటపడేందుకే ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్



సాక్షి, అమరావతి: సరస్వతీ పవర్ వాటాల బదిలీ విషయంలో షర్మిల చేస్తున్న అసంబద్ధ వాదనపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సరస్వతీ పవర్ వాటాలను జప్తు చేయలేదన్న షర్మిల వాదనతో న్యాయ నిపుణులు విభేదిస్తున్నారు. ఈడీ.. సరస్వతీ పవర్ స్థిర, చరాస్తులన్నింటినీ జప్తు చేసిందని, చరాస్తుల్లోకి షేర్లు కూడా వస్తాయని వారు గుర్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని కంపెనీల చట్టం స్పష్టంగా చెబుతోందని పేర్కొంటున్నారు. కంపెనీల చట్టం సెక్షన్ 44 ప్రకారం షేర్లు, డిబెంచర్లను చరాస్తులుగా పరిగణిస్తారు. అందువల్ల సరస్వతీ పవర్ స్థిర, చరాస్తులను ఈడీ జప్తు చేసినందున, ఆ కంపెనీ షేర్లు కూడా జప్తులో ఉన్నట్లే. కాబట్టి హైకోర్టు జారీ చేసిన యథాతథస్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు సరస్వతీ పవర్ షేర్లకు కూడా వర్తిస్తాయి. షేర్లతో సహా జప్తులో ఉన్న ఏ ఆస్తులను కూడా ఇతరులకు విక్రయించడం గానీ, బదలాయించడం గానీ చేయడానికి వీల్లేదు. సరస్వతీ పవర్ స్థిర, చరాస్తులను ఈడీ జప్తు చేసినట్లు ట్రిబ్యునల్ తీర్పులో స్పష్టంగా చెప్పింది. వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి నమోదైన కేసులో ఈడీ పలు ఆస్తులను జప్తు చేసింది. ఇందులో జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన గ్రూపునకు చెందిన పలు కంపెనీలున్నాయి. ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో సరస్వతీ పవర్‌కు చెందిన స్థిర, చరాస్తులు కూడా ఉన్నాయి. ఈడీ తాత్కాలిక జప్తు ఉత్తర్వులను, ఆ ఉత్తర్వులను సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి, సరస్వతీ పవర్‌లతో సహా పలు గ్రూపు కంపెనీలు మనీలాండరింగ్ నిరోధక అప్పిలేట్ ట్రిబ్యునల్ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై సుదీర్ఘ విచారణ జరిపిన అప్పిలేట్ ట్రిబ్యునల్ 2019 జూలై 26న తీర్పు వెలువరించింది. ఆ తీర్పులో సరస్వతీ పవర్ స్థిర చరాస్తులను ఈడీ జప్తు చేసినట్లు స్పష్టంగా పేర్కొంది. సరస్వతి పవర్ స్థిర, చరాస్తుల జప్తును తప్పుపట్టింది. ఆ జప్తు ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2019 అక్టోబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రిబ్యునల్ తీర్పు అమలుకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపేయాలని హైకోర్టును కోరింది. ఈడీ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ఈడీ దాఖలు చేసిన అప్పీల్ తేలేంత వరకు ఆ రోజు నాటికి ఉన్న స్థితిని అన్ని రకాలుగా యథాతథంగా కొనసాగించాలంటూ 2019 డిసెంబర్ 2న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు ఈ రోజుకీ అమల్లో ఉన్నాయి. ఈ యథాతథస్థితి ఉత్తర్వుల గురించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావిస్తున్నారు. ఈ ఉత్తర్వులు అమల్లో ఉండగా సరస్వతీ పవర్‌లో వాటాలను బదలాయించడం అంటే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నది న్యాయ నిపుణుల మాట. ఇదే విషయాన్ని న్యాయ నిపుణులు సలహా రూపంలో జగన్‌మోహన్‌రెడ్డికి స్పష్టంగా చెప్పారు. ఈ సలహాను జగన్ తన చెల్లి షర్మిల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆ న్యాయ సలహాను ఆమె ముందుంచారు.

జగన్‌ను ఉద్దేశపూర్వకంగా సమస్యల్లోకి నెట్టిన షర్మిల...

కోర్టులో ఉన్న కేసులన్నీ తేలిన తరువాత వాటాలు బదలాయించుకోవచ్చునని షర్మిలకు జగన్ స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు వాటాలు బదిలీ చేస్తే తనకు న్యాయపరమైన సమస్యలు వస్తాయని కూడా వివరించారు. అయితే చంద్రబాబు చెప్పినట్లు నడుచుకుంటున్న షర్మిల తన అన్న జగన్ మాటలను పెడచెవిన పెట్టారు. ఆయన్ను న్యాయపరమైన సమస్యల్లోకి నెట్టేందుకే నిర్ణయించుకున్నారు. అందుకు అనుగుణంగానే సరస్వతీ పవర్‌లో ఉన్న వాటాలను అక్రమ పద్ధతిలో బదలాయించేశారు. అన్యాయమైన పని చేసిన షర్మిల మరోవైపు జగన్‌పై ఎదురుదాడికి దిగారు. ఈడీ సరస్వతీ పవర్‌కు చెందిన భూములను మాత్రమే జప్తు చేసిందే కానీ, షేర్లను జప్తు చేయాలంటూ ఓ వాదనను తీసుకొచ్చారు. అందుకే వాటాలను బదలాయించినట్లు ఆమె చెబుతున్నారు. న్యాయ నిపుణులు మాత్రం ఆమె వాదన చట్ట విరుద్ధంగా ఉందని తేల్చి చెబుతున్నారు. షర్మిల దురుద్దేశపూర్వకంగా సృష్టించిన సమస్యల నుంచి బయటపడేందుకే జగన్ న్యాయపోరాటం ప్రారంభించారు. షేర్ల బదిలీల విషయంలో ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసి, తన వాటాలను తిరిగి ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

సరస్వతీ పవర్ షేర్లు జప్తులో లేవని ఎలా చెబుతారు..?

హైకోర్టు న్యాయవాది మరక్కగారి బాలకృష్ణ

సరస్వతీ పవర్ షేర్ల బదిలీ విషయంలో షర్మిల వాదన చట్ట విరుద్ధంగా ఉంది. ఎవరు ఇస్తున్నారో గానీ ఆమెకు సరైన న్యాయ సలహాలు ఇవ్వడం లేదు. కంపెనీ చట్టంలోని సెక్షన్ 44ను చదివితే షేర్లు అనేవి చరాస్తుల కిందకు వస్తాయి. ఇందుకు పెద్దగా చదువుకుని ఉండాల్సిన అవసరం కూడా లేదు. స్థిర, చరాస్తులను జప్తు చేసినప్పుడు, చరాస్తుల కిందకు వచ్చే షేర్లు కూడా జప్తులో ఉన్నట్లే. ఇందులో చర్చకు, వాదనకు ఆస్కారం ఏముంది? మనీలాండరింగ్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులు సరస్వతి పవర్ షేర్లకు వర్తిస్తాయి. జప్తు ఉన్న షేర్లను విక్రయించుకోవచ్చునని ఏ చట్టం చెబుతుందో షర్మిలకే తెలియాలి.

జగన్‌ను దెబ్బతీస్తున్న

అతి మంచితనం.. అతి నిజాయితీ..

- పెళ్లయిన 20 ఏళ్ల తర్వాత, తండ్రి మరణించిన 10 ఏళ్ల తర్వాత ఆస్తులిచ్చే అన్న ఉంటారా?
- తన స్వార్జితమైన కంపెనీలలో చెల్లెలికి 40శాతం వాటా ఇవ్వడానికి ఎవరైనా సిద్ధపడతారా?
- ఆ కంపెనీలలో షర్మిల పెట్టుబడి లేదు, శ్రమలేదు, అప్పులు తేలేదు.. అయినా వాటా ఇచ్చారు..
- పదేళ్ల వ్యవధిలో రూ.200 కోట్లు ఇచ్చినా కనీస కృతజ్ఞత లేని సోదరి
- సొంత అన్నపై కత్తికట్టి... శత్రువులతో కలిసి కుట్రలా..

నెటిజన్ల వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్



అతి మంచితనం.. అత్యంత నిజాయితీ!!

వైఎస్ జగన్‌ను పలుసార్లు దెబ్బ తీస్తున్నవి ఇవే!!

నెటిజన్లు, రాష్ట్ర ప్రజల్లో ఇప్పుడు మరోసారి ఇదే చర్చ జోరుగా మొదలైంది!!

తన దక్షత, ఆసక్తి, చొరవతో రాణించి స్వయంకృషితో నిర్మించుకున్న వ్యాపారాల్లో 40 శాతం ఆస్తులను 25 ఏళ్ల క్రితమే వివాహమైన సోదరికి ఇవ్వటానికి సిద్ధపడ్డారంటే అది జగన్ అతి మంచితనం కాదా? ఈ రోజుల్లో ఇలాంటి అన్న ఎంత మందికి ఉంటారు? తన నిజాయితీ చాటుకునేందుకు ఎంఓయూ చేసి మరీ సొంత చెల్లెలి చేతిలోనే ఎదురు దాడికి గురవుతుండటం అతి మంచితనం వల్ల కాదా? చేసిన పనికి కృతజ్ఞత చూపకపోగా రివర్స్‌లో కేసుల్లో ఇరికించి జైలు పాలు చేసే కుట్రలో భాగస్వామిగా మారిపోయిన చెల్లెమ్మను ఏమనుకోవాలి? అతి మంచితనమే ఆయన్ను ఇబ్బందులకు గురి చేస్తోంది. వైఎస్సార్ మరణించి పదేళ్లు అవుతోంది. ఆయన ఉండగానే కుటుంబ ఆస్తులను పంచి ఇచ్చారు. అయినప్పటికీ చెల్లిపై ప్రేమ, ఆప్యాయతతో సొంత ఆస్తుల్లో వాటా ఇచ్చేందుకు సిద్ధపడటం అతి మంచితనానికి పరాకాష్ట కాదా? అతి నిజాయితీగా ఉండటం, రాజకీయాల్లో అబద్ధాలకు ఆమడ దూరంలో ఉండటం వల్లే 2014, 2024 ఎన్నికల్లో జగన్ ఓటమి పాలయ్యారని, తరచూ సమస్యల్లో చిక్కుకుంటున్నారనే చర్చ ఇప్పుడు సర్వత్రా జరుగుతోంది. – సాక్షి, అమరావతి

1 చెల్లెలిపై ప్రేమ, అభిమానంతోనేగా..?

షర్మిల వివాహం జరిగిన 20 ఏళ్ల తర్వాత, తన తండ్రి వైఎస్సార్ మరణించిన 10 ఏళ్ల తర్వాత 2019 ఆగస్టు 31న.... జగన్ తన స్వార్జితమైన ఆస్తులు ఎందుకు ఇవ్వాలనుకున్నారు? చెల్లెలిపై ఎంతో ప్రేమ, అభిమానం గుండెల్లో ఉండబట్టే కదా? ఏ సోదరుడైనా చెల్లెలికి ఇన్ని ఆస్తులు ఇవ్వడానికి సిద్ధపడతారా?

2 ఎంఓయూపై షర్మిల కూడా సంతకం చేశారుగా?

చంద్రబాబుతో అంటకాగటమే అభిమతంలా ప్రవరిస్తున్న షర్మిల మాటలకు- చేతలకు పొంతన ఉంటే ఒట్టు!. జగన్ తనకు భవిష్యత్తులో ఇస్తానంటూ ఎంఓయూలో పేర్కొన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులని, వైఎస్సార్ జీవించి ఉన్నప్పుడే వాటిలో తనకు వాటా ఇవ్వాలని కుటుంబ మిత్రులతో చెప్పారని అంటున్న షర్మిలకు అవన్నీ జగన్ సొంతంగా సంపాదించుకున్న ఆస్తులని తెలియదా? అవన్నీ వైఎస్ జగన్ సొంతంగా ఆర్జించిన ఆస్తులని, వాటిని కేవలం చెల్లెలిపై ఉన్న ప్రేమాభిమానాలతో భవిష్యత్తులో ఆమెకు బదలాయిస్తానని ఎంఓయూలో స్పష్టంగా పేర్కొన్నారు కదా!. ఆ ఎంఓయూపై జగన్‌తో పాటు షర్మిల కూడా సంతకాలు చేశారు కదా? మరి అవన్నీ కుటుంబ ఆస్తులయితే ఆ విషయాన్ని ఎందుకు ఎంఓయూలో పేర్కొనలేదు? దానికి షర్మిల ఎందుకు అడ్డుచెప్పలేదు? పోనీ వైఎస్సార్ జీవించి ఉన్నపుడే అలా భావించి ఉంటే... జగన్‌కు సొంత కంపెనీల్లో షర్మిల కుటుంబీకులు ఒక్కరిని కూడా ఎందుకు వాటాదారుగానో, డైరెక్టరుగానో పెట్టలేదు? వేరే పవర్ కంపెనీల్లో మాత్రమే షర్మిలను ఎందుకు వాటాదారుగా పెట్టారు? ఎందుకంటే జగన్ సొంత ఆస్తులతో షర్మిలకు సంబంధం ఉండకూడదని వైఎస్సార్ భావించారు కనక. అయినా సరే... ఆయన మరణించి పదేళ్లు గడిచిపోయాక కూడా... చెల్లెలిపై ఉన్న ప్రేమాభిమానాలతో తన నాలుగు ఆస్తుల్లో 40 శాతం వాటా ఇవ్వాలని జగన్ సంకల్పించారు.

3 వైఎస్సార్ ఉండగానే ఆస్తుల పంపిణీ జరగలేదా?

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ బతికుండగానే వారసత్వపు ఆస్తుల పంపిణీ జరిగిపోయింది. 2004, 2009 సంవత్సరాలలో వైఎస్సార్ ఎన్నికల అఫిడవిట్లు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమౌతుంది. 2004లో వైఎస్సార్ పేరుతో ఉన్న ఆస్తులు ఆ తర్వాత కనిపించవు. అంటే.. వాటిని పిల్లలిద్దరికీ పంచేసినట్లు అర్థం కావడం లేదూ?

4 అపుడు సాక్షి, భారతి సిమెంట్స్ లేవా?

వైఎస్సార్ బతికి ఉన్నప్పుడే సాక్షి ఉంది, భారతి సిమెంట్స్ ఉంది. వైఎస్సార్ వాటిని ఎందుకు పంచలేదు? అంటే అవి తను సంపాదించిన ఆస్తులు కాదు కాబట్టి. అవి జగన్‌వి కాబట్టి..

5 జగన్ కంపెనీలపై హక్కు ఎలా వస్తుంది?

సాక్షి, భారతి సిమెంట్స్ ఇంకా జగన్ ప్రారంభించిన కంపెనీల్లో షర్మిల ఎలాంటి పెట్టుబడి పెట్టలేదు, ఆ కంపెనీలు నడిచేందుకు ఎలాంటి సాయమూ చేయలేదు. రిస్క్ తీసుకునే విషయంలో గ్యారెంటర్‌గా సంతకం కూడా చేయలేదు. కంపెనీల కోసం తెచ్చిన రుణాలపై షర్మిలకు ఎలాంటి సంబంధమూ లేదు. ఆ కంపెనీల నష్టాలను షర్మిల పంచుకోలేదు. ఎలాంటి కేసులనూ ఎదుర్కోలేదు. మరి వాటిపై హక్కు ఎలా వస్తుంది?

6 ఇంతకన్నా ఆధారాలు కావాలా?

భారతి సిమెంట్స్ పేరులోనే జగన్ సతీమణి భారతి పేరు ఉంది. జగతి పబ్లికేషన్స్ అనేది జగన్, భారతి పేర్లతో కలిపి పెట్టిందనేది అందరకూ తెలుసు. అవి జగన్‌వి అనేందుకు ఇంతకన్నా వేరే ఆధారాలెందుకు?

7 రూ. 200 కోట్లు ఇవ్వలేదా?

తన స్వార్జితమైన ఆస్తులివ్వడానికి ముందే పదేళ్ల వ్యవధిలో షర్మిలకు జగన్ రూ.200 కోట్లు ఇచ్చారు. ఆ విషయంలోనూ షర్మిలకు ఎలాంటి కృతజ్ఞతా లేదు.

8 డివిడెండ్ ఎలా వస్తుంది?

జగన్ కంపెనీలలో షర్మిల వాటాదారు కాదు. ఏ కంపెనీలలోనూ ఆమెకు ఒక్క శాతం కూడా షేరు లేదు. మరి రూ.200 కోట్ల డివిడెండ్ ఎలా వస్తుంది? అన్న చేసిన సాయాన్ని ఇలా మార్చి చెప్పడం వంచన కాక మరేమిటి?

9 ఇలాంటి అన్న ఎక్కడన్నా ఉన్నారా?

పెళ్లి చేసుకున్న 20 ఏళ్ల తర్వాత, వారసత్వపు ఆస్తులు పంచేసిన తండ్రి చనిపోయిన 10ఏళ్ల తర్వాత కూడా బాధ్యతగా చెల్లెలికి ఆస్తులిస్తానని ఎంఓయూ చేసే అన్న ఎవరైనా ఉంటారా? కోర్టు కేసుల తర్వాత ఆ ఆస్తులిస్తానని స్వయంగా సంతకం చేసి ఇచ్చే అన్నను ఎవరన్నా చూశారా? ఆ విషయంలోనూ షర్మిలకు కృతజ్ఞత లేదు.

10 అందరితో చెప్పి జగన్‌తో చెప్పలేదెందుకు?

వైఎస్ జగన్ సొంతంగా నిర్మించుకున్న వ్యాపారాలు కూడా కుటుంబ ఆస్తులని, వాటిలో తన పిల్లలిద్దరితో సహా మనవలు నలుగురికీ సమాన వాటా ఇవ్వాలని వైఎస్సార్ సంకల్పించారని, ఇదే విషయాన్ని బంధువులతో చెప్పారని అంటున్న షర్మిల... ఆ విషయాన్ని జగన్‌తో వైఎస్సార్ ఎందుకు చెప్పలేదనే ప్రశ్నకు సమాధానమివ్వగలరా? బంధుమిత్రులతో చెప్పిన వైఎస్సార్... ఆ వ్యాపారాలను నడిపిస్తున్న సొంత కుమారుడితో చెప్పకుండా ఉంటారా? ఒకవేళ చెప్పి ఉంటే... ఆయన మాటను విస్మరించటమో, కాదనటమో జగన్ చేసేవారా? తండ్రి మరణించాక... ఆ విషాదాన్ని తట్టుకోలేక అసువులు బాసిన పలువురు అభిమానులను కలవటానికి ఓదార్పు యాత్ర చేస్తానని పావురాలగుట్ట సాక్షిగా ప్రమాణం చేశారు జగన్. ఆ మాటను నిలబెట్టుకోవటానికి కాంగ్రెస్ అధిష్టానంతో తలపడటమే కాదు... కేసులు ఎదుర్కొన్నారు. జైలుకూ వెళ్లారు. ఆ స్థాయి వ్యక్తికి ఊహల్లో కూడా ఎదురుకానన్ని కష్టాలను భరించారు. అదీ... తండ్రి పట్ల, ప్రజల పట్ల జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్. అలాంటి జగన్‌పై షర్మిల చేస్తున్న ఈ విమర్శలకు అర్థం ఉందా అసలు? మాట కోసం ఎంత దూరానికైనా వెళ్లే జగన్... మాట తప్పారని అనటానికి అసలు నోరెలా వస్తుంది!!.

11 మరి షర్మిల కూడబెట్టిన ఆస్తుల మాటేమిటి?

పెళ్లయిన 25 ఏళ్ల వైవాహిక జీవితంలో షర్మిల కూడా కొన్ని వారసత్వ ఆస్తులను పొందారు. కొన్ని సొంతంగా సంపాదించారు. కొన్ని కంపెనీలమీద రుణాలు తీసుకుని ఆస్తులు కూడబెట్టారు. వ్యాపారాలు చేశారు. వాటిపై ఏనాడైనా జగన్ హక్కులు కోరారా? ఆమె సంపాదించుకున్న ఆస్తులు జగన్‌కు ఎలా వస్తాయి? మరి షర్మిలకు కూడా అది వర్తిస్తుంది కదా?

12 నాలుగేళ్లుగా ఎన్ని ఇబ్బందులు పెట్టినా..

జగన్ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవటానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఎందుకంటే రకరకాల కారణాలతో షర్మిల నాలుగేళ్లుగా జగన్‌ను ఇబ్బందిపెడుతున్నారు. ఆయన ప్రత్యర్థులందరితోను చేతులు కలిపారు. అసత్య ఆరోపణలు చేశారు. అయినా సరే... ఆయన క్షమించారు, ఒక్కోసారి రాజకీయంగా విమర్శల్ని తిప్పికొట్టారు తప్ప... ఇంత దారుణంగా చేస్తున్న నీకు ఎంఓయూ ప్రకారం ఆస్తులెందుకు పంచాలని ఒక్కసారి కూడా అడగలేదు. ఎంఓయూ ఊసే బయటపెట్టలేదు.

13 కృతజ్ఞత లేకపోగా.. కుట్రలా..?

''నేనింత ప్రేమాభిమానాలు చూపిస్తున్నా నువ్వు కనీసం కృతజ్ఞత చూపించటం లేదు. ఆఖరికి నా క్షేమాన్ని కాంక్షించకుండా నువ్వు వరసగా చేస్తున్న పనులు నన్ను తీవ్రంగా బాధపెట్టాయి. రాజకీయంగా వ్యతిరేకించటమే కాదు. బహిరంగంగా నువ్వు చేసిన దారుణమైన అసత్యారోపణలు నా వ్యక్తిగత ప్రతిష్ఠను కూడా దెబ్బతీశాయి. అయినా అవన్నీ నీ విజ్ఞతకే వదిలేశా. నేనైతే చాలా బాధపడ్డా'' అని ఆమెకు రాసిన తొలి లేఖలో పేర్కొన్నారు. కానీ తనను న్యాయపరంగా ఇబ్బంది పెట్టడానికి కుట్రపూరితంగా ఆస్తులు బదలాయించడాన్నే ఆయన గట్టిగా వ్యతిరేకించారు. ఇది ఎంఓయూకు విరుద్ధం కనక.. ఎంఓయూను ఆమె గౌరవించటం లేదు కనక... ఇంకా తానెందుకు ఎంఓయూకు కట్టుబడి ఉండాలని ప్రశ్నించారు. అంతేకాదు! అప్పటికీ ఒక చివరి అవకాశమిస్తూ... చెల్లెలు కనక.. మనసు మార్చుకుని, ప్రవర్తన మార్చుకుంటే భవిష్యత్తులో తన ఎంఓయూను అమలు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తానని చెప్పారు. అదీ జగన్ వ్యక్తిత్వం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 26-10-2024

స్ఫూర్తి

పవర్ ఆఫ్ సాదియా



బాలీవుడ్ సినిమా 'దంగల్'లో ఒక డైలాగ్...

'పతకాలు సాధించే విజేతలు చెట్లపై పెరగరు. కష్టపడి ప్రేమతో, అంకితభావంతో వారిని తయారు చేయాలి'

గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాదియా అల్మాస్ గురించి తెలుసుకునే క్రమంలో 'దంగల్' గుర్తుకు వస్తుంది. మల్ల యోధుడైన తండ్రి తన కూతుళ్ల రెజ్లింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కలలు కంటాడు. ఎన్నో కష్టాలు పడతాడు. సాదియా తండ్రి సందానీ కూడా అలాంటి కలల తండ్రే.

'పవర్ లిఫ్టింగ్'లో అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన సమ్దానీకి తనలోని ఛాంపియన్‌ను కూతురిలో చూసుకోవాలనుకున్నాడు. జీవిక కోసం కొబ్బరి బొండాలు అమ్ముతూ కూతురిని పవర్ లిఫ్టింగ్‌లో తీర్చిదిద్దాడు. అతడి శ్రమ వృథా పోలేదు. సాదియా అల్మాస్ అంతర్జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది.

సాదియాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. కబడ్డీ బాగా ఆడేది. 'యముడు' 'సింగం' సినిమాలలో హీరో సూర్య సాహసాలు చూసిన సాదియాకు 'పోలిస్ ఆఫీసర్' కావాలనే కల మొదలైంది. పోలీసు అంటే బలంగా ఉండాలి, ఫిజికల్ ఫిట్‌నెస్ కావాలి... అందుకే 'పవర్ లిఫ్టింగ్' లోకి వచ్చింది. తండ్రి సందానీ పవర్ లిఫ్టింగ్‌లో చేయి తిరిగిన ఆటగాడు. 'నాన్న' అనే స్కూలులో సాధన మొదలుపెట్టింది.

ఒక్కో మెట్టు ఎక్కుతూ జూనియర్ పవర్ లిఫ్టింగ్ వరల్డ్ చాంపియన్‌గా ఎదిగింది. ఉదయం కాలేజీకి వెళ్లే సాదియా సాయంత్రం 5.30గంటల నుంచి 9గంటల వరకు ప్రాక్టిస్ చేస్తుంటుంది.

'నువ్వు అమ్మాయివి. ఇంత బరువులు ఎత్తే ఆటను ఎందుకు ఎంచుకున్నావని చాలామంది అడుగుతుంటారు. నా దృష్టిలో కష్టం లేని ఆట లేదు. ప్రతి ఆటలోనూ విజయం కోసం శ్రమించాల్సిందే. మా నాన్న కష్టం ముందు నా కష్టం చాలా చిన్నది. కుటుంబ పోషణ కోసం నాన్న కొబ్బరి బోండాలు అమ్మారు. నన్ను ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టేందుకు ఎంతో కష్టపడ్డారు. మా అక్క కూడా నాన్న ప్రోత్సాహంతో వరల్డ్ వర్సిటీ పవర్‌లిఫ్టర్ పోటీలకు వెళ్లింది. ఇప్పుడు హౌస్ సర్జన్‌గా చేస్తోంది' అంటుంది సాదియా.

సాదియా ట్రాక్ రికార్డు

ఈ ఏడాది మల్టాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ జూనియర్ వరల్డ్ చాంపియన్ షిప్‌లో మూడు విభాగాల్లో కలిపి 462.5 కిలోలు లిఫ్ట్ చేసిన సాదియా '57 కిలోల విభాగంలో ఇదే నా అత్యుత్తమ ప్రదర్శన' అని చెబుతుంది. జూనియర్ విభాగంలో రెండుసార్లు వరల్డ్ చాంపియన్ పతకాలు వచ్చాయి. 2023లో షార్జాలో జరిగిన ఏషియన్ వర్సిటీ క్లాసిక్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకంతో పాటు 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏషియన్ వర్సిటీస్' టైటిల్ సాధించింది. కేరళలో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో విజేతగా, స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏషియాగా నిలిచింది. 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన కామన్ వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా, స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్‌గా, టర్కీలో వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో వెండి పతకం, 2018, 2021, 2022లో ఏషియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ విజేతగా నిలిచింది. జాతీయస్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధించింది. తాజాగా దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఎక్విప్డ్ చాంపియన్ షిప్‌లో స్క్వాట్‌లో 185 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 95 కిలోలు బరువులెత్తి మొత్తంగా 460 కిలోలు లిఫ్ట్ చేసి బంగారు పతకాలు సాధించింది.

'సాదియా' అనే పేరుకు ఉన్న అర్థాలలో విజయం, అదృష్టం అనేవి కూడా ఉన్నాయి. అయితే ఆమె విజయం కోసం అదృష్టంపై ఎప్పుడూ ఆధారపడలేదు. తండ్రిలా కష్టాన్నే నమ్ముకుంది. అందుకే తండ్రి కలను నిజం చేయగలిగింది.

– వరదా ఎస్వీ కృష్ణకిరణ్, సాక్షి, అమరావతి
ఫొటోలు: కందుల చక్రపాణి

ఆటలాడితే చదువు బాగా వస్తుంది!

నా చిన్నప్పుడు స్కూల్లో సరిగా చదవని వారిని 'స్పోర్ట్స్‌లోకి తీసుకోండి' అనేవారు. అది నా దృష్టిలో తప్పు. ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుంది. బాగా చదివే విద్యార్థి అయినా, చదువులో వెనుకబడిన వాళ్లైనా స్పోర్ట్స్‌లో ఉంటే శారీరకంగా, మానసికంగా మంచిది.



తొమ్మిదో తరగతి వరకు నాకు 60 శాతం మార్కులు వచ్చేవి. ఇప్పుడు 85 శాతంపైగా మార్కులు వస్తున్నాయి. దీనికి ఆటలే కారణం అని చెబుతాను. ఆటల్లో పడి చదువును ఎక్కడ నిర్లక్ష్యం చేస్తారోనని భయపడి ఎంతోమంది తల్లిదండ్రులు పిల్లలను ఆటల వైపు ప్రోత్సహించడం లేదు. ఇది మారాలి. ఎంబీఏ తర్వాత పీహెచ్‌డీ చేయాలని ఉంది. 'అథ్లెట్స్ మైండ్ సెట్స్ ఎడ్యుకేషన్'పై పరిశోధన చేస్తాను.

– సాదియా అల్మాస్

రిటైర్డ్ ఉద్యోగులు తమ మలివయసు జీవనం ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ప్రశాంతంగా గడిచిపోవాలని కోరుకుంటారు. కానీ, ఆరోగ్యం సహకరించకపోవడంతో నలుగురిలో కలవలేకపోవడం, ఆనందకరమైన జీవనం గడపలేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. ఇలాంటివి గుర్తించి హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. వెయ్యికి పైగా ఉన్న ఈ సభ్యులు తమకు ఆత్మీయులు ఉన్నారనే భరోసాతో ఆనందాలను కలబోసుకుంటూ, ఆరోగ్యాల గురించి సమీక్షించుకుంటూ మలివయసును ఉపయుక్తంగా మలుచుకుంటున్నారు. ఈ సంఘ సభ్యులను కలిసినప్పుడు అంతా ఒక జట్టుగా ఉంటే ఏ వయసు అయినా ఉల్లాసంగా గడిచిపోతుందనే ఆలోచనను పంచుకున్నారు.

* వయోనిధి



విశ్రాంత జీవితాన్ని ఉపయుక్తంగా...!

మేలిసంధ్య

'అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్' సంఘం హైదరాబాద్ చిక్కడపల్లిలో ఉంది. ఈ ఏడాది నాల్గవ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఈ నాలుగేళ్లలో వెయ్యికి పైగా ఉన్న సభ్యులను ఒక తాటి మీదకు తీసుకువచ్చి, తమ సమస్యలను పరిష్కరించుకోవడమే కాదు, వారి పెన్షన్‌లో నుంచి కొంత మొత్తాన్ని సేవాకార్యక్రమాలకు వినియోగిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఉల్లాస భరితమైన కార్యక్రమాల ఏర్పాటుతో కొత్త ఉత్సాహాన్ని పొందడానికి ప్రయతిస్తున్నారు.

ఆరోగ్యంగా భరోసా!

సంఘం కార్యదర్శి బుచ్చిరాజు మాట్లాడుతూ "మొన్నీమధ్య అర్ధరాత్రి ఫోన్ వచ్చింది. సనత్ నగర్‌లో ఉన్న మా సంఘ సభ్యుడు ఒకరికి హార్ట్ ఎటాక్ వచ్చింది. 'ఏ ఆసుపత్రికి తీసుకెళ్లాలి. హెల్త్ కార్డ్ ఎలా?' అనే విషయంపై ఆ సభ్యుడి కూతురు ఆందోళనగా ఫోన్ చేసింది. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. సమీప హాస్పిటల్ వాళ్లకు ఫోన్ చేసి, అంబులెన్స్‌ను పంపించడంతో పాటు, వారికి సహాయంగా ఉండటం కోసం వారి దగ్గరలో ఉన్న మరొక సభ్యుడిని అలెర్ట్ చేశాం. మాకు పెద్ద కుటుంబం అండగా ఉందన్న భరోసాను ఆ కుటుంబానికి అందించాం. ఇదే విధంగా ఇంకో సభ్యుడి సమస్య. పిల్లలిద్దరూ విదేశాలలో ఉన్నారు. తండ్రి ఒక్కడే హైదరాబాద్‌లో ఒంటరిగా ఉంటాడు. ఆరోగ్య స్థితి బాగోక ఆపద సమయంలో మమ్మల్ని సంప్రదించాడు. మేం తోడున్నామనే భరోసాను అందించాం. విశ్రాంత జీవనంలో ఉండేవి ముఖ్యంగా ఆరోగ్య సమస్యలే. పిల్లలు వారి పనుల్లో బిజీగా ఉంటారు. దీంతో ఒంటరితనంతో బాధపడుతుంటారు. కొన్ని విషయాల్లో పిల్లలు చెప్పింది వినరు. ఇలాంటప్పుడు ఏ వయసు వారిని ఆ వయసు వారితో కౌన్సెలింగ్స్ కూడా ఇప్పిస్తుంటాం..'' అంటూ తామంతా ఒకే కుటుంబంగా ఎలా ఉంటున్నదీ వివరించారు.

గాత్రంతో వీనుల విందు..

కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కమిషనర్‌గా చేసి, రిటైర్డ్ అయిన కె.రామారావు మాట్లాడుతూ "మా సంఘ సభ్యులుగా ఉన్న ఔత్సాహిక గాయనీగాయకులను ప్రోత్సహించడం కోసం కల్చరల్ విభాగం ఏర్పాటు చేశాం. ఇప్పటికి 16 మంది కళాకారులు తమ గాత్రంతో సభ్యులకు వీనుల విందు చేస్తుంటారు. ఘంటసాల, బాలసుబ్రమణ్యం వర్ధంతి, జయంతి, సుశీల బర్త్‌డే సందర్భంగా సంగీత విభావరి నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా కళాకారులు అందరినీ సన్మానిస్తుంటాం. ఈ విభాగానికి కన్వీనర్‌గా ఉన్నందుకు, ఇలా కళాసేవ చేస్తున్నందుకు ఆనందంగా ఉంద'ని తెలియజేశారు.

సంఘంలో చేరవచ్చు



ఆంధ్రప్రదేశ్ పెన్షన్‌దారులు ఎవరైనా హైదరాబాద్‌లో స్థిరపడినవారుంటే ఈ సంఘంలో చేరి, తమకంటూ మరో పెద్ద కుటుంబం ఉందన్న భరోసాతో ఆనందంగా జీవించవచ్చు.

– టిఎంబి, బుచ్చిరాజు
ప్రధాన కార్యదర్శి

పెన్షన్ నుంచి సామాజిక సేవ

ఆరోగ్య అవగాహన కల్పించడమే కాదు ఈ సంఘం సభ్యులు సామాజిక సేవలో పాల్గొంటూ తమ దాతృత్వాన్నీ చాటుకుంటున్నారు. నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా చేసిన విశ్రాంత ఉద్యోగి డి.మీరం శెట్టి మాట్లాడుతూ "ప్రతి మూడు నెలలకు ఒకసారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. ఇటీవల నిలోఫర్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు లక్ష రూపాయల విలువైన మెడికల్ పరికరాలను, సైఫాబాద్‌లో గల వైదేహి అనాథ బాలికల ఆశ్రమానికి స్కూటీని, దమ్మాయిగూడలోని వేద పాఠశాలకు పుస్తకాలు, వంట సామాగ్రిని, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ అందించాం. కోవిడ్ సమయంలో గాంధీ హాస్పిటల్ వైద్యులను, 700 మంది నర్సులను సన్మానించాం. రెండు నెలల కిందట మున్సిపల్ వర్కర్లకు, గాంధీ ఆసుపత్రి మెటర్నటీ వార్డులోని 400 మంది స్త్రీలకు చీరలు పంపిణీ చేశాం. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నా క్యాంటీన్‌కు రెండు లక్షలు, ఇటీవల వరద బాధితుల సహాయార్థం రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశాం. ఆర్మీలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాల సహాయార్థం రెండు లక్షల రూపాయలకు పైగా వితరణ చేశాం'' అని వివరించారు. ఈ మొత్తాలను సంఘ సభ్యులే తమ దయా హృదయంతో విరాళంగా ఇస్తుంటారని, వాటితోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని తెలిపిన వీరు మలివయసును మహోన్నతంగా మలుచుకుంటూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



మా సభ్యులకు వివిధ ప్రముఖ మెడికల్ ల్యాబ్‌ల నుండి, ఆసుపత్రుల నుండి ఫీజుల్లో రాయితీ వచ్చేటట్లు కృషి చేస్తున్నాం. మా సభ్యుల సౌకర్యార్థం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ సంఘానికి సంబంధించిన వివరాలతో త్రైమాసిక మ్యాగజైన్‌ని కూడా మా సభ్యులకు పంపుతున్నాం.

– డి. మీరం శెట్టి, కన్వీనర్,
ఆర్థిక సామాజిక సేవా విభాగం

మహిళా బృందం

విశ్రాంత ఉద్యోగ మహిళలను, విశ్రాంత ఉద్యోగుల సతీమణులను చైతన్య పరచి, వారు వివిధ కార్యక్రమాలలో పాల్గొనేలా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఈ విభాగంలో సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉత్సాహవంతులైన మహిళలతో కోలాట బృందాన్ని ఏర్పరచి వారికి శిక్షణను ఇచ్చి, వివిధ కార్యక్రమాలలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం.



– ఆర్ అనురాధ,
కన్వీనర్, మహిళా విభాగం



వైరల్

వారెవా డ్యాన్స్!

వయసు పెరుగుతున్న కొద్దీ అందం, నటనతో అభిమానులను ఆశ్చర్యానికి లోనయ్యేలా చేస్తున్నారు కొందరి తారామణులు. వారిలో ఇప్పుడు ముందు వరసలో చేరారు మాధురీ దీక్షిత్. విద్యాబాలన్‌తో కలిసి ఇటీవల 'అమి జె తోమార్ 3.0' యుగళగీతానికి నృత్యం చేస్తున్న షూటింగ్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. భూల్ భులయ్యా 3 సినిమాలోని ఈ పాట అక్టోబర్ 25న విడుదల అయ్యింది. ఈ సినిమా ట్రైలర్‌లో ఇప్పటికే మాధురీ దీక్షిత్‌ను చూసిన నెటిజనులు చెక్కుచెదరని ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇంక 'అమి జె తోమర్ 3.0' లో 45 ఏళ్ల విద్యాబాలన్‌తో కలిసి 57 ఏళ్ల మాధురి దీక్షిత్ చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంటోంది. 2007లో విడుదలైన భూల్ భులయ్యా సినిమాలోని ఒరిజనల్ ట్రాక్‌కి రీమేక్ ఇది. మ్యూజిక్ డైరెక్టర్ ప్రీతమ్ కంపోజ్ చేసిన ఈ పాటను శ్రేయా ఘోషల్ పాడారు.

దివ్యంగా వండండి

దీపావళి వస్తోంది...
ఇల్లంతా వెలుగులతో నిండిపోతుంది.
పిల్లల ముఖాల్లో మతాబులు వెలుగుతాయి.
మరి... వంటిల్లు బోసిపోతే ఎలాగ?
ఫ్రిజ్‌లోంచి బ్రెడ్... క్యారట్ తీయండి.
స్టవ్ వెలిగించండి...
చక్కెర డబ్బా మూత తీయండి.

వంటిల్లు

షాహీ తుకడా



కావలసినవి: బ్రెడ్ స్లయిస్‌లు -5; నీరు – టీ స్పూన్; పాలు– 3 కప్పులు; జీడిపప్పు– గుప్పెడు; పిస్తా– గుప్పెడు; బాదం – గుప్పెడు; యాలకులు – 2 (పొడి చేయాలి); నెయ్యి – అరకప్పు; చక్కెర – అర కప్పు; కుంకుమ పువ్వు – 6 రేకలు;

తయారీ: ● బాదం, పిస్తా, జీడిపప్పులను సన్నగా తరిగి పక్కన పెట్టాలి. ● అడుగు మందంగా, వెడల్పుగా ఉన్న పెనంలో చక్కెరలో నీటిని పోసి సన్న మంట మీద మరిగించాలి. చక్కెర కరిగిన తరవాత అందులో కుంకుమ పువ్వు రేకలు వేయాలి. చక్కెర తీగపాకం వచ్చిన తర్వాత దించి పక్కన పెట్టాలి. ● ఒక పాత్రలో పాలు పోసి మరిగించాలి. మధ్యలో గరిటెతో అడుగు పట్టకుండా కలుపుతూ పాలు చిక్కబడి పావు వంతుకు వచ్చే వరకు మరిగించి యాలకుల పొడి వేయాలి. ఆ తర్వాత పైన తయారు చేసి సిద్ధంగా ఉంచిన చక్కెర పాకంలో నాలుగవ వంతు వేసి కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరిగించి స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి. ఇది రబ్రీ. ● బ్రెడ్ స్లయిస్‌లను అంచులు తీసేసి త్రికోణాకారంలో కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. ● మరొక పెనంలో నెయ్యి వేడి చేసి బ్రెడ్ ముక్కలను అన్ని వైపులా దోరగా కాల్చాలి. పెనం మీద నుంచి తీసిన వెంటనే చక్కెర పాకంలో వేసి నిమిషం తర్వాత తీసి వెడల్పుగా, అంగుళం లోతు ఉన్న ప్లేట్‌లో అమర్చాలి. ఇలా అన్ని స్లయిస్‌లను వేయించి, చక్కెర పాకంలో ముంచి తీసి ప్లేట్‌లో సర్దాలి. ● ఇప్పుడు ప్లేట్‌లో ఉన్న బ్రెడ్ స్లయిస్‌ల మీద రబ్రీ పోసి, ఆ పైన బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులను చల్లాలి.

గమనిక: పాలను రబ్డీ చేసే సమయం లేకపోతే కండెన్స్‌డ్ మిల్క్ వాడవచ్చు. డయాబెటిస్ పేషెంట్‌లు తినాలంటే చక్కెర బదులుగా మార్కెట్‌లో దొరికే షుగర్ ఫ్రీ లేదా స్టీవియాలను వాడవచ్చు.

క్యారట్ బర్ఫీ



కావలసినవి: క్యారట్ – అర కిలో; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు; పాలు – కప్పు; చక్కెర – అర కప్పు; యాలకుల పొడి– అర టీ స్పూన్; పిస్తా – గుప్పెడు (తరగాలి);

తయారీ: ● క్యారట్‌ను కడిగి చెక్కు తీసి తురమాలి. ● మందపాటి బాణలిలో రెండున్నర టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేడి చేసి అందులో క్యారట్ తురుము వేసి బాగా కలిపి మూత పెట్టి మంట తగ్గించి సన్నమంట మీద పది నిమిషాల సేపు మగ్గనివ్వాలి. ● ఇప్పుడు క్యారట్ తురుములో పాలు పోసి కలిపి మూత పెట్టి నాలుగైదు నిమిషాల సేపు ఉడికించాలి. ● క్యారట్ మెత్తగా ఉడికిన తర్వాత అందులో చక్కెర, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. చక్కెర కరిగేకొద్దీ మిశ్రమం ద్రవంగా మారుతుంటుంది. కొద్ది సేపటికి తిరిగి దగ్గరవడం మొదలవుతుంది. అప్పుడు మిశ్రమం అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ బాగా దగ్గరయ్యే వరకు ఉంచాలి. ● ఈ లోపు ఒక ట్రేకి నెయ్యి రాసి క్యారట్ మిశ్రమం పోయడానికి సిద్ధం చేసుకోవాలి. ● క్యారట్ పాకం గట్టి పడిన తరవాత స్టవ్ మీద నుంచి దించి నెయ్యి రాసిన ట్రేలో పోసి సమంగా సర్ది పిస్తా పలుకులను అద్దితే క్యారట్ బర్ఫీ రెడీ. ● బర్ఫీ వేడి తగ్గిన తర్వాత చాకుతో గాట్లు పెట్టాలి. పూర్తిగా చల్లారిన తర్వాత బర్ఫీ ముక్కలను ప్లేట్ నుంచి సులువుగా వేరు చేయవచ్చు.

గమనిక: క్యారట్ మిశ్రమాన్ని ఎప్పుడు ట్రేలో పోయాలనేది స్పష్టంగా తెలియాలంటే... స్పూన్‌తో కొద్దిగా తీసుకుని చల్లారిన తరవాత చేత్తో బాల్‌గా చేసి చూడాలి. తురుము జారిపడకుండా బాల్ గట్టిగా వస్తే అప్పుడు మంట మీద నుంచి దించేయవచ్చు.

మీకుందా పింక్ బెల్ట్?

కరాటేలో పింక్ బెల్ట్ లేదు.
కాని నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్క అమ్మాయి, మహిళపింక్ బెల్ట్ కలిగి ఉండాలని అంటుంది అపర్ణ రజావత్.
ఆగ్రాతో మొదలుపెట్టి దేశంలో లక్షలాది మందికి సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్న ఈ మార్షల్ ఆర్టిస్ట్ అమెరికన్ డాక్యుమెంటరీ మేకర్ జాన్ మెక్రిటెను ఆమెపై డాక్యుమెంటరీ చేసేలా స్ఫూర్తినిచ్చింది.
'పింక్ బెల్ట్' ఇప్పుడు వివిధ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు పొందుతోంది.



కరాటేలో పింక్ బెల్ట్ లేదు. వైట్, ఆరంజ్, బ్లూ, ఎల్లో, గ్రీన్, బ్రౌన్, బ్లాక్ బెల్ట్‌లు ఉంటాయి. తర్వాతి రోజుల్లో కొన్ని కరాటే స్కూల్స్‌లో పింక్ బెల్ట్‌ను కూడా మొదలు పెట్టారు. ఇది వైట్ నుంచి ఎల్లో మధ్య స్థాయిలో ఉంటుంది. 'ఏ స్థాయిలోదైనా ప్రతి స్త్రీకి ఆత్మరక్షణ విద్య తెలిసి ఉండాలి' అంటుంది అపర్ణ రజావత్. 'మన దేశంలో అబ్బాయిలు అమ్మాయిలు సమానం కాదని చిన్నప్పటి నుంచి మెదడులో వేస్తారు. ఇప్పటికీ కూడా 'బేటీ బచావో బేటీ పఢావో' అంటున్నాం. ఎవరైనా కాపాడే వస్తువా స్త్రీ అంటే? ఇది కాదు నేర్పాల్సింది... కొడుకుకు సంస్కారం నేర్పండి... నేర్వకపోతే దండించండి... ఇది కదా నేర్పాలి' అని ప్రశ్నిస్తుందామె.



అన్నయ్యల మీద తిరగబడి...

అపర్ణ అవడానికి రాజస్థాన్ క్షత్రియ పుత్రిక అయినా తండ్రి ఉద్యోగరీత్యా ఆగ్రాలో పెరిగింది. నలుగురు అక్కచెల్లెళ్లు, ఇద్దరు అన్నయ్యలు. చిన్నప్పటి నుంచి తల ఒంచుకుని ఉండటం అపర్ణకు ఇష్టం లేదు. ఎదురు చెప్పేది. దాంతో అన్నయ్యలు ఆమెను దారిలో పెట్టాలని తరచూ గద్దించేవారు. అప్పుడు అపర్ణకు ఈ అన్నయ్యలను ఎదిరించాలంటే నేను ఏదో ఒక యుద్ధవిద్య నేర్వాలి అనుకుంది. అలా ఎనిమిది పదేళ్ల వయసులోనే కరాటేలో చేరింది. రాజ్‌పుత్‌ల ఇళ్లల్లో ఆడపిల్లల్ని అలా కరాటే నేర్పించడానికి పంపడం మర్యాద తక్కువ. అందుకని డ్రాయింగ్ క్లాస్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లేది. తల్లి ఇందుకు సహకరించింది. అలా నేర్చుకున్న కరాటేతో 12వ ఏట తన కంటే సీనియర్ బెల్ట్ ఉన్న అమ్మాయిని ఓడించడంతో పేపర్‌లో వార్త వచ్చింది. దాంతో ఇంట్లో తెలిసి గగ్గోలు రేగింది. ఆ తర్వాత తండ్రి ఆమె సామర్థ్యాన్ని గ్రహించి కరాటేలో ప్రోత్సహించాడు. 'కరాటేలో తొలి ఇంటర్నేషనల్ మెడల్ తెచ్చిన భారతీయ మహిళను నేనే' అంటుంది అపర్ణ.

నిర్భయ ఘటన తర్వాత...

చదువుకున్నాక అమెరికాలో ఉంటూ ట్రావెల్ ఏజెంట్‌గా పని చేస్తున్న అపర్ణను 2012లో నిర్భయ ఘటన కలచి వేసింది. ఆ సమయంలో అమెరికాలో ఆమె సహోద్యోగులు 'మీ ఇండియాలో ఇలాగే ఉంటుందా?' అని అడగడం మరీ అన్యాయంగా అనిపించింది. 'నా వంతుగా ఏం చేయగలను' అనుకున్నప్పుడు ఆమెకు తట్టిన సమాధానం స్వీయ రక్షణలో వీలైనంతమందికి శిక్షణ ఇవ్వడం. ఆ ఆలోచనతోనే 2016లో ఇండియా వచ్చి ఆగ్రాలో 'పింక్‌బెల్ట్ మిషన్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేవలం రెండుమూడు రోజుల వర్క్‌షాప్‌ల ద్వారా స్త్రీలకు కనీస ప్రతిఘటన విద్యలు నేర్పి పింక్ బెల్ట్‌ను బహూకరించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెంచడమే పింక్ బెల్ట్ మిషన్ లక్ష్యం.

ఆత్మరక్షణ ఈ స్త్రీలకు అక్కర్లేదా?

'ఆత్మరక్షణ గురించి స్త్రీలకు చాలా అపోహలు ఉన్నాయి. ఆ అపోహలను తీర్చాల్సిన అవసరం ఉంది' అంటుంది అపర్ణ.

అపోహ: వయసు నలభై దాటేసింది. బలహీన పడిపోయాను. కరాటే నేర్చుకోవాలా?

వాస్తవం: కరాటే ఏ వయసులోనైనా నేర్చుకోవచ్చు. తాయ్‌చిలాంటి విద్యనైతే 80 ఏళ్ల తర్వాత కూడా నేర్చుకోవచ్చు.

అపోహ: నేను ఇంటి బయటకే వెళ్లను. నాకు ఆత్మరక్షణ విద్య ఎందుకు?

వాస్తవం: స్త్రీలపై దాడులు జరిగేది ఇళ్లలోనే. అదీ అయినవాళ్ల చేతుల్లోనే. ఇంట్లో ఉన్నంత మాత్రాన రక్షణ ఉన్నట్టు కాదు.

అపోహ: నేను మంచి ఆఫీస్‌లో పని చేస్తాను. నా కొలిగ్స్ మర్యాదస్తులు.

వాస్తవం: మీరు ఎక్కడ పని చేసినా మీకు ప్రమాదం పొంచే ఉంటుంది. పార్కింగ్ ఏరియాలో మీ మీద దాడి జరిగితే?

అపోహ: నేను రెచ్చగొట్టే దుస్తులు వేసుకోను. నా జోలికి ఎవరూ రారు.

వాస్తవం: మీరు ఎలాంటి దుస్తులు ధరించినా దాడి జరిగే అవకాశం ఉంది. అత్యాచారం లైంగిక చర్య మాత్రమే కాదు... ఆధిపత్య నిరూపణ కోసం చేసే చర్య కూడా.

అపోహ: ఆడవాళ్లు ఎంత నేర్చినా మగవారితో సమానం అవుతారా?

వాస్తవం: ఆత్మరక్షణ విద్య నేర్చుకునేది మగవారి బలంతో సమానం అని చెప్పడానికి కాదు. ప్రమాదం జరిగినప్పుడు మెదడు మొద్దుబారి లొంగిపోకుండా ఫైట్‌బ్యాక్ చేసే సన్నద్ధత కోసం.

ఆ లక్ష్యంతో ఇప్పటికి అపర్ణ ఇండియాలోని నాలుగైదు రాష్ట్రాల్లో ఇప్పటికి 2 లక్షల మంది అమ్మాయిలు, మహిళలకు వర్క్‌షాప్‌ల ద్వారా ఆత్మరక్షణ నేర్పింది. దీని కోసం ఫుల్‌టైమ్ మాస్టర్స్‌ను తీర్చిదిద్దింది. అమెరికాలోని భారతీయుల కోసం కూడా ఈ శిక్షణ కొనసాగిస్తోంది.



డాక్యుమెంటరీ నిర్మాణం

అపర్ణ రజావత్ కృషి గురించి దేశ విదేశాల పత్రికలు రాశాయి. అలా ఆమె కథ హాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది. దర్శకుడు మెక్‌క్రయిట్ ఆమెను పిలిచి ఏకంగా సినిమాయే తీస్తానని చెప్పాడు. కాని వాస్తవిక స్ఫూర్తి అందరికీ అందాలంటే డాక్యుమెంటరీ చాలని కోరింది అపర్ణ. అలా 'పింక్ బెల్ట్' పేరుతో 79 నిమిషాల డాక్యుమెంటరీ తయారయ్యి ప్రస్తుతం అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు పొందుతోంది. షికాగో, న్యూబరీ పోర్ట్, జైపూర్ ఫెస్టివల్స్‌లో పింక్ బెల్ట్ హర్షధ్వానాలు అందుకుంది. యూట్యూబ్‌లో దీని ట్రైలర్ తాజాగా విడుదలైంది.



వెనకటి తరంలో పిల్లలకు తండ్రి దగ్గర అంత చనువుండేది కాదు. వారికి ఏం కావాలన్నా అమ్మతో రికమెండ్ చేయించుకోవాల్సిందే. నాన్న వస్తున్నాడంటే ఎక్కడి ఆటలు అక్కడ ఆపేసి వచ్చి పుస్తకాలు ముందరేసుకుని చదువుతున్నట్టు యాక్షన్ చేసేవాళ్లు. అయితే ఆ తరం మారిపోయింది.

ఇప్పుడు పిల్లలు అమ్మ కన్నా నాన్నతోనే ఎక్కువ చనువుగా ఉంటున్నారు. తమకు కావలసిన వాటిని నాన్నతోనే అమ్మకు రికమెండ్ చేయించుకుంటున్నారు.

మీ పిల్లలు కూడా అలాగే చేస్తుంటారా?

నాన్న కూచులు



నాన్నలు ప్రాక్టికల్

చాలా విషయాలలో అమ్మలకన్నా నాన్నలు ఎక్కువ ప్రాక్టికల్‌గా ఉంటారు. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారు. చిన్నారుల చిన్ని జీవితంలో ఎదురయ్యే రకరకాల సమస్యలు, సవాళ్లను ప్రాక్టికల్‌గా ఏ విధంగా చూడాలో వివరిస్తూనే, వాటిని అధిగమించేందుకు సాయం చేస్తారు. అంతేకాదు, దేనినైనా రెండు వైపుల నుంచి ఏ విధంగా ఆలోచించాలో తండ్రులే పిల్లలకు నేర్పుతారు.

నాన్న దగ్గరుంటే నిశ్చింత

పిల్లలకు ఏమైనా సమస్య అంటే తోటి పిల్లల నుంచి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 'మా నాన్నతో చెబుతా' అని వారికి వార్నింగిస్తుంటారు. ఎందుకంటే వాళ్ల దృష్టిలో నాన్నే హీరో. సర్వశక్తిమంతుడు. నాన్నకు చెబితే ఏ పని అయినా తేలిగ్గా అయిపోతుందని, దానికి తిరుగుండదని వాళ్ల భావన. అందుకే నాన్న వాళ్లకొక నిశ్చింత.

ఆటలు... పాటలు

చాలామంది నాన్నలు ... పిల్లలతో ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ చాలా సరదాగా ఉంటారు. కొత్త కొత్త ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్ ఆడడంలో మెలకువలు చెప్పి సాయం చేస్తుంటారు. అమ్మలతో పోల్చితే ఆటల విషయంలో ఆంక్షలు తక్కువ. తమని ఒంటరిగా పంపడానికి భయపడుతుంటే స్కూల్‌లో టీచర్లు ప్లాన్ చేసే టూర్లకు, ఎక్స్‌కర్షన్లకు అమ్మలకు నచ్చజెప్పి ఒప్పించి మరీ వాళ్లకు కావలసినంత పాకెట్ మనీ ఇచ్చి సాగనంపుతారు.

ఆంక్షలు తక్కువ

అమ్మతో పోల్చితే నాన్న దగ్గర ఆంక్షలు తక్కువ... ఉదాహరణకు అబ్బబ్బా.. ఆ షూస్ విప్పకుండా అలా లోపలికి వచ్చేస్తావెందుకు... ఛీ.. యూనిఫారమంతా ఇంకు పూసేసుకున్నావు... దీనిని బాగు చేసేదెలా? తీసుకెళ్లిన పుడ్డంతా బుద్ధిగా తినకపోయావో.... ఇంకేం లేదు.. ఈ ఎగ్జామ్స్‌లో మార్కులు తక్కువ వస్తే ఊరుకోను... ఇటువంటి ఆంక్షలు నాన్నల దగ్గర ఉండవు.

నాన్నంటే ఓ సాహసం

పిల్లలకు నాన్నంటే నిజంగా ఓ అడ్వెంచర్. గోడలెక్కడం, చెట్లెక్కడం, గంతులు పెట్టడం... సైకిల్ మీద సవారీలు, కారు, బైకు డ్రైవింగ్ నేర్పించడం... ఇలా కొత్తగా ఏదైనా చెయ్యడం... లాంటివాటికి నో చెప్పక సై అంటారు.

తండ్రితో తీపి జ్ఞాపకాలు

సెలవుల్లోస్తే బయటికి తీసుకెళ్లడం, ఆటలు ఆడించడం, సినిమాలకు, జూలకి తీసుకెళ్లడం, కోరిన చోటుకు తీసుకెళ్లి దిగబెట్టి రావడం... ఇలాంటి జ్ఞాపకాలెన్నో తండ్రులతో బిడ్డలకు ముడిపడి ఉంటాయి. అందువల్ల నాన్నంటే వాళ్లకు చాలా ఇష్టం.

నాన్న... నవ్వురస భరితం

చాలామంది తండ్రులు పిల్లలతో హాయిగా జోకులు వేస్తుంటారు. లేదంటే చిన్న చిన్న కామెడీ సీన్లు కూడా సృష్టిస్తుంటారు. ఏం చేసినా, పిల్లలు హాయిగా నవ్వుకునేలా చేస్తారు. గంభీరంగా ఉన్న ఇంటి వాతావరణాన్ని తమ జోకులు, కామెడీ సీన్లతో తేలిగ్గా మార్చేసి, నవ్వుల పువ్వులు విసురుతారు.

> **తండ్రి వస్తుంటే... చేస్తున్న చిలిపి పనులు ఆపేసి తటాలున తలుపు చాటున దాక్కునే పిల్లలు ఇప్పుడు దాదాపు ఎక్కడా కనిపించట్లేదు. తండ్రులు కూడా పిల్లలకేసి ఉరిమి చూడటం లేదు. పిల్లల అల్లరిని ఆనందంగా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రేమతో ప్రోత్సహిస్తున్నారు**

రోల్ మోడల్స్

పిల్లలందరికీ నాన్నలే వాళ్ల రోల్ మోడల్. జీవితంలో ఎదురయే సమస్యలు, సవాళ్లను తట్టుకుని దృఢంగా ఎదిగే నాన్నలు తమను తాము రోల్‌మోడల్స్‌గా మలచుకుంటారు. పిల్లలతో గాఢానుబంధాన్ని ఏర్పరుచుకుంటూనే, బాధ్యతలను సక్రమంగా ఎలా నెరవేర్చుకోవాలో పిల్లలకు నేర్పకనే నేర్పుతారు.

ఇక్కడ మనం నాన్న గురించి ఎన్నో విషయాలు చెప్పుకున్నాం... అలా అని అందరి నాన్నలూ అలా ఉండకపోవచ్చు. ఉండాలనీ ఏం లేదు. కాకపోతే పూర్వం కన్నా పరిస్థితులలో మార్పులు వచ్చాయి. ఇప్పటి కాలం పిల్లలు నాన్నలతో ఫ్రీగా ఉంటున్నారు. నాన్నలు కూడా గాంభీర్యాన్ని విడిచిపెట్టేశారు. నాన్నలతో గాఢమైన బంధం ఉండే కూతుళ్లు ఎందరో ఉన్నారు. అలాగే అమ్మలను రోల్‌మోడల్స్‌లా తీసుకునే కొడుకులూ ఉన్నారు.



అమెరికా వ్యాప్తంగా దాదాపు 6,000 భారతీయ రెస్టారెంట్లు ఉన్నాయి. గత ఏడాది ఇవి అమెరికా సంయుక్త దేశాల రెస్టారెంట్ మార్కెట్‌లో దాదాపు 1 శాతం వాటాను ఆక్రమించడం విశేషం. ఇక మిషెలిన్ గైడ్ రెస్టారెంట్లలో భారతీయ రుచులను కోరుకుంటున్న వారు మూడు శాతంపైనే ఉన్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

భారతీయ యోగాకు పెద్దపీట

భారతీయ యోగా... యోగులు, రుషులు మనకందించిన అపూర్వ విజ్ఞానమిది. ఇప్పుడీ విజ్ఞానం విదేశీయులను విస్మయపరుస్తోంది. మానసిక, శారీరక ఆరోగ్యాల సాధనకు దీన్ని మించిన సాధనం లేదని పాశ్చాత్యులు భావిస్తున్నారు. 2023 నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉన్న మొత్తం యోగా స్టూడియోల సంఖ్య 36,000 పైమాటే!

అమెరికాలో లాయర్లో 1.3 శాతం మంది, జర్నలిస్టుల్లో దాదాపు మూడుశాతం మంది భారతీయ సంతతికి చెందినవారే.

డాలర్లు కురిపిస్తున్న ఇండియన్ సినిమాలు

2015 నుంచి 2023 మధ్య వివిధ బాషలకు చెందిన 96 భారతీయ సినిమాలు అమెరికాలో విడుదలయ్యాయి. నార్త్ కరోలినా ప్రాంతంలో ఇండియన్ సినిమాకు మంచి మార్కెట్ ఉంది. ఈ కారణంగానే ఇక్కడ విడుదలైన ఒక్కో సినిమా దాదాపు ఒక మిలియన్ డాలర్లకు తక్కువ వసూళ్లను రాబట్టలేదు. మొత్తంగా చూస్తే వీటివిలువ 340 మిలియన్ల అమెరికన్ డాలర్లు

స్పెల్ బీ లోనూ మన కూనలదే హవా

స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీలో భారతీయ సంతతి విద్యార్థుల హవా కొనసాగుతోంది. ఆ ఏడాది విజేత బృహత్ సోమ సహా భారతీయ సంతతి విద్యార్థులు ఈ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ఈ పోటీల్లో 2000 నుంచి 2023 వరకూ మొత్తం 34 మంది విజేతలుగా నిలవగా వారిలో 28 మంది మన విద్యార్థులే కావడం మనందరికీ గర్వకారణం.

లైఫ్@360

గుండెపోటుకు అలారమ్



రోజూ ఉదయం అలారమ్ మోతతో నిద్రలేస్తున్నారా? అలారమ్ మోత ఎంతటి నిద్ర నుంచి అయినా ఇట్టే మేలుకొలుతోందా? మొద్దు నిద్ర నుంచయినా సరే ఠక్కున నిద్రలేపగలిగినంత రింగ్ పెట్టుకుంటున్నారా?

మన డైలీ రొటీన్ ఇలా అలారమ్‌తో మొదలవుతోందంటే గుండె వ్యాధులకు ఆహ్వానం పలుకుతున్నట్లే. సాధారణంగా నిద్ర సరిపోయి నిద్రలేచే వారితో పోలిస్తే గట్టి అలారమ్ మోతతో నిద్రలేచే వాళ్లలో బీపీ 74 శాతం ఎక్కువగా నమోదవుతోంది. ఇది బీపీ నార్మల్‌గా ఉన్న వారి సంగతి. హైబీపీ, గుండె సమస్యలు ఉన్న వారిలో రిస్క్ మరింత ఎక్కువగా ఉంటుంది. ఎనిమిది గంటల మంచి నిద్ర లేకనే నిద్రలేచినప్పుడు నిద్రలేచిన తర్వాత కనీసం రెండు గంటల సేపు స్తబ్దుగా గడుస్తుంది. మంచి నిద్రకు ఒక్కసారిగా అంతరాయం కలిగితే భయం, ఆందోళనలతో కార్టిసోల్ (స్ట్రెస్ హార్మోన్) స్థాయులు పెరుగుతాయి. మానసిక ఒత్తిడి, గుండెకొట్టుకునే వేగం కూడా గణనీయంగా పెరుగుతుందని పరిశోధనలు తెలియచేస్తున్నాయి. మరి... అలారమ్ మోగకపోతే నిద్ర లేచేదెలాగ? నగరంలో కోడి ఉండదుగా అంటారా?



సూర్యుడున్నాడుగా!

నిద్రపోయే గదిలోని సహజమైన వెలుతురు ప్రసరిస్తుంటే మెలకువ దానంతట అదే వస్తుంది. సూర్యరశ్మి గదిలోకి ప్రసరిస్తే మెలటోనిన్ హార్మోన్ (స్లీప్ హార్మోన్) లెవెల్స్ పడిపోతాయి. దాంతో దేహం నిద్ర నుంచి మేల్కొంటుంది. గదిలోకి సహజమైన వెలుతురును స్వాగతించడంతోపాటు డైలీ స్లీప్ షెడ్యూల్ (రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం)ను కచ్చితంగా పాటిస్తే నిద్రలేవడానికి అలారమ్ సహాయం అవసరమే ఉండదు. ఇప్పటికే అలారమ్ మోగితే తప్ప లేవాలని తెలియనంతగా అలారానికి అడిక్ట్ అయి ఉంటే అలారమ్ సౌండ్ మరీ బడి గంట కొట్టినట్లు కాకుండా మెలోడియస్‌గా ఉండేటట్లు చూసుకోవాలి. ఏ నెలకో రెండు నెలలకో ఓ సారి తెల్లవారు ఝామున రైలందుకోవడానికి అలారం సౌండ్ బిగ్గరగా పెట్టుకోక తప్పదు. కానీ రెగ్యులర్ ప్రాక్టీస్‌లో పెద్ద శబ్దంతో అలారం మేలుకొలుపు మంచిది కాదు.

దోమలకు శత్రువులు

దోమలు, ఈగల బెడద లేని చోట్లు అంటూ ఉండవంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా దోమలను తొలగించడానికి మస్కిటో కాయిల్స్, ఓడోమాస్ లాంటి రకరకాల క్రీములు, ఇంకా అనేక ఉత్పత్తులు మార్కెట్లో లభిస్తున్నాయి. వీటి వాడకం వల్ల రకరకాల దుష్ఫలితలు కూడా ఉన్నాయి. అయితే అలా కాకుండా సింపుల్‌గా కొన్ని రకాల మొక్కలను పెంచుకోవడం ద్వారా కూడా దోమలను అరికట్టవచ్చంటున్నారు. అవేంటో చూద్దామా...





బంతి మొక్క

బంతిపూల సీజన్ ఇది. ఒక మొక్క తెస్తే చాలు బంతిపువ్వులు విపరీతంగా పూస్తాయి. బాల్కనీ అందాన్ని పెంచే బంతి మొక్కను కొని ఇంటికి తెచ్చుకుని కుండీలో నాటండి. బంతిపూల మొక్కల నుంచి వచ్చే వాసన దోమలకు అలెర్జీలా ఉంటుంది. బంతి మొక్క ఉంటే ఒక్క దోమలే కాదు కీటకాల బెడదను కూడా తప్పించుకోవచ్చు.

పుదీనా మొక్క

తాజా పరిమళంతోపాటు ఆహారానికి మంచి రుచినిచ్చే వాటిలో పుదీనా ఒకటి. మనకైతే దాని వాసన చాలా ఇంపుగా ఉంటుంది కానీ దోమలు, ఇతర కీటకాలకు మాత్రం దాని వాసన పడదు. అందువల్ల కుండీలో నాలుగు పుదీనా మొక్కలు పెంచుకుంటే కావలసినప్పుడల్లా నాలుగు ఆకులు నమిలి నోటిని తాజాగా ఉంచుకోవడంతో పాటు దోమలను తరిమేయవచ్చు. కాబట్టి చిన్న కుండీల్లో పుదీనా మొక్కలు పెంచడం అలవాటు చేసుకోండి.

వీటితోపాటు లెమన్ గ్రాస్ ప్లాంట్, లావెండర్ మొక్క కూడా దోమలను తరిమికొడతాయని పరిశోధనల్లో తేలింది. వీలున్న వాటిని తెచ్చుకుని పెంచుకోండి.

సినిమా

అందుకే జ్యోతిర్లింగాలను సందర్శించాం

- మంచు విష్ణు



● మోహన్‌బాబు, విష్ణు

"పరమ శివుడి పరమ భక్తుడి కథగా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. అందుకే ఈ చిత్రం విడుదలకు ముందే 12 జ్యోతిర్లింగాలను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేష్‌కు రావడం ఆనందంగా ఉంది. మా ఎపిక్ యాక్షన్ చిత్రమైన 'కన్నప్ప' విడుదల కోసం యూనిట్ అంతా ఎదురుచూస్తున్నాం'' అని హీరో మంచు విష్ణు అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు విష్ణు హీరోగా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా 'కన్నప్ప' చిత్రయూనిట్ పన్నెండు జ్యోతిర్లింగాల సందర్శన యాత్రను చేపట్టింది. రిషికేశ్ సందర్శనతో వారి ప్రయాణం ముగిసింది. ఈ యాత్రలో మోహన్‌బాబు, విష్ణు, ముఖేష్ కుమార్ సింగ్, నటుడు అర్పిత్ రంకా పాల్గొన్నారు. ''ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి ఇతిహాసాల స్ఫూర్తితో 'కన్నప్ప' రూపొందింది. భక్తి, శౌర్యం, ఆధ్యాత్మిక అన్వేషణతో కూడిన ప్రయాణంగా ఈ మూవీ ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



● చిరంజీవి ● నాగార్జున

ఈ సంవత్సరం మాకు ప్రత్యేకం

- నాగార్జున

దివంగత ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు పేరుతో ఇస్తున్న 'ఏఎన్‌ఆర్' అవార్డు వేడుకని ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 20న ఏఎన్ఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది 'ఏఎన్ఆర్' అవార్డుని హీరో చిరంజీవికి ఇవ్వనున్నట్లు నాగార్జున పేర్కొన్న విషయమూ తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం చిరంజీవిని కలిసిన నాగార్జున అవార్డు వేడుకకి రావాలంటూ ఆహ్వానించారు. ''మా నాన్న ఏఎన్ఆర్‌గారి శత జయంతి వేడుకలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం మాకు చాలా ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా ఈ అవార్డు వేడుకకి అమితాబ్ బచ్చన్ గారు, చిరంజీవిగారిని ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు ఫంక్షన్‌ను మరపు రానిదిగా చేద్దాం'' అంటూ తన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు నాగార్జున. ఈ అవార్డు ప్రదానోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. ఇక ఇప్పటివరకూ దేవానంద్, షబానా అజ్మీ, అంజలీ దేవి, వైజయంతీ మాల బాలి, లతా మంగేష్కర్, కె. బాలచందర్, హేమ మాలిని, శ్యామ్ బెనెగల్, అమితాబ్ బచ్చన్, ఎస్.ఎస్. రాజమౌళి, శ్రీదేవి, రేఖ వంటి దిగ్గజాలు 'ఏఎన్ఆర్' అవార్డును అందుకున్నారు.

అప్పుడు ప్రేక్షకులకు బోర్ కొడుతుంది!



● సాయి పల్లవి

నటనకు ప్రాధాన్యం ఉండే, మనసుని హత్తుకునే పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తుంటారు సాయిపల్లవి. దక్షిణాదిలో తనకంటూ ఎంతో గుర్తింపు, ఫ్యాన్ ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్న ఈ బ్యూటీ 'రామాయణ' సినిమాతో బాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. కాగా శివ కార్తికేయన్ హీరోగా సాయిపల్లవి హీరోయిన్‌గా నటించిన 'అమరన్' తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా సాయి పల్లవి మాట్లాడుతూ... బాలీవుడ్ పీఆర్ ఏజెన్సీల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ''ఇటీవల బాలీవుడ్‌కు చెందిన ఒక వ్యక్తి నాకు ఫోన్ చేశారు. తరచూ వార్తల్లో నిలవడం కోసం మీరు పీఆర్ టీమ్‌ను నియమించుకుంటారా? అని అడిగారు. పీఆర్ టీమ్ వల్ల తరచుగా వార్తల్లో ఉండగలను... అందరూ నా గురించి మాట్లాడుకుంటారు. అది నాకు ఇష్టం లేదు. ఎందుకంటే నా సినిమాలు రిలీజైనప్పుడు ఎలాగూ నేను ఇంటర్వ్యూలు ఇస్తున్నాను. అప్పుడు ప్రేక్షకులు, ఫ్యాన్స్ నా గురించి మాట్లాడుకుంటారు. సినిమా రిలీజ్ తర్వాత కూడా నా పేరు వినిపిస్తూనే ఉండాల్సిన అవసరం ఏముంది? పైగా నిత్యం నా గురించి మాట్లాడితే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది.. విసుగొస్తుంది.. అందుకే నేను పీఆర్ టీమ్ వద్దని చెప్పాను'' అంటూ సాయి పల్లవి చెప్పారు.

నిజం గ్రహించలేక...



● ఆరాధ్యా దేవి

ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తన ఆర్జీవీ డెన్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'శారీ'. ఆరాధ్యా దేవి, సత్య యాదు ప్రధాన పాత్రధారులు. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్జీవీ- ఏఏఆర్‌వీఐ ప్రొడక్షన్స్‌పై రవివర్మ నిర్మించారు. ఈ సినిమాని డిసెంబరు 20న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ముత్యాల రాందాస్ రిలీజ్ చేయనున్నారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా భయానకమైన బంధాలకు తెరలు లేపుతోంది. సోషల్ మీడియా జనానికి మేలు చేయకపోగా యాంటీ సోషల్ మీడియాగా మారుతోంది. అమ్మాయిలు అందులోని నిజాలను గ్రహించలేక ఆకర్షితులవుతున్నారు. మితిమీరిన ప్రేమ ఎంత భయంకరంగా మారొచ్చు? అనేది ఈ చిత్రంలోని ప్రధానాంశం'' అన్నారు. ''పలు నిజజీవిత ఘటనలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'శారీ'' అన్నారు రవి వర్మ.

ఇఫీలో కల్కి... 35: చిన్న కథ కాదు

- నవంబరు 20 నుంచి 28 వరకూ ఇఫీ ఉత్సవాలు
- ప్రారంభ చిత్రంగా 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' ప్రదర్శన



● 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' పోస్టర్



● 'కల్కి' పోస్టర్



● '35 చిన్న కథ కాదు' పోస్టర్

ఒక భారీ చిత్రం... ఒక చిన్న చిత్రం... తెలుగు పరిశ్రమ నుంచి ఈ రెండు చిత్రాలు గోవాలో జరగనున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో ప్రదర్శితం కానున్నాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మించిన భారీ చిత్రం 'కల్కి', నివేదా థామస్, విశ్వదేవ్, ప్రియదర్శిల కాంబినేషన్‌లో నందకిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా నిర్మించిన చిన్న చిత్రం '35: చిన్న కథ కాదు' ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శనకు ఎంపికయ్యాయి. దేశ వ్యాప్తంగా పోటీలో నిలిచిన 384 ఫీచర్స్ ఫిల్మ్స్‌లో మెయిన్ స్ట్రీమ్ విభాగంలో 5 చిత్రాలను, ఇండియన్ పనోరమా విభాగంలో 20 చిత్రాలను... మొత్తంగా 25 చిత్రాలను ఎంపిక చేశారు. ఇక నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో పోటీలో నిలిచిన 262 చిత్రాల్లో 20 చిత్రాలను ఎంపిక చేశారు. ప్రధాన స్రవంతి విభాగంలో ప్రదర్శితం కానున్న 5 చిత్రాల్లో 'కల్కి', ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శితం కానున్న 20 చిత్రాల్లో '35: చిన్న కథ కాదు' ప్రదర్శితం కానున్నాయి. మలయాళ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' కూడా మెయిన్ స్ట్రీమ్ విభాగంలో ప్రదర్శితం కానుంది. ఇక కురుక్షేత్ర యుద్ధంతో మొదలై, అక్కణ్ణుంచి 6 వేల సంవత్సరాల తర్వాతి కథతో దాదాపు రూ. 600 కోట్లతో రూపొందిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ మూవీ 'కల్కి' హాలీవుడ్ సినిమాని తలపించి, భారీ వసూళ్లను రాబట్టి, ఘనవిజయం సాధించింది. ఇక కుమారుడు పాస్ మార్కులు తెచ్చుకోవాలని ఓ తల్లి పడే తపనతో రూపొందిన '35: చిన్న కథ కాదు' ఎమోషనల్‌గా ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది.



> **నాన్ ఫీచర్ ఫిల్మ్స్ విభాగంలో ప్రదర్శనకు ఎంపికైన చిత్రాల్లో బెంగాలీ చిత్రం 'మొనిహార' ఒకటి. కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న సుభాదీప్ బిస్వాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అదే ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్ ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన మొనిహార కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఇక గతంలో వారాల అన్వేష సినిమాటోగ్రాఫర్‌గా రూపొందిన 'అపార్, 'నవాబీ శౌక్' చిత్రాలు ఇండో బంగ్లాదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో సహా పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమయ్యాయి. ఇంకా తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన పట్నాల పై అన్వేష్ తీసిన డాక్యుమెంటరీ బతుకమ్మ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది.**

ప్రారంభ చిత్రంగా 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్'

ఇండియన్ పనోరమా విభాగంలో ప్రారంభ చిత్రంగా హిందీ 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్'ని ప్రదర్శించనున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్న యోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జీవితం ఆధారంగా రూపొందిన ఈ బయోపిక్‌లో టైటిల్ రోల్‌ను రణ్‌దీప్ హుడా పోషించారు. అది మాత్రమే కాదు.. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు ఒక రచయితగా, ఓ నిర్మాతగానూ వ్యవహరించారు రణ్‌దీప్. ముందు మహేశ్ మంజ్రేకర్ దర్శకత్వంలోనే ఈ చిత్రం ఆరంభమైంది. అయితే క్రియేటివ్ పరంగా ఏర్పడ్డ మనస్పర్థల వల్ల ఆయన తప్పుకున్నారు. ఆ తర్వాత రణ్‌దీప్ దర్శకత్వ బాధ్యతను నిర్వర్తించారు. ఈ చిత్రంలో చరిత్రను ఏకపక్షంగా చూపించారంటూ కొన్ని విమర్శలు ఎదురైనప్పటికీ నటీనటుల నటనకు ప్రశంసలు లభించాయి. రణ్‌దీప్ టైటిల్ రోల్‌లో అంకితా లోఖండే, అమిత్ సాయి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.

దక్షిణాది ప్రముఖులకు జ్యూరీలో చోటు లేదు

'ఇఫీ' ఉత్సవాల్లో మొత్తం 25 ఫీచర్ ఫిల్మ్స్, 20 నాన్ ఫీచర్ ఫిల్మ్స్ ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులు జ్యూరీలో ఉంటారు. ఫీచర్ ఫిల్మ్స్ ఎంపిక కోసం 12 మంది సభ్యులతో కూడిన జ్యూరీ, నాన్ ఫీచర్ ఫిల్మ్స్ కోసం ఆరుగురు సభ్యులతో కూడిన జ్యూరీ సినిమాలను ఎంపిక చేసింది. అయితే దక్షిణాదికి చెందిన ప్రముఖులు ఎవరూ జ్యూరీలో లేకపోవడం గమనార్హం. ఇక గోవా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహించనున్న ఈ 55వ 'ఇఫీ' వేడుకలు నవంబరు 20న ఆరంభమై 28న ముగుస్తాయి.

సాక్షి బిజినెస్
శనివారం
26-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	663	79,402
నిఫ్టీ ▽	219	24,181

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,613	△	158
డోజోన్స్	42,141	▽	233
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▽	21
డాక్స్	19,464	△	21
షాంఘై	3,300	△	19
నికాయ్	37,914	▽	229

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99 స్వచ్ఛత)	78,015	▽	231
బంగారం (95 స్వచ్ఛత)	77,703	▽	230
వెండి (కేజీ)	95,800	▽	1693

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.67	84.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.73	110.57
€	యూరో	ఒకటి	89.80	92.42
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.76	56.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.71	56.90
S$	సింగపూర్ డాలర్		61.57	66.24
SAR	సౌదీ రియాల్		21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్		22.00	23.78
¥	చైనా యువాన్		10.92	12.75

మెగా ఐపీఓ ముసలం!



అలుపెరగని బుల్ రన్‌తో రికార్డుల మోత మోగించిన స్టాక్ మార్కెట్లు ఇప్పుడు రివర్స్ గేరేశాయి. అటు పశ్చిమాసియాలో యుద్ధ భయాలు.. విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనం ఇలా కారణాలేవైనా నిన్న మొన్నటిదాకా జోష్ మీదున్న ఇన్వెస్టర్లు పెట్టుబడులకు వెనకడుగు వేస్తున్నారు. ఐపీఓల వరద వెల్లువెత్తినప్పుడల్లా... మెగా ఐపీఓలు దూసుకొచ్చిన ప్రతి సారీ... మార్కెట్ భారీగా కరెక్షన్‌కు గురవుతుండటం విశేషం. భారీ ఐపీఓలు లిస్టింగ్‌లో బోల్తా కొట్టడమే కాకుండా, మార్కెట్లో ప్రతికూల సెంటిమెంట్‌కు ఆజ్యం పోయడం గమనార్హం!

గత మెగా ఇష్యూల సంగతిదీ..

(ఆర్‌ప)వర్

లిస్టింగ్ – ఫిబ్రవరి 11, 2008 (నిధుల సమీకరణ – రూ.11,563 కోట్లు)
సబ్‌స్క్రిప్షన్ – 73 రెట్లు (రిటైల్ 15 రెట్లు)
ఇష్యూ ధర – రూ. 450
లిస్టింగ్ ధర – రూ. 599 (33 శాతం ప్రీమియం)
ముగింపు ధర – రూ. 372 (17 శాతం డౌన్)
ఆల్‌టైం కనిష్టం – రూ. 1. ప్రస్తుత ధర రూ. 40 (ఆల్‌టైమ్ గరిష్టం రూ. 544)
నిఫ్టీ – అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభంతో 2008 జనవరిలో అప్పటికే మన మార్కెట్ కుప్పకూలింది. 4 ఏళ్ల బుల్ రన్‌తో నిఫ్టీ 6,357 పాయింట్ల ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకి.. అదే నెలలో 4,449 పాయింట్లకు (30%) క్రాష్ అయింది. ఆర్‌పవర్ లిస్టింగ్ షాక్ దీనికి తోడైంది. నిఫ్టీ 2008 అక్టోబర్‌లో 2,253 పాయింట్ల కనిష్టానికి (65 శాతం) కుప్పకూలి బాటమ్ అవుట్ అయింది.

కోల్ ఇండియా

లిస్టింగ్ – నవంబర్ 4, 2010 (నిధుల సమీకరణ – రూ.15,200 కోట్లు)
సబ్‌స్క్రిప్షన్ – 15.28 రెట్లు (రిటైల్ 2.31 రెట్లు)
ఇష్యూ ధర – రూ. 245
లిస్టింగ్ ధర – రూ. 288 (17% ప్రీమియం)
ముగింపు ధర – రూ. 342 (40% అప్)
ఆల్‌టైం కనిష్టం – రూ. 94. ప్రస్తుత ధర రూ. 477 (ఆల్‌టైమ్ గరిష్టం రూ. 544)
నిఫ్టీ – 2010 నవంబర్‌లో సూచీ 6,338 పాయింట్లను తాకింది (ఆల్‌టైమ్ గరిష్టం 6,357). దీంతో కోల్ ఇండియా లిస్టింగ్‌లో ఇన్వెస్టర్లకు దండిగానే లాభాలు పంచింది. అయితే, ఆ తర్వాత నుంచి మళ్లీ మార్కెట్లో కరెక్షన్ మొదలైంది. 2011 డిసెంబర్‌లో నిఫ్టీ 4,531కి పడింది. అంటే దాదాపు 30 శాతం కరెక్షన్ జరిగింది.

ఎల్‌ఐసీ

ఐపీఓ లిస్టింగ్ – మే 17, 2022 (నిధుల సమీకరణ – రూ.21,008 కోట్లు)
సబ్‌స్క్రిప్షన్ – 2.95 రెట్లు (రిటైల్ 1.99 రెట్లు)
ఇష్యూ ధర – రూ. 949
లిస్టింగ్ ధర – రూ. 872 (8.6% డిస్కౌంట్)
ముగింపు ధర – రూ. 875 (8.5% డౌన్)
ఆల్‌టైం కనిష్టం – రూ. 530. ప్రస్తుత ధర రూ. 912 (ఆల్‌టైమ్ గరిష్టం రూ. 1,183)
నిఫ్టీ – మార్కెట్ కరెక్షన్ కొనసాగుతున్న దశలో ఇది పేలవంగా లిస్టయింది. అయితే, 2022 జూన్‌లో నిఫ్టీ బాటమ్ అవుట్ అయ్యి మళ్లీ కోలుకోవడం మొదలైంది. అయితే, ఎల్‌ఐసీ షేరు మాత్రం ఏడాదిలో రూ.530 కనిష్టానికి చేరింది.

లిస్టింగ్ – నవంబర్ 18, 2021 (నిధుల సమీకరణ – రూ.18,300 కోట్లు)
సబ్‌స్క్రిప్షన్ – 1.89 రెట్లు (రిటైల్ 1.66 రెట్లు)
ఇష్యూ ధర – రూ. 2,150
లిస్టింగ్ ధర – రూ. 1,950 (9.3% డిస్కౌంట్)
ముగింపు ధర – రూ. 1,560 (26.5% డౌన్)
ఆల్‌టైం కనిష్టం – రూ. 310. ప్రస్తుత ధర రూ. 764
నిఫ్టీ – నవంబర్ 2021 (18,604 – ఆల్‌టైమ్ హై)లో కరెక్షన్ మొదలైంది. పేటీఎం లిస్టింగ్ తర్వాత 6 నెలల్లో సూచీ 20% పడింది. 2022 జూన్‌లో 15,183 పాయింట్ల వద్ద బాటమ్ అవుట్ అయింది.

మార్కెట్లోకి మెగా ఐపీఓలొస్తున్నాయంటే... ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించిన హ్యుందాయ్ దీనికి మరో మచ్చుతునక! ఈ ఏడాది ఇప్పటికే 70కి పైగా కంపెనీలు రూ. లక్ష కోట్లకు మించి నిధులను మార్కెట్ నుంచి ఐపీఓల ద్వారా దక్కించుకున్నాయి. లిస్టింగ్లోనూ భారీ లాభాలు పంచాయి. ఈ ఐపీఓ బూమ్ ఇలాగే కొనసాగితే, 2021 నాటి రూ.1.19 లక్షల కోట్ల ఆల్‌టైమ్ రికార్డు సమీకరణను ఈ ఏడాది అధిగమించే అవకాశం ఉంది. ఇవన్నీ ఒకెత్తయితే, హ్యుందాయ్ ఒక్కటే రూ. 27,870 కోట్లను పిండేసింది. అయితే, సెప్టెంబర్ దాకా పబ్లిక్ ఆఫర్లంటే ఎగబడిన రిటైల్ ఇన్వెస్టర్లు హ్యుందాయ్ మెగా ఎంట్రీ తర్వాత ముఖం చాటేస్తున్నారు. విపరీతమైన హైప్ క్రియేట్ చేసిన ఈ ఇష్యూ కేవలం 2.37 రెట్లు సబ్‌స్క్రయిబ్ కాగా, రిటైల్ ఇన్వెస్టర్లయితే తమ కోటాలో 50 శాతానికి మాత్రమే బిడ్లు వేయడం విశేషం. ఇక హ్యుందాయ్ లిస్టింగ్‌లో తుస్సుమంది. ఇష్యూ ధర రూ.1960తో పోలిస్తే, 1.5 శాతం డిస్కౌంట్‌తో అరంగేట్రం చేసి, అదే రోజు 7 శాతం పడిపోయింది. యాదృచ్ఛికంగా... ఈ మెగా ఐపీఓకు ముందు రోజుకో కొత్త ఆల్‌టైమ్ గరిష్టాలను తాకిన మన మార్కెట్లు... పశ్చిమాసియా యుద్ధ భయాలు, ఇతరత్రా కారణాలతో దిద్దుబాట పట్టాయి. సెప్టెంబర్లో ఆల్‌టైమ్ గరిష్టం నుంచి సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఇప్పటికే 9 శాతం పైగా దిగజారాయి. కరెక్షన్ కొనసాగవచ్చని కూడా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కొనసాగుతున్న సంప్రదాయం...

మెగా ఐపీఓలు వచ్చిన ప్రతిసారీ మార్కెట్లో భారీ పతనం.. కరెక్షన్ జరగడం అనే ఆనవాయితీ హ్యుందాయ్ విషయంలోనూ మరోసారి నిజమవుతోంది. ఎందుకంటే, గతంలో పేటీఎం, ఎల్‌ఐసీ, కోల్ ఇండియా, రిలయన్స్ పవర్ ఇలా మెగా ఐపీఓలన్నీ పేలవంగా లిస్ట్ కావడమే కాకుండా, మొత్తం మార్కెట్ సెంటిమెంట్‌ను సైతం దిగజార్చాయి. ఆశ్చర్యకరంగా మార్కెట్లు కరెక్షన్‌లో ఉన్నప్పుడో, దిద్దుబాటలోకి ఎంటరైన తరుణంలో ఈ భారీ ఐపీఓలు రావడం విశేషం. కాగా, మెగా ఐపీఓలు తుస్సుమన్న సందర్భాలు మన దేశంలోనే కాదు విదేశీ మార్కెట్లలోనూ ఉన్నాయి. అప్పట్లో ఫేస్‌బుక్ ఐపీఓ లిస్టింగ్ షాక్ వేవ్స్ మొత్తం టెక్ రంగాన్ని కుదిపేసింది. అలాగే, ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించిన సౌదీ ఆరామ్‌కో షేర్లు కూడా లిస్టింగ్ తర్వాత వెనుకంజ వేయడం గమనార్హం. కాగా, స్విగ్గీ, ఎన్‌ఎస్‌డీఎల్, ఎన్‌టీపీసీ గ్రీన్ వంటి భారీ ఐపీఓలు ఈ ఏడాది డిసెంబర్లోపు లిస్టింగ్ సన్నాహాల్లో ఉన్నాయి. హ్యుందాయ్ నిరుత్సాహం, మార్కెట్ కరెక్షన్ నేపథ్యంలో సెంటిమెంట్ మళ్లీ రివర్స్ అయితే తప్ప అవి ఐపీఓలను వాయిదా వేసుకునే అవకాశాలు లేకపోలేదనేది పరిశీలకుల టాక్!!

– సాక్షి, బిజినెస్ డెస్క్

- హ్యుందాయ్ మెగా ఐపీఓకు ముఖం చాటేసిన రిటైల్ ఇన్వెస్టర్లు
- గతంలోనూ తుస్సుమన్న బడా ఇష్యూలు
- మార్కెట్ కరెక్షన్‌తో పాటు సెంటిమెంట్‌పైనా తీవ్ర ప్రభావం
- ఈ ఏడాది ఇప్పటికే 70 కంపెనీలు.. రూ. లక్ష కోట్లకు పైగా సమీకరణ
- 2021 నాటి రూ. 1.19 లక్షల కోట్ల రికార్డు బ్రేక్ అయ్యే అవకాశం..

80 వేల దిగువకు సెన్సెక్స్



ముంబై: స్టాక్ మార్కెట్లో అయిదో రోజూ అమ్మకాలు ఆగలేదు. సెన్సెక్స్ 663 పాయింట్లు పతనమై 80 వేల స్థాయి దిగువన 79,402 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 219 పాయింట్లు కోల్పోయి 24,181 వద్ద నిలిచింది. దేశీయంగా కార్పొరేట్ దిగ్గజాల సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు నిరాశపరుస్తుండటం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో క్రూడాయిల్ ధరల పెరుగుదల కూడా ఆందోళనకు గురిచేసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 927 పాయింట్లు క్షీణించి 79,138 వద్ద, నిఫ్టీ 326 పాయింట్లు క్షీణించి 24,399 వద్ద కనిష్టాన్ని తాకింది. కాగా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఎదురీదాయి. గోద్రేజ్ కన్జూమర్ షేరు 3% లాభపడింది. ఐటీసీ 2% చొప్పున లాభపడ్డాయి. మరోవైపు బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 2.50%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకటిన్నర శాతం నష్టపోయాయి. ఈ వారం మొత్తంగా చూస్తే సెన్సెక్స్ 1822 పాయింట్లు (2.25%), నిఫ్టీ 673 పాయింట్లు (2.75%) నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో...

బీవోబీ లాభం జూమ్.. రూ.5,238 కోట్లు

ఇండిగో నష్టం రూ. 986 కోట్లు

ఇక యూట్యూబ్‌లో షాపింగ్!

క్రియేటర్లకు అదనపు ఆదాయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ **యూట్యూబ్ భారత్‌లో** షాపింగ్ అఫిలియేట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. **అర్హత కలిగిన** క్రియేటర్లు తమ వీడియోలకు ఉత్పత్తులను జోడించడం ద్వారా అదనపు ఆదాయం ఆర్జించేందుకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. వీడియోలు, షార్ట్స్, లైవ్‌స్ట్రీమ్స్‌కు కంటెంట్ క్రియేటర్లు ప్రొడక్ట్స్‌ను ట్యాగ్ చేస్తే.. వీడియో డిస్క్రిప్షన్‌లో, అలాగే ప్రొడక్ట్ సెక్షన్‌లో అవి ప్రత్యక్షం అవుతాయి. వ్యూయర్స్ వాటిని క్లిక్ చేయడం ద్వారా రిటైలర్స్ సైట్‌కు చేరుకుని షాపింగ్ చేయవచ్చు. వీక్షకులు చేసే కొనుగోళ్ల ఆధారంగా కంటెంట్ క్రియేటర్లకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతానికి ఈ–కామర్స్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, మింత్రా పోర్టల్‌లో లిస్ట్ అయిన ఉత్పత్తులను క్రియేటర్లు తమ వీడియోలకు ట్యాగ్ చేయాల్సి ఉంటుంది.

అంతర్జాతీయంగా సక్సెస్..: యూట్యూబ్ షాపింగ్ అంతర్జాతీయంగా విజయవంతం అయిందని యూట్యూబ్ తెలిపింది. అంతర్జాతీయంగా 2023లో వ్యూయర్స్ ఏకంగా 3,000 కోట్లకు పైగా గంటల షాపింగ్ సంబంధ కంటెంట్‌ను యూట్యూబ్‌లో వీక్షించారు. ఈ నేపథ్యంలో షాపింగ్ అఫిలియేట్ ప్రోగ్రామ్‌ను భారత్‌లో పరిచయం చేసినట్టు యూట్యూబ్ షాపింగ్ జీఎం, వైస్ ప్రెసిడెంట్ ట్రావిస్ కజ్ తెలిపారు.

జోస్ ఆలుక్కాస్ 'ఆహా దీపావళి' ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోస్ ఆలుక్కాస్ 'ఆహా దీపావళి' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లు రూ.60 వేల కొనుగోలుపై బంగారు ఆభరణాలకు ఉచితంగా వెండి, వజ్రాల కొనుగోలుపై ఒక బంగారు నాణేన్ని ఉచితంగా పొందవచ్చు. వజ్రాలపై 20% తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7% తగ్గింపు అందిస్తుంది. పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో మార్పిడి చేసుకునే సదుపాయం ఉంది. దీపావళి బహుమతిగా ఒక కారు ఈ ఆఫర్‌లో భాగంగా ఉంటుంది. ధన త్రయోదశి కోసం ముందస్తు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 'ఆహా దీపావళి' ఆఫర్లను ప్రజలంతా వినియోగించుకోవాలని కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కా కోరారు.

తనిష్క్ పండుగ ఆఫర్లు

ముంబై: ఆభరణాల సంస్థ తనిష్క్ పండుగ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లు బంగారు ఆభరణాలు, వజ్రాభరణాల తయారీ చార్జీలపై 20% వరకు తగ్గింపు పొందవచ్చు. పాత బంగారు విలువకు సమానమైన బంగారు ఆభరణాలకు ఎలాంటి చెల్లింపు లేకుండా ఉచితంగా పొందవచ్చు. ఈ నవంబర్ 3 వరకు ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. మరిన్ని ఆఫర్ల కోసం తనిష్క్ షోరూం లేదా, అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

సాక్షి స్పోర్ట్స్


రమణ్‌దీప్

సెమీస్‌లో భారత్ 'ఎ' ఓటమి

ఎమర్జింగ్ కప్ ఆసియా టి20 టోర్నీలో భారత 'ఎ' జట్టు కథ సెమీ ఫైనల్లోనే ముగిసింది. ఒమన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో తిలక్ వర్మ సారథ్యంలోని భారత 'ఎ' జట్టు 20 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టు చేతిలో ఓడిపోయింది. మొదట అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జుబేద్ అక్బరి (41 బంతుల్లో 64 : 5 ఫోర్లు, 4 సిక్సలు), సిదిఖుల్లా అటల్ (52 బంతుల్లో 83 ; 7 ఫోర్లు, 4 సిక్సలు), కరీమ్ జనత్ (20 బంతుల్లో 41 ; 4 ఫోర్లు, 2 సిక్సలు) చెలరేగారు. భారత బౌలర్ రసిఖ్ సలామ్‌కు 3 వికెట్లు దక్కాయి. తర్వాత భారత్ 'ఎ' జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 186 పరుగులే చేయగలిగింది. టాప్–5 బ్యాటర్లు వరుసగా... ప్రభ్‌సిమ్రన్ (19), అభిషేక్ శర్మ (7), తిలక్ వర్మ (16), ఆయుశ్ బదోని (31), నేహాల్ (20) విఫలమయ్యారు. చివర్లో రమణ్‌దీప్ (34 బంతుల్లో 64 ; 8 ఫోర్లు, 2 సిక్సలు), నిశాంత్ (13 బంతుల్లో 23 ; 3 ఫోర్లు) మెరిపించారు.


పుణేలోనూ పరేషాన్

ఈసారి స్పిన్ వలలో భారత్ విలవిల • తొలి ఇన్నింగ్స్‌లో 156కే ఆలౌట్

7 వికెట్లతో తిప్పేసిన సాంట్నర్ • న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ 198/5 • 301 పరుగుల ఆధిక్యంలో కివీస్

తొలి టెస్టులో న్యూజిలాండ్ పేస్ బౌలర్ల ధాటికి దాసోహం అన్న భారత జట్టు... రెండో టెస్టులో స్పిన్నర్లను ఎదుర్కోలేక చేతులెత్తేసింది. ఏడేళ్ల క్రితం ఇక్కడే జరిగిన టెస్టు మ్యాచ్‌లో పూర్తి స్పిన్ పిచ్‌ను సిద్ధం చేసి ఆస్ట్రేలియా చేతిలో భంగపాటుకు గురైన టీమిండియా... ఇప్పుడు న్యూజిలాండ్ చేతిలోనూ అలాంటి పరిస్థితే ఎదుర్కుంటోంది. స్పిన్‌ను ఆడటంలో సిద్ధహస్తులు అనుకున్న మన బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టడంతో తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ బృందం కుప్పకూలగా ... భారత బ్యాటర్లు అష్టకష్టాలు పడ్డచోట కివీస్ ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టారు. ఫలితంగా రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా గడ్డు స్థితిలో ఉంది. భారత గడ్డపై ఇప్పటి వరకు టెస్టు సిరీస్ గెలవని న్యూజిలాండ్ ఇప్పటికే 301 పరుగుల ఆధిక్యంతో దూసుకెళ్తుండగా... పుష్కర కాలం నుంచి సొంతగడ్డపై సిరీస్ ఓటమి ఎరుగని టీమిండియా ఇప్పుడు ఆ ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది! ఇక ఈ మ్యాచ్ నుంచి రోహిత్ బృందం గట్టెక్కాలంటే అద్భుతం జరగాల్సిందే!


సాంట్నర్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లి బౌల్డ్


సాంట్నర్


లాథమ్

పుణే: దశాబ్ద కాలంగా సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తూ... ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తున్న టీమిండియా 12 సంవత్సరాల తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ ఓటమి అంచున నిలిచింది. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ పేసర్ల ధాటికి బెంబేలెత్తి పరాజయం పాలైన టీమిండియా... ఇప్పుడు పుణేలో ప్రత్యర్థి స్పిన్ దెబ్బకు వెనుకంజ వేసింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన న్యూజిలాండ్ జట్టు శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. కెప్టెన్ టామ్ లాథమ్ (133 బంతుల్లో 86; 10 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. బ్లన్‌డెల్ (30 బ్యాటింగ్; 2 ఫోర్లు) రాణించాడు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లు పడగొట్టాడు. చేతిలో ఐదు వికెట్లు ఉన్న న్యూజిలాండ్... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 103 పరుగులు కలుపుకొని ఓవరాల్‌గా 301 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. బ్లన్‌డెల్‌తో పాటు గ్లెన్ ఫిలిప్స్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 16/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 45.3 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌటైంది. రవీంద్ర జడేజా (38; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా... యశస్వి జైస్వాల్ (30), శుబ్‌మన్ గిల్ (30) ఫర్వాలేదనిపించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మిషెల్ సాంట్నర్ 7 వికెట్లతో సత్తా చాటగా... గ్లెన్ ఫిలిప్స్ రెండు కీలక వికెట్లు పడగొట్టాడు.

లాథమ్ కెప్టెన్ ఇన్నింగ్స్

భారత బ్యాటర్లు పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడిన చోట... బ్యాటింగ్ ఎలా చేయాలో లాథమ్ ఆచరణలో చూపాడు. అప్పటికే 100 పరుగులకు పైగా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంతో స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసిన లాథమ్... ఒక్కో పరుగు జోడిస్తూనే వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరు బోర్డును నడిపించాడు. కాన్వే (17), విల్ యంగ్ (23), రచిన్ రవీంద్ర (9), మిచెల్ (18) ఎక్కువసేపు నిలవకపోయినా... చిన్న చిన్న భాగస్వామ్యాలు నిర్మిస్తూ ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. పేసర్లు ప్రభావం చూపకపోవడంతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆరంభం నుంచే స్పిన్నర్లను నమ్ముకోగా.. సుందర్ మినహా అశ్విన్, జడేజా స్థాయికి తగ్గ బౌలింగ్ చేయలేకపోయారు. మరి కాసేపట్లో రెండో రోజు ఆట ముగుస్తుందనగా.. లాథమ్‌ను సుందర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా... ఇప్పటికే 301 పరుగుల ఆధిక్యం సాధించిన న్యూజిలాండ్... టీమిండియా ముందు ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనేది ఆసక్తికరం.

ఒకరి వెంట ఒకరు..

బెంగళూరు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న భారత జట్టు... స్పిన్‌కు స్వర్గధామంలా కనిపిస్తున్న పుణే పిచ్‌పైనైనా చెలరేగుతుంది అనుకుంటే అదీ సాధ్యపడలేదు. రెండో వికెట్‌కు గిల్, జైస్వాల్ జోడించిన 49 పరుగులే భారత ఇన్నింగ్స్‌లో అత్యధిక భాగస్వామ్యం కాగా.. జట్టు స్కోరు 50 వద్ద గిల్ ఔటయ్యాడు. ఇక అక్కడి నుంచి ప్రారంభమైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. సాంట్నర్ వేసిన ఊరించే బంతికి విరాట్ కోహ్లి (1) క్లీన్ బౌల్డ్ కాగా.. యశస్వి జైస్వాల్, పంత్ (18)ను ఫిలిప్స్ బుట్టలో వేసుకున్నాడు. గత మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడి తన విలువ చాటుకున్న కోహ్లి చెత్త బంతికి పెవిలియన్ చేరాడు. సర్ఫరాజ్ (11), అశ్విన్ (4) ఎక్కువసేపు నిలువలేకపోయారు. బెంగళూరులో భారీ సెంచరీతో జట్టులో ఆత్మవిశ్వాసం నింపిన సర్ఫరాజ్ ఈసారి అదే ప్రయత్నం చేయలేకపోయాడు. జడేజా ధాటిగా ఆడగా... సుందర్ (18 నాటౌట్; 2 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయంగా నిలిచాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 30; రోహిత్ (బి) సౌతీ 0; గిల్ (ఎల్బీ) (బి) సాంట్నర్ 30; కోహ్లి (బి) సాంట్నర్ 1; పంత్ (బి) ఫిలిప్స్ 18; సర్ఫరాజ్ (సి) రూర్కే (బి) సాంట్నర్ 11; జడేజా (ఎల్బీ) సాంట్నర్ 38; అశ్విన్ (ఎల్బీ) (బి) సాంట్నర్ 4; సుందర్ (నాటౌట్) 18; ఆకాశ్‌దీప్ (బి) సాంట్నర్ 6; బుమ్రా (ఎల్బీ) (బి) సాంట్నర్ 0; ఎక్స్‌ట్రాలు: 0; **మొత్తం (45.3 ఓవర్లలో ఆలౌట్) 156. వికెట్ల పతనం:** 1-1, 2-50, 3-56, 4-70, 5-83, 6-95, 7-103, 8-136, 9-142, 10-156. **బౌలింగ్:** సౌతీ 6-1-18-1, రూర్కే 3-2-5-0, ఎజాజ్ 11-1-54-0, సాంట్నర్ 19.3-1-53-7, ఫిలిప్స్ 6-0-26-2.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 18; మిషెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బ్యాటింగ్) 30; ఫిలిప్స్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (53 ఓవర్లలో 5 వికెట్లకు) 198. వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183. **బౌలింగ్:** అశ్విన్ 17-1-64-1; సుందర్ 19-0-56-4; జడేజా 11-1-50-0; బుమ్రా 6-1-25-0.

ఆస్ట్రేలియా పర్యటనకు నితీశ్ కుమార్ రెడ్డి



ముంబై: ప్రతిష్టాత్మక బోర్డర్–గావస్కర్ సిరీస్‌కు ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఎంపికయ్యాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో మెరుపులు మెరిపించిన 21 ఏళ్ల నితీశ్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. సుదీర్ఘ కాలం పేస్ ఆల్‌రౌండర్‌గా సేవలందించగల సత్తా ఉండటంతోనే సెలెక్టర్లు నితీశ్ వైపు మొగ్గుచూపారు. నవంబర్ 22 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... దీని కోసం బీసీసీఐ శుక్రవారం రాత్రి 18 మందితో కూడిన జట్టును ప్రకటించింది. నితీశ్‌తో పాటు ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణా తొలిసారి టెస్టు జట్టులో ఎంపికయ్యాడు. గాయంతో ఇబ్బంది పడుతున్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను పరిగణించలేదు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఆకట్టుకున్న వాషింగ్టన్ సుందర్ ఆసీస్ పర్యటనకూ ఎంపికయ్యాడు. సీనియర్ పేసర్ షమీ పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని ఎంపిక చేయలేదు.

సఫారీతో టి20 సిరీస్‌కు రమణ్‌దీప్, వైశాక్

దక్షిణాఫ్రికాతో వచ్చే నెలలో జరగనున్న నాలుగు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం కూడా బీసీసీఐ శుక్రవారమే 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. పంజాబ్ బ్యాటర్ రమణ్‌దీప్ సింగ్, కర్ణాటక సీమర్ విజయ్ కుమార్ వైశాక్ తొలిసారి జాతీయ జట్టులోకి వచ్చారు. గాయాల బారిన పడ్డ శివమ్ దూబే, మయాంక్ యాదవ్‌ను ఎంపిక చేయలేదు. దక్షిణాఫ్రికాతో నాలుగు టి20 మ్యాచ్‌లు నవంబర్ 8న (డర్బన్), 10న (పోర్ట్ ఎలిజబెత్), 13న (సెంచూరియన్), 15న (జొహనెస్‌బర్గ్) జరుగుతాయి.

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, పంత్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, అశ్విన్, జడేజా, బుమ్రా, ఆకాశ్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్.

దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌కు భారత జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ సామ్సన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణ్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, విజయ్ కుమార్ వైశాక్, అవేశ్ ఖాన్, యశ్ దయాళ్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కేసీ, అజయ్ మాకెన్‌లతో భట్టి భేటీ

- రాష్ట్ర రాజకీయాలు, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై చర్చ
- కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితోనూ భేటీ.. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ఆరా



ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌ను శాలువాతో సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, న్యూఢిల్లీ: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు, ఏఐసీసీ జాతీయ కోశాధికారి అజయ్ మాకెన్‌లను వేర్వేరుగా కలిశారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పథకాల అమలు వంటి విషయాలపై కేసీతో తొలుత ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. నవంబర్ 13, 20 తేదీల్లో జార్ఖండ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకునిగా భట్టి ఉన్న నేపథ్యంలో అక్కడి తాజా పరిస్థితులు, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల బలాబలాలు, ప్రజల నాడి, పార్టీ వ్యవహరించాల్సిన అనేక అంశాలపై కేసీకి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు శుక్రవారం సాయంత్రం అజయ్ మాకెన్‌తో భేటీ అయిన భట్టి... పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జార్ఖండ్‌లో చేపట్టిన ఇటీవలి పర్యటన అనంతరం అక్కడి ప్రజల్లో వచ్చిన మార్పులు, చోటుచేసుకున్న పరిణామాలతోపాటు పోలింగ్ సందర్భంగా వ్యవహరించాల్సిన తీరుపై ఆయనతో చర్చించినట్లు తెలిసింది.

అప్పులపై ఆర్థిక కార్యదర్శితో మంతనాలు

గత ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌ల నుంచి 10.75 శాతం నుంచి 11.25 శాతం వడ్డీపై రూ. 31,795 కోట్ల రుణాలను తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆగస్టు 24న కలిసిన సందర్భంగా భట్టి చెప్పారు. వాటి వడ్డీ రేట్లు తగ్గించి రుణాలను రీస్ట్రక్చరింగ్ చేయాలని అప్పుడు కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. దీంతో ఈ విషయాలతోపాటు రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ బకాయిలపై చర్చించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు మద్దిరాలను శుక్రవారం భట్టి కలిశారు. కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఆర్థిక అంశాలపై చర్చించారు. అలాగే ఏపీ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను ఇప్పించాలని మరోసారి కోరారు. అలాగే కేంద్రం గుర్తించిన వెనుకబడిన జిల్లాల గ్రాంటును రాష్ట్రానికి ఎప్పటిలోగా మంజూరు చేస్తారని భట్టి అడిగినట్లు సమాచారం.



కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిర్మాణరంగ ప్రతినిధులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బిల్డర్లు, నిర్మాణ రంగానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా
- హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టత ఉందని వెల్లడి
- నగరాభివృద్ధికి బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు కేటాయించామని వ్యాఖ్య.. రియల్ ఎస్టేట్ సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచన

సాక్షి, హదరాబాద్: బిల్డర్లకు, నిర్మాణ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తమ్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం సమస్యల పరిష్కారానికి ప్రాపర్టీ డెవలపర్ల సంఘాలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, దీనివల్ల ప్రభుత్వంతో చర్చలకు మార్గం సుగుమం అవుతుందని చెప్పారు. నిర్మాణదారులు ఎప్పుడైనా ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు ఈ కమిటీ దోహదపడుతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టత ఉందని.. అందులో భాగంగానే బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లను నగరాభివృద్ధికి కేటాయించిందని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే రీజనల్ రింగ్‌రోడ్డుతోపాటు కనెక్టివిటీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. మెట్రో విస్తరణ వేగవంతం చేయడంతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సన్నాహాలు పూర్తి అయ్యాయన్నారు. తాగునీటి సామర్థ్యాన్ని పెంచే అంశం పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా వర్సిటీ నెలకొల్పుతున్నట్లు చెప్పారు.

టీపీసీసీ చీఫ్‌గా 'అర్ధ శతకం' ఎలా ఉంది?

- ఢిల్లీలో తనను కలిసిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కేసీ వేణుగోపాల్ పలకరింపు.. కులగణన సహా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ



కేసీ వేణుగోపాల్‌తో మహేశ్‌కుమార్‌గౌడ్, ఆయన సతీమణి, కుమారుడు

సాక్షి, న్యూఢిల్లీ: 'హలో మహేశ్‌జీ... ఎలా ఉన్నారు? పీసీసీ చీఫ్‌గా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నారు. అందుకు మీకు అభినందనలు. ఈ 50 రోజుల్లో మీ పదవీ బాధ్యతలు ఎలా ఉన్నాయి?' అంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పలకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సతీమణి సంధ్యారాణి, కుమారుడు రుత్విక్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్.. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో కేసీ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా కులగణనను రాష్ట్రం నుంచే అమలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి కేసీ అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో 'హైడ్రా' సాగించిన అక్రమ కట్టడాల కూల్చివేతల అంశం కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో జరిగిన పరిణామాలను కేసీకి మహేశ్‌కుమార్‌గౌడ్ వివరించారు. కాగా, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్నామని చెప్పారు. మరోవైపు అధిష్టానం పెద్దలకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు పీసీసీ కొత్త కార్యవర్గం కూర్పుపై మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించనున్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెప్పాయి. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగే వీహెచ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన పాల్గొననున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ లేకుండా ఉండలేని పరిస్థితికి వచ్చేశాం. ఇప్పటి వరకు ప్రధానంగా బొగ్గు, జల, అణు, గ్యాస్, నాఫ్తా ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నుంచి అధికంగా విద్యుత్ ఉత్పత్తి జరిగింది. దేశంలో గ్యాస్ లేక పోవడం, నాఫ్తా ధరలు విపరీతంగా ఉండటంతో ఆ ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో అందరి దృష్టి పునరుత్పాదక ఇంధనంపైనే పడింది. పైగా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. సంప్రదాయ విద్యుత్ నుంచి పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి మించిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సంప్రదాయ ఇంధనం కంటే.. సంప్రదాయేతర ఇంధన వనరుల ఉపయోగంతో ఉత్పత్తి అయ్యే విద్యుత్ వ్యయం తగ్గుతుండగా, సంప్రదాయ విద్యుత్ వ్యయం భారీగా పెరుగుతోంది. దీంతో సంప్రదాయేతర ఇంధనం వైపు మొగ్గు చూపుతున్నారు.

- సాక్షి, హైదరాబాద్

అందరిచూపు క్లీన్ ఎనర్జీ వైపే..



దేశవ్యాప్తంగా రెండులక్షల మెగావాట్లు దాటిన రీన్యూవబుల్ ఎనర్జీ స్థాపిత సామర్థ్యం

ప్రస్తుతం 46.3 శాతం రీన్యూవబుల్ ఎనర్జీనే..

మొత్తం దేశంలో విద్యుదుత్పాదన స్థాపిత సామర్థ్యం 452.69 గిగావాట్లు

తెలంగాణలో 40 వేల మెగావాట్ల మేరకు అవకాశమున్నా, ప్రస్తుతానికి 6,159 మెగావాట్లే అందుబాటులో

సౌర, పవన, జల, బయోవ్యర్థాలతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా 201.45 గిగావాట్లు

2030 నాటికి 500 గిగావాట్ల క్లీన్ఎనర్జీ ఉత్పాదన లక్ష్యం


ఇవీ ప్రోత్సాహకాలు..

- ఏటా 50 గిగావాట్ల సంప్రదాయేతర ఇంధన విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్రణాళిక పెట్టుకున్నారు.
- ఈ విద్యుత్ ప్రాజెక్టుల్లో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి.
- రాష్ట్రాల మధ్య సౌర, పవన విద్యుత్ ప్రసారాలకు ట్రాన్స్‌మిషన్ చార్జీల మినహాయింపు. ఇది 2030 డిసెంబర్ వరకు వర్తింపు
- విధిగా సంప్రదాయేతర విద్యుత్ కొనుగోలు తప్పనిసరి
- ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి సెల్ ఏర్పాటు. పెట్టుబడులను ఆకర్షించడం.
- అల్ట్రామెగా రీన్యూవబుల్ ఎనర్జీ పార్క్‌లు ఏర్పాటు.
- సంప్రదాయేతర విద్యుత్‌కు ఒకే రకమైన విద్యుత్ చార్జీలు అమలు చేయడం
- 2030 నాటి వరకు వచ్చే ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాల కల్పన..
- గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ నిబంధనలు 2022 కింద రీన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహించడం.

దేశంలో ప్రస్తుతం 452.69 గిగావాట్లు (4.52 లక్షల మెగావాట్లు) విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. అందులో సంప్రదాయేతర ఇంధన (రీన్యూవబుల్ ఎనర్జీ) స్థాపిత సామర్థ్యం 2.01 గిగావాట్లు(2.01 లక్షల మెగావాట్లు) అంటే దాదాపు 46.3 శాతం ఉత్పత్తికి సామర్థ్యం పెరిగింది. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి పెరుగుతున్న కొద్దీ కర్బన ఉద్గారాలు తగ్గించి.. కాలుష్య రహిత విద్యుత్ ఉత్పాదనకు మార్గం సుగమం అవుతుంది. సంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదనలో ప్రధానంగా సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తి ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. శిలాజ ఇంధనాలైన బొగ్గు, నాచురల్ గ్యాస్, నాఫ్తా భవిష్యత్‌లో తగ్గే అవకాశమున్న నేపథ్యంలో వాటి స్థానంలో సంప్రదాయేతర ఇంధన వినియోగంపైనే ప్రభుత్వాలు ఎక్కువ దృష్టి పెట్టాయి. 2030 నాటికి దేశంలో సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదన స్థాపిత సామర్థ్యం 500 గిగావాట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏటా 50 గిగావాట్లు(అంటే 50 వేల మెగావాట్లు) సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దేశంలో ప్రస్తుతమున్న 201 గిగావాట్లలో సౌర విద్యుత్ వాటా 90.76, పవన విద్యుత్ 47.36, జల విద్యుత్ 51.99, బయోపవర్ 11.32 గిగావాట్లుగా ఉంది.

దేశంలో 452.69 గిగావాట్ల విద్యుదుత్పాదన సామర్థ్యం

దేశంలో విద్యుదుత్పాదన సామర్థ్యం (గిగావాట్లలో)



తెలంగాణలో..

తెలంగాణలో దాదాపు 40 వేల మెగావాట్ల సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి అవకాశమున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో 6,159 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం మాత్రమే ఉంది, ఇందులోనూ సింహభాగం సౌర విద్యుత్‌దే కావడం గమనార్హం. ఆశించినస్థాయిలో సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి పెరగని పరిస్థితులు ఉన్నాయి.

కేంద్ర సహకారం..

సంప్రదాయేతర విద్యుత్ కోసం కేంద్ర ప్రభుత్వం పలు రకాల పథకాలను అమలు చేస్తూ.. ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇందులో నేషనల్ హైడ్రోజన్ మిషన్, పీఎం-కుసుమ్, పీఎం సూర్యఘర్, సౌర ఫలకాల ఉత్పత్తిలో ప్రోగ్రాం లింక్ ఇంటెన్సివ్‌ను అమలు చేస్తున్నారు.

దేశంలో ఆ నాలుగు రాష్ట్రాలు

దేశంలో నాలుగు రాష్ట్రాలు సంప్రదాయేతర ఇంధన విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాయి. తద్వారా దేశ ఇంధన రంగానికి ఎంతో సహకరిస్తున్నాయి. రాజస్తాన్‌లో విస్తారమైన ఎడారి నేపథ్యంలో అక్కడ సౌర విద్యుత్ అధికంగా ఉత్పత్తి అవుతోంది, రాజస్తాన్‌లో 29.98 గిగావాట్లు, పారిశ్రామికంగా దూసుకెళ్తున్న గుజరాత్‌లో 29.52 గిగావాట్లు, ఆ తర్వాత తమిళనాడు 23.70 గిగావాట్లు, నాలుగో స్థానంలో కర్ణాటక 22.37 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి. అంటే దేశంలోని సంప్రదాయేతర విద్యుదుత్పాదన మొత్తం 2.01 గిగావాట్లు కాగా అందులో 50 శాతంపైగా దాదాపు 1.05 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కేవలం ఈ నాలుగు రాష్ట్రాల్లోనే ఉండడం గమనార్హం.

సంస్థ మీది.. సొమ్ము మాది



స్టార్టప్-ఇన్వెస్టర్ల సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

- ఒకే వేదికపై స్టార్టప్‌లు.. పెట్టుబడిదారులు
- ఐఐటీ హైదరాబాద్‌లో ప్రత్యేక సదస్సు
- 40కి పైగా స్టార్టప్ ప్రతినిధుల హాజరు
- 30 మంది దేశ, విదేశీ ఇన్వెస్ట్ సంస్థల ప్రతినిధుల రాక

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: స్టార్టప్ (అంకుర సంస్థ)లు.. సాధారణంగా పెట్టుబడిదారుల కోసం వేచి చూస్తుంటాయి. ఆకాశాన్ని తాకే ఆవిష్కరణలున్నప్పటికీ.. తమ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాలంటే పెట్టుబడులు తప్పనిసరి. మరోవైపు పెట్టుబడిదారులు తమకు లాభాల పంట పండించే స్టార్టప్‌ల కోసం నిత్యం అన్వేషిస్తుంటారు. తమ పెట్టుబడి అనేక రెట్లు పెరిగే వినూత్న స్టార్టప్‌ల కోసం వెతుకుతుంటారు. ఇలా ఈ ఇద్దరినీ ఒకే వేదికపైకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా హైదరాబాద్ ఐఐటీలో స్టార్టప్-ఇన్వెస్టర్ల సదస్సు జరిగింది. భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీహెచ్) భాగస్వామ్యంతో వీసీ సర్కిల్ - ప్యూర్ ఈవీ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించారు. 40కి పైగా స్టార్టప్‌ల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన ఇన్వెస్ట్ సంస్థల ప్రతినిధులు 30 మంది వరకు ఇందులో పాల్గొన్నారు.

బెంగళూరులో మాదిరిగా..

ఇలాంటి సదస్సులు ఎక్కువగా బెంగళూరులోనే జరుగుతాయి. అక్కడితో పోల్చితే హైదరాబాద్‌లో ఇలాంటివి చాలా తక్కువ. ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా స్టార్టప్ సంస్థల ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు అవకాశాలు కలుగుతాయి. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. మంచి లాభాలను ఇచ్చే స్టార్టప్‌లతో జత కట్టే పెట్టుబడిదారులకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగకరమని.. హాజరైన ప్రతినిధులు పేర్కొన్నారు. ఏఐ, వ్యవసాయం, సౌర విద్యుత్.. తదితర రంగాలకు చెందిన స్టార్టప్ సంస్థలు సదస్సులో పాల్గొన్నాయి. ప్రధానంగా సౌర విద్యుత్, కృత్రిమ మేధ, ఈవీ ఆటోమొబైల్, వ్యవసాయం, జాబ్‌పోర్టల్, క్రీడలు, ఫొటోగ్రఫీ, షేర్ మార్కెట్ తదితర రంగాల స్టార్టప్‌లు పాల్గొన్నాయి.

మంచి స్టార్టప్‌ల ఎంపికకు అవకాశం



ఇలాంటి సదస్సులతో మంచి స్టార్టప్‌లను ఎంచుకునే అవకాశం.. పెట్టుబడిదారులకు లభిస్తుంది. స్టార్టప్ సంస్థలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చుతుంది. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఐఐటీహెచ్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం.

– రవితేజ గుప్తా, గుప్తాజీ ఇన్వెస్ట్స్ ప్రతినిధి

విద్యుత్ వాహనాల రంగంలో 399 స్టార్టప్‌లు



విద్యుత్ వాహనాల రంగంలో దేశవ్యాప్తంగా 399 స్టార్టప్ సంస్థలున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. 2023 నాటికే దేశవ్యాప్తంగా 15 లక్షల విద్యుత్ వాహనాలు రోడ్లపై తిరుగుతుంటే.. 2030కి ఈ సంఖ్య 50 లక్షలకు చేరుకుంటుందని అంచనాలున్నాయి. ఈ వాహన రంగంలో పెట్టుబడులు గత ఐదేళ్లలో 48 శాతం పెరిగాయి.

నిశాంత్ దొంగరి, ప్యూర్‌ఈవీ స్టార్టప్ కంపెనీ అధినేత, ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

ఆ ప్రైవేట్ మెడికల్ కాలేజీకి అనుమతి ఎలా ఇచ్చారు?

- ఇటీవలే జఫర్‌గూడలో ఒక మెడికల్ కాలేజీకి అనుమతి
- ఎలాంటి సిబ్బంది లేకుండానే గ్రీన్ సిగ్నల్
- తాజాగా వాకిన్ ఇంటర్వ్యూలకు ప్రకటన ఇచ్చిన కాలేజీ
- ఎన్ఎంసీ తీరుపై వైద్య వర్గాల్లో చర్చ

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి సిబ్బంది లేకుండానే, ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తున్న సమయంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జఫర్‌గూడలో ఉన్న ఒక కొత్త ప్రైవేట్ మెడికల్ కాలేజీకి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇవ్వడంపై కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఇటీవలే ఎన్ఎంసీ నుంచి ఈ ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యం 150 సీట్లతో కొత్తగా అనుమతులు పొందింది. ఆ సీట్లకు సంబంధించి కాళోజీ వర్సిటీ సీట్ మ్యాట్రిక్స్ కూడా విడుదల చేసింది. ఇందులోని 150 సీట్లలో 75 సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ కూడా చేశారు. మిగిలిన సీట్లకు ప్రస్తుతం కౌన్సెలింగ్ జరుగుతోంది. అయితే తమ కాలేజీలో పనిచేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈనెల 26, 27 తేదీల్లో వాకిన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆ కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ప్రకటన వైద్య, ఆరోగ్య శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. డీన్ లేదా ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెండెంట్, అన్ని క్లినికల్, నాన్ క్లినికల్ డిపార్ట్‌మెంట్లకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ రెసిడెంట్లు, నర్సింగ్ సూపరింటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సహా అన్ని రకాల సిబ్బందిని నియమించేందుకు ఈ వాకిన్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. వీరంతా లేకుండానే ఎన్ఎంసీ ఎలా అనుమతి ఇచ్చిందనేది ఇప్పుడు అంతుపట్టని ప్రశ్నగా ఉండిపోయింది. అసలు ఎన్ఎంసీ బృందాలు తనిఖీలు చేశాయా.. చేయకుండానే గుడ్డిగా అనుమతులు మంజూరు చేశాయా అన్న అనుమానాలను వైద్య వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ ఆ కాలేజీకి తగినంతమంది బోధన, బోధనేతర సిబ్బంది దొరకకపోతే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ఆ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. రెండేళ్ల కిందట హైదరాబాద్‌లో ఉన్న రెండు ప్రైవేట్ మెడికల్ కాలేజీల పరిస్థితి ఇలాగే అయిందని గుర్తు చేస్తున్నాయి. ఆ కాలేజీలు ప్రారంభమైన నెల రోజుల్లోనే ఎన్ఎంసీ తనిఖీలు చేసి సీట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎంబీబీఎస్ విద్యార్థులు రోడ్డుమీదకు ఎక్కారు. కోర్టుల్లోనూ కేసులు వేశారు. చివరకు రాష్ట్రంలో ఎక్కడెక్కడో వారిని సర్దుబాటు చేశారు. ఇలాంటి అనుభవాలు ఉండగా, ఎన్ఎంసీ ఎలా అనుమతి ఇచ్చిందని చర్చించుకుంటున్నారు.

ప్రజారోగ్య సంచాలకుడిపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు

తెలంగాణ మెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుధాకర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్‌నాయక్‌పై తెలంగాణ మెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ పగిడిపాటి సుధాకర్ ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి శేషాద్రికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ వివరాలను శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. భువనగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ యశోద చేస్తున్న అక్రమాలపై ఫిర్యాదు చేశానని, దానిపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారని తెలుసుకునేందుకు డాక్టర్ రవీందర్‌నాయక్ వద్దకు వెళ్లానని చెప్పారు. అదే సమయంలో రవీందర్‌నాయక్ బయటకు వచ్చినప్పుడు విషయం చెబుదామని దగ్గరకు వెళితే వినకుండా లోపలికి వెళ్లిపోయారన్నారు. ఆ తర్వాత జిరాక్స్ కాపీలు ఇచ్చేందుకు ఆయన చాంబర్ లోపలికి వెళితే...ఇక్కడికి ఎందుకు వచ్చావంటూ అమర్యాదగా ప్రవర్తించారని తెలిపారు. తాను 25 ఏళ్లు వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేశానని, డీఎంహెచ్‌వోగా రిటైర్ అయ్యాయని సుధాకర్ తెలిపారు. డాక్టర్స్ అసోసియేషన్లలో వివిధ హోదాల్లో పనిచేశానని వివరించారు. తన సర్వీసులో ఇలాంటి ప్రవర్తన కలిగిన అధికారిని ఎన్నడూ చూడలేదని రవీందర్‌నాయక్ తన విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

పనిలో సమానం..ఓటు హక్కులో వివక్ష!

మమ్మల్ని తొలగించడం అన్యాయమంటున్న ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లు

'టీచర్'ఎమ్మెల్సీ ఎన్నికలపై హైకోర్టులో పిల్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లకు ఓటు హక్కు తొలగించడం అన్యాయమంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అయితే పిటిషనర్ వ్యాజ్యంలో ఏం కోరుకుంటున్నారో స్పష్టంగా పేర్కొనలేదని, మార్పులు చేసి వేయాలని సీజే ధర్మాసనం శుక్రవారం సూచిస్తూ విచారణను వాయిదా వేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బీమనబోయిన కృష్ణమూర్తి ఈ పిల్ దాఖలు చేశారు. ఎన్నికలకు ఉపాధ్యాయులను ఓటర్లుగా చేర్చుకునేందుకు ఉద్దేశించి ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లు జారీ చేసిన సర్క్యులర్‌ను సవాల్ చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ...ఈ సర్క్యులర్‌తో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లను ఓటింగ్‌లో పాల్గొనకుండా తొలగించారని, తద్వారా వారికి ఓటు హక్కు లేకుండా పోయిందన్నారు. హైస్కూల్ టీచర్లతో సమానంగా పనిచేస్తున్నా వివక్ష చూపడం అన్యాయమని పేర్కొన్నారు. హైస్కూల్ టీచర్ల మాదిరిగానే వీరు కూడా గ్రాడ్యుయేట్లేనని, వారిని ఎమ్మెల్సీ ఎన్నికల పరిధి నుంచి తప్పించడం సమంజసంకాదని వెల్లడించారు. అధికారుల నిర్ణయం ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని చెప్పారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించేలా నిబంధనలను సవరించాలని కోరారు. అఫిడవిట్‌లో మార్పు చేసి మళ్లీ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం సూచించింది. విచారణ వాయిదా వేసింది.

మంత్రి దామోదరతో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం భేటీ

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఎన్నికైన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూప్రసాద్‌రాథోడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...త్వరలోనే ప్రభుత్వ డాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి దామోదరను కోరారు. వైద్యుల సమస్యలపై ఆయనకు విన్నవించారు. తమ సమస్యల పరిష్కారం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రవూఫ్, డాక్టర్ దీన్‌దయాళ్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ రాజు, డాక్టర్ రామ్‌సింగ్, డాక్టర్ రమేశ్, డాక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురితో నారాయణ!



నలుగురు విద్యార్థినులకు బోధిస్తున్న అధ్యాపకుడు

అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. కానీ, సరైన ప్రచారం లేకపోవడంతో 11 మంది మాత్రమే కళాశాలలో చేరగా.. తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక 11 మందిలో ఒక విద్యార్థి డ్రాపవుట్ కాగా పది మంది మిగిలారు. శుక్రవారం వీరిలో నలుగురు మాత్రమే హాజరుకావడం, అందరూ విద్యార్థినులే కావడం విశేషం. ఈ నలుగురికే అధ్యాపకుడు పాఠం బోధిస్తున్న దృశ్యమిది.

ఉద్యోగ భద్రత, పదోన్నతులకు వినతి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ భద్రత, పదోన్నతులు కల్పించాలని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ (ఈజీఎంఎం) కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ఈజీఎంఎం కాంట్రాక్టు ఉద్యోగులు శ్రీనివాస్, రాజమౌళి, సాయికిరణ్, కిరణ్, బాల్‌రాజ్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. హెచ్ఆర్ విధానం, సరైన జీతభత్యాలు, పదోన్నతులు లేక తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ యువకిరణాలు, రాజీవ్ ఉద్యోగశ్రీ అమలు చేసిన ఈజీఎంఎం ఉద్యోగులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని వివరించారు.


ఎంఎంటీఎస్ పొడిగింపునకు రాష్ట్ర వాటా విడుదల చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత గూడూరు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్ : యాదాద్రి దేవాలయం వరకు ఎంఎంటీఎస్ రైలు సర్వీసుల పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు కేంద్రం సుముఖంగా ఉందన్నారు. ఈ విషయంలో మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడలను సీఎం రేవంత్ అనుసరించకుండా, కేంద్రంతో చేయి కలిపి ముందుకు సాగితే ఈ ప్రాజెక్ట్ సత్వరం మొదలయ్యే అవకాశముందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పూర్తి సుముఖతతో ఉన్నారని, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అందిస్తున్న తోడ్పాటుతో ఇది త్వరలోనే వాస్తవరూపం దాల్చే అవకాశముందని తెలిపారు.

శ్రీశైలంలో రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

55,782 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



శ్రీశైలం ఆనకట్ట వద్ద రెండు గేట్లు ఎత్తివేత

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట వద్ద శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో రెండు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేరకు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 55,782 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల స్పిల్‌వే ద్వారా 24,936 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 38,240, సుంకేశుల నుంచి 63,105 మొత్తం 1,26,281 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,600 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,406 మొత్తం 67,006 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.6 అడుగుల వద్ద 213.4011టీఎంసీల నీటి నిల్వ ఉంది.

క్లుప్తంగా...

సోషల్ ఆడిట్ కొత్త డైరెక్టర్‌గా శ్రీకాంత్

సాక్షి, అమరావతి: సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (సోషల్ ఆడిట్–ఎస్‌ఎస్‌ఏఏటీ) డైరెక్టర్‌గా గోనబత్తుల శ్రీకాంత్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆయన ఈ బాధ్యతల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. సోషల్ ఆడిట్ కొత్త డైరెక్టర్ కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకోగా, ఇందుకోసం సీసీఎల్ఏ జి.జయలక్ష్మీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించిన ఐదుగురు సభ్యుల సెర్చ్ కమిటీ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి డైరెక్టర్‌గా శ్రీకాంత్‌ను నియమించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకం కార్యక్రమాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించేందుకు ఉపాధి హామీ పథకం చట్టం నిబంధన ప్రకారం అధికారులతో సంబంధం లేని స్వతంత్రపత్తితో కూడిన సోషల్ ఆడిట్ వ్యవస్థ–ఎస్‌ఎస్‌ఏఏటీలను అన్ని రాష్ట్రాలల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా శ్రీభవానీ హర్ష

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా మొట్టమొదటిసారి ఓ అడిషనల్ ఎస్పీ స్థాయి పోలీసు ఉన్నతాధికారిని ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఎస్.విజయలక్ష్మి స్థానంలో అడిషనల్ ఎస్పీ బి.శ్రీభవానీ హర్షను నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ కార్యక్రమంలో గుర్తించిన అవకతవకలపై చర్యలు తీసుకోవడం ఈ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రధాన విధి. అలాగే ఆయా సిబ్బందిని సస్పెండ్ చేయడం, లేదా సిఫార్సుల మేరకు నిర్ణీత మొత్తాన్ని ఆయా వ్యక్తుల నుండి రాబట్టడం వంటి విధులు చేపట్టాల్సి ఉంటుంది.

కేజీహెచ్‌కు పోర్టు విరాళం రూ.కోటి

మహారాణిపేట: కేజీహెచ్ అభివృద్ధికి విశాఖపట్నం పోర్టు ట్రస్టు బాసటగా నిలిచింది. కేజీహెచ్‌లో రోగులకు ఉపయోగకరంగా ఉండే క్యాజువాలిటీ, అవుట్ పేషెంట్(ఓపీ) విభాగం నిర్మాణం కోసం సీఎస్సార్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేసింది. శుక్రవారం పోర్టు ట్రస్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు ఈ చెక్కును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌కు అందించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు, పోర్టు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవ వల్లే ఈ నిధులు కేజీహెచ్‌కు వచ్చాయని పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ

కాకినాడ లీగల్: కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు, ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు, ప్రైవేట్ వ్యక్తులను ఒక కేసు విషయమై నాలుగేళ్ల తర్వాత అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం కార్యాలయంలో గోప్యంగా విచారించారు. 2020 జనవరి 10 తేదీన కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగుల వద్ద, దస్తావేజు లేఖర్ల వద్ద రూ.1,29,640 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు పర్యవేక్షణలో అప్పటి సబ్ రిజిస్ట్రార్లు కే.వి.ఎస్.కుమారి, ఎస్.శేఖర్‌బాబుతోపాటు ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు, ఆఫీసులో ఉన్న ప్రైవేట్ వ్యక్తులను నాలుగేళ్ల తర్వాత కార్యాలయంలో గది తలుపులు మూసివేసి విచారణ చేశారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ను విలేకరులు ప్రశ్నించగా పాత కేసుపై విచారణ సాగిందని చెప్పారు.

‘బండ్లమోటు’కు మోక్షం ఎప్పుడో..?

2002లో పల్నాడు జిల్లా బండ్లమోటులో మూతపడిన హిందుస్థాన్ జింక్ ఫ్యాక్టరీ


బండ్లమోటు హిందుస్థాన్ జింక్ ఫ్యాక్టరీ (ఫైల్)

- ఒకప్పుడు మినీ విశాఖగా వెలుగొందిన ఈ ప్రాంతం
- 517 ఎకరాల్లో 480 మంది కార్మికులతో 1978లో తవ్వకాలు ప్రారంభం
- 20 ఏళ్లపాటు రోజుకు 240 టన్నుల సీసంను శుద్ధి చేసిన ఘనత
- అంతర్జాతీయ మార్కెట్‌లో సీసం ధరలు పడిపోవడంతో మూసివేత
- ప్రస్తుతం ‘సీసం’కు భారీ డిమాండ్
- కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలంటున్న ప్రజాసంఘాలు

సాక్షి, నరసరావుపేట: బండ్లమోటు..రాష్ట్ర చరిత్రలో దీనికంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలానికి చెందిన ఈ ప్రాంతంలో దేశంలో రాజస్థాన్ తరువాత అత్యధికంగా సీసం లభించే ప్రాంతంగా చరిత్రలోకెక్కింది. దీంతో హిందుస్థాన్ కంపెనీ జింక్ ఫ్యాక్టరీని నిర్మించింది. మినీ వైజాగ్‌గా గుర్తింపు పొంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించింది. కాలక్రమేణా ఉత్పత్తి వ్యయం పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పతనమవడంతో 2002లో ఫ్యాక్టరీ మూతపడింది. అప్పటి నుంచి ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలు, కార్మికులు తిరిగి జింక్ ఫ్యాక్టరీ తెరవాలని ఆకాంక్షిస్తున్నారు. తాజాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో శుద్ధిచేసిన జింక్ ధరలు రూ.1.3 నుంచి 1.5 లక్షల మధ్య ఉంటుండటంతో సీసం తవ్వకాలు తిరిగి ప్రారంభించాలని డిమాండ్ పెరుగుతోంది. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి తిరిగి ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

480 మందితో మొదలైన తవ్వకాలు...

బండ్లమోటులో సర్వే ఆఫ్ ఇండియా 1969లో సర్వే నిర్వహించి..ఇక్కడ సీసం, రాగి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించి జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థకు నివేదిక ఇచ్చింది. ఈ రిపోర్టు ఆధారంగా కేంద్రం హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 1978లో 480 మంది కార్మికులతో పనులు ప్రారంభించింది. 1980 నాటికి రోజుకు 240 టన్నుల సీసం శుద్ధి చేసే స్థాయికి కంపెనీ చేరింది. 1993కి ఆర్థిక సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చాక సీసం ధరలు పడిపోయాయి. గనులు నిర్వహణతో లాభం లేకపోవడంతో ఉద్యోగుల భారం తగ్గించుకునేందుకు ‘గోల్డెన్‌షేక్ హ్యాండ్’ పేరిట 150 మంది ఉద్యోగులను స్వచ్ఛంద పదవీ విరమణకు ఒప్పించింది. దీంతో 310 మంది ఉన్న శాశ్వత ఉద్యోగుల సంఖ్య 160కి పడిపోయింది. కాంట్రాక్ట్ ఉద్యోగులతో కొంతకాలం నెట్టుకొచ్చారు. 1998కి బండ్లమోటు జింక్ ఫ్యాక్టరీను సొంతం చేసుకుంది. ఇక్కడి వెలికితీసిన సీసం శుద్ధి చేయడానికి రాజస్థాన్‌కు పంపడంతో రవాణా ఖర్చు తడిసిమోపెడు అవడంతో కంపెనీని మూసివేసింది. ఆ సమయంలో 125 మంది శాశ్వత, 150 మంది కాంట్రాక్టు సిబ్బంది ఫ్యాక్టరీలో పనిచేసేవారు. వీరితోపాటు పరోక్షంగా ఉపాధి పొందుతున్న వేలాది మంది రోడ్డునపడ్డారు.

అంతర్జాతీయంగా పెరిగిన ధరలతో...

గత కొంత కాలంగా అంతర్జాతీయంగా సీసం ధరలు రూ.1.3 లక్షల నుంచి 1.5 లక్షల వరకు ఉంటోంది. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి తవ్వకాలు ప్రారంభించేందుకు కృషి చేసింది. 2022 డిసెంబర్‌లో ప్రైవేట్ కంపెనీలను టెండర్లు వేయాలని ప్రకటన జారీ చేసింది. కొంత సాంకేతిక సమస్యలతో బిడ్డింగ్ పనులు ఆలస్యం అవ్వడం, ఇంతలో ఎన్నికల సమీపించడంతో ఈ ప్రతిపాదన మరుగునపడింది. తాజాగా బండ్లమోటు కార్మికల సంఘాలు సమావేశం ఏర్పాటు చేసి తిరిగి తవ్వకాలు ప్రారంభించాలని పిలుపునిచ్చాయి. పెరిగిన ధరలతో గిట్టుబాటు అవుతుందని, ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. గనిలో ఇంకా మేలైన సీసం నిల్వలు ఉన్నాయి. గతంలో తవ్వి తీసి ధరలు పడిపోవడంతో వదిలేసిన ముడి ఖనిజం సైతం 15 లక్షల టన్నుల వరకు నిల్వ ఉంది. ఇప్పటికే తవ్వితీసిన గనులను పర్యాటక క్షేత్రంగా మలిస్తే ఈ ప్రాంతానికి ఆర్థికంగా బలం చేకూర్చినట్టు అవుతుంది.

బండ్లమోటు హిందుస్థాన్ జింక్ ఫ్యాక్టరీ పరిసరాలలో ఉన్న సీసం ముడి ఖనిజ పదార్థాలు



తవ్వకాలు చేపట్టాలి



నేను బండ్లమోటు జింక్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నేతగా పనిచేశాను. గతంలో ఓ వెలుగు వెలిగిన ఫ్యాక్టరీ మూతపడటంతో ఈ ప్రాంతానికి చెందిన వందలాది మంది ఉపాధి కోల్పోయారు. అప్పట్లో సీసం ధరలు తక్కువగా ఉండటం, తవ్వకం ఖర్చు పెరగడంతో మూతపడింది. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్న నేపథ్యంలో సాంకేతికతను ఉపయోగించి తవ్వకాలు ప్రారంభిస్తే మంచిది. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అందుకు అవసరమైన అటవీశాఖ అనుమతులు సైతం పునరుద్ధరించుకోవాల్సి ఉంది.

–జయకర్ రావు, కార్మిక సంఘం మాజీ వర్కింగ్ సెక్రటరీ, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్

జీవనశైలిలో మార్పు వస్తుంది



ప్రస్తుత అంతర్జాతీయ మార్కెట్‌లో సీసం ధరలతో ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించడానికి సానుకూలంగా ఉంది. ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభిస్తే ఈప్రాంత ప్రజల జీవనశైలిలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉంది. దళిత, గిరిజన ప్రజలలో సాంఘిక పరమైన మార్పులు పెద్ద ఎత్తున రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టి వీలైనంత త్వరగా తవ్వకాలు పునఃప్రారంభించాలి. గతంలో పనిచేసిన కార్మికులంతా కలిసి మాకు చేతనైనంతగా పోరాటాలు చేస్తున్నాం.

– ఎంహెచ్ ప్రసాద్, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, కార్మిక సంఘం పూర్వ నేత

గిరిజనుల మీదే ప్రయోగాల కత్తి!

రాష్ట్రంలో ఏది తొలగించాలన్నా ముందుగా వారి నుంచే శ్రీకారం

- ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరుకుల వాహనాల తొలగింపు ప్రతిపాదన
- ఇప్పుడు గిరిజన గురుకులాలు, హాస్టల్స్‌లో భోజనాల బాధ్యత ‘అక్షయపాత్ర’కు అప్పగించే యోచన
- రూ.260 కోట్ల డైట్ చార్జీలు సక్రమంగా ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం
- ‘అక్షయపాత్ర’కు అదనంగా రూ.67 కోట్లు కలిపి రూ.327 కోట్లు కట్టబెట్టేలా స్కెచ్
- అదే జరిగితే 2,054 మంది వంట సిబ్బంది భవితవ్యం అగమ్యగోచరం
- ఎస్సీ, బీసీ విద్యాసంస్థల్లో భోజనాల బాధ్యత ప్రైవేటుపరం?

సాక్షి, అమరావతి: అమాయక గిరిజనులపై టీడీపీ కూటమి సర్కారు ప్రయోగాల కత్తికట్టింది. అధికారం చేపట్టిన నాటి నుంచి ఏ పథకం తొలగించాలన్నా.. ఏ ప్రయోగం చేయాలన్నా వారు ప్రశ్నించరనే ధీమాతో ముందుగా గిరిజనులనే లక్ష్యంగా చేసుకుంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల గడప వద్దకే రేషన్ సరుకులను అందించేలా ఏర్పాటుచేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ) వాహనాలను తొలుత గిరిజన ప్రాంతాల్లోనే తొలగించాలని చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రతిపాదించారు. ఇప్పుడు తాజాగా గిరిజన బిడ్డలుండే గురుకులాలు, వసతి గృహాల్లో అందించే భోజనంపై కన్నేసింది. గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాన్ని అందించేలా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేసింది. అక్షయపాత్ర ఫౌండేషన్ శాఖాహార భోజనాన్ని మాత్రమే అందిస్తుందని.. నిర్దేశించిన రోజుల్లో కోడిగుడ్లు, చికెన్ మాత్రం ప్రత్యేకంగా వండించే ఏర్పాట్లుచేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏడాదికి అందిస్తున్న డైట్ ఛార్జీలు రూ.260 కోట్లకు మరో రూ.67 కోట్లు అదనంగా కలిపి మొత్తం రూ.327 కోట్లు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. పేద పిల్లలకు అందించే డైట్ చార్జీలు సక్రమంగా ఇవ్వని కూటమి ప్రభుత్వం ఇప్పుడు అంతకుమించి ప్రైవేటు సంస్థకు అందించే ప్రతిపాదన చేయడం గమనార్హం. ఈ ప్రతిపాదన అమలుల్లోకి వస్తే గిరిజన విద్యార్థులకు ఇప్పటివరకు ఆహారాన్ని సమకూరుస్తున్న 2,054 మంది వంట సిబ్బంది భవితవ్యం అగమ్యగోచరమవుతుంది. వారిని వసతి గృహాల నిర్వహణ, సెక్యూరిటీ, వంట వడ్డించే పనులకు వినియోగించుకోవచ్చని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రానున్న కాలంలో వారి ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు.

ఆహార కలుషితం సాకు..

ఇక చంద్రబాబు అధికారం చేపట్టాక పేద పిల్లలు చదివే గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి ఆహారం కలుషితమైన ఘటనలు పెద్దఎత్తున చోటుచేసుకున్నాయి. ఇలా రాష్ట్రంలో జరిగిన దాదాపు తొమ్మిది ఘటనల్లో వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రిపాలయ్యారు. దీన్ని సాకుగా చూపి మొత్తం భోజనం బాధ్యతను అక్షయపాత్రకు అప్పగించి ఆ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆహారం కలుషితమై పేద పిల్లలు అనారోగ్యం పాలుకావడానికి కారణాలను తెలుసుకుని వాటిని సరిదిద్దకుండా ఆ బాధ్యత నుంచి తప్పించుకుంటోంది.



ఒక్కొక్కటిగా అక్షయపాత్రకు..

తొలినుంచి ప్రైవేటీకరణ వైపే మొగ్గుచూపే చంద్రబాబు పేద పిల్లల భోజనాన్ని కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించడం బాధాకరం. ఇప్పటికే అన్న క్యాంటీన్, మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించిన చంద్రబాబు.. తాజాగా గిరిజన గురుకులాలు, వసతి గృహాలను కూడా అప్పగించే ప్రతిపాదన చేసింది. రానున్న కాలంలో ఎస్సీ, బీసీ తదితర వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల భోజన బాధ్యతలు కూడా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

ఇంటింటికి రేషన్ నిలిపివేతకు ఏజెన్సీ నుంచే ప్రయత్నం

ఇక రాష్ట్రంలో ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలను తొలగించేందుకు చంద్రబాబు సర్కారు వచ్చిన వెంటనే ప్రతిపాదన సిద్ధంచేసింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర పేద వర్గాలకు చెందిన యువతకు 90 శాతం సబ్సిడీపై అందించిన ఈ వాహనాలను ఆపేసి మళ్లీ రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకునేలా ప్రతిపాదించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఎండీయూ వాహనాలు ఆపేస్తే ప్రజల నుంచి విమర్శలు వస్తాయనే ఎత్తుగడతో తొలుత గిరిజన ప్రాంతాల్లోనే వాటిని ఆపేసేలా ప్రతిపాదించారు. వీరి నుంచి ప్రతిఘటన రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా వాటిని నిలిపివేసేలా పన్నాగం పన్నింది. వాస్తవానికి అటవీ ప్రాంతాల్లో సుదూరంగా ఉండే ఆవాసాల నుంచి ప్రజలు కిలోమీటర్ల తరబడి డీలర్ షాపునకు వచ్చి సరుకులు తీసుకోవడం కష్టసాధ్యమని తెలిసినా టీడీపీ ప్రభుత్వం వాటిని ఆపేయాలనుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉచిత ఇసుక బూటకం

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.

నెల్లూరు(దర్గామిట్ట): బూటకపు హామీలు, అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పడం ఒక నాటకమని, ఉచితం పేరున తెలుగు తమ్ముళ్ల జేబులు నింపే ఎత్తుగడ అని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలో భవన నిర్మాణ కార్మికులతో కలసి పార్టీ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రీచ్‌లోకి వెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే తెలుగుదేశం స్టిక్కర్ ఉంటేనే వీలయ్యే పరిస్థితి ఉందన్నారు. నేరుగా నదుల్లో ఇసుకను దోచుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇసుక ఉచితమంటూ ప్రజలను చంద్రబాబు మోసం చేసున్నాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వానికి ఇసుక సీనరేజీ ద్వారా ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయం వస్తే ప్రస్తుతం జీరో అయిందన్నారు. ఇసుక దోపిడీని కలెక్టర్ ఆపాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున తామే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేలా ఆయన మెడలు వంచేందుకైనా సిద్ధమన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీలో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీ, మాజీ ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు బొర్రా మధుసూధన్, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

90 మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యం

విశాఖ సిటీ: విశాఖ పోర్టు ఈ ఏడాది 90 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేస్తున్నట్లు పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. విశాఖ పోర్టు అథారిటీ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పోర్టు పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన చైర్‌పర్సన్ మాట్లడుతూ పోర్టు గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని, దాన్ని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అలాగే పోర్టులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పోర్టు సామర్థ్యం, పోర్టులో పర్యావరణ సుస్థిరత కోసం చేపడుతున్న చర్యలు, సాంకేతిక పురోగతి, సామాజిక సేవలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను విశదీకరించారు. పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా వినియోగిస్తున్న సీఎస్ఆర్ నిధులకు సంబంధించి విద్యా, ఆరోగ్య రంగాలకు చెందిన సంస్థలకు చెక్కులు అందించారు. శిక్షణను పూర్తిచేసుకున్న సిబ్బందికి ఐజీఓటీ సర్టిఫికెట్లు, పెన్షనర్లకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పోర్టు పరిపాలనా భవనంలో ఆధునీకీకరించిన బోర్డు రూంను చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి వైజాగ్‌పటంగా నామకరణం చేశారు. పోర్టు పరిసర ప్రాంతాలలో సుందరీకరణ, పచ్చదనాన్ని పెంపొందించే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఇళ్ల మధ్య మద్యం షాపుతో మా ప్రాణాలు తీయద్దు

నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

తిరుపతి కల్చరల్: నిత్యం యాత్రికుల రద్దీతో పాటు వందలాది కుటుంబాలు నివాసాలు ఉన్న తిరుపతి కస్తూరిబా వీధిలో మద్యం షాపు ఏర్పాటుతో తమ ప్రాణాలు తీయద్దంటూ శుక్రవారం స్థానిక మహిళలు ముక్త కంఠంతో నినదించారు. తిరుపతి మద్యం షాపు దక్కించుకున్న టీడీపీ నేత కంకణాల రజనీకాంత్ అధికార పార్టీ అండతో అధికంగా ఆదాయ వనరులు పొందేందుకు అటు శ్రీగోవిందరాజస్వామి ఆలయం, ఇటు రైల్వేస్టేషన్, పాఠశాల ఉన్నటువంటి కస్తూరిబా వీధిలోని వీధి ముఖద్వారం వద్దనున్న ఖాళీ స్థలంలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం మినీ ఆటోల ద్వారా మద్యం సరుకును తీసుకుని వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు మద్యం ఏర్పాటు స్థలం వద్దకు చేరుకుని మద్యంను దించవద్దంటూ అడ్డుకున్నారు. షాపు ఏర్పాటు దారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేసుకోవడంతో నివాస గృహాల వద్ద మద్యం షాపు వద్దు అంటూ ముక్తకంఠంతో అడ్డుకున్నారు. మద్యం సరుకును తీసుకొచ్చిన మినీ ఆటోలను అక్కడి నుంచి పంపేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు శిరీష, రాధమ్మ, కృష్ణవేణి మాట్లాడుతూ కస్తూరిబా వీధిలో సుమారు 500కుపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. పక్కనే రైల్వేస్టేషన్ ఉండడతో నిత్యం యాత్రికులు రద్దీగా ఉంటుందన్నారు. అంతేకాక ఇదే వీధి పాఠశాల కూడా ఉండడంతో ఆర్‌సీ రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణంతో అటు వైపు దారి లేకపోవడంతో ఇక్కడ నివాసమున్న కుటుంబాలకు ఇదే దారి తప్ప వేరే లేదన్నారు.




శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,004 మంది స్వామివారిని దర్శించుకోగా 20,173 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీకాళహస్తిలో 1న కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీపావళి సందర్భంగా నవంబరు 1న నిర్వహించే కేదార గౌరీ వ్రతానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో ఆలయాన్ని దీపాల కాంతితో ముస్తాబు చేయాలన్నారు. ఈ శక్తితో మనం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు బలం చేకూరుతుందన్నారు. కార్తీక మాసం గతం కన్నా భిన్నంగా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేయాలన్నారు. ఒక్కొక్క సోమవారం ఒక్కో కోనేరులో దీపాలు వెలిగించాలని అందులో భక్తుల భాగస్వామ్యం అవసరమన్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీవారి పట్టపురాణి




చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అభిషేక సేవను చేపట్టి సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద అమ్మవారికి విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్‌సేవను చేపట్టారు. అనంతరం అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై, నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



కొమ్మాది: విశాఖనగరం రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు కనులపండువగా జరిపించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లి, అభిషేకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ అంధకారమే

తిరుపతి క్రైం: ర్యాగింగ్ భూతం ప్రమాదకరమని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను అంధకారం చేస్తుందని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వర్సిటీలో చదవడం అదృష్టమని, సీనియర్లు జూనియర్లతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టాలు చాలా కఠినంగా ఉంటాయన్నారు.



ఏయూలో డ్యూయల్ డిగ్రీ కోర్సులు

మద్దిలపాలెం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డ్యుయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వీసీ ఆచార్య జి. శశిభూషణ రావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డ్యుయల్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించామన్నారు. బీటెక్ వీఎల్ఎస్ఐ, ఎంటెక్ సిగ్నల్ ప్రోసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. 2018 నుంచి ఏయూలో చదివి అనివార్య కారణాల వలన మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాలేని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

రేపు గుంటూరులో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి 5వ మాస్టర్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం గుంటూరులో నిర్వహిస్తున్నట్టు పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో 25 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు వివిధ కేటగిరీలలో మహిళలు, పురుషులకు నిర్విహిస్తున్నట్టు వివరించారు. వివరాలకు 8296374963 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయిలో జరిగే రెజ్లింగ్(కుస్తీ) పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం మాట్లాడుతూ పురుషులు, స్త్రీల విభాగాలలో ఎంపికలు జరిగాయన్నారు.





● మన బొమ్మలు

నేను టెడ్డీబేర్‌ని...



హాయ్.. నేనే.. మీకెంతో ఇష్టమైన మెత్తటి బొమ్మని. టెడ్డీబేర్‌ని.ఎలుగుబంటిని. బంటిగాణ్ణి. నా గురించి తెలుసా మీకు? చెప్పనా?

ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ నేను ఉంటాను. నేను లేని ఇల్లు ఉండదు– ఆ ఇంట్లో పిల్లలు ఉంటే. బర్త్‌డే పార్టీ వచ్చిందంటే చాలు పిల్లలకు అందరూ గిఫ్ట్‌గా ఇచ్చేది, పిల్లలు గిఫ్ట్‌గా పొందేది నన్నే. బుజ్జి సైజు నుంచి బోలెడు సైజు వరకూ నన్ను దగ్గర పెట్టుకుంటారు తెలుసా? తోడుగా పడుకోబెట్టుకుంటారు తెలుసా?

నాకు రెండు ఊళ్లున్నాయి. ఒకటి అమెరికా, మరొకటి జర్మనీ. అమెరికాకు చెందిన మోరిస్ మిష్టమ్, జర్మనీకి చెందిన రిచర్డ్ స్టీఫ్ కాస్త అటూఇటుగా ఒకేసారి నన్ను తయారు చేశారు. వాళ్లు తయారు చేసిన రూపాల్లో తేడాలున్నా తయారు చేసింది మాత్రం నన్నే. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూస్‌వెల్ట్‌ని ప్రజలు 'టెడ్డీ' అని పిలిచేవారు. ఆయన 1903లో అమెరికాలోని సిన్‌సినాటీకి వేటకు వెళ్లి అక్కడ గాయపడిన ఒక ఎలుగుబంటిని చూసి 'ఈ స్థితిలో ఉన్న ఈ ఎలుగుబంటిని నేను వేటాడను' అని జాలిగొన్నాడు. ఆ సంగతి దేశమంతా పాకింది. ఎలుగుబంటి జాలి రూపం పిల్లలను ఆకట్టుకుంటుందని మెత్తగా ఉండే నన్ను తయారు చేసి 'టెడ్డీబేర్'గా నామకరణం చేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ఆ పేరుతోనే నేను మీకందరికీ తెలిశాను.

మార్కెట్‌లో అత్యంత పెద్దసైజు అంటే 63 అడుగుల ఎత్తులో నేను దొరుకుతాను. అలాగే 9 మిల్లీమీటర్ల అతి చిన్న సైజులో కూడా దొరుకుతాను. నేను మొత్తం 500 రకాల్లో మీకు కనిపిస్తుంటాను. ప్రతి నిమిషానికి ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు నన్ను కొంటూ ఉంటారు.

నన్ను ప్రపంచమంతా టెడ్డీబేర్ అని పిలిచినా సరే, రష్యా, చైనా, యూరప్ దేశాల్లో నాకంటూ ప్రత్యేకమైన పేర్లున్నాయి. ఏ దేశంలో ఆ దేశస్తులకు తగ్గట్టు నాకు పేర్లు పెట్టుకుంటారు. మీరు కూడా మీకు నచ్చిన పేరు నాకు పెట్టుకోవచ్చు. అమెరికన్లకు నేనంటే చాలా చాలా ఇష్టం. ఏడాదికి ఒక్కొక్కరు 220 అమెరికన్ డాలర్లు నాకోసం ఖర్చు పెడతారు. నన్నెంతో ప్రేమగా చూసుకుంటారు. వాలెంటైన్స్ డే రోజున నన్ను వాళ్ల ప్రేమికులకు బహుమతిగా ఇస్తారు. ఇదీ నా కథ. ఇక ఉంటాను. బై!

● సినిమా చూద్దామా?

ఇఫ్... మన ఊహే నిజమైతే...



ఈ ప్రపంచంలో తల్లిదండ్రుల తరువాత మనకు నియర్ అండ్ డియర్ ఎవరైనా ఉన్నారంటే వాళ్ళే మన ఫ్రెండ్స్. పిల్లల్లో కొంత మంది వాళ్ళ ఫ్రెండ్స్ గురించి అద్భుతంగా ఊహించుకుంటారు. ఇంకొంతమంది పిల్లలు నిజ జీవితంలో ఉన్నవారిని కాకుండా తమ ఊహల్లోనే కొంతమంది ఫ్రెండ్స్‌గా భావిస్తారు. అంటే ఆ ఊహలోని ఫ్రెండ్స్‌కి గొప్ప పవర్స్, పవర్‌ఫుల్ మేకోవర్ ఉంటాయి. మరి అలాంటి ఊహలు నిజమైతే? అలాంటి థాట్‌లోంచి వచ్చిన సినిమానే 'ఇఫ్' చిత్రం. ఇదో ఫాంటసీ కామెడీ మూవీ. దీనిని జాన్ క్రసిన్‌స్కీ తీశారు. ప్రముఖ నటులు రేయాన్ రెనాల్డ్స్‌తో పాటు కాలే ఫ్లెమ్మింగ్ తమ పాత్రలకు అద్భుతమైన న్యాయం చేశారు.

'ఇఫ్' సినిమా కథేంటంటే పన్నెండేళ్ళ బీ తన డాడీ ఆపరేషన్ వల్ల గ్రాండ్ మదర్ మార్గరేట్ అపార్ట్‌మెంట్‌కు వస్తుంది. బీ మమ్మీ చిన్నప్పుడే చనిపోతుంది. ఓరోజు రాత్రి బీ తనకు బిల్డింగ్‌లో ఎవరో రేర్ క్రియేచర్ వెళ్తున్నట్టు అనిపిస్తుంది. ఆ తరువాత రోజు కూడా ఆ క్రియేచర్ ఓ మనిషితో పాటు వెళ్తున్నట్టు మళ్ళీ కనిపిస్తుంది. ఆ మనిషి ఎవరో కాదు తన గ్రాండ్ మదర్ బిల్డింగ్ పై ఫ్లోర్ లో వున్న కాల్ అని తెలుస్తుంది. కాల్‌తో వున్న క్రియేచర్ బ్లూ. కాని ఈసారి బ్లూతో పాటు సీతాకోకచిలుక రూపంలో వున్న బ్లాసమ్‌ని చూడగానే బీ మూర్చపోతుంది. ఆ తరువాత కొన్ని రోజులకు బీ కాల్‌తో కలిసి ఈ క్రియేచర్స్ అన్ని ఉన్న చోటికి వెళ్ళి తన ఇమేజినేషన్‌తో వాటన్నిటిని తనకు నచ్చిన విధంగా మార్చి చూసుకుని ముచ్చట పడుతుంది. అసలు బీకి కనిపించిన ఈ క్రియేచర్స్ ఏంటి, తన ఇమేజినేషన్ తో సృష్టించుకున్న క్రియేచర్స్‌తో బీ ఇంకెన్ని మాజిక్స్ చేసిందో ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఇఫ్' చూస్తే తెలిసిపోతుంది. ఈ సినిమా మొత్తంలో గ్రాఫిక్స్ చాలా బావుంటాయి. మనకు కనిపించే క్రియేచర్స్‌ని చాలా బాగా చూపించారు. ఇట్స్ ఎ వర్త్ మూవీ ఫర్ కిడ్స్.



- ఇంటూరు హరికృష్ణ

● మూగ ప్రేమ

బొజ్జో నాన్నా కన్నా...



ఈ ఫొటో చూశారా? 19 ఏళ్ల తన పెంపుడు కుక్కను రోజూ దగ్గర్లోని చెరువుకు తీసుకొని వస్తూ, దాన్ని అందులో ఒక రెండు గంటలపాటు ఉంచుతున్నాడు జాన్ ఎంగర్ అనే వ్యక్తి. ఎందుకో తెలుసా? మనుషులకు వచ్చినట్టే కుక్కలకు కూడా జబ్బులు వస్తాయి. అలా ఆ కుక్కకు తీవ్రమైన ఆర్థరైటిస్ వచ్చింది. ఆ నొప్పుల కారణంగా అది నిద్రపోవడం లేదు. డాక్టర్లు ఎన్ని చికిత్సలు చేసినా ప్రయోజనం లేదు. దీంతో ఆ కుక్కకు మత్తుమందు ఇచ్చి చంపేయమని ఆయనకు కొందరు సలహా ఇచ్చారు. కానీ జాన్ అందుకు ఒప్పుకోలేదు. ఒకప్పుడు తాను ఆత్మహత్య చేసుకోబోతుంటే తన పెంపుడు కుక్క తనను ఆపింది. ఆ ప్రయత్నం మానుకునేలా చేసింది. అలాంటి జీవిని చంపడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే రోజూ తన కుక్కను చెరువుకు తీసుకొచ్చి, దాన్ని కాసేపు ఆ నీటిలో ఉంచి, నిద్రపోయేలా చేస్తారు. అది నిద్రపోతున్నంతసేపూ ఏమాత్రం కదలకుండా అలాగే ఉంటారు. ఎన్నో రోజులుగా ఆయన ఈ పని చేస్తున్నారు. చూశారా! వారిద్దరి మధ్య ఎంత గాఢమైన అనుబంధమో!

● ఈ సామెత తెలుసుకోండి!



'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది'

మన చుట్టూ ఉన్నా వారిని గౌరవించి, వారితో ప్రేమగా ఉంటే వారూ మనతో ప్రేమగా ఉంటారు. అలా కాకుండా ఎప్పుడూ వారితో గొడవపడుతూ, వారిని నిర్లక్ష్యం చేస్తే వాళ్లు కూడా మనతో అలాగే ప్రవర్తిస్తారు. కాబట్టి మనం అందరితో మంచిగా ఉండాలి. అందర్నీ గౌరవించాలి. ఎవరి గురించీ తప్పుగా మాట్లాడకూడదు. ఎవర్నీ తక్కువగా చూడకూడదు. అందరితో కలిసిమెలిసి ఉండాలి. ఆ విషయాన్ని చెప్పేందుకు ఈ సామెత వాడతారు.

● యంగ్ టాలెంట్


ఎన్ని తెలివితేటలో!



ఫ్రెండ్స్, ఈరోజు మనం బెంగళూరుకు చెందిన అర్షత్ ద్వివేది గురించి తెలుసుకుందాం. పది సంవత్సరాల అర్షత్ అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ (జే హెచ్–సీటీవై)లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్'కు హాజరయ్యే అర్హత సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల్లో అర్షత్ ద్వివేది ఒకరు.

'సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్' అనేది సైన్స్, గణితం లాంటి సబ్జెక్ట్‌లలో విద్యార్థుల ప్రతిభను పరీక్షించే కార్యక్రమం. ఈ పరీక్షలలో తొంభైశాతం మార్కులతో 'శభాష్' అనిపించుకున్నాడు మన అర్షత్ ద్వివేది.

● కామెడీ క్లాస్



ఆహా!

దోమపిల్ల మొదటిసారిగా గాల్లోకి ఎగిరింది.
దోమతల్లి : ఎలా అనిపిస్తుంది?
పిల్ల : నా సంగతి వదిలేయ్... జనాలు మాత్రం చాలా ప్రోత్సహిస్తున్నారు...
తల్లి : ప్రోత్సాహం ఏమిటి?
పిల్ల : నేను ఎక్కడికి వెళ్లినా... జనాలు సంతోషంతో చప్పట్లు కొడుతున్నారు!



అలా మానేశాడు!

డాక్టర్ : మందు మానేశారా?
పేషెంట్ : పూర్తిగా మానేశాను సర్. ఎవరైనా అదేపనిగా అడిగితేనే తాగుతున్నాను.
డాక్టర్ : అది సరే, ఇతను ఎవరు?
పేషెంట్ : నా ఉద్యోగి
డాక్టర్ : ఏం పనిచేస్తాడు?
పేషెంట్ : 'మద్యం తాగండి' అని అదేపనిగా నన్ను బతిమిలాడుతుంటాడు!



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

మాల్లవి	మల్ల యుద్ధం
మాల్యవంతుడు	పువ్వుల దండ ధరించేవాడు
మాషాదం	తాబేలు
మాషాశం	గుర్రం
మార్జాలం	పిల్లి
దోషలుడు	నేరం చేసిన వాడు
కాంతారం	పెద్ద అడవి
కావికాలం	చెడుకాలం
అకాండపాతం	అనుకోకుండా జరగడం
చోరుడు	దొంగ

● కథ

తెలివైన మేక పిల్లలు




ఒక అడవిలో ఒక మేక వుండేది. దానికి బుజ్జిబుజ్జి పిల్లలు వున్నాయి. ఒక రోజు అవన్నీ కలసి మేతకు పోయాయి. అడవిలో ఒక నక్క వుంది. దాని కన్ను మేక మీద పడింది. ఎగిరి దాని మీదకు దుంకింది. తల్లీపిల్లలు బెదిరిపోయి తలోదిక్కు పరుగు అందుకున్నాయి. తల్లి మేక వెంట నక్క పడటంతో అది బెదిరి మరింత వేగంగా వురకసాగింది. దారిలో పెద్ద గుంత వుంది. మేక దభీమని దానిలో పడిపోయింది. నక్క వురుక్కుంటా ఆ గోతి కాడికి వచ్చింది. కింద అందేంత దూరంలోనే ఆహారం వుంది. కానీ దిగితే పైకి రావడం అంత సులభం గాదు. 'అడవేం చిన్నది గాదు. ఇది కాకపోతే ఇంకొకటి దొరుకుతుంది' అనుకుంటా గమ్మున తిరిగి వెళ్ళిపోయింది. ఇక్కడ మేక పిల్లలన్నీ ఒక చోటికి గుంపయ్యాయి. అమ్మను వెదుక్కుంటా బైలుదేరాయి.

వెదుకుతా వెదుకుతా చివరికి ఆ గుంత దగ్గరికి చేరుకున్నాయి. అప్పటికే ఆ మేక బైటకి రావడానికి ఎగిరీ ఎగిరీ అలసిపోయి, ఇంగ లాభం లేదు అనుకోని మౌనంగా వుండిపోయింది. పిల్లలన్నీ ఆ గుంత చుట్టూ చేరాయి. తల్లి వారిని చూసి 'పిల్లలూ... చీకటి పడతా వుంది. మీరంతా ఇంటికి వెళ్ళండి. ఇక ఈ రోజుతో మీకూ నాకూ ఋణం తీరిపోయింది. మీరంతా హాయిగా కలసిమెలసి వుండండి' అంటా మంచిమాటలు చెప్పింది. ఆ మాటలకు పిల్లల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అప్పుడు ఒక చిట్టిమేక 'మనం అమ్మను కాపాడి చీకటి పడే లోగా అందరం తప్పించుకోవాలి బుర్రలకు పదును పెట్టండి' అంది. ఒక బుజ్జిమేక 'అన్నలారా... అదిగో అక్కడ చూడండి. పెద్ద తీగ వుంది. దాన్ని తెంపి లోపలికి వదులుదాం. అమ్మను పైకి లాగుదాం. ఎలా వుంది నా ఆలోచన'' అంది. ఆ ఉపాయం అన్నిటికీ భలే నచ్చింది. వెంటనే పరుగెత్తుకోని పోయి ఆ తీగను నోటితో కొరికి తెంపాయి. దాన్ని మోసుకోని వచ్చి లోపలికి వదిలాయి. 'అమ్మా... నువ్వు ఒకవైపు గట్టిగా నోటితో పట్టుకో. మేమంతా మరొక వైపు పట్టుకొని పైకి లాగుతాం' అన్నాయి. పిల్లల తెలివికి అమ్మ ఆనందంతో మురిసిపోయి 'సరే' అంది. ఆ తీగను గట్టిగా పట్టుకొంది. రెండవ వైపు పిల్లలన్నీ కలసి పట్టుకొని 'లాగర లాగు హైలెస్సా... గట్టిగ లాగు హైలెస్సా... అమ్మను లాగు హైలెస్సా' అని అరుచుకుంటా లాగసాగాయి.

కానీ అవెంత. వాటి బలమెంత. బుజ్జి బుజ్జి పిల్లలు. ఎంత లాగినా తల్లి ఒక్క ఇంచు గూడా పైకి రాలేదు. అన్నీ గుంత చుట్టూ చేరాయి. 'అమ్మా... మేం ఓడిపోయాం. నిన్ను కాపాడుకోలేక పోతా వున్నాం'' అన్నాయి దిగులుగా. అంతలో ఒక చిట్టిమేకకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. 'తమ్ముల్లారా... మనమంటే చిన్న చిన్న పిల్లలం. బలం తక్కువ. అమ్మను బైటకు లాగలేక పోతా వున్నాం. అదే అమ్మయితే మనలని గుంతలో నుండి ఒక్క నిమిషంలో బైటకు లాగగలుగుతుంది. మనం అందరం గుంతలోకి దుంకేద్దాం. మన మీదకు ఎక్కి అమ్మ బైటకు ఎగురుతుంది. ఆ తరువాత మరలా మనందరినీ ఒక్కొక్కటిగా పైకి లాగుతుంది. ఏమంటారు' అంది. అన్నింటికీ ఆ ఆలోచన తెగ నచ్చేసింది. వెంటనే ''అమ్మా.. వస్తున్నాం'' అంటా ఒక్కొక్కటి లోపలికి దుంకేశాయి. పిల్లలు ఒకదాని పక్కన ఒకటి నిలబడ్డాయి. తల్లిమేక వాటిపైకి ఎక్కి ఎగిరి గట్టు మీదకు చేరుకుంది. తరువాత ఒక్కొక్క దాన్ని తీగతో పైకి లాగేసింది. ఆ రోజు వెన్నెల వెలుగుల్లో తనను కాపాడిన పిల్లలకు కోరినవన్నీ చేసి పెట్టి గొప్ప విందు ఇచ్చింది.



● మహనీయులు నేతాజీ

ఇంట్లోని రొట్టెలు ఆకలిగొన్న వారికి పెట్టారు



పిల్లలూ! మీ ఇంటి ముందుకు ఎవరైనా వచ్చి ఆకలిగా ఉందంటే మీరేం చేస్తారు? మీ ఇంట్లో ఉన్నదేదో వారికి పెడతారు. అయితే ఆకలితో ఉన్నవారిని వెతుక్కుంటూ వెళ్లి మరీ ఆహారం పెడతారా? అలా పెట్టిన బాలుడి కథ ఇది. ఒక రోజు ఆ బాలుడి అమ్మ బాలుడి గది సర్దుతూ ఉంటే అల్మారాలోకి చీమల వరుస వెళ్తూ ఉండటం కనిపించింది. అల్మారా తెరిచి చూస్తే లోపల కాగితంలో రెండు ఎండిపోయిన రొట్టెలు కనిపించాయి. వాటిని అక్కడ పెట్టింది తన కొడుకే అని భావించిన ఆమె కొడుకు కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అతను రాగానే విషయం చెప్పి, రొట్టెలు అల్మారాలో ఎందుకు పెట్టావని అడిగింది.

దానికి ఆ బాలుడు 'అమ్మా! మా పాఠశాలకు వెళ్లే దారిలో ఒక ముసలావిడ కూర్చుని ఉంటుంది. ఆమెకు ఇల్లు లేదు. బంధువులు, సొంత వాళ్లు కూడా లేరు. వేళకు ఆహారం అందించేందుకు కూడా ఎవరూ ముందుకు రారు. నేను రోజూ మన ఇంటి నుంచి రెండు రొట్టెలు తీసుకుని వెళ్లి ఆమెకు ఇచ్చేవాణ్ని. ఆమె వాటిని తీసుకుని, నన్ను కృతజ్ఞతగా చూసేది' అని వివరించాడు.

'మరి ఈ రొట్టెలు ఆమెకు ఇవ్వలేదా?' అని తల్లి అడిగింది.

'లేదమ్మా! రెండు రోజుల క్రితం నేను రొట్టెలు తీసుకువెళ్ళే సమయానికి ఆమె కనిపించలేదు. ఏమైందని చుట్టుపక్కల వారిని అడిగితే చనిపోయిందని ఎవరో వచ్చి శవాన్ని తీసుకెళ్లి దహనం చేసేశారని చెప్పారు. ఆమెకోసం తీసుకెళ్ళిన రొట్టెలను పడేయడం ఇష్టం లేక ఇలా అల్మారాలో పెట్టేశాను' అన్నాడు.

ఆ మాటలకు తల్లి కరిగిపోయి, కన్నీళ్లు పెట్టుకొని అతణ్ని హత్తుకుంది. ఆ బాలుడే ఆ తర్వాత కాలంలో 'నేతాజీ'గా పేరుపొందిన సుభాష్ చంద్రబోస్. 'అజాద్ హింద్ ఫౌజ్'ను స్థాపించి మన దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. మీరు ఆయనలాగా మీ చుట్టూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి. వారికి సాయం అందించాలి.

● పాడుదాం గేయం

దేవుని కోవెల

1
ఇదిగో ఇదిగో దేవుని కోవెల
చల్లని దైవం నిలిచిన కోవెల
భక్తితో జనులు వచ్చే కోవెల
అందరు కలిసి మొక్కే కోవెల

2
పూలను తెచ్చి.. సజ్జలో పెట్టి
పండూ ఫలమూ చేతనుబట్టి
వడివడిగా అడుగులు వేసి
చేరుకుందాము దేవుని కోవెలకు

3
గంటలు కొట్టి.. దేవుని మొక్కి
అర్చన చేసి.. హారతులిచ్చి
పువ్వులు ఉంచి.. పూజలు చేసి
వేడుకుందాము విద్యలీయమని

4
ఇదిగో ఇదిగో దేవుని కోవెల
చల్లని దైవం నిలిచిన కోవెల
భక్తితో జనులు వచ్చే కోవెల
అందరు కలిసి మొక్కే కోవెల



బిజినెస్ రీల్

రిస్కులో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ: ఎంఆర్ఏఐ



న్యూఢిల్లీ: రీసైక్లింగ్ వ్యవస్థలో గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ పలు రిస్కులు ఎదుర్కొంటోందని మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఆర్ఏఐ) తెలిపింది. పరిశ్రమలోకి మోసపూరిత వ్యాపార సంస్థల ఎంట్రీతో పాటు పర్యావరణంపరంగా విపత్తులు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు వివరించింది. ప్రస్తుత ధర విధానం వల్ల లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల దిగుమతులపై భారత్‌కు సుమారు 1 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకంపరంగా నష్టం వాటిల్లుతోందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో లిథియం రీసైక్లింగ్‌కు ఫ్లోర్ ధరను పెంచాలని, నిబంధనలు పారదర్శకంగా అమలయ్యేలా చూడాలని కేంద్రాన్ని కోరినట్లు ఎంఆర్ఏఐ వివరించింది.

● ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి

జపాన్ కంపెనీతో ఎంఎస్‌టీసీ ఒప్పందం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) విక్రయానికి సంబంధించి జపాన్‌కి చెందిన కొనొయికే ట్రాన్స్‌పోర్ట్‌తో ప్రభుత్వ రంగ ఎంఎస్‌టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం దీపం కార్యదర్శి ఈ విషయం వెల్లడించారు. ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి ప్రభుత్వం రూ. 262 కోట్ల రిజర్వ్ ధర నిర్దేశించగా కొనొయికే రూ. 320 కోట్లు బిడ్ చేసింది. కొనొయికే ట్రాన్స్‌పోర్ట్ ఉక్కు విభాగం 140 ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తోంది. మరోవైపు, స్క్రాప్ ప్రాసెసింగ్ తదితర కార్యకలాపాలు నిర్వహించే ఎఫ్ఎస్ఎన్ఎల్ 1979లో ఏర్పాటైంది.

టయోటా రూమియన్ లిమిటెడ్ ఎడిషన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తాజాగా మల్టీ పర్పస్ వెహికిల్ రూమియన్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రూ.20,608 విలువగల కాంప్లిమెంటరీ యాక్సెసరీ ప్యాకేజీను అక్టోబర్ 31 వరకు ఆఫర్ చేస్తోంది. రూమియన్ ఎక్స్‌షోరూం ధర రూ.10.44 లక్షల నుంచి ప్రారంభం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-10-2024	
విశాఖ	540-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

నేటి బోర్డు సమావేశాలు

ఐసీఐసీఐ బ్యాంక్, యస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఆర్‌ఈసీ, రిలయన్స్ పవర్, జేకే సిమెంట్, జేపీ ఇన్‌ఫ్రాటెక్, టిటాఘర్ రైల్ సిస్టమ్స్, సీడీఎస్ఎల్, ఎస్‌జీఎఫ్‌సీ ఫైనాన్స్

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,004.85	4.9
TECHM	1,732.85	2.14
TATACONSUM	1,016.00	1.78
BAJAJ-AUTO	10,550.00	1.75
HDFCBANK	1,736.20	1.26

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,794.30	-3.22
SUNPHARMA	1,836.70	-2.69
EICHERMOT	4,660.70	-2.07
SHRIRAMFIN	3,194.00	-1.86
POWERGRID	316.8	-1.84

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,513
ఎన్ఎస్ఈ	1,14,725
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,93,030
ఎఫ్ఐఐ	- 3,037
డీఐఐ	+ 4,159

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.88	$ 70.19
బ్రెంట్	76.88	$ 74.38

బ్లూజే ఏరో లాజిస్టిక్స్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్లీన్ టెక్నాలజీ సంస్థ బ్లూజే ఏరో తాజాగా లాజిస్టిక్స్ కోసం ఉపయోగించే మానవరహిత వీటీవోఎల్ (వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్) ఎయిర్‌క్రాఫ్ట్ 'రీచ్'ను లైవ్‌లో ప్రదర్శించింది. ఇది దేశీయంగా రూపొందించిన తొలి హైడ్రోజన్-ఎలక్ట్రిక్ వీటీవోఎల్ అని సంస్థ సహ వ్యవస్థాపకుడు ఉత్తమ్ కుమార్ తెలిపారు. 100 కేజీల పేలోడ్ సామర్థ్యంతో ఒక్కసారి చార్జ్ చేస్తే 300 కి.మీ. ప్రయాణించగలదని వివరించారు. అంతగా కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో కూడా సత్వరంగా డెలివరీ చేసేందుకు ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు. తమ టెక్నాలజీతో సంప్రదాయ ఎయిర్‌పోర్ట్ మౌలిక సదుపాయాల అవసరం లేకుండా హైదరాబాద్-వరంగల్, ముంబై-పుణె వంటి కీలక రూట్లలో 30 నిమిషాల్లోపే వాయుమార్గంలో రవాణా సాధ్యపడుతుందని చెప్పారు. ఇప్పటివరకు రూ. 18 కోట్లు సమీకరించామని, మరో రూ. 250 కోట్లు సమీకరించే యత్నాల్లో ఉన్నామని ఉత్తమ్ కుమార్ వివరించారు. జిరోధాకు చెందిన రెయిన్‌మ్యాటర్ క్యాపిటల్, ఎండియా పార్ట్‌నర్స్ తదితర సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి.

74 శాతం తగ్గిన ఆదాయ అసమానతలు

పదేళ్లలో రూ. 5 లక్షల వరకు ఆదాయ వర్గాలపై ఎస్‌బీఐ నివేదిక



న్యూఢిల్లీ: పదేళ్ల వ్యవధిలో దేశీయంగా ఆదాయ అసమానత గణనీయంగా దిగి వచ్చింది. రూ. 5 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి సంబంధించి 2013-14, 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో అసమానతలు ఏకంగా 74.2 శాతం మేర తగ్గాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లోని ఎకనమిక్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2014-2024 అసెస్‌మెంట్ ఇయర్స్ గణాంకాలను అధ్యయనం చేసిన మీదట ఎస్‌బీఐ దీన్ని రూపొందించింది. దీని ప్రకారం ఆదాయాన్ని మెరుగుపర్చుకుంటూ పై స్థాయికి చేరుకుంటున్న అల్పాదాయ వర్గాల వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2014 ఆర్థిక సంవత్సరంలో రూ. 3.5 లక్షల వరకు ఆదాయాలున్న వారిలో 31.8 శాతంగా ఉన్న అసమానత 2021 ఆర్థిక సంవత్సరం నాటికి 12.8 శాతానికి తగ్గింది. రూ. 5.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వర్గాల సంపాదన గత దశాబ్ద కాలంలో (కోవిడ్ ప్రభావిత 2020 అసెస్‌మెంట్ ఇయర్ తప్ప) ప్రతి సంవత్సరం సానుకూల రేటుతో వృద్ధి చెందింది.

జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ లాభం రూ. 250 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా నికర లాభం సుమారు రూ. 250 కోట్లుగా నమోదైంది. గత క్యూ2లో కంపెనీ రూ. 123 కోట్ల నష్టం ప్రకటించింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 679 కోట్ల నుంచి రూ. 1,507 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 505 కోట్ల నుంచి రూ. 973 కోట్లకు చేరాయి.

ఎన్‌టీపీసీ రూ. 2.50 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ దిగ్గజం ఎన్‌టీపీసీ లాభం 14 శాతం ఎగసి రూ. 5,380 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 4,726 కోట్లు. అయితే, ఆదాయం రూ. 45,385 కోట్ల నుంచి రూ. 45,198 కోట్లకు తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 10 ముఖ విలువ గల షేరుపై రూ. 2.50 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్ ఇచ్చే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. డివిడెండ్ చెల్లింపు తేదీ నవంబర్ 18గా ఉంటుంది. లడఖ్‌లోని చుషుల్‌లో సోలార్ హైడ్రోజన్ ఆధారిత మైక్రోగ్రిడ్‌ను ఏర్పాటు చేసేందుకు భారతీయ ఆర్మీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. రెండో త్రైమాసికంలో స్థూల విద్యుదుత్పత్తి 90.30 బిలియన్ యూనిట్ల నుంచి 88.46 యూనిట్లకు తగ్గింది. క్యాప్టివ్ బొగ్గు గనుల నుంచి ఉత్పత్తి 5.59 మిలియన్ టన్నుల నుంచి 9.03 ఎంఎంటీకి పెరిగింది. గ్రూప్ స్థాయిలో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 73,824 మెగావాట్ల నుంచి 76,443 మెగావాట్లకు చేరింది.

డీఎల్‌ఎఫ్ లాభం రెండు రెట్లు వృద్ధి



న్యూఢిల్లీ: లగ్జరీ ప్రాపర్టీలకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో సెప్టెంబర్ త్రైమాసికంలో రియల్టీ దిగ్గజం డీఎల్‌ఎఫ్ నికర లాభం రెండు రెట్లు పెరిగి రూ. 1,381 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 622 కోట్లు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం 48 శాతం పెరిగి రూ. 1,476 కోట్ల నుంచి రూ. 2,181 కోట్లకు చేరింది. ప్రథమార్ధంలో నికర లాభం రూ. 1,150 కోట్ల నుంచి రూ. 2,027 కోట్లకు ఎగిసింది. మొత్తం ఆదాయం రూ. 2,998 కోట్ల నుంచి రూ. 3,910 కోట్లకు చేరింది.

నష్టాల్లోకి ఇండిగో



న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెల్లడించింది. ఏడు త్రైమాసికాల తదుపరి జులై-సెప్టెంబర్(క్యూ2)లో లాభాలను వీడింది. రూ. 986 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అధిక ఇంధన వ్యయాలు, ఇంజిన్ సమస్యలతో కొన్ని విమానాలు నిలిచిపోవడం లాభాలను దెబ్బతీశాయి. విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే రూ. 746 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఇండిగో బ్రాండుతో సర్వీసులందిస్తున్న కంపెనీ గతేడాది(2023-24) ఇదే కాలంలో నికరంగా రూ. 189 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 15 శాతం పుంజుకుని రూ. 17,800 కోట్లను తాకింది. ఇంధన వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 6,605 కోట్లకు చేరాయి.

కొత్త బిజినెస్ క్లాస్: ఢిల్లీ-ముంబై మార్గంలో కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన బిజినెస్ క్లాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. తదుపరి దశలో 40కుపైగా విమానాలను 12 మెట్రో రూట్లలో ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. మరిన్ని విదేశీ రూట్లకు సర్వీసులను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఇండిగో ప్రస్తుతం 410 విమానాలను కలిగి ఉంది. వెరసి మొత్తం వ్యయాలు 22 శాతం పెరిగి రూ. 18,666 కోట్లను తాకాయి. 6%అధికంగా 2.78 కోట్ల ప్యాసింజర్లు ప్రయాణించగా.. టికెట్ల ఆదాయం 10 శాతం ఎగసి రూ. 14,359 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్ఈలో 3.5 శాతం క్షీణించి రూ. 4,365 వద్ద ముగిసింది.



వినోద రంగానికి పైరసీ దెబ్బ

2023లో రూ. 22,400 కోట్ల నష్టం ● ఈవై-ఐఏఎంఏఐ నివేదిక

న్యూఢిల్లీ: దేశీ వినోద రంగానికి పైరసీ పెను ముప్పుగా మారింది. పైరసీ దెబ్బతో పరిశ్రమ గతేడాది (2023) ఏకంగా రూ. 22,400 కోట్ల మేర నష్టపోయింది. ఈవై, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) రూపొందించిన 'ది రాబ్ రిపోర్ట్'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం మీడియా వినియోగదార్లలో 51 శాతం మంది పైరసీ అయిన కంటెంట్‌ను వీక్షిస్తున్నారు. అనధికారికంగా కాపీ చేయడం, పంపిణీ చేయడం లేదా కాపీరైట్ హక్కులున్న మెటీరియల్‌ను (సంగీతం, సినిమాలు, సాఫ్ట్‌వేర్ మొదలైనవి) వినియోగించుకోవడాన్ని పైరసీగా వ్యవహరిస్తారు. ఒరిజినల్ క్రియేటర్ల హక్కులను హరించి, వారిని గణనీయంగా నష్టపరుస్తుంది కాబట్టి దీన్ని ఒక విధంగా దొంగతనంగా కూడా పరిగణిస్తారు. 'భారత మీడియా-వినోద పరిశ్రమలో సెగ్మెంట్లవారీ ఆదాయపరంగా చూస్తే 2023లో పైరసీ ఎకానమీ రూ. 22,400 కోట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఇందులో సినిమా థియేటర్ల నుంచి పైరసీ చేసిన కంటెంట్ పరిమాణం రూ. 13,700 కోట్లుగా, ఓటీటీ ప్లాట్‌ఫాంల నుంచి జనరేట్ చేసినది రూ. 8,700 కోట్లుగా ఉంటుంది. పైరసీ కంటెంట్ వల్ల రూ. 4,300 కోట్ల మేర ప్రభుత్వానికి జీఎస్‌టీ నష్టాలు వాటిల్లి ఉంటుందని అంచనా' అని నివేదిక వివరించింది.

సబ్‌స్క్రిప్షన్ ఫీజులు భారీగా ఉండటమే కారణం

పైరేటెడ్ కంటెంట్‌ను చూడటానికి నిర్దిష్ట కారణాలున్నాయని యూజర్లు చెబుతున్నారు. సబ్‌స్క్రిప్షన్ ఫీజులు అధికంగా ఉండటం, కోరుకునే కంటెంట్ అందుబాటులో లేకపోవడం, ఒక్కో సబ్‌స్క్రిప్షన్‌ను నిర్వహించుకోవడమనేది సమస్యగా మారడం మొదలైనవి వీటిలో ఉన్నాయి. పైరసీ ఎక్కువగా 19-34 ఏళ్ల ఆడియన్స్‌లో ఉంటోందని, మహిళలు ఓటీటీ షోలను ఇష్టపడుతుండగా, పురుషులు క్లాసిక్ సినిమాలను వీక్షిస్తున్నారని నివేదిక తెలిపింది. పైరేటెడ్ కంటెంట్‌ను చూసేవారు, దాన్ని ఉచితంగా అందిస్తే, ప్రకటనలపరంగా అంతరాయాలు వచ్చినా, అధికారిక చానల్స్‌కి మారేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం గమనార్హం. కంటెంట్ ప్రొవైడర్లు ధరల విధానాలను, కంటెంట్‌ను అందుబాటులో ఉంచే వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది. పైరేటెడ్ కంటెంట్ వినియోగదారుల్లో 70 శాతం మంది తాము ఏ ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌నూ తీసుకోదల్చుకోలేదని తెలిపారు. ప్రథమ శ్రేణి నగరాలతో పోలిస్తే ద్వితీయ శ్రేణి పట్టణాల్లో పైరసీ ఎక్కువగా ఉంటోంది. అధికారికంగా కంటెంట్‌ను వీక్షించేందుకు అవకాశాలు తక్కువగా ఉండటం, పైరేటెడ్ కంటెంట్ సులువుగా లభిస్తుండటం, పైరసీ వల్ల వచ్చే నష్టాలపై అవగాహన లేకపోవడం, ఆదాయాల్లో వ్యత్యాసాలు, థియేటర్లు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు కూడా పైరసీ విస్తృతికి కారణంగా ఉంటున్నాయి. ప్రథమ శ్రేణి నగరాల్లోని యూజర్లు సాధారణంగా పాత సినిమాలను వీక్షించేందుకు పైరేటెడ్ కంటెంట్‌ను ఆశ్రయిస్తుండగా, ద్వితీయ శ్రేణి నగరాల్లోని వారు టికెట్టు కోసం ఖర్చు చేయడం ఇష్టం లేక ఈమధ్యే విడుదలైన కొత్త సినిమాలను చట్ట విరుద్ధంగా చూసేందుకు ఉపయోగిస్తున్నారు.

సమిష్టిగా పోరాడాలి..

పైరసీ వల్ల వాటిల్లుతున్న నష్టాలను దృష్టిలో ఉంచుకుని, దాన్ని కట్టడి చేసేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని ఐఏఎంఏఐ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ చైర్మన్ రోహిత్ జైన్ చెప్పారు. 'దేశీయంగా డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ గణనీయంగా వృద్ధి చెందుతోందనేది కాదనలేని వాస్తవం. 2026 నాటికి ఫిలిం ఎంటర్‌టైన్‌మెంట్ రూ. 14,600 కోట్లకు చేరుతుందని అంచనా. అయితే, విచ్చలవిడిగా విజృంభిస్తున్న పైరసీ నుంచి దీనికి పెను ముప్పు పొంచి ఉంది. కాబట్టి, ప్రభుత్వం, పరిశ్రమ, వినియోగదారులు అందరూ కూడా కలిసికట్టుగా దీనిపై పోరాడాల్సి ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం డౌన్

క్యూ2లో రూ. 404 కోట్లు




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 85 శాతం పడిపోయి రూ. 404 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,773 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 44,821 కోట్ల నుంచి రూ. 39,837 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 40,801 కోట్ల నుంచి రూ. 38,644 కోట్లకు తగ్గాయి. సెప్టెంబర్30కల్లా నికర రుణ భారం త్రైమాసికవారీగా రూ. 4,899 కోట్లు పెరిగి రూ. 85,098 కోట్లను తాకింది. విస్తరణ ప్రాజెక్టులు, ఇల్లవర్ర కోకింగ్ కోల్ అసెట్‌లో 20 శాతం వాటా కొనుగోలు ఇందుకు కారణంకాగా.. ఈ కాలంలో రూ. 3,384 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది. 7 శాతం అధికంగా 6.77 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసింది. విక్రయాలు 4 శాతం నీరసించి 5.96 ఎంటీకి పరిమితమయ్యాయి. ఎగుమతులు 43 శాతం బలహీనపడి 0.39 ఎంటీకి చేరాయి.

ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు బీఎస్ఈలో 1.6 శాతం క్షీణించి రూ. 943 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ లాభం ఫ్లాట్

రూ. 853 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 853 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 850 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం స్వల్పంగా 2 శాతం బలపడి రూ. 3,459 కోట్లకు చేరింది. ఈ సెప్టెంబర్30 కల్లా కంపెనీ నెట్‌వర్త్ రూ. 27,970 కోట్లకు, నికర రుణభారం రూ. 24,875 కోట్లకు చేరాయి. నికరంగా విద్యుదుత్పత్తి 14 శాతం ఎగసి 9,840 మిలియన్ యూనిట్లను తాకింది. ఈ కాలంలో 204 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాన్ని జత కలుపుకుంది.

ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం క్షీణించి రూ. 671 వద్ద ముగిసింది.

బీవోబీ లాభం జూమ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 5,238 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 4,253 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 7 శాతం పుంజుకుని రూ. 11,622 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 24 శాతం ఎగసి రూ. 5,181 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్ర వృద్ధితో 3.1 శాతానికి చేరాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.32 శాతం నుంచి 2.5 శాతానికి దిగివచ్చాయి. తాజా స్లిప్పేజీలు రూ. 2,788 కోట్లుకాగా.. కనీస మూలధన నిష్పత్తి 16.26 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో బీవోబీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం క్షీణించి రూ. 240 వద్ద ముగిసింది.

ఐడీబీఐ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 1,836 కోట్లు



న్యూఢిల్లీ: బీమా రంగ దిగ్గజం ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 39 శాతం జంప్‌చేసి రూ. 1,836 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,323 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,924 కోట్ల నుంచి రూ. 8,754 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం రూ. 3,066 కోట్ల నుంచి రూ. 3,875 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ మార్జిన్లు 4.33 శాతం నుంచి 4.87 శాతానికి మెరుగుపడ్డాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.9 శాతం నుంచి 3.68 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.39 శాతం నుంచి 0.2 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 21.98 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభంతో రూ. 83 వద్ద ముగిసింది.

బంధన్ బ్యాంక్.. బాగుంది



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 30 శాతం జంప్‌చేసి రూ. 937 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 721 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,032 కోట్ల నుంచి రూ. 6,095 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 4,492 కోట్ల నుంచి రూ. 5,500 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ మార్జిన్లు 7.4 శాతంగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 7.32 శాతం నుంచి 4.68 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.32 శాతం నుంచి 1.29 శాతానికి దిగివచ్చాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 30 కోట్లు తగ్గి రూ. 606 కోట్లకు చేరాయి. అయితే కనీస మూలధన నిష్పత్తి 19.21 శాతం నుంచి 14.34 శాతానికి క్షీణించింది.

ఫలితాల నేపథ్యంలో బంధన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 7 శాతం పతనమై రూ. 168 వద్ద ముగిసింది.

టోరెంట్ ఫార్మాకు అమ్మకాల దన్ను..



న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లో అమ్మకాల వృద్ధితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టోరెంట్ ఫార్మా నికర లాభం 17 శాతం పెరిగి రూ. 453 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ2లో ఇది రూ. 386 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2,660 కోట్ల నుంచి రూ. 2,889 కోట్లకు పెరిగింది. దేశీ మార్కెట్లో ఆదాయం 13 శాతం వృద్ధి చెంది రూ. 1,632 కోట్లుగా నమోదైనట్లు సంస్థ తెలిపింది. మెయింటెనెన్స్ పనుల కోసం మూసివేసిన ప్లాంటులో డిసెంబర్ నుంచి ఉత్పత్తి మళ్లీ ప్రారంభమవుతుందని వివరించింది.

బీఎస్ఈలో శుక్రవారం సంస్థ షేరు 3 శాతం పెరిగి రూ. 3,438 వద్ద క్లోజయ్యింది.

హెచ్‌పీసీఎల్ లాభం నేలచూపు

రూ. 143 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 98 శాతం పడిపోయి రూ. 143 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 5,827 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్-జూన్)లో ఆర్జించిన రూ. 634 కోట్లతో చూసినా లాభాలు భారీగా క్షీణించాయి. రిఫైనరీ మార్జిన్లు క్షీణించడం, నిల్వల నష్టాలు లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో ఒక్కో బ్యారల్‌పై స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) 13.33 డాలర్ల నుంచి 3.12 డాలర్లకు పడిపోయాయి. వీటికితోడు ప్రభుత్వ నియంత్రిత ధరలకే వంటగ్యాస్ విక్రయాల కారణంగా రూ. 2,057 కోట్ల అండర్ రికవరీ(నష్టం) నమోదైంది. ఇక అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు బ్యారల్‌కు 5 శాతం తగ్గడంతో రూ. 1,400 కోట్ల మేర నిల్వలపై నష్టాలు నమోదయ్యాయి.


ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు బీఎస్ఈలో 8 శాతం పతనమై రూ. 372 వద్ద ముగిసింది.

ఇలా అయితే కష్టమే!




'ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు'... అన్న చందంగా ఏరి కోరి సిద్ధం చేసుకున్న స్పిన్ పిచ్‌పై టీమిండియా బోల్తా కొట్టింది. బెంగళూరు వేదికగా జరిగిన తొలి టెస్టులో పిచ్ పేస్‌కు అనుకూలించడం వల్లే టీమిండియా తడబడింది అని సర్దిచెప్పుకున్న వాళ్లు సైతం... పుణే ప్రదర్శనతో బేజారవుతున్నారు. ప్రత్యర్థిని స్పిన్ వలలో వేసి ఉక్కిరి బిక్కిరి చేయాలనుకున్న రోహిత్ సేన చివరకు ఆ ఉచ్చులోనే చిక్కి విలవిల లాడింది. టెస్టు కెరీర్‌లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా నాలుగు కంటే ఎక్కువ వికెట్లు తీసిన అనుభవం లేని సాంట్నర్‌కు ఏకంగా మనవాళ్లు ఏడు వికెట్లు సమర్పించుకున్నారు. భారత ఆటగాళ్లు తడబడ్డ చోటే రెండో ఇన్నింగ్స్‌లోనూ న్యూజిలాండ్ ప్లేయర్లు స్వేచ్ఛగా పరుగులు రాబట్టడం పుండు మీద కారం చల్లినట్లయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన భారత స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ రెండో ఇన్నింగ్స్‌లోనూ నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నా... కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్ మాత్రం చక్కటి ఇన్నింగ్స్‌తో అలరించాడు. స్పిన్నర్లను ఎదుర్కొనే క్రమంలో క్రీజు వదలి ఒక అడుగు ముందుకు వేసి బంతిని అందుకోవడంతో పాటు... కాళ్ల కదలికలో చురుకుదనం చూపిస్తూ ఖాళీల్లోకి బంతిని పోనిచ్చి పరుగులు పిండుకున్నాడు. మరో ఎండ్‌లో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతున్నా... ఏమాత్రం తడబడకుండా క్రీజులో నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఫలితంగా రెండో టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. 1955–56 నుంచి భారత్‌లో పర్యటిస్తున్న న్యూజిలాండ్... ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఇక్కడ టెస్టు సిరీస్ గెలవలేకపోయింది. 36 ఏళ్ల తర్వాత తొలిసారి భారత గడ్డపై న్యూజిలాండ్ చేతిలో టెస్టు మ్యాచ్ ఓడిన టీమిండియా... ఇప్పుడు టెస్టు క్రికెట్ చరిత్రలో మొదటిసారి సిరీస్ ఓటమి అంచున నిలిచింది. వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరాలనుకుంటున్న టీమిండియా... ఇదే ప్రదర్శన కొనసాగిస్తే మున్ముందు మరిన్ని కష్టాలు ఎదుర్కోక తప్పదు. 2023–25 ఎడిషన్‌లో భాగంగా భారత్ ఇంకా కేవలం ఆరు టెస్టు మ్యాచ్‌లు మాత్రమే ఆడాల్సి ఉంది. అందులో ఒకటి న్యూజిలాండ్‌తో కాగా... మిగిలిన ఐదు ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాతో. ఇలాంటి దశలో స్వదేశంలో ఆడుతున్న సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చి డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మెరుగైన స్థితితో ఆసీస్ గడ్డపై అడుగు పెడుతుంది అనుకుంటే... ఫలితాలు మాత్రం అందుకు విరుద్ధంగా వస్తున్నాయి. తొలి టెస్టులో టీమిండియా ఘోర పరాజయం తర్వాత భారత మాజీ కెప్టెన్, హెడ్ కోచ్ అనిల్ కుంబ్లే మాట్లాడుతూ... 'జట్టులో పుజారా వంటి ప్లేయర్ ఎంతో అవసరం. ఎలాంటి పిచ్‌పైనైనా ఓపికగా నిలవడంతో పాటు సహచరులకు భరోసా ఇవ్వగల సామర్థ్యం అతడి సొంతం' అని అన్నాడు. ఇప్పుడు వరుసగా రెండో టెస్టులోనూ మన బ్యాటర్ల ఆటతీరు చూస్తుంటే కుంబ్లే చెప్పింది నిజమే అనిపిస్తోంది. స్వదేశంలోనే పరిస్థితి ఇలా ఉంటే... ఆస్ట్రేలియా టూర్‌లో టీమిండియా ఎలాంటి ప్రదర్శన చేస్తుందనే అనుమానాలు రేకెత్తక మానవు! గత రెండు ఆసీస్ పర్యటనల్లోనూ పుజారా క్రీజులో పాతుకుపోయి జట్టుకు మూలస్తంభంలా నిలిచి మరపురాని విజయాలు అందించాడు. మరి బెంగళూరు, పుణే పిచ్‌పైనే పరుగులు చేసేందుకు ఆపసోపాలు పడుతున్న మనవాళ్లు కంగారూ గడ్డపై ఏం చేస్తారో వేచి చూడాలి!

–సాక్షి క్రీడావిభాగం



శిక్ష



నేహా

కాంస్యాలు గెలిచిన శిక్ష, నేహా శర్మ

టిరానా (అల్బేనియా): ప్రపంచ అండర్–23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం భారత మహిళా రెజ్లర్లు రెండు కాంస్య పతకాలు సాధించారు. 65 కేజీల విభాగంలో శిక్ష... 57 కేజీల విభాగంలో నేహా శర్మ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. కాంస్య పతక బౌట్‌లలో శిక్ష 6–3తో జపాన్ రెజ్లర్ రిన్ తారా మోటోను ఓడించగా... నేహా శర్మ 5–0తో చైనా రెజ్లర్ మింగ్‌యు జాంగ్‌పై విజయం సాధించింది. అండర్–23 ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో నేహాకిది రెండో పతకం కావడం విశేషం. గత ఏడాది నేహా ఫైనల్లో ఓడి రజత పతకాన్ని గెల్చుకుంది.

భారత్‌ను గెలిపించిన రిషి



చోన్‌బురి (థాయ్‌లాండ్): ఆసియా కప్–2025 అండర్–17 పురుషుల క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తుర్క్‌మెనిస్తాన్ జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 44వ నిమిషంలో రిషి సింగ్ గోల్ చేసి భారత విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. తొలి మ్యాచ్‌లో భారత జట్టు 13–0 గోల్స్ తేడాతో బ్రూనై జట్టుపై ఘనవిజయాన్ని అందుకుంది. రేపు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్ జట్టుతో భారత్ తలపడుతుంది.

షకీల్ సూపర్ సెంచరీ



- పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్ 344
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 24/3

రావల్పిండి: బ్యాటర్ల పట్టుదలకు, బౌలర్ల సహకారం తోడవడంతో సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో పాకిస్తాన్ మెరుగైన స్థితిలో నిలిచింది. సిరీస్ నిర్ణయాత్మక పోరులో పాకిస్తాన్ ప్లేయర్లు సమష్టిగా సత్తా చాటారు. ఫలితంగా రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. జాక్ క్రాలీ (2), బెన్ డకెట్ (12), ఒలీ పోప్ (1) విఫలం కాగా... జో రూట్ (5 బ్యాటింగ్), హ్యారీ బ్రూక్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లలో నోమాన్ అలీ రెండు, సాజిద్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టారు. చేతిలో 7 వికెట్లు ఉన్న ఇంగ్లండ్... ఇంకా ప్రత్యర్థి కన్నా 53 పరుగులు వెనుకబడి ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 73/3తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 96.4 ఓవర్లలో 344 పరుగులకు ఆలౌటైంది. మిడిలార్డర్ ప్లేయర్ సౌద్ షకీల్ (223 బంతుల్లో 134; 5 ఫోర్లు) వీరోచిత సెంచరీతో కదం తొక్కాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ల దాడిని సమర్థంగా ఎదుర్కొన్న షకీల్ బౌండరీల జోలికి పోకుండా ఒకటి, రెండు పరుగులు చేస్తూ ముందుకు సాగాడు. ఆఖర్లో స్పిన్ ద్వయం నోమాన్ అలీ (45; 2 ఫోర్లు, ఒక సిక్సర్), సాజిద్ ఖాన్ (48 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో పాకిస్తాన్‌కు 77 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కెప్టెన్ షాన్ మసూద్ (26), వికెట్ కీపర్ రిజ్వాన్ (25) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోగా.. సల్మాన్ ఆఘా (1) విఫలమయ్యాడు. సహనానికి పరీక్షగా మారిన స్లో పిచ్‌పై దాదాపు ఐదు గంటలకు పైగా క్రీజులో నిలిచిన షకీల్... నోమాన్ అలీ, సాజిద్‌తో కలిసి విలువైన పరుగులు జోడించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో రేహాన్ అహ్మద్ 4, షోయబ్ బషీర్ మూడు వికెట్లు పడగొట్టారు.

ఖోఖో ప్రపంచకప్ బరిలో యూరోప్ దేశాలు

వచ్చే ఏడాది న్యూఢిల్లీలో మెగా ఈవెంట్



న్యూఢిల్లీ: గ్రామీణ క్రీడ ఖోఖోకు ప్రపంచకప్ శోభ తెచ్చేందుకు ఆసియా, యూరోప్, ఆఫ్రికా, అమెరికా ఖండాలకు చెందిన జట్లు మద్దతు పలుకుతున్నాయి. భారత్ వేదికగా వచ్చే ఏడాది జరగబోయే ప్రప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు యూరోప్ దేశాలు 'సై' అంటున్నాయి. ఇంగ్లండ్, జర్మనీ, నెదర్లాండ్స్, పోలాండ్ జట్లతో పాటు బ్రెజిల్, అమెరికా, కెనడా సహా 24 దేశాలు ఖోఖో మెగా ఈవెంట్ బరిలో దిగేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వచ్చే జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ప్రపంచకప్ ఖోఖో పోటీలు జరుగుతాయి. ఆఫ్రికా నుంచి ఘనా, కెన్యా, దక్షిణాఫ్రికా, ఉగాండా... ఆసియా నుంచి ఆతిథ్య భారత్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, ఇండోనేసియా, ఇరాన్, మలేసియా, నేపాల్, పాకిస్తాన్, దక్షిణ కొరియా, శ్రీలంక జట్లు పాల్గొననున్నాయి. దక్షిణ అమెరికాకు చెందిన బ్రెజిల్, పెరూ... ఓసియానియా నుంచి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు సైతం ఆడనున్నాయి. పురుషులు, మహిళల కేటగిరీల్లో 16 జట్ల చొప్పున పోటీపడతాయి. భారత ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ మాట్లాడుతూ 'ప్రముఖ దేశాలన్నీ ఇందులో పాల్గొననుండటం వల్ల ఇదో చారిత్రక చాంపియన్‌షిప్‌గా మారనుంది. గ్రామీణ స్థాయి నుంచి ఓ ప్రపంచకప్‌గా రూపాంతరం చెందడం గొప్ప విషయం. 2025లో ఖోఖోతో కొత్త క్రీడా విప్లవానికి భారత్ నాంది పలుకుతుంది' అని అన్నారు.

పోరాడి ఓడిన యూకీ-ఒలివెట్టి జోడీ



బాసెల్: స్విస్ ఇండోర్స్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ కథ ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ–ఒలివెట్టి ద్వయం 6–4, 5–7, 6–10తో జేమీ ముర్రే (బ్రిటన్)–జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. యూకీ–ఒలివెట్టి జోడీకి 19,765 యూరోల (రూ. 18 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తొలి రౌండ్‌లో మొత్తం ఏడు గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్ నెగ్గిన జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) జంటను బోల్తా కొట్టించిన యూకీ–ఒలివెట్టి ద్వయం క్వార్టర్ ఫైనల్లో మరో సంచలనం సృష్టించే అవకాశాన్ని చేజార్చుకుంది. 93 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి 14 ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. రెండు జోడీలు తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోయాయి. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో మాత్రం అపార అనుభవజ్ఞులైన జేమీ ముర్రే–జాన్ పీర్స్ పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకున్నారు. డబుల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ అయిన 38 ఏళ్ల జేమీ ముర్రే మొత్తం 32 టైటిల్స్ సాధించాడు. ఇందులో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్) కూడా ఉన్నాయి. 36 ఏళ్ల జాన్ పీర్స్ ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో సహచరుడు మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించాడు. కెరీర్ మొత్తంలో 28 డబుల్స్ టైటిల్స్ నెగ్గిన జాన్ పీర్స్ 2017లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డబుల్స్ చాంపియన్‌గా నిలిచాడు.

క్వార్టర్స్‌లో రష్మిక ఓటమి



అడిలైడ్ (ఆస్ట్రేలియా): ప్లేఫోర్డ్ ఓపెన్ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో భారత రెండో ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 303వ ర్యాంకర్ రష్మిక 5–7, 0–6తో ప్రపంచ 129వ ర్యాంకర్ తాలియా గిబ్సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడింది. 72 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది.



వార్నర్‌కు విముక్తి

- జీవితకాల నాయకత్వ బాధ్యతల నిషేధం ఎత్తివేత
- సమీక్ష అనంతరం క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం
- బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ సారథిగా అవకాశం

డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ అంతర్జాతీయ ఇన్నింగ్స్ అయితే ముగిసింది. సారథిగా సరికొత్త ఇన్నింగ్స్ ఆడే అవకాశం ఇప్పుడొచ్చింది. ఆరేళ్ల క్రితం పడిన మచ్చ, విధించిన నిషేధం నుంచి పెద్ద ఊరట ఇప్పుడు లభించింది. బాల్ టాంపరింగ్ ఉదంతంతో జీవితకాల కెప్టెన్సీ నిషేధానికి గురైన అతనికి క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తీపి కబురు చెప్పింది. ఇకపై పగ్గాలు చేపట్టొచ్చని నిర్ణయం తీసుకుంది.

సిడ్నీ: ఆస్ట్రేలియన్ డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు శాశ్వత సారథ్య బాధ్యతలపై విధించిన నిషేధం నుంచి విముక్తి లభించింది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఇకపై అతను కెప్టెన్ హోదాకు అర్హుడని ప్రకటించింది. ఇదివరకే అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై పలికిన వార్నర్ దేశవ్యాప్త లీగ్‌లలో ఓ బ్యాటర్‌గానే కాకుండా సారథిగానూ వ్యవహరించే అవకాశం లభించింది. దీంతో డిసెంబర్–జనవరిలలో సొంతగడ్డపై జరిగే బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్) టి20 టోర్నమెంట్‌లో అతను ప్రాతినిధ్యం వహించే సిడ్నీ థండర్ జట్టుకు కెప్టెన్ అయ్యేందుకు మార్గం సుగమం అయ్యింది.

ఎందుకీ అనూహ్య నిర్ణయం

ఇది అనూహ్యం కానేకాదు. ఉన్నపళంగా లేదంటే కారుణ్యంతో తీసుకున్న నిర్ణయం కూడా కాదు. సీఏ ఏం చేసినా ఓ పద్ధతి ప్రకారమే చేస్తుంది. ఇప్పుడు అదే చేసింది. 2022లో సవరించిన ప్రవర్తనా నియమావళిని అనుసరించి సీఏ ముగ్గురు సభ్యులతో కూడిన స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నిషేధం విధించినప్పటి నుంచి ఇప్పటివరకు వార్నర్ ప్రవర్తన సరళి ఎలా ఉందని ఈ కమిటీ విచారించింది. ఇందులో భాగంగా ప్యాట్ కమిన్స్, ఆండ్రూ మెక్‌డొనాల్డ్, గ్రెగ్ చాపెల్, లీసా స్థాలేకర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ల అభిప్రాయాలను సేకరించింది. నిషేధానంతరం మైదానం లోపల, వెలుపల వార్నర్ ప్రవర్తన ఎంతో మారిందని, హుందాగా నడుచుకుంటున్నాడని వారంతా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో ముగ్గురు సభ్యుల స్వతంత్ర కమిటీ కూడా ఏకగ్రీవంగా అతనిపై విధించిన జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తేయాలని సిఫార్సు చేస్తూ సీఏకు నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను సమీక్షించిన సీఏ ఉన్నతస్థాయి మండలి తాజాగా వార్నర్‌కు ఊరటనిచ్చే నిర్ణయాన్ని వెలువరించింది.

అప్పుడేం జరిగిందంటే...

స్టీవ్ స్మిత్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా 2018లో దక్షిణాఫ్రికాలో పర్యటించింది. కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో బంతి ఆకారాన్ని మార్చేందుకు చాటుమాటుగా సాండ్ పేపర్‌తో రుద్దడం టీవీల్లో కనిపించింది. బాల్ టాంపరింగ్ ఉదంతం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ)ను అప్రతిష్ఠ పాలు చేయడంతో ఆగ్రహించిన బోర్డు కెప్టెన్ స్మిత్, బ్యాన్‌క్రాఫ్ట్‌పై ఏడాది నిషేధం విధించింది. ఈ సంఘటనకు ప్రధాన కారకుడు డేవిడ్ వార్నర్ అని నిర్ధారించుకున్న తర్వాత అతనిపై ఏడాది నిషేధంతోపాటు జీవితకాలం పాటు కెప్టెన్సీకి పనికి రావంటూ శిక్ష విధించింది. నిషేధం అనంతరం ముగ్గురి ఆటలు సాగినా... వార్నర్‌పై పడిన మరక రిటైర్మెంట్ ప్రకటించినా చెరిగిపోలేదు.

కాంస్యం కోసం యువ భారత్ పోరు



- న్యూజిలాండ్‌తో చివరి మ్యాచ్ 'డ్రా'
- చేజారిన ఫైనల్ బెర్త్
- నేడు మరోసారి న్యూజిలాండ్‌తో 'ఢీ'

కౌలాలంపూర్: జొహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరుకోవడంలో విఫలమైంది. ఆరు జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారంతో రౌండ్ రాబిన్ లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. టాప్–2లో నిలిచిన ఆస్ట్రేలియా, బ్రిటన్ జట్లు టైటిల్ కోసం పోటీపడనుండగా... మూడో స్థానంలో నిలిచిన భారత్, నాలుగో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్ జట్లు కాంస్య పతకం కోసం తలపడతాయి. 5–6 స్థానాల కోసం జపాన్, ఆతిథ్య మలేసియా జట్లు ఆడతాయి. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న భారత జట్టుకు నాలుగో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా క్లీం వేసింది. ఒక్క గోల్ సమర్పించుకోకుండా భారత్‌పై నాలుగు గోల్స్ సాధించి ఆస్ట్రేలియా ఘనవిజయం నమోదు చేసుకుంది. అయినప్పటికీ చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలిస్తే భారత జట్టు ఫైనల్‌కు చేరుకునేది. కానీ అలా జరగలేదు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌ను భారత జట్టు 3–3తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున గుర్జోత్ సింగ్ (6వ నిమిషంలో), రోహిత్ (17వ నిమిషంలో), తాలెమ్ ప్రియోబర్తా (60వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు జాంటీ ఎల్మెస్ (17వ, 32వ, 45వ నిమిషాల్లో) ఏకంగా మూడు గోల్స్ అందించాడు. కివీస్‌తో మ్యాచ్ 'డ్రా' కావడంతో భారత జట్టు ఫైనల్ బెర్త్ ఖరారయ్యేది ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలపై ఆధార పడింది. అయితే బ్రిటన్ జట్టు 3–1తో జపాన్‌పై, ఆస్ట్రేలియా 9–3తో మలేసియాపై ఘనవిజయం సాధించాయి. ఫలితంగా బ్రిటన్, ఆస్ట్రేలియా, భారత జట్లు 10 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ సగటు ఆధారంగా ఆస్ట్రేలియా, బ్రిటన్ తొలి రెండు స్థానాల్లో నిలువగా... భారత్‌కు మూడో స్థానం దక్కింది.

బోపన్న-ఎబ్డెన్ జోడీ పరాజయం

న్యూఢిల్లీ: వియన్నా ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. ఆస్ట్రియాలో జరుగుతున్న ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7–6 (9/7), 4–6, 8–10తో 'సూపర్ టైబ్రేక్'లో నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంట చేతిలో ఓడిపోయింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ ఏడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. రెండో సెట్‌లో తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన ఈ ఇండో–ఆసీస్ జోడీకి ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు మూడుసార్లు అవకాశం వచ్చినా ఫలితం లేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన బోపన్న–ఎబ్డెన్‌లకు 20,470 యూరోల (రూ. 18 లక్షల 62 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.





పుణేరి పల్టన్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ తమ జోరు కొనసాగిస్తోంది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 36–22తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ఈ లీగ్‌లో మూడో విజయం నమోదు చేసిన పుణేరి జట్టు 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. బెంగళూరుతో మ్యాచ్‌లో పుణేరి తరఫున పంకజ్, మోహిత్ 6 పాయింట్ల చొప్పున... గౌరవ్, అమన్ 4 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ 5 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42–40తో తమిళ్ తలైవాస్‌పై గెలిచి ఈ లీగ్‌లో తొలి విజయాన్ని అందుకుంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో బెంగాల్ వారియర్స్ (రాత్రి 8 గంటల నుంచి); దబంగ్ ఢిల్లీతో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

సాక్షి ప్లస్
శనివారం । 26-10-2024

గాజన్లే కవచాలు

గాజాలో ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) అత్యంత అమానుషంగా వ్యవహరిస్తోంది. యుద్ధ సమయంలో ఇళ్లు, సొరంగాల్లోకి ప్రవేశించడానికి పాలస్తీనా పౌరులను మానవ కవచాలుగా వాడుకుంటోంది. 'మస్కిటో ప్రోటోకాల్'గా పిలిచే ఈ పద్ధతిని గాజాలోని ఇజ్రాయెల్ యూనిట్లన్నీ అవలంబిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైనికుడే ఈ మేరకు వెల్లడించడం విశేషం. ఐదుగురు పాలస్తీనా మాజీ ఖైదీలు దీన్ని ధ్రువీకరించారు. ఉత్తర గాజా, గాజా సిటీ, ఖాన్ యూనిస్, రఫా... ఇలా గాజా అంతటా ఇదే పద్ధతిని అమలు చేస్తోంది ఇజ్రాయెల్ సైన్యం.

- జెరూసలెం

ఇజ్రాయెల్ సైన్యం అమానుషత్వం



నిషేధం బేఖాతరు

సైనిక కార్యకలాపాలలో పౌరులను ఇలా అనైతికంగా, అనుమానంగా ఉపయోగించడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం నిషిద్ధం. వెస్ట్ బ్యాంక్‌లో అనుమానిత మిలిటెంట్ల తలుపులను తట్టడానికి ఇజ్రాయెల్ సైన్యం పాలస్తీనా పౌరులను ఉపయోగిస్తోందని హక్కుల సంఘాలు ఫిర్యాదు చేయడంతో ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు 2005లో ఈ పద్ధతిని పూర్తిగా నిషేధించింది. దీన్ని క్రూరమైనదిగా, అనాగరికమైనదిగా అభివర్ణించింది. దాంతో ఈ విధానాలను మానుకున్నట్టు ఇజ్రాయెల్ సైన్యం అప్పట్లో ప్రకటించింది. కానీ దాన్ని ఇంకా అమలు చేస్తున్నట్టు తాజా ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. గాజాలో పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం మానవ కవచాలుగా ఉపయోగిస్తున్న మూడు ఫోటోలను 'బ్రేకింగ్ ది సైలెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ మీడియాకు విడుదల చేసింది. ఉత్తర గాజాలో విధ్వంసకర పరిస్థితుల్లో ఇద్దరు సైనికులు ఓ పౌరుడిని ముందుకు తీసుకువెళుతున్న భయానక దృశ్యం ఒక ఫొటోలో ఉంది. మరో దాంట్లో మానవ కవచాలుగా ఉపయోగించే పౌరుల కళ్లకు గంతలున్నాయి. మూడో ఫొటోలో ఒక సైనికుడు బంధించిన పౌరుడిని కాపలా కాస్తున్నాడు.

ఏమిటీ మస్కిటో ప్రోటోకాల్

శత్రువులున్న చోటికి కుక్కను పంపడం, ట్యాంక్ షెల్ లేదా సాయుధ బుల్డోజర్‌తో దాడి వంటివి చేస్తారు. కానీ ఈ పద్ధతిలో తాము దాడి చేయాలనుకున్న చోటికి బందీలనో, శత్రు దేశ పౌరులనో ముందుగా పంపిస్తారు. అక్కడ పేలుడు పదార్థాలున్నా, శత్రువులు పొంచి కాల్పులు, పేలుళ్లకు పాల్పడ్డా ముందుగా వెళ్లినవారు చనిపోతారు. ఆ ముప్పు తొలగాక సైన్యం ప్రవేశిస్తుంది. సాధారణంగా ఉగ్రవాద సంస్థలు ఉపయోగించే ఈ పద్ధతిని ఇజ్రాయెల్ సైన్యం అమలు చేస్తోంది.

మన ప్రాణాలు ముఖ్యమన్నారు..

ఉత్తర గాజాలో తమ యూనిట్ ఓ అనుమానాస్పద భవనంలోకి ప్రవేశించే ముందు ఇద్దరు పాలస్తీనా ఖైదీలను ముందుగా పంపినట్టు ఇజ్రాయెల్ సైనికుడే వెల్లడించాడు. "వారిలో ఒకరు 16 ఏళ్ల బాలుడు. మరొకరు 20 ఏళ్ల యువకుడు. ఇదేంటని ప్రశ్నిస్తే మన సైనికుల కంటే పాలస్తీనా యువకులు చనిపోవడం మంచిది కదా అని మా సీనియర్ కమాండర్ బదులిచ్చారు. షాకింగ్‌గా ఉన్నా ఇది నిజం. సుదీర్ఘ కాలం యుద్ధంలో పాల్గొని అలసిపోయాక పెద్దగా ఆలోచించడానికి కుదరదు. అయినా ఈ పద్ధతిని అనుసరించడానికి కొందరు సైనికులం నిరాకరించాం. 'అంతర్జాతీయ చట్టాల గురించి ఆలోచించొద్దు. ముందు మన ప్రాణాలు ముఖ్యం' అని కమాండర్ చెప్పారు" అన్నాడు. చివరికి ఇద్దరు పాలస్తీనియన్లను వదిలేశారని చెప్పుకొచ్చాడు.

వెనుక నుంచి కాల్చారు..

గాజాలో ఐదుగురు పాలస్తీనా మాజీ ఖైదీలు కూడా దీన్ని ధ్రువీకరించారు. 20 ఏళ్ల మహ్మద్ సాద్ఇజ్రాయెల్ సైన్యం దాడుల తర్వాత ఉత్తర గాజా వీడి ఖాన్ యూనిస్ సమీపంలో తాత్కాలిక శిబిరంలో ఉంటున్నాడు. తనకు, తమ్ముళ్లకు ఆహారం కోసం బయటికొస్తే ఇజ్రాయెల్ సైన్యం పట్టుకుంది. "మమ్మల్ని జీపులో తీసుకెళ్లారు. 47 రోజుల పాటు రఫా సైనిక శిబిరంలో నిర్బంధించారు. నిఘా చర్యలకు ఉపయోగించారు. మాకు మిలటరీ యూనిఫాం ఇచ్చారు. తలపై కెమెరా పెట్టారు. మెటల్ కట్టర్ ఇచ్చారు. సొరంగాల్లో వెదికేటప్పుడు సాయానికి మమ్మల్ని వాడుకున్నారు. మెట్ల కింద వీడియోలు తీయాలని, ఏదైనా దొరికితే బయటికి తేవాలని చెప్పేవారు. ఒక మిషన్ కోసం పౌర దుస్తుల్లో తీసుకెళ్లారు. సైన్యం వదిలివెళ్లిన ట్యాంకును వీడియో తీయమన్నారు. నేను భయపడితే వీపుపై తుపాకీతో కొట్టారు. నేను ట్యాంకు వద్దకు వెళ్లగానే వెనుక నుంచి కాల్చారు. అదృష్టవశాత్తూ బయటపడ్డా" అంటూ వీపుపై తూటా గాయాలు చూపించాడు. 17 ఏళ్ల మొహమ్మద్ షబ్బీర్‌దీ ఇదే కథ. ఖాన్ యూనిస్‌లోని అతని ఇంటిపై ఇజ్రాయెల్ సైన్యం దాడి చేసింది. తండ్రి, సోదరిని చంపి అతన్ని బందీగా పట్టుకుంది. "నన్ను మానవ కవచంగా వాడుకున్నారు. కూల్చేసిన ఇళ్లలోకి, ప్రమాదకరమైన, మందుపాతరలున్న ప్రదేశాల్లోకి తీసుకెళ్లారు" అని షబ్బీర్ చెప్పుకొచ్చాడు.

డాక్టర్‌నూ వదల్లేదు...

59 ఏళ్ల డాక్టర్ యాహ్యా ఖలీల్ అల్ కయాలీ ఓ వైద్యుడు. గాజాలో అతి పెద్ద వైద్య సముదాయమైన అల్ షిఫా ఆస్పత్రిలో వేలాది మంది శరణార్థులతో కలిసి ఉండేవారు. గత మార్చిలో ఇజ్రాయెల్ సైన్యం రెండు వారాల దాడిలో ఆసుపత్రి ధ్వంసమైంది. అప్పుడే కయాలీని సైన్యం పట్టుకుంది. "నాతో అపార్ట్‌మెంట్ భవనాలను, ప్రతి గదినీ తనిఖీ చేయించారు. అదృష్టవశాత్తూ వేటిలోనూ హమాస్ ఫైటర్లు లేరు. అలా 80 అపార్ట్‌మెంట్లను తనిఖీ చేశాక నన్ను వదిలేశారు" అని గుర్తు చేసుకున్నారు.

ఈ నెల 28న భూమి సమీపానికి
భారీ గ్రహశకలం

భూమికి ఎలాంటి ముప్పు లేదంటున్న సైంటిస్టులు

ఏకంగా 70 అంతస్తుల భవనం అంత ఎత్తున్న భారీ గ్రహశకలం ఈ నెల 28న భూమికి సమీపానికి రాబోతోంది. సైంటిస్టులు దీనికి 'అస్టరాయిడ్ 2020 డబ్ల్యూజీ' అని పేరుపెట్టారు. ఈ నెల 28న ఏం జరుగుతుందన్న ఆసక్తి నెలకొంది. ఈ గ్రహ శకలాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబ్(జేపీఎల్) తొలుత గుర్తించింది. ఇది భూమికి అతి సమీపంలోకి.. అంటే 3.3 మిలియన్ కిలోమీటర్ల దూరంలోకి రాబోతున్నట్లు తేల్చారు. ఇది భూమికి, చంద్రుడికి మధ్యనున్న దూరానికి 9 రెట్లు అధికం. సమీపం నుంచి దూసుకెళ్లే ఈ అస్టరాయిడ్ వల్ల భూమికి ఎలాంటి ముప్పు ఉండదని సైంటిస్టులు చెబుతున్నారు. గ్రహ శకలాలపై మరిన్ని పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇది సెకన్‌కు 9.43 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుందని, సమీపం నుంచే క్షుణ్నంగా పరిశీలించవచ్చని అంటున్నారు. ఇదొక అరుదైన అవకాశమని చెబుతున్నారు. భవిష్యత్తులో భూమికి సమీపంలోకి రాబోయే గ్రహ శకలాలు, వాటి నుంచి వాటిల్లే ముప్పు, ఆ ముప్పు తప్పించే మార్గాలపై అధ్యయనానికి 'అస్టరాయిడ్ 2020 డబ్ల్యూజీ' రాకను ఉపయోగించుకుంటామని సైంటిస్టులు వెల్లడించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లోని
8 మంది షూటర్లు అరెస్ట్

న్యూఢిల్లీ: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లోని ఏడుగురు షూటర్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్ట్ చేసిందని అధికారులు శుక్రవారం వెల్లడించారు. వీరిలో ఏడుగురు రాజస్తాన్ మాజీ ఎమ్మెల్యే బంధువును చంపేందుకు పథకం వేశారని చెప్పారు. మరో ఘటనలో ఢిల్లీ పోలీసులు లారెన్స్ బిష్ణోయ్, కాలా జథేడి గ్యాంగ్ సభ్యుడు రిజ్వాన్ అన్సారీని అదుపులోకి తీసుకుని ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ నెల 12న మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ హత్యకు తామే కారణమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకున్న నేపథ్యంలో పోలీసులు ఈ ముఠాపై ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా పట్టుబడిన షూటర్లకు బాబా సిద్ధిఖీ హత్యతో సంబంధమున్నట్లు ఆధారాలు దొరకలేదని డీసీపీ ప్రతీక్షా గొదారా చెప్పారు. అయితే వీరు, రాజస్తాన్‌లోని గంగానగర్ వాసి సునీల్ పహల్వాన్‌ను, మాజీ ఎమ్మెల్యే బంధువు రాజ్ కుమార్ గౌర్‌ను హత్య చేసేందుకు వీరు పథకం వేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇందుకోసం వీరు రెక్కీ కూడా చేపట్టారని ఆమె చెప్పారు. వీరి నుంచి ఆరు అత్యాధునిక పిస్టళ్లు, 24 బుల్లెట్లు, జీపీఎస్ ట్రాకింగ్ పరికరం, ఒక వాహనం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కుట్ర వెనుక జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ అనుచరుడు ఆర్జూ బిష్ణోయ్ ఉన్నాడన్నారు. ముంబైలోని సల్మాన్ ఖాన్ నివాసం వెలుపల కాల్పుల ఘటనకు, బాబా సిద్ధిఖీ మరణానికి కెనడాలో ఉంటున్న అన్‌మోల్ బిష్ణోయ్ అలియాస్ భానుయే కారణమని చెబుతున్నారు.

పరువు నష్టం కేసులో సంజయ్ రౌత్‌కు బెయిల్

ముంబై: పరువు నష్టం కేసులో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్‌కు దిగువ కోర్టు విధించిన జైలు శిక్షను ముంబై సెషన్స్ కోర్టు కొట్టివేసింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. బీజేపీ నేత కిరీట్ సోమయ్య భార్య మేధా సోమయ్య వేసిన కేసులో దిగువ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సంజయ్ రౌత్ పెట్టుకున్న రివిజన్ పిటిషన్‌పై కోర్టు శుక్రవారం విచారణ జరిపింది. విచారణకు స్వయంగా హాజరైన రౌత్ బెయిల్ కోసం విజ్ఞప్తి చేశారు. ఆయనకు బెయిలిస్తే అభ్యంతరం లేదని సోమయ్య తరపు లాయర్ పేర్కొన్నారు. అయితే, రివిజన్ పిటిషన్‌ను కోర్టు స్వీకరించాలన్నారు. దీంతో, కోర్టు రివిజన్ పిటిషన్‌ను అంగీకరిస్తూ రూ.50 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జడ్జి సంజీవ్ పింగ్లే ప్రకటించారు. తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 31న ఉంటుందని పేర్కొన్నారు.

ముద్రా రుణ పరిమితి రూ.20 లక్షలకు పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ముద్రా యోజన రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం పెంచింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ముద్రా రుణాల పరిమితిని ప్రస్తుతమున్న రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం, గతంలో తరుణ్ కేటగిరీ కింద రుణాలను తీసుకుని, పూర్తిగా తిరిగి చెల్లించిన వ్యాపారవేత్తలకు కొత్తగా తరుణ్ ప్లస్ అనే కేటగిరీని తీసుకువచ్చారు. దీన్లో గరిష్ట రుణ పరిమితిని రూ.20 లక్షలుగా నిర్ణయించారు. పథకం లక్ష్యాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పెంపు దోహదపడుతుందని పేర్కొంది.

సీఎం సిద్దరామయ్య భార్యను ప్రశ్నించిన లోకాయుక్త

మైసూరు: మైసూరు ముడా ఇళ్ల స్థలాల కేసులో లోకాయుక్త అధికారులు శుక్రవారం సీఎం సిద్దరామయ్య భార్య పార్వతిని ప్రశ్నించారు. ఈ కేసులో రెండో ముద్దాయిగా ఉన్న ఆమెను గుర్తు తెలియని ప్రాంతంలో మూడు గంటలపాటు ప్రశ్నించారు. విచారణకు హాజరు కావాలని పార్వతికి గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితుల విచారణ పూర్తయింది. మొదటి ముద్దాయిగా ఉన్న సీఎం సిద్దరామయ్యను ఎప్పుడు విచారిస్తారనేది ఉత్కంఠగా మారింది. మరోవైపు ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది.


జ్ఞానవాపిపై హిందువుల పిటిషన్ కొట్టివేత

వారణాసి: కాశీలోని విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్‌లో తవ్వకాలు జరిపి సర్వే చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను వారణాసి కోర్టు తిరస్కరించింది. సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ యుగుల్ శంభు శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. కట్టడంలో ఎలాంటి తవ్వకాలు జరపరాదు, నష్టం కలిగించరాదంటూ హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టు కూడా స్పష్టంగా ఆదేశాలిచ్చినందున పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని హిందూ పక్షం న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ చెప్పారు. అక్కడ తవ్వకాలు జరపకుండా వాస్తవాలు వెలుగుచూసేందుకు అవకాశం లేదన్నారు.

కశ్మీర్‌లో హింసను ఆపండి..

- పాక్‌కు ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వినతి
- తాము ఆ దేశంలో విలీనమయ్యేది లేదని స్పష్టీకరణ

శ్రీనగర్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైత్రి పెంపొందే వరకు గుల్‌మార్గ్‌లో ఉగ్ర కాల్పుల వంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ)పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య స్నేహంతోనే జమ్మూకశ్మీర్ కష్టాలు తొలగిపోతాయన్నారు. హింసను మాని, భారత్‌తో మైత్రిని పెంపొందించేందుకు కృషి చేయాలని పాకిస్తాన్‌కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. అలా చేయని పక్షంలో భవిష్యత్తు మరింత కష్టంగా ఉంటుందని చెప్పారు. 'పాకిస్తాన్‌లో మేం కలిసేది లేదు. అలాంటప్పుడు ఎందుకివి చేయిస్తోంది? మా భవిష్యత్తును నాశనం చేయడానికా? లేక మమ్మల్ని మరింత పేదలుగా మార్చడానికా?'అని నిలదీశారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు అత్యధికంగా తరలి వచ్చి ఓటు వేయడాన్ని పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోతోందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో అశాంతిని ప్రేరేపించడం మాని సొంత సమస్యల్ని పరిష్కరించుకుంటూ మెరుగైన భవిత కోసం కృషి చేయాలని పాకిస్తాన్‌కు సూచించారు. వాళ్లు తమకు తాము నాశనమయ్యేది కాకుండా, మమ్మల్ని కూడా నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 'గత 30 ఏళ్లుగా ఇలాంటివి నేను చూస్తున్నాను. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. దాడికి పాల్పడిన వారు ఎక్కడి నుంచి వస్తున్నారో అందరికీ తెలుసు. ఒక పరిష్కారం కనుగొనే వరకు ఇలా కొనసాగుతూనే ఉంటాయి'అని అన్నారు. 'గురువారం గుల్‌మార్గ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నా నివాళులు. వారి కుటుంబాలను క్షమాపణ కోరుతున్నా'అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటేశారు. ప్రజల కోసం అసెంబ్లీ పనిచేస్తుంది. ప్రజల కోసం ప్రభుత్వం పనిచేసేందుకు వీలుగా జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను కేంద్రం ఇస్తుందని భావిస్తున్నాం'అని ఫరూక్ అన్నారు. తాను సీఎంగా పనిచేసిన సమయంలో కూడా కేంద్రం, రాష్ట్రం సహకరించుకుంటూ పనిచేయాలనే విషయాన్ని పలుమార్లు చెప్పానని గుర్తు చేశారు.





బార్బర్ షాపులో రాహుల్!

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలోని బార్బర్ షాపులో గడ్డం ట్రిమ్మింగ్ చేయించుకున్నారు. తనకు ట్రిమ్మింగ్ చేసిన దుకాణం యజమాని అజిత్‌తో మాట్లాడారు. నిత్య జీవితంలో ఆయన ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. తనకు మిగిలిందేమీ లేదంటూ అజిత్ కన్నీరు పెట్టుకున్నాడని రాహుల్ ఆవేదన చెందారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తగ్గుతున్న ఆదాయాలు పేద, మధ్య తరగతి ప్రజల సొంత దుకాణం, సొంతిల్లు కలిగి ఉండాలని, ఆత్మగౌరవంతో బతకాలన్న వారి కలలను కల్లలు చేశాయన్నారు. 'ఇటువంటి వారి సమస్యలకు ఆధునిక పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఉంది. వీరి ఆదాయం, పొదుపులను పెంచాలి. నైపుణ్యం కలవారికి తగు ప్రతిఫలం దక్కాలి'అని రాహుల్ పేర్కొన్నారు.

- న్యూఢిల్లీ

నగ్న చిత్రం ప్రతిదీ అసభ్యకరం కాదు

బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబై: నగ్నంగా ఉండే ప్రతి పెయింటింగ్ అశ్లీలంగా ఉందని చెప్పలేమని బాంబే హైకోర్టు పేర్కొంది. ప్రముఖ చిత్రకారులు ఎఫ్ఎన్ సౌజా, అక్బర్ పదమ్‌సీ గీసిన కళాఖండాలను వారికి తిరిగిచ్చేయాలంటూ కస్టమ్స్ విభాగం అధికారులను ఆదేశించింది. ఈ ఏడాది జూలైలో ముంబై కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ జస్టిస్ ఎంఎస్ సొనక్, జస్టిస్ జితేంద్ర జైన్ డివిజన్ బెంచ్ శుక్రవారం తీర్పు వెలువరించింది. నగ్నంగా అగుపించేంది ఏదైనా సరే అశ్లీలమైనదనే వ్యక్తిగత అవగాహన ఆధారంగా మాత్రమే ఆ అధికారి నిర్ణయం తీసుకున్నారని, నిపుణుల అభిప్రాయాన్ని కూడా తీసుకోలేదని పేర్కొంది. ముంబై వ్యాపారవేత్త ముస్తాఫా కరాచీవాలాకు చెందిన బీకే పాలిమెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 2022లో లండన్‌లో జరిగిన రెండు వేర్వేరు వేలాల్లో ఎఫ్ఎన్ సౌజా, అక్బర్ పదమ్‌సీ గీసిన ఏడు పెయింటింగ్‌లను సొంతం చేసుకుంది. వీటిని 2023 ఏప్రిల్‌లో ముంబైకి తీసుకురాగా కస్టమ్స్ విభాగం స్పెషల్ కార్గో కమిషనరేట్ వీటిని అసభ్యకర వస్తువులని అభ్యంతరం చెబుతూ స్వాధీనం చేసుకుంది. 2024లో అసిస్టెంట్ కమిషనర్ వీటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించడంతోపాటు ఆ కంపెనీకి రూ.50వేల జరిమానా సైతం విధించారు. ఈ చర్యలను బీకే పాలిమెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో సవాల్ చేసింది.

జిన్ పింగ్ ఆమెను చిన్న పిల్లలాగా ఏడిపిస్తారు

కమలా హారిస్‌పై ట్రంప్ ఎకసెక్కాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యక్తిగత విమర్శలు పదునెక్కుతున్నాయి. కమలా హారిస్‌నుద్దేశించి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చులకనగా మాట్లాడుతున్నారు. రేడియో వ్యాఖ్యాత హ్యూగ్ హెవిట్‌తో ఆయన మాట్లాడారు. ఏమీ తెలియని కమల అధ్యక్షురాలే అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆమెను చిన్నపిల్లను ఏడిపించినట్లే ఏడిపిస్తారని వ్యాఖ్యానించారు. 'జిన్‌పింగ్‌తో ఎలా వ్యవహరించాలో ఆమెకు తెలియదు. చెస్ గ్రాండ్ మాస్టర్‌తో కొత్త ఆటగాడు ఆడినట్లే ఉంటుంది వ్యవహారం' అని పేర్కొన్నారు. పన్నులు పెంచుతానన్న కమల ప్రతిపాదనపై లాస్‌వెగాస్‌లో ట్రంప్ మాట్లాడుతూ ఆమెను రాబందుతో పోల్చారు.

అందరి చూపు షిల్లాంగ్ వైపే

- మేఘాలయ రాజధాని వైపు మొగ్గుచూపుతున్న భారతీయుల పర్యాటకులు
- విదేశీయాత్రపై మరింత పెరిగిన మక్కువ
- స్కైస్కానర్ నివేదిక

న్యూఢిల్లీ: జలపాతాలు, ప్రకృతి రమణీయతలకు నెలవై 'స్కాట్లాండ్ ఆఫ్ ది ఈస్ట్'గా ఖ్యాతిగడించిన మేఘాలయ రాజధాని నగరం షిల్లాంగ్‌లో వచ్చే ఏడాది పర్యటించేందుకు భారతీయులు తెగ ఉవ్విళ్లూరుతున్నారని ప్రఖ్యాత ట్రావెల్ యాప్ స్కైస్కానర్ తన నివేదికలో వెల్లడించింది. వచ్చే ఏడాదికి సంబంధించిన 'ట్రావెల్ ట్రెండ్స్ రిపోర్ట్'ను బుధవారం విడుదలచేసింది. తరచూ పర్యటనకు వెళ్లే భారతీయుల్లో 66 శాతం మంది 2025 సంవత్సరంలో మరింతగా పర్యటనలు చేయాలని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. పర్యాటకం అనగానే విదేశీయానం చేసే భారతీయులు స్వదేశంలో షిల్లాంగ్‌కు అగ్రతాంబూలం ఇచ్చారు. అజర్‌బైజాన్ దేశంలోని బాకూ నగరం, మలేసియాలోని లాంగ్‌కావీ నగరాలను పక్కకునెట్టి షిల్లాంగ్ ఈ జాబితాలో తొలిస్థానంలో నిలిచింది. హాయిగా విశ్రాంతి తీసుకునేందుకు ఆహ్లాదకర వాతావరణం, ట్రెక్కింగ్ వంటి సాహసాలు చేయడానికి అనువైన పచ్చటి కొండలతో అలరారే షిల్లాంగ్‌లో పర్యటించాలని ఎక్కువ మంది భారతీయులు భావిస్తున్నారు. దీంతోపాటే నార్వేలోని ట్రోంసో, ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్, సౌదీ అరేబియాలోని అల్–ఉలాలనూ పర్యటనల కోసం భారతీయులు ఎక్కువగా సెర్చ్‌చేశారు. తమ పర్యాటక ఖర్చులకు తగ్గ ఆనందం లభిస్తుందన్న 'బెస్ట్ వాల్యూ డెస్టినేషన్ కేటగిరీ'లో కజక్‌స్థాన్‌లోని అల్మటీ తొలిస్థానంలో నిలిచింది. ఇండోనేసియాలోని జకార్తా, మలేసియాలోని సింగపూర్, కౌలాలంపూర్‌లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ దేశాలకు విమానచార్జీలు గత ఏడాదికాలంలో భారీగా తగ్గడమూ ఇందుకు మరో కారణం.

ఖర్చులే కీలకం

ఏ దేశాల్లో పర్యటించాలనే విషయంలో హోటల్ ఖర్చులను లెక్కలోకి తీసుకుంటామని 65 శాతం మంది చెప్పగా విమాన చార్జీలను లెక్కిస్తామని 62 శాతం మంది చెప్పారు. అక్కడి ఆహారం, చిరుతిళ్ల ఖర్చులు సైతం బేరీజు వేసుకుంటామని 54శాతం మంది పేర్కొన్నారు. విమాన ఖర్చులకే ఎక్కువ ఖర్చవుతోందని 86 శాతం మంది చెప్పగా, ఇతర ఖర్చులే ఎక్కువగా ఉంటాయని 80 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదితో పోలిస్తే 2025లో ఖచ్చితంగా పర్యటించాలన్న బలమైన కాంక్ష ఎక్కువ మందిలో ఉండటం విశేషం. వచ్చేసారి ఎక్కడికి వెళ్లాలనే తుది నిర్ణయంలో ఖర్చులదే అత్యంత కీలక పాత్ర అని స్కైస్కానర్‌కు సంబంధించిన పర్యాటక నిపుణుడు మోహిత్ జోషి వ్యాఖ్యానించారు. అబూధాబిలో డిసెంబర్‌లో జరగబోయే ఫార్ములా1 రేసింగ్ వంటి క్రీడలు చూసేందుకు భారతీయులు విపరీతంగా విమానాల్లో వెళ్తున్నారని నివేదిక పేర్కొంది.

పాలపుంత వెలుగుల్లోనూ..

జెడ్ జనరేషన్ యువతలో 62 శాతం మంది ఖాళీ సమయాలను విదేశాల్లో ఎంజాయ్ చేయాలని భావిస్తున్నారు. అందులో ముఖ్యంగా 57 శాతం మంది తాము ఆడిన వీడియోగేమ్‌లో తరచూ చూసిన ప్రపంచ ప్రఖ్యాత స్థలాలను వెళ్లిరావాలని కోరుకుంటున్నారు. రాత్రిళ్లు వినీలాకాశంలో పాలపుంత అందాలను కళ్లారా చూసేందుకూ ఆయా ప్రదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నట్లు 53 శాతం మంది చెప్పారు. ఖగోళ వింతలను కెమెరాల్లో బంధించేందుకు ఇష్టపడుతున్నట్లు 56 శాతం మంది చెప్పారు. ధ్రువకాంతులను చూసేందుకు విదేశీయానం చేయాలనుకుంటున్నట్లు 44 శాతం మంది చెప్పారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పోలీసుల ఎదుట ఆరుగురు మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. వీరిపై మొత్తం రూ.24 లక్షల వరకు రివార్డు ఉంది. వీరిలో కమ్లు హేమ్లా అలియాస్ పవన్, ఆయన భార్య బండి దుధి అలియాస్ కమల కూడా ఉన్నారని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు. ఈ దంపతులపై రూ.10 లక్షల రివార్డు ఉందన్నారు. లొంగిపోయిన మరో ఇద్దరిపై రూ.5 లక్షల చొప్పున, మరో ఇద్దరిపై రూ.2 లక్షల చొప్పున రివార్డు ఉందని వెల్లడించారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో జరిగిన అనేక ప్రధాన విధ్వంస ఘటనల్లో పాల్గొన్నారని తెలిపారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

సుక్మా జిల్లా బుర్కలంక అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బలగాలతో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని గుర్తించాల్సి ఉందని ఎస్పీ కిరణ్‌చౌహాన్ తెలిపారు.

గుల్‌మార్గ్‌లో ముష్కరుల కోసం వేట ఉధృతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని గుల్‌మార్గ్ సమీపంలో గురువారం జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో బలగాలు అలెర్ట్ ప్రకటించాయి. శుక్రవారం ఉగ్ర మూకల పీచమణిచేందుకు హెలికాప్టర్లు, డ్రోన్లతో నియంత్రణ రేఖ వెంబడి ముమ్మరంగా వేట ప్రారంభించాయి. గుల్‌మార్గ్ సెక్టార్‌లో కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌ను ఉన్నతాధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గురువారం దాడి చోటుచేసుకున్న ప్రాంతానికి వెళ్లే ప్రాంతానికి అన్ని మార్గాలను భద్రతాబలగాలు మూసివేశాయి. ముందు జాగ్రత్తగా రిసార్టు పట్టణం గుల్‌మార్గ్‌కు దగ్గర్లోని గొండోలా రోప్‌వేను సేవలను కొద్దిసేపు నిలిపివేశారు. అయితే, గొండోలా స్కై రిసార్టుకు పర్యాటకులను అనుమతిస్తున్నామని అధికారులు తెలిపారు. కొద్ది నెలల క్రితం నియంత్రణ రేఖను దాటి ముష్కర మూకల గ్రూపొకటి అఫ్రావత్ రేంజిలోకి ప్రవేశించిందన్న సమాచారంతో ఆర్మీ ఇప్పటికే ఇక్కడ ప్రత్యేక బలగాలున్నాయి. సియాచిన్ హిమానీ నదంపై విధులు నిర్వహించే బలగాలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ నిచ్చే ప్రఖ్యాత హై ఆల్టిట్యూడ్ వార్‌ఫేర్ స్కూల్(హెచ్ఏడబ్ల్యూఎస్)కూడా ఇక్కడికి దగ్గర్లోనే ఉండటం గమనార్హం.

కేరళ గవర్నర్ చర్యను కోర్టులో సవాల్ చేస్తాం

వీసీ పునర్నియామకంపై అధికార సీపీఎం ఆగ్రహం

త్రిసూర్: కేరళ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేయూహెచ్ఎస్) వైస్ ఛాన్స్‌లర్‌గా మోహనన్ కున్నుమ్మల్‌ను పునర్నియమిస్తూ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఆదేశాలివ్వడాన్ని అధికారం సీపీఎం తీవ్రంగా తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరపకుండా తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికం, చట్ట విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ విమర్శించారు. గవర్నర్ చర్యను న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. ప్రభుత్వ నిధులతో నడిచే విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్‌లను నియమించే ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం తప్పనిసరి అనే ఆనవాయితీకి ఆయన తూట్లు పొడిచారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీకి అనుకూలంగా ఉండే వారిని నామినేట్ చేసి, వర్సిటీ సెనేట్‌తో ఆమోదింపజేసుకుంటున్నారని గవర్నర్ ఖాన్‌పై మండిపడ్డారు. కున్నుమ్మల్ పదవీ కాలం ఈ నెల 25వ తేదీతో ముగియనుండగా, ఆయన పదవీ కాలాన్ని మరో ఐదేళ్లకు పొడిగించడంతోపాటు యూనివర్సిటీ ఆఫ్ కేరళకు తాత్కాలిక వీసీగా కూడా కున్నుమ్మల్‌ను నియమిస్తూ గవర్నర్ ఖాన్ గురువారం ఇచ్చిన ఉత్తర్వులపై దుమారం రేగుతోంది.

జార్ఖండ్ మాజీ సీఎం
మధు కోడాకు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ సీఎం మధు కోడాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై విధించిన శిక్ష అమలును నిలిపివేసి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వీలు కల్పించాలని పెట్టుకున్న అర్జీని న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో 2017లో ఇచ్చిన మూడేళ్ల జైలు శిక్ష తీర్పు అమలుపై స్టేకు నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు అక్టోబర్ 18వ తేదీన వెలువరించిన ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం నిరాకరించింది. కోర్టు తీర్పుపై చేసుకున్న అప్పీల్ పెండింగ్‌లో ఉండగానే మధు కోడా మూడేళ్ల జైలు శిక్షను పూర్తి చేశారని ఆయన లాయర్ తెలిపారు. అయితే, ప్రజాప్రాతినిధ్య చట్ట ప్రకారం దోషిగా నిర్ధారణై కనీసం రెండేళ్ల జైలు శిక్ష అనుభవించిన వారు విడుదలయ్యాక ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ లెక్కన పిటిషనర్ 9 ఏళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయలేరని పేర్కొంది. మధు కోడా గతంలో కూడా ఇలాంటి పిటిషన్‌ను వేయగా న్యాయస్థానం తిరస్కరించిందని సీబీఐ తరపు లాయర్ ఆర్ఎస్ చీమా గుర్తు చేసింది. ఇలా ఉండగా, జార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13, 20వ తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరగనుంది.

సాక్షి ప్లస్
శనివారం। 26-10-2024

జీవించే హక్కును వివరించే అధికరణ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు

వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాథమిక హక్కులు పెట్టని కోట. భారత ప్రజాస్వామ్యానికి ఇవి పునాదిరాళ్లు. ప్రాథమిక హక్కులను మన రాజ్యాంగానికి మాగ్నాకార్టాగా పేర్కొంటారు. వీటికి, ఆదేశిక సూత్రాలకు మధ్య సంబంధం విషయంలో.. న్యాయ శాస్త్రవేత్తలకు, రాజ్యాంగ నిపుణులకు, రాజనీతిజ్ఞులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయ సంరక్షణ లేని హక్కులుగా బి.ఎన్.రావు వర్ణించిన ఆదేశిక సూత్రాల స్థితిగతులపై అనేక వాదనలున్నాయి. రాజ్యాధికార దుర్వినియోగం, నియంతృత్వ చట్టాల నుంచి పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే బాధ్యతను మన రాజ్యాంగం సుప్రీం కోర్టు, హైకోర్టులకు అప్పగించింది. తద్వారా ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ లభించింది. వీటి రక్షణ కోసం సుప్రీంకోర్టు 32వ అధికరణ ప్రకారం, హైకోర్టులు 226వ అధికరణ ప్రకారం రిట్లను జారీ చేస్తాయి. రాజ్యాంగంలోని 37వ అధికరణను అనుసరించి ఎలాంటి న్యాయ సంరక్షణ లేని ఆదేశిక సూత్రాలు అంతగా పట్టించుకోదగినవి కావని కె. సంతానం వ్యాఖ్యానించడం గమనార్హం. నిర్దేశిక నియమాలకు న్యాయసంరక్షణ లేకపోయినప్పటికీ సామాజిక మద్దతు ఉందని డా.బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఈ విషయాన్ని విస్మరించడానికి అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం

ప్రాథమిక హక్కులు– ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యాలు, తేడాలు మాత్రమే ఉన్నాయని, ఎలాంటి సంబంధం, సమన్వయం లేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. 19(1)(ఎ) అధికరణ వ్యక్తి భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాల గురించి పేర్కొంటోంది. 21వ అధికరణ వ్యక్తి స్వేచ్ఛను తెలుపుతోంది. సాధారణంగా అన్ని రకాల ఆర్థిక వనరులను కలిగి రాజ్యాంగం, హక్కుల గురించి అవగాహన ఉన్నవారు వాటిని పొందడం పెద్ద సమస్య కాదు. కానీ పేదలు, నిరక్షరాస్యులు, ప్రాథమిక హక్కుల గురించి అవగాహనలేనివారు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడానికి ఆదేశిక సూత్రాల్లోని 39–ఎ అధికరణ ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. పేదలకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉచిత న్యాయసేవా సహాయం అందించడానికి 1987లో లీగల్ ఎయిడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కును వివరిస్తోంది. 41వ అధికరణ, 48ఎ అధికరణలు ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య అవినాభావ సంబంధాన్ని తెలుపుతున్నాయి. రాజ్యాంగంలోని 46వ అధికరణ వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగపరంగా ప్రత్యేక అవకాశాలను కల్పించాలని పేర్కొంటోంది. రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను 15(4), 15(5), 16(4), 16(4ఎ) అధికరణలు సమర్థిస్తాయి. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అమలులో ఒకదానికి మరొకటి సహకరించడంతో



పాటు ఒక అంశాన్ని మరొక అంశం పటిష్ఠపరిచేందుకు దోహదపడడం గమనార్హం.

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య భిన్నత్వం

ప్రాథమిక హక్కులు ప్రధానంగా వ్యక్తి ప్రాతిపదికపై రూపొందించినవి. ఆదేశిక సూత్రాలు సమాజ సమష్టి ప్రయోజనం కోసం ఉద్దేశించినవి. హక్కులు వ్యక్తి స్వేచ్ఛను, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయి. ప్రాథమిక హక్కుల సంరక్షణ, అమలు కోసం పౌరులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా, వాటి సంరక్షణ కోసం న్యాయస్థానాలు కూడా ఆజ్ఞలు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. ఆదేశిక సూత్రాలకు అలాంటి న్యాయ సంరక్షణ లేకపోవడం గమనార్హం. ప్రాథమిక హక్కులు ఎల్లప్పుడూ పౌరులకు అందుబాటులో ఉంటాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన సందర్భంలో మాత్రమే భారత రాష్ట్రపతి వాటిని తాత్కాలికంగా సస్పెండ్ చేయొచ్చు. కానీ నిర్దేశిక నియమాలు ఎల్లప్పుడూ సుప్తచేతనావస్థలో ఉంటాయి. అంటే వాటికి జీవం పోయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేసి అమలు పర్చాలి. ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యత న్యాయస్థానాలపై, నిర్దేశిక నియమాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు సకారాత్మక దృక్పథాన్ని కల్పిస్తాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాన్ని చూపుతాయి. ప్రాథమిక హక్కులు ప్రధానంగా ఏ పనులు చేయకూడదో తెలుపుతాయి. అంటే కొన్ని హక్కులు తప్ప మిగతావన్నీ నకారాత్మక దృక్పథాన్ని తెలుపుతాయి.

ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ సంక్షేమ లక్ష్యాలను తెలిపితే... ప్రాథమిక హక్కులు ఆ లక్ష్యాలను సాధించే సాధనాలు, మార్గాలుగా ఉపయోగపడతాయి.

సంక్షేమ రాజ్యస్థాపనలో నిమగ్నమైన మన దేశంలో నిర్దేశిక నియమాలు.. ప్రభుత్వ శాసనాల రూపకల్పనలో, పరిపాలనా విషయంలో మాత్రమే కాకుండా న్యాయస్థానాల న్యాయ నిర్వహణలోనూ అధిక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి.

ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యం:

ఆదేశిక సూత్రాలను అమలు పర్చాల్సిన బాధ్యత కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఆదేశిక సూత్రాల అమలుకు ప్రభుత్వాలు రూపొందించే చట్టాలు... ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నప్పుడు ఉన్నత న్యాయస్థానాలు న్యాయ సమీక్ష నిర్వహించి ఆ చట్టాలు చెల్లవని ప్రకటిస్తున్నాయి.

- ★ 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంలో మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం 46వ అధికరణను అమలు జరపడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. సమానత్వపు హక్కుకు రిజర్వేషన్లు విరుద్ధమని పేర్కొంటూ చంపకం దొరై రాజన్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ల చట్టం 13వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు విరుద్ధమని తీర్పునిచ్చింది.
- ★ 1950 లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 39(బి), 39(సి) అధికరణలను అమలు పర్చడంలో భాగంగా భూ సంస్కరణల చట్టాలను రూపొందించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టులు భూ సంస్కరణల చట్టాలను సమర్థించగా... బీహార్,పశ్చిమబెంగాల్ హైకోర్టులు ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాయి. కారణం అప్పట్లో ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుగా ఉండడమే. అంతేకాకుండా దేశంలోని వివిధ హైకోర్టుల్లో వందలాది కేసులు విచారణలో ఉన్నాయి.
- ★ రిజర్వేషన్లు, భూ సంస్కరణల చట్టాల విషయంలో ఉన్నత న్యాయస్థానాలిచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని 1951 లో నెహ్రూ ప్రభుత్వం మొదటి రాజ్యాంగ సవరణను చేసింది. ఈ సవరణ ద్వారా భూ సంస్కరణల చట్టాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. ప్రైవేట్ ఆస్తులను చట్టబద్ధంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ 31(ఎ), 31(బి) అధికరణలను మన రాజ్యాంగంలో పొందుపర్చారు.
- ★ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధతను కల్పిస్తూ 15(4) అనే అధికరణను కూడా చేర్చారు. మొదటి రాజ్యాంగ సవరణ కూడా ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉందనే కారణంతో శంకరీ ప్రసాద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.
- ★ 1951లో శంకరీ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... మొదటి రాజ్యాంగ సవరణను, తద్వారా రాజ్యాంగంలో చేర్చిన అంశాలను సమర్థించింది. ఈ కేసులో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించింది. 13వ అధికరణ ప్రకారం సాధారణ చట్టాలను మాత్రమే న్యాయ సమీక్షకు గురిచేయొచ్చని, 368 అధికరణ ప్రకారం చేసిన రాజ్యాంగ సవరణలను న్యాయ సమీక్షకు గురిచేసే అవకాశం లేదని పేర్కొంది.
- ★ బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్, కామేశ్వరీ సింగ్ వర్సెస్ బీహార్ మధ్య జరిగిన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు... ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తులను సమాజ ప్రయోజనం కోసం జాతీయం చేసినప్పుడు వారికి నష్టపరిహారం న్యాయబద్ధంగా చెల్లించాలని, అంటే మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో పార్లమెంట్ 4వ రాజ్యాంగ సవరణ చేసింది. వ్యక్తులకు చెల్లించే నష్టపరిహారాన్ని చట్టబద్ధంగా మాత్రమే చెల్లించాలని పేర్కొంది.
- ★ సజ్జన్‌సింగ్ వర్సెస్ రాజస్థాన్ మధ్య జరిగిన వ్యాజ్యంలో కూడా సుప్రీంకోర్టు 1965లో 4వ సవరణను సమర్థించింది. కానీ, 1967లో గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... గత తీర్పులకు భిన్నమైన తీర్పునిచ్చింది. ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ప్రాథమిక హక్కులను సవరించినట్లయితే.. ఆ సదరు సవరణలను కూడా న్యాయసమీక్షకు గురిచేస్తామని కోర్టు పేర్కొంది.
- ★ 1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 బ్యాంకులను జాతీయం చేసిన అంశాన్ని, 1970లో రాజభరణాలను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్స్‌లు కూడా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పులనిచ్చింది. దీంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 24, 25, 26వ రాజ్యాంగ సవరణలను చేపట్టింది.
- ★ 24వ సవరణ ప్రకారం... ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ★ 25వ సవరణ ప్రకారం ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారం అనే పదానికి బదులుగా కొంత మొత్తం చెల్లించాలని, ఈ అంశాన్ని ఏ న్యాయస్థానంలో కూడా సవాల్ చేసే అవకాశం లేదని పేర్కొంటూ 'సి' క్లాజును చేర్చారు.
- ★ 26వ సవరణ ప్రకారం రాజభరణాల రద్దుకు రాజ్యాంగబద్ధతను కల్పించారు.
- ★ పై మూడు రాజ్యాంగ సవరణలను 1973లో కేశవానంద భారతి వర్సెస్ కేరళ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 24వ రాజ్యాంగ సవరణను సమర్థిస్తూ ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం సవరించే అధికారం లేదని పేర్కొంది.
- ★ 25వ సవరణను సమర్థించినప్పటికీ అందులోని సి క్లాజు చెల్లదని తీర్పునిచ్చింది.
- ★ 26వ రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సమర్థించింది.
- ★ 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా పార్లమెంట్ సవరిస్తుందని, అలా సవరించిన అంశాన్ని ఏ న్యాయస్థానం ముందు ప్రశ్నించొద్దని, ఆ అంశాన్ని న్యాయ సమీక్షకు గురిచేసే అధికారం కూడా న్యాయస్థానాలకు లేదని పేర్కొంది.
- ★ 42వ సవరణ ద్వారా చేర్చిన అంశాలను 1980లో జరిగిన మినర్వా మిల్స్ కేసులో ప్రశ్నించారు. మినర్వామిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ పరస్పరం విరుద్ధమైనవి కావు, భారత ప్రజాస్వామ్యానికి రెండు రథచక్రాల వంటివి, ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆదేశిక సూత్రాలన్నింటికీ కాకుండా 39(బి), 39(సి) అధికరణలకు మాత్రమే న్యాయ సంరక్షణ ఉంటుందని పేర్కొంది. ప్రాథమిక హక్కులు మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని వెల్లడిస్తూ ఆదేశిక సూత్రాలపై ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను చాటి చెప్పింది.
- ★ ఎం.హెచ్. హోస్‌కాట్ వర్సెస్ మహారాష్ట్ర మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఉచిత న్యాయ సేవా సహాయాన్ని అందించడం కూడా ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పునిచ్చింది.
- ★ 1992లో మోహినీజైన్ కేసులో, ఉన్నికృష్ణన్ కేసులో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. ఇందిరాసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య వ్యాజ్యంలో సంక్షేమ స్వభావం కూడా మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.
- ★ ఆదేశిక సూత్రాల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని కూడా సమర్థిస్తూ ఎం.సి.మెహతా కేసులో తాజ్‌మహల్ చుట్టూ కాలుష్యాన్ని వెదజల్లే 18 రకాల పరిశ్రమలను మూసివేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- ★ 2006లో భారత పార్లమెంట్ 93వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని అశోక్‌కుమార్ ఠాకూర్ కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ ఎస్టీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

తెలంగాణ రాష్ట్రం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వరంగల్‌లోని ఎస్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్–1, 2, 3, 4, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, పోలీసు ఇతర ఉద్యోగ పరీక్షల కోసం ఉచిత ఫౌండేషన్ కోర్సు అందించనున్నారు. అర్హులైన తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత

» గిరిజన తెగలకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలు మించకూడదు. ఉమ్మడి వరంగల్ జిల్లా(ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం)కు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. సీట్ల కేటాయింపు: మహిళలకు 33 1/3 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లను కేటాయించారు.

» ఎంపిక విధానం: రాతపరీక్షలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ తేది: 31.10.2024.

» స్క్రీనింగ్ టెస్ట్ తేది: 03.11.2024.

» ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది: 07.11.2024.

» వెబ్‌సైట్: https://studycircle.cgg.gov.in

మనూలో బీఈడీ(ఓడీఎల్) కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో బీఈడీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సు వ్యవధి: రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు). బోధనా మాధ్యమం: ఉర్దూ.

» అర్హత: డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు అర్హులు.

» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.


» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.10.2024.

» ప్రవేశ పరీక్ష తేది: 03.11.2024.

» ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి తేది: 06.11.2024.

» వెబ్‌సైట్: http://https//manuu.edu.in

చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?



బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వచించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మన దేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపా నాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్‌సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమయంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలి గే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు
    2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయో గించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దేపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి
    4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

ఆరోగ్యకరమైన చర్మానికి అవసరమయ్యే విటమిన్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీవ రసాయనాలు

జీవుల్లో మాత్రమే తయారయ్యే రసాయనాలను జీవ రసాయనాలు (Biochemicals) అంటారు. వీటి అంతర చర్యల ద్వారా మాత్రమే జీవి మనుగడ సాధ్యమవుతుంది. ప్రస్తుతం మానవుడు వీటిని కృత్రిమంగా తయారు చేయగలుగుతున్నాడు. పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, కేంద్రకామ్లాలు ముఖ్యమైన జీవ రసాయనాలు.

పిండి పదార్థాలు

పిండి పదార్థాలు(Carbohydrates) జీవులకు ప్రధాన శక్తి వనరులు. ఇవి C, H, D లాంటి పదార్థాలతో నిర్మితమై ఉంటాయి. వీటి ని సాధారణంగా చక్కెరలు (Sugars) అంటా రు. అన్ని చక్కెరలు తియ్యగా ఉండవు. అత్యంత సరళమైన పిండి పదార్థాలు మోనోశాకరైడ్స్.

ఉదా: గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్.

ఈ మూడింటిలోనూ ఆరు కార్బన్లు ($C_6H_{12}O_6$) ఉంటాయి. కాబట్టి వీటిని హెక్సోజ్‌లు అంటారు. రెండు మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా డై శాకరైడ్ తయారవుతుంది.

ఉదా: సుక్రోజ్, లాక్టోజ్, మాల్టోజ్.

సుక్రోజ్ చెరకురసంలో ఉంటుంది. దీన్ని కేన్ షుగర్ అంటారు. దీన్ని Invert Sugar and Table Sugar అని కూడా అంటారు. అనేక మోనో శాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా లభించేది పాలీశాకరైడ్.

ఉదా: స్టార్చ్, సెల్యులోజ్, గ్లైకోజన్.

సాధారణంగా పాలీశాకరైడ్‌లు తియ్యగా ఉండవు. మోనో, డై శాకరైడ్‌లు తియ్యగా ఉంటాయి.

ప్రోటీన్లు

శరీర అభివృద్ధికి కీలకమైన జీవ రసాయనాలు ప్రోటీన్లు. వీటినే మాంసకృత్తులు అంటారు. ఇవి అమైనో ఆమ్లాలు అనే ప్రమాణాల పాలిమర్లు. అమైనో ఆమ్లాల మధ్య పెప్టైడ్ బంధాలు ఏర్పడటం ద్వారా ప్రోటీన్ తయారవుతుంది. ప్రోటీన్లు మానవ శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తాయి. శరీరంలో అత్యధిక ప్రోటీన్లు ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. శరీరంలో జరిగే రసాయనిక చర్యల్లో ఇవి ఉత్ప్రేరకాలుగా వ్యవహరించి, చర్యలు తక్కువ శక్తి వద్ద వేగంగా జరిగేలా తోడ్పడతాయి. జీర్ణక్రియ, శ్వాసక్రియ, కండర సంకోచం, రక్తస్కంధనం లాంటి శరీర క్రియలన్నీ రసాయనిక చర్యల ద్వారానే సాధ్యమవుతాయి. ఎంజైమ్‌లు ఈ రసాయనిక చర్యలను నిర్వహిస్తూ, శరీర పెరుగుదలకు దోహదపడతాయి.

ఉదా: పెప్సిన్, ట్రిప్సిన్.

కొన్ని ప్రోటీన్లు హార్మోన్‌లుగా కూడా వ్యవహరించి, శరీర జీవక్రియలను నియంత్రిస్తాయి.


ఉదా: పెరుగుదల హార్మోన్.

ఇది పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఇన్సులిన్, గ్లూకగాన్ రెండూ కలిసి రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తాయి. మరికొన్ని ప్రోటీన్లు నిర్మాణ ప్రమాణాలుగా వ్యవహరిస్తాయి.

ఉదా: కెరాటిన్. ఇది గోర్లు, రోమాలు, కొమ్ములు లాంటి నిర్మాణాల్లో ఉంటుంది.

కొవ్వులు

కొవ్వులు శక్తి వనరులుగా, రిజర్వు ఆహారంగా ఉపయోగపడతాయి. సరళ కొవ్వులను ట్రై గ్లిసరైడ్స్ అంటారు. ఒక ట్రై గ్లిసరైడ్‌లో ఒక గ్లిసరాల్ అణువుకు మూడు కొవ్వు ఆమ్లాలు ప్రత్యేక ఎస్టర్ బంధాల ద్వారా బంధితమై ఉంటాయి. అన్ని రకాల వంట నూనెల్లో ఈ ట్రై గ్లిసరైడ్‌లు ఉంటాయి. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్లన్నింటి మధ్య ఏకబంధాలు ఉంటే దాన్ని సంతృప్త(Saturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్ల మధ్య కనీసం ఒక ద్వి బంధం లేదా త్రి బంధం ఉన్నట్లయితే దాన్ని అసంతృప్త (Unsaturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఇలాంటి ద్వి బంధాలు, త్రి బంధాలు ఎక్కువగా ఉంటే దాన్ని Poly Unsaturated Fatty Acids (PUFA) అంటారు. ఇవి ఆరోగ్యానికి, ముఖ్యంగా గుండె పనితీరును మెరుగుపరచడానికి తోడ్పడతాయి. సంక్లిష్ట కొవ్వులకు కొలెస్టరాల్ మంచి ఉదాహరణ. శరీరంలో కొవ్వు నిల్వ ఉన్న కణజాలం అడిపోజ్. స్టీరాయిడ్‌లు, మైనం (Waxes) కూడా కొవ్వు పదార్థాలే.



విటమిన్లు

మానవుడికి పోషణలో కేవలం స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలనే విటమిన్లు అంటారు. ఇవి శక్తి వనరులు కావు. ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని భాగం లేదా దాని ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యల్లో ఎంజైమ్‌లకు దోహదం చేస్తాయి. ఇవి ముఖ్యంగా శక్తి విడుదలయ్యే ప్రక్రియల్లో సహ ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. రసాయనిక స్వభావం ఆధారంగా విటమిన్లను రెండు రకాలుగా విభజిస్తారు. అవి..

1. **కొవ్వుల్లో కరిగేవి:** A, D, E, K
2. **నీటిలో కరిగేవి:** బి-కాంప్లెక్స్, C.

విటమిన్	రసాయనిక నామం	దాని లోపం ద్వారా వచ్చే వ్యాధులు
A	రెటినాల్	రేచీకటి, కెరటోమలేసియా, జీరాప్తాల్మియా
D	కాల్సిఫెరాల్	రికెట్స్, ఆస్టియోమలేసియా
E	టోకోఫెరాల్	లోపం అరుదు. పక్షుల్లో వంధ్యత్వం, నవజాత శిశువుల్లో హీమోలైటిక్ అనీమియా
K	ఫిల్లోక్వినోన్/ మినాక్వినోన్	డయాథెసిస్, ఆలస్యంగా రక్తస్కంధనం
B_1	థయామిన్	బెరిబెరి, పాలీ న్యూరిటిస్, వెర్నికె-కోర్సకాఫ్ సిండ్రోమ్
B_2	రైబోఫ్లేవిన్	ఎరైబోఫ్లేవినోసిస్, గ్లాసిటిస్, కీలోసిస్
B_3	నియాసిన్/ నికొటినమైడ్	పెల్లాగ్రా/ 4డి సిండ్రోమ్
B_5	పాంటోథెనిక్ ఆమ్లం	పారెస్తీసియా
B_6	పైరిడాక్సిన్/ పైరిడాక్సామైన్	న్యూరోపతి
B_7	బయోటిన్	డెర్మటైటిస్, ఎంటిరైటిస్
B_9	ఫోలిక్ ఆమ్లం/ ఫొలాసిన్	మెగలోబ్లాస్టిక్ అనీమియా
B_{12}	సయనకోబాలమిన్	పెర్నీసియస్ అనీమియా
C	ఆస్కార్బిక్ ఆమ్లం	స్కర్వీ

ఆరోగ్యకరమైన దృష్టికి విటమిన్ A అవసరం. B_1 (థయామిన్), B_2 (రైబోఫ్లేవిన్), B_3 (నియాసిన్) లాంటివి ప్రధానంగా శక్తి విడుదల ప్రక్రియకు, ప్రోటీన్, పిండి పదార్థం, కొవ్వుల జీవక్రియల్లో అవసరమవుతాయి. B_9 (ఫోలిక్ ఆమ్లం), B_{12} (సయనకోబాలమిన్) విటమిన్లు హిమోగ్లోబిన్ ఏర్పడటానికి, ఎర్ర రక్త కణాల పరిపక్వతకు తోడ్పడతాయి. బలమైన ఎముకలు, దంతాలకు, కాల్షియం, ఫాస్ఫరస్ జీవక్రియ నియంత్రణకు విటమిన్ D అవసరమవుతుంది. ఇది సూర్యరశ్మి నుంచి లభిస్తుంది. విటమిన్ K ఒక అనుబంధ రక్తస్కంధన కారకంగా వ్యవహరిస్తుంది.

ఆరోగ్యకరమైన చర్మానికి, ప్రత్యుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి విటమిన్ E అవసరం. నోటి ఆరోగ్యానికి, బలమైన చిగుళ్లకు విటమిన్ C అవసరం. విటమిన్ E, విటమిన్ C యాంటీ ఆక్సిడెంట్లుగా వ్యవహరిస్తాయి.

కేంద్రకామ్లాలు

కేంద్రకామ్లాలు అనే జీవ రసాయనాలు జన్యు పదార్థంగా వ్యవహరిస్తాయి. ఇవి రెండు రకాలు. 1) డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్ (DNA), 2) రైబో న్యూక్లిక్ యాసిడ్ (RNA). వీటిలో ప్రధాన జన్యు పదార్థం DNA. కేవలం కొన్ని వైరస్‌లలో RNA ప్రధాన జన్యు పదార్థంగా ఉంటుంది. జీవుల లక్షణాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుచుకోవడమే కాకుండా వాటిని కొత్త తరానికి సంక్రమింపజేసే విధులను DNA నిర్వర్తిస్తుంది. DNA, RNA రెండూ న్యూక్లియోటైడ్ అనే ప్రమాణాల పాలిమర్లు.

మాదిరి ప్రశ్నలు

1. చెరకురసం నుంచి ప్రత్యేకంగా తయారుచేసే మత్తు పానీయం?
   ఎ) విస్కీ బి) వోడ్కా
   సి) రమ్ డి) ఫెన్నీ
2. డీఎన్ఏలో ఏ రకమైన చక్కెర ఉంటుంది?
   ఎ) హెక్సోజ్ బి) పెంటోజ్
   సి) టెట్రోజ్ డి) ట్రయోజ్
3. సహజ చక్కెరల్లో తియ్యనిది ఏది?
   ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
   సి) స్టార్చ్ డి) ఫ్రక్టోజ్
4. మధుమేహ రోగుల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే కృత్రిమ తీపి రసాయనం?
   ఎ) సుక్రలోజ్ బి) ఆస్పర్టేం
   సి) శాకరిన్ డి) అన్నీ
5. ఒక గ్రాము ఆల్కహాల్ ద్వారా ఎన్ని కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది?
   ఎ) 4 బి) 7 సి) 9 డి) 12
6. ఖడ్గమృగం కొమ్ముల్లో ప్రధానంగా కన్పించే ప్రోటీన్?
   ఎ) కెరాటిన్ బి) సెరిసిన్
   సి) ఫైబ్రోమిన్ డి) కొల్లాజెన్
7. కిందివాటిలో ఆవశ్యక అమైనో ఆమ్లం?
   ఎ) ఫినైల్ అలనిన్ బి) ఆస్పర్టిక్ ఆమ్లం
   సి) గ్లుటమిక్ ఆమ్లం డి) గ్లైసిన్
8. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు ఏ చేపలో లభిస్తాయి?
   ఎ) హిల్సా బి) సాల్మన్
   సి) మెకరల్ డి) అన్నీ
9. కిందివాటిలో స్యాచురేటెడ్ కొవ్వు ఆమ్లం?
   ఎ) పామిటిక్ ఆమ్లం
   బి) లినోలిక్ ఆమ్లం
   సి) లినోలెనిక్ ఆమ్లం
   డి) అరాకిడోనిక్ ఆమ్లం
10. ఆహారంలో ప్రోటీన్ల లోపం వల్ల పిల్లల్లో అభివృద్ధి కుంటుపడటాన్ని ఏమంటారు?
    ఎ) మరాస్మస్ బి) క్వాషియోర్కర్
    సి) మరుగుజ్జుతనం డి) విల్సన్ డిసీజ్
11. ప్రోటీన్ కర్మాగారాలు ఏవి?
    ఎ) మైటోకాండ్రియా బి) లైసోజోమ్‌లు
    సి) రైబోజోమ్‌లు డి) గాల్జీ సంక్లిష్టం
12. మనిషి కండరాల్లో అత్యధిక మోతాదులో కన్పించే ప్రోటీన్ ఏది?
    ఎ) ఆక్టిన్ బి) మయోసిన్
    సి) కొల్లాజెన్ డి) కెరాటిన్
13. బ్రౌన్ ఫ్యాట్ అంటే?
    ఎ) రక్త సరఫరా లేని కొవ్వు
    బి) రక్త సరఫరా ఉన్న కొవ్వు
    సి) కుళ్లుతున్న కొవ్వు
    డి) పిండి పదార్థంతో కలిసిన కొవ్వు
14. కిందివాటిలో ఎంజైమ్ కానిది ఏది?
    ఎ) పెప్సిన్ బి) టయలిన్
    సి) గ్యాస్ట్రిన్ డి) స్టియాప్సిన్
15. ఆంగ్ల అక్షరాల ఆధారంగా విటమిన్లను సంబోధించే విధానాన్ని ప్రవేశపెట్టిందెవరు?
    ఎ) కాసిమర్ ఫంక్ బి) జె.సి.డ్రామండ్
    సి) జేమ్స్ లిండ్ డి) ఐజక్‌మన్
16. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
    ఎ) రెటినాల్ బి) రైబోఫ్లేవిన్
    సి) బయోటిన్ డి) నియాసిన్
17. ఏ విటమిన్ లోపం ద్వారా నోటి అంచుల వద్ద పగుళ్లు ఏర్పడే కీలోసిస్ అనే వ్యాధి వస్తుంది?
    ఎ) B_1 బి) B_2 సి) B_3 డి) B_5

సమాధానాలు

1) సి 2) బి 3) డి 4) డి 5) బి
6) ఎ 7) ఎ 8) డి 9) ఎ 10) బి
11) సి 12) బి 13) ఎ 14) సి
15) బి 16) బి 17) బి.

How many steps will be...

BANK EXAMS

REASONING

INPUT-OUTPUT

In Input-Output problems an aspirant is asked to imagine a kind of computer or a word processing machine which performs some operations repeatedly on a given input as per a pre-fixed manner and subsequently different output are given in different steps.

Arrangement: The words or the numbers are arranged as per a fixed order.

Generally the order can be alphabetical order incase of words, incre- asing or decreasing incase of numbers. Arrangement ends as soon as the desired order is achieved.

In case of arrangement a word that comes alphabetically first (or last) in a dictionary will go to first (or last) place, in the first step. Similarly a word which comes second (or second last) in alphabetical order which go to second (or second last) place and so on.

If the input consists of numbers, the smallest (or largest) number going to the first (or last) place in first step. Similarly the second smallest (or second largest) will go to second (or second last) place in the second step.

Directions (Q.No: 1–5): ***Study the following information carefully and answer the questions given below:***

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and various steps of rearrangement. (All the numbers are two digit numbers).

Input: plan more vacation 35 56 92 nice holiday tours 84 61 12
Step I: 92 plan more vacation 35 56 nice tours 84 61 12 holiday
Step II: 92 84 plan vacation 35 56 nice tours 61 12 more holiday
Step III: 92 84 61 plan vacation 35 56 tours 12 nice more holiday
Step IV: 92 84 61 56 vacation 35 tours 12 plan nice more holiday
Step V: 92 84 61 56 35 vacation 12 tours plan nice more holiday
Step VI: 92 84 61 56 35 12 vacation tours plan nice more holiday

And Step VI is the last step of the rearrangement as the desired arrangement is obtained.

As per the rules followed in the above steps, find out in each of the questions the appropriate step for the given input.

Analysis: On observing the last step it can be concluded that numbers are arranged in the descending order from left end and the words are arranged in the alphabetical order from the right end. The first five steps reveal that one number and one word are arranged in the respective order in each step. Each time the remaining numbers are pushed to the right.

Questions:

Input: hard work pays 96 42 in 79 long run 18 25 57

1. **Which step number is the following output?**
   96 79 57 42 work run 18 25 pays long in hard
   1) Step II 2) Step III
   3) Step IV 4) Step V
   5) There is no such step

A: 3
As four numbers 96, 79, 57 and 42 are arranged in descending order from left and four words viz. hard, in, long and pays are arranged in alphabetical order from right end, it can be established that the given step is the fourth step of the arrangement.

2. **How many elements (words/ numbers) are there between "work" and "in" as they appear in Step III?**
   1) Six 2) Five
   3) Seven 4) Four
   5) Three

A: 1
In the III step the elements 96, 79 and 57 will take the first three positions and the word 'work' will take the fourth position from the left end. Similarly the word 'in' will occupy the second position from right end (i.e. eleventh position from the left end). Therefore there are 11–4–1 = 6 elements (words/numbers) between 'work' and 'in'.



3. **Which of the following represents the positions of "pays" in the Step II?**
   1) Seventh from right
   2) Sixth from left
   3) Eighth from right
   4) Fourth from left
   5) Fifth from left

A: 4
In II step 96 and 79 will occupy the first and second positions respectively followed by the words 'work' and 'pays' in the next two positions. Therefore the word 'pays' represents the fourth position from the left end in step II.

4. **Which word/ number would be at the seventh position from the right in the Step IV?**
   1) work 2) run 3) long
   4) 18 5) 25

A: 2
In Q. No. 1, the IV step is given. It can be seen that the word 'run' takes seventh position from the right end.

5. **Which word/number would be third to the left of the fourth element from the right in the Step III?**
   1) pays 2) 42
   3) run 4) 18
   5) work

A: 2
The element third to the left of fourth element from the right will be 4+3=7th element from the right. Therefore the same element will occupy 13–7=6th position from the left end. In step III 96, 79 and 57 will occupy the first three positions followed by 'work', 'pays' and 42 in the subsequent three positions. Therefore the number 42 will take the sixth position from the left end in step III.

Directions (Q.No: 6-10): ***Study the given information and answer the following questions:***

When a word and number arrangement machine is given an input line of words and numbers, it arranges them following a particular rule. The following is an illustration of input and rearrangement. (All the numbers are two digit numbers).

Input: 40 made butter 23 37 cookies salt extra 52 86 92 fell now 19
Step I: butter 19 40 made 23 37 cookies salt extra 52 86 92 fell now
Step II: cookies 23 butter 19 40 made 37 salt extra 52 86 92 fell now
Step III: extra 37 cookies 23 butter 19 40 made salt 52 86 92 fell now
Step IV: fell 40 extra 37 cookies 23 butter 19 made salt 52 86 92 now
Step V: made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 86 92 now
Step VI: now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 92
Step VII: salt 92 now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19

Step VII is the last step of the above arrangement as the intended arrangement is obtained. As per the rules followed in the given steps, find out the appropriate steps for the given input.

Analysis: It is observed from the last step, numbers and words are arranged alternately, words in the reverse dictionary order and numbers in the descending order from the left end or the words in the dictionary order and the numbers in the ascending order from the right end. From the first six steps it can be concluded that every time a word and a number are arranged in dictionary order and ascending order respectively from the left end but they are pushed to right in the subsequent steps.

Questions:

Input: 32 proud girl beautiful 48 55 97 rich family 61 72 17 nice life

6. **How many steps will be requi- red to complete the given input?**
   1) Five 2) Six 3) Seven
   4) Eight 5) Nine

A: 3
There are fourteen elements in the given input. In each step a word and a number (two elements) are arranged in the respective order, it will take 14 by 2 i.e. 7 steps to complete the arrangement.

7. **Which of the following is the third element from the left end of Step VI?**
   1) beautiful 2) life
   3) 61 4) nice 5) 17

A: 4
In V step, the word 'nice' will take the first position and the number 61 will take the second position. In the subsequent VI step they are pushed towards right taking third and fourth positions respectively. Therefore the word 'nice' will take the third position from the left end in the VI step.

8. **Which of the following is Step III of the given input?**
   1) proud 72 girl 48 family 32 beautiful 17 55 97 rich 61 nice life
   2) life 55 girl 48 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
   3) girl 48 family 32 beautiful 17 proud 55 97 rich 61 72 nice life
   4) family 32 beautiful 17 proud girl 48 55 97 rich 61 72 nice life
   5) girl 48 life 55 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice

A: 3
In III step, the word 'girl' will take the first position and the number 48 will take the second position. Since the word 'family' and the number 32 take the first and second positions in the previous step, will occupy the third and fourth positions respectively in Step III. Only option 3 will satisfy the above two conditions.

9. **What is the position of nice from the left end in the final step?**
   1) Fifth 2) Sixth 3) Seventh
   4) Eighth 5) Ninth

A: 1
The word 'nice' takes the first position in Step V and in each of subsequent VI and VII steps two elements precede this word. Therefore a total of four elements precede the word 'nice' that means the word 'nice' will take the fifth position from the left end in the final step.

10. **Which element is third to the right of 'family' in Step V?**
    1) beautiful 2) 17
    3) proud 4) 97
    5) 32

A: 2
In step II the word 'family' takes the first position, the number 32 the second position, the word 'beautiful' the third position and the number 17 the fourth position from the left end. In every subsequent steps the elements 'family 32 beautiful 17' will be pushed to the right with no element coming in between them. Therefore the element third to the right of 'family' will be 17 in each of the steps from II to VII.